# తీయని మోసం



కె.కె.భాగ్యశ్రీ

# తీయని మోసం

కె.కె.భాగ్యశ్రీ

# తీయని మోసం

కుక్కు...కుక్కు... కుక్కు...' గోడకున్న మ్యూజికల్ వాచ్ లోంచి కోకిల కూత లాంటి సుమధుర సంగీతం వినిపించ గానే చేస్తున్న పనినాపి తలెత్తి చూసింది సలిల.

గడియారం అయిదు గంటలని సూచిస్తోంది.

మిషన్ పనినక్కడితో ఆపివేసి, కుడుతూన్న బట్టలన్నింటినీ చక్కగా సర్ది పెరట్లోకి నడిచింది సలిల..

అది... ఆమె మొక్కలకు సంరక్షణ చేసే సమయం.

కిరణ్ కి మొక్కలంటే ప్రాణం, నర్సరీ లోకీ ఏ కొత్త రకం మొక్క వచ్చినా వెంటనే తీసుకొచ్చి ఇంటి దగ్గర నాటితే గానీ అతడి మనసూరుకోదు.

సలిలకూ అదే అభిరుచి ఉండడంతో వారి పెరటి తోట ప్రకృతిలోని హరిత వర్ణాన్ని తన స్వంతం చేసుకొని, పచ్చగా అలరారుతోంది.

ప్రకృతిని ప్రేమించే భావుకత్వం ఉన్న కిరణ్ తనకు దొరకడం తన అదృష్టమని భావిస్తుంది సలిల.

పెరటి తలుపు తీయగానే వివిధ వర్ణాలతో విరాజిల్లే సుమబాలలన్నీ ఆప్యాయంగా స్వాగతం పలికాయి ఆమెకు.

రకరకాల సైజులలో విచ్చిన రంగురంగుల చేమంతులు, సగం వీడగానే తమ సోయగాలను వెదజల్లుతున్న గులాబీలు, సాంధ్యాకాశ వర్ణంలో ఎర్రదనం తమదే నన్నట్లుగా రంగులీనుతున్న కనకాంబరాలు... ప్రేయసీ ప్రియులను

తమ సుగంధాల ద్వారా మరింత దగ్గర చేస్తున్నామన్న గర్వంతో ఆకు కనిపించకుండా పందిరి నిండా పూసిన సన్నజాజులు...

అందంతో పాటు, ఆహ్లాదాన్ని కలుగజేసే విధంగా ఉన్న ఆ పెరటి తోట ఎంతో కమనీయంగా ఉంది.

మోటర్ ఆన్ చేసి వచ్చి, ట్యూబ్ ద్వారా మొక్కలకి నీళ్లు పెట్టసాగింది సలిల. తోటపని చేయడం ద్వారా తనువు– మనసు రెండూ పులకిస్తాయని ఆమె అనుభవం ద్వారా తెలుసుకుంది.

తదేక దీక్షతో మొక్కల మధ్య విహరిస్తూ... వాటి క్షేమ సమాచారాల్ని తెలుసుకుంటున్న సలిల... అక్కడే సిమెంట్ అరుగుపై కూర్చుని, తననే కన్నార్పకుండా గమనిస్తున్న కిరణ్ ని చూడలేదు..

పని ముగించుకుని అలసటతో... కాస్సేపు కూర్చుందామనిపించింది అరుగు దగ్గరకు వచ్చిన సలిలకు... రెప్పవాల్చక తననే వీక్షిస్తున్న ప్రాణనాథుడు దర్శనమిచ్చాడు.

" మీరెప్పుడొచ్చారు?'' తడి చేతులు కొంగుకి తుడుచుకుంటూ ప్రశ్నించింది సలిల.

ధ్యానానికి భంగం కలిగిన మునిపుంగవుడిలా ఉలిక్కిపడి ''నేనా... చాలా సేపైంది'' అన్నాడు కిరణ్.

''మరి పిలవలేదేం? ''ఈ హరితవనంలో 'వనరాణి' లా విహరిస్తున్న అన్నులమిన్న అందచందాలు పరికిస్తూ ఉండిపోయా, ప్రకృతిలో అందాలు చిందే ఈ పూల బాలలన్నీ ఒకెత్తు... వాటిలోని సౌకుమార్యాన్ని ప్రోది చేసి ఆ నలువ సృష్టించిన నా లలన ఒకెత్తు... సౌందర్య రసాస్వాదన చేస్తూ పరవశించి ఉన్న మా ఏకాగ్రతను భంగపరిచితివని మేమెంతో చింతిస్తున్నాము'' నాటకీయంగా పలికాడు కిరణ్.

''సంతోషించాంలే... మీ కవిత్వానికి వాహ్... వాహ్ పలికే తీరిక నాకు లేదు'' నవ్వింది సలిల.

హతివిధీ... 'నాలోని కవితావేశాన్ని అర్థం చేసుకోలేని ఈ సుందరి భార్యగా దొరికిందేమిటీ' కిరణ్ వాపోయాడు.

ఆ సంగతి నిజమేనన్నట్లుగా కనురెప్పలల్లల్లార్చి " అవును పాపం నిరంతరం భావుకత వరదకై పారే ఈ కవిగారికి నేనెక్కడ దొరికానో'' అంది సలిల జాలిగా ముఖం పెట్టి.

విసనకర్రల్లాంటి ఆమె కనురెప్పల కదలికలకు ముగ్ధుడైపోయిన కిరణ్ ఇక ఆగలేనట్లుగా అర్ధాంగిని అల్లుకుపోయాడు.

తన ముక్కుతో ఆమె చెంప మీద సుతారంగా రాస్తూ "ఐ లవ్యూ మై డాళింగ్... రియల్లీ ఐ లవ్యూ సోమచ్'' అన్నాడు ఎంతో తమకంగా.

ఆ బాహుబంధంలోని తియ్యదనాన్ని తనివితీరా అనుభవిస్తూ, ఆస్వాదిస్తున్న సలిల అతడి చెవిలో అడిగింది గుసగుసగా "ఎందుకో... దొరవారికి నేనంటే ఇంత అభిమానం'

" సౌరభములేల వమ్ము పుష్ప వ్రజంబు?

చంద్రికల నేల వెదజల్లు చందమామ?

ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?

ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?"

గొంతెత్తి పాడాడు కిరణ్ రాగయుక్తంగా. ఆతడి నయనాల్లో తన పట్ల వెల్లివిరుస్తున్న ఆరాధనా భావం, స్వరమాధురితో కురిసిన భావ సౌందర్యం సలిల మనసుని మీటి మైమరిపించాయి.

అతడిని మరింతగా అల్లుకుంటూ "కృష్ణ శాస్త్రి గారు గానీ ఆవహించారా? మత్తుగా అడిగింది.

"నిన్ను చూస్తే సామాన్యులకే కవిత్వం పుట్టుకొస్తుంది, కృష్ణశాస్త్రి గారే గనుక జీవించి ఉంటే ఎన్ని కవితలల్లేవారో" తన్మయత్వంగా అన్నాడు. సలిల నవ్వింది ఎంతో అందంగా..

"సీరియస్ గా ఆడుగుతున్నాను చెప్పండి... నేనంటే నీకెందుకంత ప్రేను? మీరు తలుచుకుంటే నాకన్నా అందమైనదీ, డబ్బున్న అమ్మాయి మీకు భార్యగా లభించి ఉండేదేమో!"

ఆ ప్రశ్నే ఆమె పదేపదే వేస్తుంది. అతడు ఎప్పుడూ చెప్పే సమాధానమే చెప్పాడు.

"కావచ్చు... కానీ ఎవరైనా సరే నీ ముందు తీసికట్టే, ఎంతమంది అమ్మాయిలు నా కోసం పరుగులు దీసి వచ్చినా, వాళ్లందరూ 'సలిలలు కాకపోవటం వలన కాదనాల్సివచ్చింది. సృష్టిలోని సమస్త జీవరాశులనూ సమ దృష్టితో ప్రేమించి నిన్ను ప్రేమించనిదెవరు? స్వచ్ఛమైన నీ హృదయం, విలక్షణమైన మీ వ్యక్తిత్వం, సాశీల్యం ఉట్టిపడే నీ ప్రవర్తన... ఎవరికైనా ఆకట్టుకొని తీరుతాయి. నేనూ అందుకే నీ పట్ల అట్రాక్ట్ అయ్యాను. నీమీద ప్రేమ పెంచుకున్నాను" అన్నాడు కిరణ్.

" మీకు దొరకడం నిజంగా నా పూర్వజన్మ సుకృతమండీ" అంది సలిల ఆరాధన నిండిన స్వరంతో..

"అదృష్టం నీది కాదు సలిలా.. నాది ఎందరో మహామహుల్నీ కాదని ఈ ముద్దుగుమ్మ నన్నే వరించడం నా భాగ్యం" కిరణ్ కంఠం నిండా ప్రేమ తొణికిసలాడింది.. "

"మీరే… నన్ను కోరి వరించేలా చేశారు " అంది సలిల.

"నిజం చెప్పు సలీలా... నీకెప్పుడూ అనిపించలేదా! నీకు నచ్చిన సంబంధాల నుండి ఏ డాక్టర్ నో ఇంజనీర్ నో పెళ్లి చేసుకుంటే జీవితం ఇంతకన్నా బాగుండి ఉండేదని, .." నిలదీశాడు కిరణ్.

"ఊ... మీరన్నట్టు ఏ డాక్టర్ నో, ఇంజనీర్ నో లేక బిజినెస్ మాగ్నెట్ నో కట్టుకునుంటే పూలతేరు మీద ఊరేగి ఉండేదానిని కాలు కదపకుండా కార్లలో విహారాలు, కాళ్ల దగ్గరకి అన్నీ అమర్చి పెట్టే దాసదాసీజనం... నవరత్న ఖచిత సువర్ణాభరణాలు, చీనిచీనాంబరాలు... సమకూరి ఉండేవి"

"స...లి....ల...." నివ్వెరపోయాడు కిరణ్.

కాంతి విహీనంగా మారిన అతడి వధనాన్ని గమనించిన సలిల ముసిముసిగా నవ్వుకుంటూ "అవును... పెద్ద హోదాలో ఉన్న వాడిని కట్టుకుంటే ఇవన్నీ నాకు దక్కి ఉండేవి. కాకపోతే అనుభవించేందుకు జీవితమే ఉండేది కాదు" అంది కాస్త గంభీరంగా..

అంతే... కిరణ్ ముఖంలోకి వెలుగు దూసుకొచ్చింది.

"అవునండీ... జీవితాన్ని పండించుకునేందుకు కావల్సినవి సిరిసంపదలు కావు. మనసుని సేద తీర్చి మైమరిపింపచేసే మమతానురాగాలు .. 'ధనం' అనే వ్యామోహం వెనుక పరుగులెత్తేవారు జీవితంలో సుఖశాంతులతో జీవించలేరు" చెప్పింది సలిల ఖచ్చితంగా.

"నీ అభిప్రాయం తప్పేమో సలిలా. ప్రపంచంలోని పెద్ద పెద్ద ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు వారి వారి భార్యలను ప్రేమించడం లేదా! సుఖశాంతులతో జీవించడం లేదా!" ఆమె ఏమంటుందోనని వేచిచూశాడు కిరణ్..

"నా భావన అది కాదు. అందరూ అలాగే బ్రతుకుతారని నా ఉద్దేశ్యం కాదు కానీ చాలా మంది జీవితాలు మాత్రం యాంత్రికంగా, ఏ స్పందనలూ లేకుండానే గడచిపోతాయి. అయినా వాళ్లందరి గురించీ మనకెందుకు? జీవితంలో మాధుర్యాన్ని పంచి ఇచ్చేందుకు బంగారం లాంటి మీరు దొరికారుగా" మురిపెంగా అంది సలిల తమిద్దరి మధ్యన చెలరేగుతున్న వాగ్వివాదాన్ని అక్కడితో ఆపాలని ప్రయత్నిస్తూ.

ఎందుకోగానీ... కిరణ్ ముఖం ముడుచుకుందొక్కసారిగా. అతడు సలిల అభిప్రాయంతో ఏకీభవించలేదని అతడి ముఖకవళికలే చెప్తున్నాయి. కారణం ఏమిటో తెలియదు..సలిలకు డబ్బంటే తగని అయిష్టం. మనిషికి కూడు, గూడు, గుడ్డ ప్రధానావసరాలు, వాటిని సంపాదించుకునేందుకు కావల్సిన డబ్బు సమకూరితే చాలునన్న భావం ఆమెది. మనిషి తృప్తిగా జీవించడానికి, కోరికలకు కళ్లెం వేయడం అవసరమని తలపోస్తుంది.

లాభం లేదు సలిల మనసు అక్కడే ఫిక్సయిపోయింది. అవసరాలకు మించి సంపాదించిన డబ్బు మనిషిని అశాంతికి గురిచేస్తుందన్నది వాస్తవమే కాని... ధన సంపాదనలో పడిన మనిషి ఇంటిని, ఇల్లాలిని నిర్లక్ష్యం చేస్తాడన్నది మాత్రం అసత్యం. ' ఏనాటికైనా సలిల ఇది తెలుసుకొని తీరాలి... అనుకున్నాడు కిరణ్ మనసులోనే..

"లోపలికి పదండి కాలేజ్ నుండి వచ్చిన తరువాత కాళ్ళైనా కడుక్కోకుండా ఏమిటీ సరాగాలు.

ఫ్రెష్ అయి రండి టిఫిన్ చేద్దురు" ఆలోచనలను దారిమళ్లిస్తూ అంది సలిల.

ఆమెకు కిరణ్ మదిలో రేగుతున్న అలజడి గురించి తెలీదు.

అర్ధాంగి తన పట్ల కురిపిస్తున్న అవ్యాజమైన అనురాగం, కిరణ్ లో జరుగుతున్న అంతరంగ మధనానికి తాత్కాలికంగా వీడ్కోలు పలికింది.

క్షణాల్లో మామూలుగా మారి "పద... పద.. నీ ధ్యాస లో పడి ఆకలి దప్పులు మరచిపోయేలా ఉన్నాను. అంతలా కట్టిపడేశావు నన్ను" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

సలిల కూడా అంతే మనోహరంగా నవ్వుతూ "బాగుంది... నేను కట్టి పడేశానంటారేంటి? అంత వద్దనుకుంటే విడిపించుకుపొండి. నేవద్దన్నానా !" అంది చిరు అలక నటిస్తూ.

చప్పున ఆమె దగ్గరకు చేరి ఆమె మెడవంపులో ముఖం దాచుకొని అంత మాటనకు సలిల.. నిన్ను విడిచి నేనుండలేను" అన్నాడు కిరణ్ ఆర్ద్రత ఎండిన స్వరంతో.టప– టప లెంపలు వాయించుకుని "తప్పయి పోయింది మహాప్రభో. నన్ను వదిలి పో మొర్రో అన్నా మిమ్మల్ని విడిచి వెళ్లను సరేనా?" అంది. సలిల కిలకిల నవ్వుతూ.

"ప్రామిస్" చేయి ముందుకు చాచాడు కిరణ్. ఆ చేతిలో తన కోమల హస్తాన్నుంచి బాస చేసింది సలిల. భార్యను సందిట పొదువుకొని లోపలికి నడిచాడు కిరణ్. సలిల-కిరణ్ లు నవ దంపతులు. సలీల డిగ్రీ పూర్తి చేసి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ మొదలైన కోర్స్ లు చేసింది, కిరణ్ ఒక ప్రముఖ కాలేజ్ లో జూనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్నాడు.

సలిలకు జీవితం పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. డబ్బు సంపాదన జీవితం సాఫీగా గడవడానికి అవసరమే, కానీ అదే జీవిత ధ్యేయం కాకూడదు. డబ్బు అన్ని బంధాలనూ దూరం చేసి, మనుష్యుల మధ్య ఎడాన్ని పెంచి, మమతానుబంధాలకు అతీతంగా తయారుచేస్తుందని ఆమె ప్రగాఢ విశ్వాసం..

అన్నవస్త్రాదుల లాంటి కనీసం అవసరాలు తీర్చుకునేపాటి సంపాదన చాలునన్న ఉద్దేశ్యంతో ఆమె . టైలరింగ్ ని ఉపాధిగా ఎంచుకుంది. తన అభిప్రాయాలను గౌరవించి, తన నమ్మకాలకు ఊతమిచ్చే కిరణ్ ని కోరి వరించిందందుకే..

సలిల అన్ని రకాల ఆర్డర్స్ స్వీకరించదు. తాను కస్టమర్స్ కోరిన నిర్ణీత సమయానికి అందజేస్తానన్న కాన్ఫిడెన్స్ ఉంటేనే ఆర్డర్స్ పుచ్చుకుంటుంది.

కస్టమర్స్ కాళ్లరిగేలా తన ఇంటి చుట్టూ తిప్పుకోవాలన్నది ఆమె అభిమతం కాదు.

ఆమె చేతిలో ఉన్న ఆర్ట్ వలన తమ దుస్తులు ఆమె చేతే కుట్టించుకోవాలన్న కోరిక ఉన్న వారు ఆమెకు 'ఎప్పుడు తీరుతుందా' అని ఎదురుచూస్తారు.

తను నేర్చుకున్న విద్యను వృథా పోనివ్వకుండా సార్థకం చేసుకుంటూ తననే సర్వస్వంగా భావించి, ఎంతగానో ప్రేమించే భర్త, ప్రేమానురాగాల వెల్లువలో తడిసి ముద్దవుతూ సంతృప్తికరమైన జీవనం గడుపుతోంది సలిల.

పొరుగునే ఉంటున్న హిమజ అన్ని విషయాల్లో సహాయ, సహకారాలు అందిస్తూ ఎంతో స్నేహంగా ఉంటుంది.

వారిరువురి వయసుల మధ్య గల అంతరం వారి స్నేహానికి ఎటువంటి అవాంతరం కలుగజేయలేదు. కొన్ని కొన్ని సందర్భాలలో హిమజ చాదస్తం భరింపశక్యం కాకున్నా, ఆమె స్నేహ ప్రియత్వానికి బందీ అయిన సలిల అదంతా ఇష్టంగానే భరిస్తుంది.

ఎటువంటి దాపరికాలు లేకుండా తనకి సంబంధించిన అన్ని విషయాలూ సలిలతో నిరభ్యంతరంగా చర్చిస్తూ ఉంటుంది హిమజ.

ఆమె భర్త సురేష్ కి కూడా సలిల, కిరణ్ లు అంటే ఎంతో అభిమానం.

వాళ్లకిద్దరు అమ్మాయిలు. మహతీ, తపతి.

పెద్దమ్మాయి మహతి డిగ్రీ ఫైనలియర్ చదువుతూ ఉంటే తపతి డిగ్రీలోకి ఎంటరైంది.

మహతిది సాధారణమైన అందం. వయస్సు తెచ్చిన ఆకర్షణ తప్పిస్తే.. ఆమెలో చెప్పుకొనేందుకేంలేదు.

కానీ... తపతి... ఆమె సౌందర్యం వర్ణనాతీతం. సామాన్యంగా ఉండే తల్లిదండ్రుల నుండి ఆమెకీ అంతటి అపురూప సౌందర్యం ఎలా సంక్రమించిందోనన్న సందేహం రాకమానదెవరికైనా.

ముక్కు మూసుకొని, అడవిలో తపస్సు చేసుకుంటూ, ఆకులు– అలములు తిని బ్రతికే ముని పుంగవుడికైనా ముచ్చెమటలు పట్టించి ముగ్గులోకి దించేంత అందమున్న తన కూతుర్ని చూసుకొని హిమజ ఎంతగా పొంగిపోతుందో, అంతకు రెట్టింపు భయపడుతుంది.

అద్భుత సౌందర్యరాశి అయిన తపతిని, ఏ కుర్రాడైనా ప్రేమవలలో బంధించి, ఆమె జీవితం నాశనం చేస్తాడేమోనన్న శంకతో, అనుక్షణం ఆమెను వేయికనులతో కనిపెడుతూ, ఆమె చుట్టూ రక్షణవలయాన్ని ఏర్పరచాలని నానా రకాల తాపత్రయ పడుతుంది హిమజ.

" ఆమెలోని ఈ వైఖరి సలిలకేమాత్రం నచ్చదు. పదే పదే తన అందాన్ని పొగడడం వలన తపతి అహంకారిగా మారే ప్రమాదం లేకపోలేదని తల పోస్తూ ఉంటుంది. ఈ విషయమై చాలాసార్లు హిమజని హెచ్చరించింది కూడా.

“నీకు తెలీదు సలిలా... అందం ఆడదానికి వరమే కాదు శాపం కూడా. మా చిన్నాన్న కూతురు 'కవిత' అని ఉండేది. తపతిలాగే చాలా అందగత్తె. కాలేజీలో చదివే రోజుల్లో ఒక అబ్బాయి ప్రేమలో పడి, ఇల్లు వదలి వెళ్లిపోయింది. వాడు దాన్ని వాడుకున్నన్నాళ్లు వాడుకొని వదిలేసిపో యాడు. తిరిగి వచ్చిన దాన్ని ఇంటి గడప తొక్కనివ్వలేదు బాబాయి. అయిన వాళ్లకి మొహం చూపెట్టుకోలేక ఎక్కడో... అజ్ఞాతంలో జీవిస్తోంది. ఆ పరిస్థితి నా కూతురికి ఎక్కడ ఎదురవుతుందోనని నా బాధ'' ఆవేదనగా చెప్పింది హిమజ.

“ మీరు అతిగా ఆలోచిస్తున్నారు. ఆవిడ రాంగ్ స్టెప్ వేసిందని తపతి కూడా అలా చేస్తుందని ఏమిటి గ్యారంటీ! మీకు తపతి పట్ల అంత బెంగ ఉన్నప్పుడు ఆమెను లేడీస్ కాలేజీలో జాయిన్ చేయకుండా కో–ఎడ్ లో చదివిస్తున్నారెందుకు?” అడిగింది సలిల. “లేడీస్ కాలేజ్ అయితే మనింటికి చాలా దూరం. అందుకే కో– ఎడ్యుకేషన్ అయినా దగ్గరని ఇక్కడ చేర్చారు మీ అంకుల్'' చెప్పింది హిమజ.

సలిలకింకా ఏం మాట్లాడాలో తోచలేదు. హిమజ అనుకుంటున్నట్లుగా అది అతిజాగ్రత్త కాదు తను తీసుకుంటున్న ఈ అతిశ్రద్ధ తపతిని ఎలా తయారుచేస్తుందోనన్న ఆలోచన ఆమెకు లేదు.

తల్లి తరుచుగా తాను అందగత్తెనని గుర్తు చేయడం వలన తపతి మనసులో ఒకానొక విపరీత భావం బయలుదేరింది.

అయితే సలిల ఊహించినట్లుగా అది అహంకారమో, తన సౌందర్యాన్ని చూసుకొని విర్రవీగే విపరీత మనస్తత్వమో కాదు.

ఆత్మన్యూనత... అవును... అక్షరాలా అంతే.

నలుగురితో కలివిడిగా ఉండకుండా చిలిపి వయసులో చేసే సరదా అల్లర్లకి తనను దూరం చేసిన అందమంటే తపతికి తీరని కోపం..ఆమెనే తీరానికి చేరుస్తుందో...

తపతికి చెప్పలేనంత అసహనంగా ఉంది. వర్ణించలేని కసితో రగిలిపోతోంది ఆమె మది.

ఆమె ఎద నిండా... తనని కట్టుదిట్టాలలో ఉంచి నిర్బంధిస్తున్న తల్లిదండ్రుల మీద పీకల్దాకా కోపం ఉంది.

ఛీ...ఛీ... తనదీ ఒక జన్మేనా?

ఒక అచ్చట–ముచ్చట లేదు. ఆట లేదు.. పాట లేదు. తన ప్రతి కదలికనూ డేగకళ్లతో పసిగడుతూ అనుక్షణం నిఘా వేసి స్వల్ప విషయాలకి కూడా నిలదీసి అల్లరి చేసే తల్లి. ఆమె ఆడించినట్లు ఆడుతూ తందాన తాన పాడే తండ్రి...

ఛీ... ఒక సరదా, సంతోషము లేని జీవితమంటే విసుగు పుడుతోంది. ఆరోజు ఉదయం జరిగిన సంఘటన ఆమె మనసుని మండిస్తూనే ఉందింకా.

“నేను మా ఫ్రెండ్స్ తో కలిసి సినిమాకు వెళ్లాలనుకుంటున్నాను" చెప్పింది తపతి వంటగదిలో ఏదో పని చేసుకుంటున్న తల్లితో. పిండివేసిన ఇడ్లీస్టాండ్ కుక్కర్లో ఉంచుతున్న హిమజ కూతురివైపు తీవ్రంగా చూసి " వీల్లేదు" అంది గట్టిగా.

తల్లి స్వరంలోని కాఠిన్యం తపతి హృదయాన్ని గాయపరిచింది.

అయినా సరే తమాయించుకుంటూ "ప్లీజ్... అమ్మా... ఇవాళ వందన బర్త్ డే. మా ఫ్రెండ్స్ అందరినీ సినిమాకి తీసుకెళ్తానంది. ఈ ఒక్కసారికీ పంపించమ్మా” అభ్యర్థనగా అంది తపతి.

" వీల్లేదని చెప్పాగా. నీకు సినిమా చూడాలనుంటే నువ్వు, నేను వెళదాం. అంతేగానీ ఫ్రెండ్స్ తో మాత్రం పంపను" నిక్కచ్చిగా చెప్పింది హిమజ.

"ఏం? ఎందుకు పంపవు? అక్కని మాత్రం అడిగిన చోటుకల్లా పంపుతారు. అడక్కుండా వెళ్లినా ఊరుకుంటారు. కానీ నేను మాత్రం మీ పర్మిషన్ కోసం వస్తే కాదంటారు. ఇదేం న్యాయం?" ఆవేశంగా నిలదీసింది తపతి.

"ఆమె వైఖరికి జడవనిదానిలా నిబ్బరంగా చూస్తూ " నీకు న్యాయాన్యాయాల గురించి అనవసరం. నువ్వు ఎవరితో పడితే వాళ్లతో, ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లడం నాకిష్టం లేదు. దట్సాల్.” అంది హిమజ..

"ఎప్పుడూ నువ్వు చెప్పినట్లే వినాలి. నీ ఇష్టం వచ్చిన పనే చేయాలి. నాకూ అక్కలాగా స్నేహితులతో కలిసి తిరగాలని, ఎంజాయ్ చేయాలని ఉండదా!" ఏడుపు గొంతుతో ప్రశ్నించింది. తపతి.

“ఉండచ్చు. కానీ నీకలా చేసే ఛాన్స్ లేదు. అక్క చూడ్డానికి యావరేజీగా ఉంటుంది. కానీ నువ్వలా కాదే. బంగారు బొమ్మలాంటి నీ మీద నలుగురి కనుదృష్టి పడకుండా ఉండాలంటే నువ్వు బయట

తిరగకపోవడమే మంచిది'' విడమరిచి చెప్పింది హిమజ.తపతి ఉక్రోషంగా పెదవి కొరుక్కుంది. తల్లి వివరణ ఆమెను సంతృప్తి పరచలేదని ఆమె ముఖకవళికలే చెప్తున్నాయి. అందంగా ఉన్నంత మాత్రాన తను బయట తిరగకూడదా! తననెవరైనా కొరుక్కు తింటారా!

తనకూ ఆలోచనా శక్తి, యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం, అన్నీ ఉన్నాయే! వెంటపడినంత మాత్రాన ఎవరి వలలోనన్నా చిక్కుకుపోయేంత అమాయకురాలా తను!

కాదే... అయినా తల్లి ఇలా అంటోందేంటి?

“అలా అయితే నన్ను కాలేజీకి మాత్రం పంపడం దేనికి? చదువు మానిపించి ఓ మూల కూర్చోపెట్టండి, హాయిగా అంట్లు తోముతూ గడిపేస్తాను'' కసిగా అంది తపతి...

ఆమె ఎదురుదాడికి ఏమాత్రం స్పందించని దానిలా “ అలాగే చేద్దును. కానీ ఇవాళ రేపు పెళ్లి కొడుకులు అమ్మాయి మినిమమ్ క్వాలిఫికేషన్ డిగ్రీ అన్నా ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే చదివిస్తున్నాం'' అంది.

చిర్రెత్తిపోయింది తపతికి. తన చదువు కూడా తనకు సంస్కారాన్ని, సంతోషాన్ని కలిగించేందుకు కాదన్నమాట.

ఎవడికో జీవితాంతం ఊడిగం చేయాలంటే పట్టభద్రురాలన్న కనీసార్హత కావాలన్నమాట. మండుతున్న హృదయంతో తన అసహనాన్ని తెలియజేస్తూ నేలని కాలితో గట్టిగా తన్ని, తన గదిలోకి పోయి ధడాలున తలుపేసుకుంది తపతి.

ఎందుకు? తల్లి పదే పదే తన అందం గురించి మాట్లాడుతుంది? తనలో ఉన్న ఇతర టాలెంట్స్ గురించి పట్టించుకోదెందుకు? తన మదిలో పెల్లుబికే భావావేశాన్నింతటినీ పొందుపరచి అందంగా కవితలల్లగలదు. ఆ కోకిలమ్మతో పోటీపడి సుమధుర రాగాలాలపించగలదు.. కానీ అవి ముందుకు సాగడానికి కావల్సిన ప్రోత్సాహం మాత్రం అందించరు ఇంట్లోని వారు. ఎక్కడకి వెళ్లాలన్నా, ఏ పని చేయాలన్నా ఈ అందమే కాళ్ల సంకెలలా తగులుకొని బాధపెడుతోంది. ఏ బాదరబందీలు ఎరుగని కాలేజ్ లైఫ్స్ ఆడుతూ పాడుతూ అనుభవించకుండా అడ్డుపడుతున్నది ఈ రూపురేఖలే.

తన అందమే తనకు శాపమైంది. ఛ... . ఆ దేవుడు తననో కురూపీలా పుట్టించి ఉంటే ఈ ఆంక్షలు, ఆటంకాలు ఏమీ ఉండేవి కావుకదా!

తపతి మదిలో వ్యధ అంతకంతకు ఎక్కువవుతోంది. ఆవేశం యొక్క ఉధృతికి అంతరంగం రగిలే అగ్నిగుండంలా మారుతోంది...

ఎదురుగా ఉన్న నిలువుటద్దం ఆమె అందగత్తె నంటూ సాక్ష్యం పలుకుతోంది.

పట్టలేనంత కోపంతో చేతికందని పౌడర్ టిన్ ని బలం కొద్దీ అద్దంకేసి విసిరింది. 'భళ్లు' మన్న శబ్దంతో ముక్కలైంది అద్దం. గాజుపలక లాంటి ఆమె హద్ర్యయమూ విరిగి శకలాలుగా మారింది. ఆ శకలాల కింద తన ఆశలూ, కోరికలూ సమాధి చెందుతున్న అనుభూతి కలిగింది ఆమెకు.

తపతి మనసులో ' కలుగుతున్న వికారాల గురించి, చెలరేగే భావసంచలనాల గురించీ తెలుసుకోలేని హిమజ, తను ఎంతో సమర్ధవంతంగా కూతుర్ని కట్టడి చేస్తున్నందుకు మురిసిపోతూ ఉంది వంటగదిలో పని చేసుకుంటూనే. "సలిలా... అర్జంటుగా నాకొక నాలుగు జతల బట్టలు సర్దు, బెంగుళూరు వెళ్లాలి" అన్నాడు కిరణ్ బయటినుంచి వస్తూ.

"బెంగుళూరా? ఏమిటింత సడెన్ గా?"

"మా ప్రిన్సిపాల్ గారు పంపిస్తున్నారులే, అయినా ఆ వివరాలన్నీ చెప్పే టైమ్ లేదు. త్వరగా వెళ్లాలి" హడావుడిగా వాచ్ చూసుకున్నాడు కిరణ్.

మరి రెట్టించలేదు సలిల, మౌనంగా అతడికి కావలసినవన్నీ సర్దిపెట్టింది. ట్రైన్ లో తినడానికి సేమియా ఉప్మా చేసి హాట్ ప్యాక్లో సర్దింది.

"సలిలా డియర్.. ఇక నేను బయలుదేరతాను" ఆదరాబాదరాగా తయారైపోయాడు కిరణ్.

"ఇప్పటికిప్పుడు ప్రయాణమవుతున్నారు. రిజర్వేషన్ అదీ.." సంశయంగా అడిగింది సలిల. " హుషారుగా ఆమె బుగ్గ మీద చిటికె వేస్తూ " నీకా భయం వలదు భార్యామణీ.. ఆ ఏర్పాట్లన్నీ మా ప్రిన్సిపాల్ చూసుకుంటాడు.. నిన్ను వదిలి ఉండడం బాధాకరమేగానీ.. బాస్ గారి ఆజ్ఞ పాటించి తీరాలి మరి" అన్నాడు కిరణ్ ఆమెను వదిలి వెళ్లలేనట్లుగా అతడిని గేట్ వరకూ సాగనంపుతూ "క్షేమంగా వెళ్లి లాభంగా రండి" మనస్ఫూర్తిగా అంది సలిల.

బయటికి అతడికి ఆనందంగా వీడ్కోలు ఇచ్చింది గానీ మనసంతా గుబులుగా వుంది. కిరణ్ లేకుండా ఆమె అస్సలు గడపలేదు.

అతడి సమక్షంలో ప్రతి క్షణం ఎంతో రసభరితంగా అనిపిస్తుంది సలిలకు. అతడి సాంగత్యం మలయమారుత వీచికలలోని శీతలత్వాన్ని తలపింపజేస్తుంది. అతడి అనురాగం అమ్మ లాలనలోని తీయదనాన్ని మరపిస్తుంది.

అందుకే.. మది ఎప్పుడూ అతడి సాహచర్యాన్నే కోరుకుంటుంది.

అతడు క్యాంప్ కి వెళ్లిన ప్రతిసారీ అమూల్యమైన పెన్నిధినేదో కోల్పోయినట్లుగా బాధపడుతుంది సలీల. .

“నువ్వు రావుగాని.. ఇద్దరం కలిసి వెళ్తే హనీమూనికి వెళ్లినట్లుగా కూడా వుంటుంది. స్వామికార్యం స్వకారం కూడా నెరవేరుతుంది'' క్రితంసారి బెంగుళూర్ వెళ్లినప్పుడు కిరణ్ అన్నాడు.ఇంచుమించు రెండు నెలలకోసారి అతడు ఏదో పనిమీద బెంగుళూర్ వెళ్తూనే వుంటాడు.

సలిల ఎడబాటు అతడినీ వేధిస్తోంది. పెళ్ళై నిండా ఏడాది కూడా కాలేదు. కొత్త దంపతులను విరహం ఎంతగా ఆరడి పెడుతుందో వారిద్దరికీ అనుభవైకవేద్యమే.

అతడు బెంగుళూర్ వెళ్లినప్పుడల్లా సలిలను తన తోపాటు రమ్మని పిలవడమూ, ఆమెరానంటూ సున్నితంగా తిరస్కరించడమూ జరిగిపోతోంది.

"ఎందుకండీ.. అనవసర ఖర్చు. మీకంటే తప్పదు. నేను కూడా ఎందుకు? ఈసారి ఎప్పుడైనా చూద్దాంలెండి'' అనేస్తుంది నవ్వు ముఖంతో.

ఆ సందర్భంలో కిరణ్ బుంగమూతి పెట్టి, పసివాడిలా అలుగుతాడు. తియ– తియ్యటి ముద్దులు అందించి, కౌగిళ్ల కారాగారంలో బంధించి అతడి అలకను దూరం చేయడం సలిలకు పరిపాటే.

ఇప్పుడూ ఆ తంతే కొనసాగింది కాస్సేపు. "బై సలిలా డార్లింగ్..చేరగానే ఫోన్ చేస్తాగా'' తన ఎడబాటు భరించలేనట్లుగా విలవిలలాడుతున్న అర్ధాంగిని ఓదార్చి బయలుదేరాడు కిరణ్.

'ఈ నాలుగు రోజులూ అతడి రాక కోసం కన్నులు కాయలు కాసేలా ఎదురు చూస్తూ, అతడి సమక్షంలో తను అనుభవించిన అమరసౌఖ్యాలను అనుక్షణం నెమరువేసుకుంటూ కాలం గడపాలి' భారంగా నిట్టూర్చింది సలిల వెళుతూన్న కిరణ్ ని చూస్తూ.

అతడు తనని విడిచి వెళ్తున్నది నాలుగు రోజులు కాదు, నాలుగు యుగాలు అన్నట్లుగా ఫీలైంది సలిల.

'కిరణ్ వచ్చేసరికి ఈ పచ్చగులాబీ తొలిపూవు పూస్తుంది' అతడు తెచ్చి నాటిన గులాబీమొక్క మొగ్గ తొడగడం గమనించి సలిల అనుకుంది సంబరంగా.

నిజంగా కిరణ్ లభించడం తనకొక వరం. ఓసారి జీవితం చేజారిన తనకు కొత్త జీవితాన్ని అందివ్వడమే కాక సంసార యాత్రలో మధురిమలను చవి చూపిస్తూ తనను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నాడు.

అందరు ఆడపిల్లలకీ ఇలాంటి అదృష్టం దొరకదు.

ఎన్నో ఆశలతో వైవాహిక జీవితంలోకి అడుగిడిన తను ఆ దైవం చిన్నచూపు చూడడం వలన ఆదిలోనే అనుకోని విఘాతాలను ఎదుర్కొంది. . జీవచ్ఛవంలా బ్రతుకుతున్న తనకు ఊపిరిపోసి, పునర్జన్మ ప్రసాదించిన మహనీయుడు కిరణ్.

తను నమ్మిన ఆదర్శాలకు చేయూతనందిస్తూ అసలైన అర్ధనారీశ్వరతత్వానికి అర్థం చెప్పాడు. ఏ ఆడపిల్లైనా ఇంతకన్నా ఏం కోరుకుంటుంది?

అర్ధాంగి అభిరుచులను, విశ్వాసాలను గౌరవిస్తూ ఆమె ఆత్మగౌరవానికి ముప్పు వాటిల్లకుండా కంటికి రెప్పలా కాచుకుంటూ ప్రాణప్రదంగా ప్రేమించే కిరణ్ లాంటి అబ్బాయి తమ జీవిత భాగస్వామిగా రావాలని పూజలు చేస్తుంది ప్రతి పెళ్లి కాని అమ్మాయి.

కానీ... ఆ పూజలేమీ చెయ్యకుండానే సలిల అన్ని మంచి లక్షణాలు మూర్తీభవించిన కిరణ్ ని భర్తగా పొందింది. ఇది ఆమె కోరుకోని వరం.. ఆశించని అదృష్టం.

★★★

''సలిలా.. సలిలా.. ఓసారిలా వస్తావా!'' పెరటి గోడ దగ్గర నిలబడి పిలుస్తోంది హిమజ.

పండుగ దగ్గరపడుతోంది. బాగా పరిచయస్తుల నుండి పుచ్చుకున్న అతికొద్ది ఆర్డర్స్ పూర్తిచేయడానికి నానా తంటాలు పడుతోంది సలిల. దానికితోడు అనారోగ్య కారణాల వలన ఉన్న ఒక్క వర్కరూ రావడం లేదు.

అప్పటికీ హెమ్మింగ్ చేయడం, కాజాలు కుట్టడం లాంటి పనుల్లో సహాయం చేస్తూనే ఉన్నాడు కిరణ్ తనకు తీరిక దొరికినప్పుడల్లా.

అయినా సరే.. చెప్పిన సమయానికి ఎవరి బట్టలు వారికి అందించగలనో లేదోనని ఆందోళన చెందుతోంది సలిల. లేట్ చేయడం ద్వారా ఇన్నాళ్లుగా సంపాదించుకున్న గుడ్ విల్ అంతా తుడిచి పెట్టుకుపోతుందని ఆమెకు తెలుసు. . ఊపిరి సలపని పనితో సతమతమవుతున్న సమయంలో హిమజ పిలవడం సలిలకు చిరాకు తెప్పించిన మాట వాస్తవం.

కానీ..హిమజతో ఆమెకున్న స్నేహం దాన్ని బయట పడనివ్వలేదు. కుడుతున్న చుడీదార్ ని ప్రక్కకు పెట్టి, పెరటిగోడ దగ్గరకు నడిచింది.

'' ఏంటంటీ.. ఏమిటి విషయం?" అడిగింది సలిల.

" నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి'' గోడ మీద నుండి ముందుకు వంగి, ఆమె ముఖానికి చేరువలో తన ముఖాన్నుంచి రహస్యం చెప్తున్నట్లుగా అంది. హిమజ..

సలీలకర్థమైంది ఆవిడేం చెప్పబోతోందో. "తపతి గురించేగా'' అడిగింది చిన్నగా నవ్వి.

"అవును. నీకెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగింది హిమజ.

"ఊహించాను. మీకెప్పుడూ అదే ధ్యాస కదా" అంది సలిల అసహనాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూ.

"మరే..నా ధ్యాస అంతా తపతి మీదే.. తను ఏమన్నా మామూలు ఆడపిల్లా...' మిస్ ఇండియా' లెవెల్ బ్యూటీక్వీన్'' గొప్పగా అంది హిమజ.

రోజుకి కనీసం పదిసార్లైనా తన కూతురి అందచందాల గురించి ప్రస్తావించక మానదు ఆమె. ఆవిడ అన్నా, అనకపోయినా తపతి 'అప్సరస' లా ఉంటుందన్నది.

నిజం.కానీ.. కూతురి అందచందాల గురించి కన్న తల్లైన హిమజ పదే పదే పొగడడమే సలిలకు నచ్చదు.

"ఎందుకు పిలిచారో చెప్పండి ఆంటీ .. అవతల నాకు చాలా పని వుంది" సౌమ్యంగా అడిగింది.

'"తపతికి ఈమధ్య స్నేహాలు బాగా పెరుగుతున్నట్లున్నాయి" గొంతు తగ్గించి చెప్పింది హిమజ. సలిలకు నవ్వొచ్చింది ఒక్కసారిగా..కానీ నవ్వితే బాగుండదని కంట్రోల్ చేసుకుంది.

ఇంతా చేసి ఈవిడ జనాంతికంగా చెప్పాలనుకున్నది ఈ విషయమా! ఈరోజుల్లో స్నేహాలు లేనిదెవరికి? స్నేహానికి లింగభేదం, వయోభేదం..తదితర తారతమ్యాలు సమసిపోయి చాలా కాలమైంది. స్త్రీ, పురుషుల మధ్య మైత్రీ భావానికున్న సరిహద్దు రేఖలు చెరిగిపోయాయేనాడో.

"నిన్నే సలిలా..నే చెప్పేది వినిపిస్తోందా!" కాస్త విసురుగా అంది హిమజ...

ఆవిడ మాటలలో సలిల తను చెప్పే విషయాన్ని అంత శ్రద్ధగా వినడం లేదేమోనన్న సందేహం తొంగి చూస్తోంది.

"ఆ.. ఆ.. వినిపిస్తోంది. ఈరోజుల్లో కాలేజ్ లో చదువుతున్న పిల్లలలో ఇది సర్వసాధారణమే కదా! దీంట్లో మీరు టెన్షన్ పడేందుకేముందీ?" నిరాసక్తంగా అంది సలిల..

హిమజ చురచుర చూస్తూ "అలా తీసిపారేయకు. ఇదిగో ఈ ఉత్తరం చూడు" అంటూ మూసి ఉన్న తన గుప్పెట్లోంచి ఉండగా చుట్టి ఉంచిన కాగితాన్ని సలిలకు అందించింది.

నలిగి ఉన్న ఆ కాగితాన్ని సాపుచేసి అందులోని సారాంశం చదివింది సలిల. అందులో ఉన్నవి నాలుగే ముక్కలు. "తపతీ..రేపొచ్చినప్పుడు నీ ఫిజిక్స్ రికార్డ్ తీసుకురా" భాను.

దాన్ని మడిచి హిమజకి తిరిగిచ్చేస్తూ "ఇందులో వర్రీ అయ్యేందుకేముంది? తపతి ఫ్రెండెవరో రాసి ఉంటారు" అంది సలిల తేలిగ్గా.

" అదే.. అదే ఆ ఫ్రెండ్ ఆడా.. మగా.. అని" అంది హిమజ కూపీ లాగుతున్నట్లుగా.

“ఎవరైతే ఏంలెండి. రాసినది రికార్డ్ గురించేగా.. అయినా పేరు చూస్తే తెలియడం లేదూ.. అమ్మాయేనని'' హిమజ ధోరణికి ఒళ్లుమండింది సలిలకు. "అందులోనే ఉంది తిరకాసంతా..ఈమధ్య ఆడపేర్లు–మగ పేర్లకి తేడా ఉండడం లేదు. కాంతి, చైతన్య, తేజ ఇలాంటి పేర్లు ఆడ, మగ ఇద్దరూ పెట్టుకుంటున్నారు” పరిశోధన చేసి ఏదో గొప్ప విషయాన్ని ఆవిష్కరించినట్లుగా చెప్పింది హిమజ.

'భాను అంటే... భానుమతి, భానురేఖ, భాను ప్రియ, ఉదయభాను... ఇలా "ఏమన్నా కావచ్చుగా'? అంది సలిల.

ఆ..కావచ్చు. అలాగే భానుప్రకాష్, భానుప్రసాద్, భానుమూర్తి కూడా అయ్యే ఛాన్సుంది.. ఏమం టావు?” కళ్లెగరేసి అంది హిమజ.

ఆవిడ లాజిక్ సలిలను నోరెత్తకుండా చేసింది. ఆ పరిస్థితుల్లో మౌనమే శ్రేయస్కరమని తలచినా హిమజ ఊరుకోలేదు.

'ఈ చీటీ కళ్లబడిన దగ్గర్నుండీ నా మనసు మనసులో లేదు. తపతి దారి తప్పుతుందేమోనని ఒకటే భయంగా వుంది” గుండెల మీద చేయి వేసుకుంది. హిమజ..

ఆవిడ భూతద్దంలోంచి చూస్తూ చిన్న సమస్యను పెద్దదిగా ఊహించుకుంటూ చిలవలు పలవలు అల్లేస్తోంది. ... తపతి అందమైన అమ్మాయే కావచ్చు. బుద్ధిహీనురాలు మాత్రం కాదని సలిల నమ్మకం.

అల్లరి మగపిల్లలు బుట్టలో వేయాలని చూసినంతనే వలలో పడిపోయేంత పసిపిల్ల కాదు ఆమె... ఈవిడే అనవసరంగా ఏవేవో అల్లేసుకుంటోంది..

మీరు చాలా ఎక్కువ దూరం ఆలోచిస్తున్నారనిపిస్తోంది నాకు. ఆ 'భాను' ఎవరో తపతినే అడగండి. ఒకవేళ మీ అనుమానమే నిజమై, ఆ వ్యక్తి పురుషుడే గనక అయితే హద్దుల్లో ఉండమని ఆమెను హెచ్చరించండి హిమజ బాధ తగ్గించడానికి తనకు తోచిన సలహా ఇచ్చింది సలీల.

అది హిమజకి నచ్చిందనడానికి సూచనగా ఆమె ముఖం విప్పారింది.

“అవును సుమీ.. విషయం దాన్నే కనుక్కుంటాను'' అంది తేలికపడిన హృదయంతో.

'రక్షించారు' అనుకుంది.సలిల మనసులోనే.

''వస్తానాంటీ.. చాలా పని పెండింగ్ లో ఉండిపోయింది'' చెప్పేసి ఇంట్లోకి నడిచింది.

సలిల 'సమయపాలన' కచ్చితంగా పాటిస్తుంది. ఒక్కో పనికీ ఇంత సమయమని కేటాయించుకుంటుంది. ఆ షెడ్యూల్ లోనే పని పూర్తి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

అయితే... అప్పుడప్పుడు అనుకోని ఆటంకాలు ఎదురైనప్పుడు కొన్ని ఒడిదుడుకులు ఏర్పడతాయి. అలాంటి సమయంలో టైమ్-టేబుల్ చెడకుండా కొన్ని అడ్జస్ట్ మెంట్స్ చేసుకుంటుంది.

ఇప్పుడు హిమజతో సంభాషించడం వలన ఖర్చు అయిన ఆ సమయాన్ని ఎలా సర్దుబాటు చేయాలా అన్న ఆలోచనతోనే మిషన్ ముందు కూర్చుంది.

''ఇవాళ రాత్రి వంట సింపుల్ గా చేసేసుకుంటే సరిపోతుంది. వేస్ట్ అయిన ఈ అరగంటా కలిసొస్తుంది. కిరణెటూ ఇంట్లో లేడు'' అనుకుంటూ సగం కుట్టి వదిలేసిన చుడీదార్ అందుకుంది.

★ ★ ★

"హలో సలిలా డార్లింగ్.. ఈరోజు సాయంత్రమే బయలుదేరాలనుకుంటున్నాను. బెంగుళూర్ నుండి నీకేం తేవాలి!'' తెలతెలవారుతూనే ఫోన్ చేసిన కిరణ్ అడిగాడు.

''నాకేం వద్దు గానీ.. మీరు సేఫ్ గా ఇంటికి రండి. అంతే చాలు'' పెరట్లో మొక్కల నడుమ అటు ఇటు పచార్లు చేస్తూ కాఫీ సిప్ చేస్తూ చెప్పింది సలిల ఎంతో ప్రేమగా.

ప్రతిరోజూ... సుప్రభాత సమయాన తొలి సంధ్యలోని అందాలను, ఎర్రబడుతూన్న తూరుపులో.. పైపైకి లేచి వస్తున్న సూర్యబింబాన్ని, ఏ సడి లేని వేకువను, తమ కలకలరావాలతో సందడిగా మారుస్తున్న పక్షుల సమూహాన్ని పరికించి మురిసిపోవడం సలిలకు అలవాటు.

తొలి ఉషస్సులోని సౌందర్యం మనసుని మురిపించి, ఆహ్లాదభరితం చేస్తుందన్నది సలిల అనుభవంలో తెలుసుకున్న విషయం.

"నువ్వు వద్దన్నా మానను గాని.. ఏం కావాలో చెప్పు డియర్" గోముగా అడిగాడు కిరణ్.

" అవును..ఆ సంగతి నాకు తెలుసు. అందుకే మీకు నచ్చిన కానుకను తీసుకురండి మహాశయా" గతంలో అతడు తెచ్చిచ్చిన అనేక బహుమతులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ అంది సలిల.

"దట్స్ గుడ్.. మా సలిల మంచి అమ్మాయి. అది సరే..దేవిగారు ఏం చేస్తున్నారు" కొంటెగా అడిగాడు కిరణ్ .

"శుభోదయ సౌందర్యాన్ని కనులారా వీక్షిస్తూ దేవరవారి రాకకోసం ఎదురుచూస్తున్నారు" తనూ అంతే చిలిపిగా బదులిచ్చింది సలిల.

"ఎదురు చూడు శ్రీమతీ..సిరీక్షణ అనంతరం జరిగే కలయిక ఎంతో మధురంగా వుంటుంది. నీకది అనుభవమేగా" కిరణ్ స్వరంలో అల్లరి చిందులు వేసింది.

సలిల బుగ్గ మందారాలు విరిశాయి. మనసులో రేగిన మధురోహల తాకిడికి కళ్లు అరమోడ్పులైనాయి. నిజమే విరహానంతరం సంగమం ఎంతో రమ్యంగా వుంటుంది. ఈ నాలుగు రోజుల ఎడబాటుకు ఒకే సారి చెల్లు చీటీ ఇచ్చేస్తాడు కిరణ్.

దాచుకున్న చిలిపి వలపులన్నీ, ఒక్కసారిగా తనపై కుమ్మరించి ఉక్కిరిబిక్కిరి చేస్తాడు.

" ఏంటీ.. మాట్లాడ్డం లేదూ.. అప్పుడే ఆ దృశ్యం ఎంత మనోహరంగా ఉంటుందో ఊహించేసుకుంటున్నావా" కవ్వించాడు కిరణ్.

"ఆ.. మరే.. దొరవారి అల్లరులన్నీ తలచుకొని మురిసిపోతున్నా" అంది సలిల.

" అటులనే గానిమ్ము. నీకు దూరంగా గడిపిన ఈ నాలుగు రోజుల విరహాన్ని రూపుమాపి... నీకు బాకీ పడిన ముద్దుముచ్చట్లన్నీ వడ్డీతో సహా చెల్లించుకుంటానని ఇందుమూలంగా తెలియజేసుకుంటున్నానాహో" నవ్వాడు కిరణ్.

"కొంపదీసి దండోరా వేస్తారా ఏం?" కంగారు నటించింది సలిల..

"వేస్తే మాత్రం తప్పేమిటోయ్.. శ్రీవారికి శ్రీమతి అంటే ఎంత అనురాగమో పదిమందీ తెలుసుకొని సంతోషిస్తారు"

"సంతోషించాంగాని.. తమరు ఇక ఫోన్ పెట్టేస్తే మంచిది. సెల్ బిల్లు వాచిపోగలదు" అంది సలిల.

బయటకు అలా అందేగాని అతడితో ఎంత సేపు మాట్లాడినా తనివి తీరడం లేదామెకి.

“సఖితో నెరపే సరస భాషణం కన్నా సెల్ బిల్లు ఎక్కువేం కాదు. అయినా సరే..కాలాతీతమౌతోంది. కనుక ఇక సెలవాదేవీ" నాటకీయంగా అన్నాడు కిరణ్.

ఫక్కున నవ్వింది సలిల.. ఆ నవ్వులు కిరణ్ గుండెల్లో విరిశరాల్లా గుచ్చుకున్నాయి.

"లాభం లేదు. వెంటనే ఇంటిదారి పట్టాలి. లేకపోతే నా మదిలో మదనుడు చేస్తున్న సందడిని ఆపలేను" ఫోన్ పెట్టేస్తూ అన్నాడు

మురిపెంగా నవ్వుకుంటూ "రోజురోజుకీ మీ రౌడీ డైలాగ్స్ ఎక్కువవుతున్నాయి" అంది సలిల.

“అంతా నీ చలవే.. ఇంక ఉంటాను డియర్” అవతల లైన్ కట్ అయ్యింది.. తనూ స్విచ్చాఫ్ చేసి గృహకృత్యాల్లో పడింది సలిల...

ఇంటి పనులు గబగబ ముగించుకొని పుట్టింటికి బయలుదేరింది. పక్క వీధిలోనే ఉన్నారు ఆమె తల్లిదండ్రులు..

తరుచు వెళ్లి వాళ్ల క్షేమ సమాచారాలు కనుక్కోవడం ఆమెకు అలవాటు.

ఎందుకంటే సలిల పెద్దన్నయ్య . అమెరికాలో వున్నాడు. అక్కడే పనిచేస్తున్న తన కొలీగ్ ను ప్రేమించి పెళ్లాడి స్థిరపడిపోయాడు.

తనకింత మంచి జీవితాన్ని అందించిన తల్లిదండ్రుల ఋణాన్ని అమెరికన్ డాలర్లు పంపి తీర్చుకుంటూనే వున్నాడు.. రెండు, మూడేళ్ళకోసారి వచ్చి వాళ్లని ఓమారు చూసి వెళ్లిపోతూ వుంటాడు.

చిన్నన్నయ్య అరవింద్ స్వదేశంలోనే ఉన్నాడు. హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తున్నాడు... అన్నయ్య ముకుంద్ లా కాకుండా జన్మనిచ్చిన వారి పట్ల, తోడబుట్టిన సలిల పట్ల కాస్తంత బాధ్యతగా వ్యవహారిస్తూ ఉంటాడు.

అందుకే సలిల కన్నవారికి చేరువలోనే ఉండి వారి బాగోగులను పర్యవేక్షించాలని ఆకాంక్షించింది.

ఆమె అదృష్టం కొద్దీ కిరణ్ భర్తగా దొరికాడు. అత్త మామలను ఆదిదంపతుల వలే పూజిస్తూ యధాశక్తి సేవలందిస్తాడు. కన్నకొడుకులకన్నా మిన్నగా తమని అభిమానిస్తున్న అల్లుడు దొరకడం తమ అదృష్టంగా భావిస్తూ పొంగిపోతారు వాళ్లు.

''రామ్మా సలిలా.. రా.. అప్పుడే నిన్ను చూసి రెండురోజులైపోయింది.. తెలుసా'' గడపలో అడుగు పెడుతున్న కూతుర్ని చూసి అన్నాడు రాఘవరావు.

'' ఏంటి నాన్నా..రెండు యుగాలైంది అన్నట్లుగా మాట్లాడుతున్నారు'' చిరునవ్వు నవ్వింది సలిలం.

“అవునే..నువ్వు, అల్లుడు కనబడకపోతే గిలగిలలాడిపోతారు మీ నాన్న” అంది అప్పుడే అక్కడకు వచ్చిన వైదేహి.

''నాన్నగారి సంగతి నాకు తెలియదా అమ్మా.. అందుకేగా అన్ని పనులు ప్రక్కన పెట్టి ఘడియకోమారు మిమ్మల్ని చూడ్డానికి పరుగెత్తుకొచ్చేది” తండ్రి ప్రక్కనే కూర్చుంటూ అంది సలిల.

'' అవునమ్మా.. మీ అన్నయ్యలు దూరంగా ఉన్నా సరే..నువ్వు అల్లుడు మా, మంచి చెడ్డలు కనుక్కోవడం వల్లనే మేం ఇలా సంతోషంగా జీవిస్తున్నాం'' అన్నాడు రాఘవరావు కనులు చెమర్చగా..

“మెడలో తాళిబొట్టు పడగానే అమ్మనాన్నలని పరాయివారిగా భావించే ఆడపిల్లల్నెందరినో చూశాను.. అలాంటిది మాకు దగ్గరగా ఉండాలని, నీ కోసం వచ్చిన గొప్ప సంబంధాలెన్నింటినో కాదనుకున్నావు.. నీ పూజలు ఫలించినట్లుగా దేవుడి లాంటి కిరణ్ దొరికాడు. అతడు నాకు అల్లుడు కాదమ్మా.. కొడుకే'' అన్నాడు రాఘవరావు గద్గదస్వరంతో..

“అంతా సా అదృష్టం నాన్నా.. జీవితమే ముగిసిపోయిందనుకున్నాను. ఒకానొక క్షణంలో కానీ.. ఆ దేవుడి దయ, నా దేవుడి ప్రేమలతో హాయిగా జీవిస్తున్నాను'' సలిల కళ్లు సజలమయ్యాయి.

వైదేహి వాతావరణం బరువెక్కడాన్ని గమనించింది. తేలిక పరచడానికన్నట్లుగా “సరిసరి.. మీ తండ్రీకూతుళ్లు మాటల్లో పడితే అంతే.. భోజనాలకి లేవండి” అంది నవ్వుతూ.

"అబ్బా.. అప్పుడే భోజనం ఏంటమ్మా.. ఇంకా పన్నెండు కూడా కాలేదు" అంది సలిల విసుగ్గా ముఖం పెట్టి.

" నీకు తొందరలేకపోవచ్చు. మీ నాన్నగారి సంగతి నీకు తెలియదా ఏం?" అంది భోజనాలకి అన్నీ రెడీ చేస్తూ. రాఘవరావుకి వేగమే భోజనం చేయడం అలవాటు. ఎట్టి పరిస్థితులలో ఉదయం పూట పన్నెండు, రాత్రి ఎనిమిది దాటనివ్వడు.

అతడి ఆరోగ్య రహస్యం అదే కావచ్చుననుకుంటుంది సలిల.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక భర్తను, కూతురిని కేకేసింది వైదేహి.

"అమ్మా..వంకాయకూర సూపర్..అలాగే దోసకాయపప్పుకూడా" చెప్పింది సలిల తల్లి చేతి వంటనాస్వాదిస్తూ,

ఎంత బాగా వంట చేసే అమ్మాయికైనా, అమ్మ చేత్తో పెట్టే ముద్ద అమృతంతో సమానమనిపిస్తుంది. ఆమె కొసరి కొసరి వడ్డిస్తుంటే తనకి తెలియకుండానే నాలుగు ముద్దలు ఎక్కువ తింటుంది.

అది అమ్మ చేతి వంతలోని కమ్మదనం వలన మాత్రమే కాదు.. ఆమె మనసులో పొంగిపొరలే మాతృత్వపు మమకారం వలన కూడా. వైదేహి వడ్డిస్తూంటే తృప్తిగా భోజనం చేసింది సలిల.

" ఏమిటో.. నీకు, చిన్నన్నయ్యకు అప్పుడప్పుడన్నా నా చేత్తో నాలుగు మెతుకులు పెట్టగలుస్తున్నాను. పెద్దన్నయ్యకే..ఎలా ఉంటున్నాడో.. ఏం తింటున్నాడో" వగచింది వైదేహి ఖండాంతరాలలో ఉంటున్న పెద్దకొడుకుని తలుచుకొని.

"హాయిగా ఉంటాడు. వాడికేం పిజ్జాలు, బర్గర్లు తింటూ లైఫ్ జాలీగా గడిపేస్తాడు" అంది సలిల చిరు కోపంగా.

"నువ్వలాగే అంటావుగాని..నా బాధ నీకేం తెలుసు. వాడికి బెల్లం ఆవకాయ అంటే చాలా ఇష్టం. అమెరికాలో అది దొరుకుతుందో లేదో" వైదేహిలో తల్లి ప్రాణం కొట్టుకుపోయింది.

'భేషుగ్గా దొరుకుతుంది. అక్కడ మన తెలుగు వాళ్ల కోసం ప్రత్యేకంగా దుకాణాలు అవీ ఉంటాయి. ఒక వేళ వాటిలో దొరక్కపోయినా ఇక్కడ నుండి వెళ్లి ఏమీ తోచక అవస్థపడే నీలాంటి అమ్మలు,

అన్నయ్య లాంటి భోజనప్రియుల కోసం అన్నీ తయారుచేసి అమ్ముతారు'' వైదేహిని ఊరడించే ప్రయత్నం చేసింది సలిల.

“నిజంగానా'' విస్మయంగా అంది వైదేహి.

''నా మీదొట్టు. మా ఫ్రెండ్ కల్పన వాళ్ల అమ్మ గారు ఆమధ్య అమెరికా వెళ్లారు కోడలి పురుదు పోయడానికని.. ఆవిడకి అక్కడ ఏమీ తోచక మన ఆంధ్రా స్పెషల్స్ అయిన పచ్చళ్లు, పొడులు ఇలాంటివన్నీ తయారుచేసి అమ్మడమే కాకుండా, ఎలా తయారుచేయాలో స్పెషల్ క్లాస్ లు పెట్టి మరీ నేర్పించారుట'' చెప్పింది సలిల సోదాహరణంగా.

వైదేహి శాంతించింది. కొడుకుకు ఇష్టమైన తిండి లభ్యమవుతోందంటే ఏ అమ్మకైనా ఆనందమే కదా!

''నువ్వు కూర్చో..నేను వడ్డిస్తాను'' భోజనం ముగించిన సలిల అంది. భోజనాలు పూర్తయ్యాక రాఘవరావు విశ్రాంతి కోసమనీ తన గదిలోకి వెళ్లిపోయాడు. తల్లీకూతుళ్లు హాల్లో చాపలు పరుచుకుని నడుం వాల్చారు.

''ఆ.. అన్నట్లు.. నీతో ఓ విషయం చెప్పడం మరచిపోయాను'' అంది వైదేహి ఏదో గుర్తొచ్చినట్లుగా..
“ఏంటమ్మా తల్లి ప్రక్కనే పడుకున్న సలిల అడిగింది.

'' నిన్ను చేసుకోమంటే పెద్దఫోజు పెట్టి కట్నానికి కక్కుర్తిపడి ఆ సుబ్బారావు కూతుర్ని తన కోడల్ని చేసుకున్నాడు కదా మీ చంద్రం మామయ్య”

“ఆ..చంద్రం మామయ్య.. ఆయనకేమైంది?” ఆదుర్దాగా అడిగింది సలిల.

'ఆయనకేం? పిడిరాయిలా వుంటేనూ' మూతి తిప్పుకుంది వైదేహి.

“మరి?”

“కోరి చేసుకున్న కోడలు కొరివిదెయ్యంలా దాపురించింది. గంప గయ్యాళిలా ఇంటిల్లిపాదినీ వేపుకుని తింటోంది..నిన్ను కాదని మరీ చేసుకున్నారుగా... బాగా తీరింది సరదా..మొన్న బజార్లో

కనిపించినప్పుడు చంద్రం మామయ్య పెద్దకోడలు కనిపించి చెప్పింది. నిన్ను చేసుకోనన్నందుకు తిక్క కుదిరిందని కూడా అంది'' కసిగా అంది వైదేహి.

''పోనీలే అమ్మా.. అలా మనం అనుకోకూడదు..ఎవరి రాత ఎలా ఉందో అలా జరుగుతుంది. యోగాన్ని బట్టే జీవితాలు వెళ్తాయి'' వేదాంత ధోరణిలో అంది సలిల.

బయటకు అలా అందేగానీ వాళ్ల కుటుంబం తమకు చేసిన ద్రోహాన్ని మరచిపోలేకపోతోంది. సంబంధం వద్దనుకోవడం, కావాలనుకోవడం వాళ్ల ఇష్టానికి సంబంధించిన విషయం. కానీ తన జాతకం మంచిది కాదనీ, ఏవేవో దోషాలున్నాయనీ ఇష్టమొచ్చినట్లుగా దుష్ప్రచారం చేశారు.

అలాంటి కుసంస్కారుల ఇంటి కోడలు కాకపోవడమే తన అదృష్టం.

"నిన్ను కాదన్నంత మాత్రాన నీకేం లోటు వచ్చిందనీ.. బంగారంలాంటి భర్త దొరికాడు'' అంది వైదేహి, సలిల మనోభావాలు చదివినట్లుగా.

"అవును కదా..మరి ఇంకొకళ్ల గురించి మనకెందుకమ్మా.. ఎవరి పాపం వాళ్లే అనుభవిస్తారు'' తల్లిభుజం తట్టి సలిల అనునయంగా. "అవునవును అంతే.. దేవుడు అందరి పాపపుణ్యాలను గమనిస్తూనే వుంటాడు పైనుండి. ఎవరికేమి ఇవ్వాలో ఆయనకి బాగా తెలుసు'' సర్దుకుంది వైదేహి. కాస్సేపు మాటామంతీ అయ్యాక బయలుదేరిపోయింది సలిల.

"ఈరోజు ఉండి వెళ్లచ్చు కదమ్మా" బొట్టుపెడుతూ అంది వైదేహి.

'' కుదరదమ్మా.. బోలెడు పని వుంది. మళ్లీ రెండు రోజులకే ప్రత్యక్షం అవనూ'' నవ్వుతూ అంది సలీల.

''పోనీలే..నువ్వన్నా మా కళ్లముందరున్నావు. అందుకే ఈ ముసలి ప్రాణాలు ఈ మాత్రంగానన్నా మిగిలి వున్నాయి'' కంట తడి పెట్టింది వైదేహి.

''అమ్మా.. అదే వద్దనేది.. ఇప్పుడేమైంది. మీ మంచిచెడ్డ చూసుకోవడం కూతురిగా నా ధర్మం'' ఓదార్చింది సలిల.

అప్పుడే నిద్రలేచిన తండ్రి దగ్గర కూడా సెలవు తీసుకుని బయలుదేరింది. ఆటోలో కూర్చుందన్న మాటేగాని ఆ చంద్రం మామయ్య కుటుంబం తన జీవితంలో ఏలా, ఆదుకుందో మళ్లీ మళ్ళీ జ్ఞాపకం వస్తూనే వుంది, ఎంత వద్దనుకున్నా.. ఆనాటి దృశ్యాలు ఆమె మనోఫలకంపై ప్రత్యక్షమయ్యాయి ఒక్కసారిగా.

ఆడపిల్ల జీవితంతో చెలగాటమాడకూడదని తెలిసి కూడా వాళ్ల ఇష్టానుసారం దుష్ప్రచారం చేశారు. ఎంత మరచిపోదామన్నా ఆ అవమానం మనసులో ఓ మూల ముల్లై గుచ్చుకుంటుంది. సలిల అప్రయత్నంగా గతంలోకి జారి పోయింది.

★★★

" ఇదిగోనోయ్...మీ చంద్రం అన్నయ్య ఉత్తరం రాశాడు..." అన్నాడు వైదేహితో రాఘవరావు.

వంటపనిలో నిమగ్నమై ఉన్న ఆమె " మీరే చదివి చెప్పండి ఏం రాశాడో... నాకు చెయ్యి ఖాళీ లేదు..." అంది.

రాఘవరావు ఉత్తరం మొత్తం చదివి తల పంకించాడు సాలోచనగా. "ఏం లేదోయ్... వాళ్లమ్మాయి గీతను మన పెద్దాడికిద్దామని ఎప్పట్నుంచో అనుకుంటున్నదే కదా... అలాగే మన సలిలను వాళ్లబ్బాయి సతీష్ కి చేసుకుంటే బాగుండునని కూడా అనుకున్నాం... పిల్లల చదువులు పూర్తయ్యి సెటిలయ్యారు కదా...

పెళ్లి విషయంలో ఓ మాట అనుకుంటే బాగుంటుందని రాశాడు... అన్నాడు ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ.

"మరేం... శుభస్య శీఘ్రం అనేద్దాం... వెంటనే రమ్మనమని రాయండి... అన్ని విషయాలు మాట్లాడుకొని ముహూర్తం పెట్టుకుందాం..." చెప్పింది వైదేహి సంబరంగా,

తల్లిదండ్రులేదో ఇంట్రెస్టింగ్ టాపిక్ గురించి చర్చిస్తూండడం గమనించిన అరవింద్ చెవులకి తగిలించుకున్న ఇయర్ ఫోన్స్ పీకి అవతల పడేసి, చేతి లోని వాక్మన్ టేబుల్ మీద పెట్టి వారి దగ్గరగా వచ్చాడు.

" ఏంటి నాన్నగారూ... అమ్మతో ఏదో రహస్యంగా చెప్తున్నట్లున్నారు?" అన్నాడు చనువుగా.

రాఘవరావు ముఖాన పట్టిన చెమటలను కండువాతో అద్దుకుంటూ " రహస్యం ఏమీలేదు. అంతా బహిరంగమే... మీ చెల్లెలు సలిలకు పెళ్లి చేద్దామనుకుంటున్నాము. అలాగే మీ అన్నయ్య ముకుంద్ కి కూడా..." అన్నాడు.

అరవింద్ షాక్ తిన్నట్లుగా చూస్తూ " అన్నయ్యకి అంటే ఓ.కే... సలిలకి అప్పుడే పెళ్లా... దాని వయసెంతనీ..." అన్నాడు.

“ఏరా... దానికి ఇరవై నిండాయి మొన్ననే... ఆడపిల్లకి అది పెళ్లి వయసేగా..." అంది వైదేహి ట్రేలో కాఫీ కప్పులు తీసుకొచ్చి భర్తకు, కొడుక్కి అందిస్తూ.

అరవింద్ తల్లి వైపు విచిత్రంగా చూసి

" ఏంటమ్మా... నువ్వు... ఇరవై అంటే ఏదో అరవైలా చెప్తావేంటి? దాన్ని పై చదువులు చదివిద్దాం. ఈ రోజుల్లో అమ్మాయిలు పెద్ద చదువులు చదివి మంచి జాబ్ చేస్తున్న సంగతి మీకు తెలియనిది కాదు... అసలు సలిలకున్న తెలివితేటలకు అదే పెద్ద ఇంజనీరో, డాక్టరో అయ్యుండేది..." అన్నాడు విసుగ్గా..

రాఘవరావు కొడుకు వైపు కోపంగా చూసి "నాకు పెద్ద చదువుల మీద మోజు లేదు... డిగ్రీతో ఆపేస్తానందిగా మీ చెల్లి... నేనేదో చదివించనట్లుగా నామీద నిష్టూరం వేస్తావెందుకు?' అన్నాడు చిరాగ్గా. "పోనీలెండి... దానిష్టప్రకారమే చదువుకి ఫుల్ స్టాప్ పెట్టేసిందనుకోండి... ఏదో కొంప మునిగినట్లే పెళ్లి ప్రయత్నాలేంటి?" అడిగాడు అరవింద్ అసహనంగా.

వైదేహి అతడికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తూ " ఏ వయసుకా ముచ్చట అన్నారుగా... అయినా ఆడపిల్ల పెళ్లి చేయకుండా ఎన్నాళ్లూరుకుంటాం..." అంది అనునయంగా.

అరవింద్ ఏదో అలోచిస్తున్నట్లుగా ముఖం పెట్టి "సరేసరే... మీ సరదా కాదనడానికి నాకేం హక్కుంది? సంబంధాలేమన్నా చూస్తున్నారా!" అడిగాడు.

రాఘవరావు వదనం తేటపడింది. కొడుకు ముఖంలోని ప్రసన్నత చూసి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంటూ “ఆ విషయమే మీ అమ్మతో మాట్లాడుతున్నాను. మీ చంద్రం మామయ్య. ఉత్తరం రాశాడు. వాళ్లబ్బాయి సతీష్ కి మన సలిలను, మనబ్బాయి ముకుంద్ కి వాళ్ల అమ్మాయి గీతను

ఇచ్చి చేస్తే బాగుంటుందని ఇదివరకే అనుకున్నాం. అదే విషయం ప్రస్తావిస్తూ రాశాడు…” చెప్పాడు సంతోషంగా.

“కుండమార్పుల సంబంధమా… అసలు చంద్రం మామయ్య అంటే…" అగిపోయాడు ఆర్థోక్తిలో

రాఘవరావు భార్య వైపు తిరిగి “చూశావుగా… నీ కొడుకు బంధుజ్ఞానం… అలా ఏడుస్తున్నాయి వీళ్ల బంధుత్వాలు…" వెటకారంగా అన్నాడు.

చంద్రం మామయ్య అంటే మా చిన్నాన్న కొడుకురా…వైజాగ్ లోనే ఉంటారురా వాళ్లూను. చదువురీత్యా నువ్వు దూరంగా వెళ్లిపోవడంతో మరచిపోయుంటావు… వైదేహి కొడుక్కి గుర్తు చేయాలని చూసింది..

" ఏమో! అంతే అయ్యుంటుంది…. అయినా సరే… ఈ కుండమార్పులేంటి?" అయిష్టంగా అన్నాడు అరవింద్.

“ఏం రా! రెండు జంటలూ ఒకరికొకరు అతికినట్లుగా సరిపోతారు. ఏదో సినిమాలో చెప్పినట్లు బంధుత్వంలో బంధుత్వం, ఆస్తిలో ఆస్తి కలిసిపోతాయి…" నవ్వాడు రాఘవరావు.

ఇంతకీ అన్నయ్యకీ, సలిలకీ ఇష్టమో కాదో… తెలుసుకున్నారా!” ఎందుకో.. అరవింద్ కి దగ్గర సంబంధాలు చేయడమంటే ఇష్టం లేదేమోననిపిస్తోంది అతడి వాలకం చూస్తే,

"నా బిడ్డలు రత్నాలురా… వాళ్లు నేను చెప్పినదాన్ని కాదనరన్న నమ్మకం నాకుంది…" గర్వంగా అన్నాడు రాఘవరావు.

"మా మీద మీకున్న నమ్మకానికి థాంక్స్ నాన్న గారూ… కానీ పెళ్లంటే నూరేళ్ల పంట… ఈ విషయంలో వ్యక్తిగత మనోభావాలకి విలువనివ్వడం మంచిదని నా అభిప్రాయం…" అన్నాడు వినయంగా..

“సరే… నీ మాట ఎందుకు కాదనాలి!? అమ్మా… సలిలా… ఇలా రా…" కూతుర్ని పిలిచాడు రాఘవరావు.

అతడు పిలిచిన రెండు క్షణాల్లో అక్కడుంది సలిల.

“ఎందుకు నాన్నగారూ...'' అడిగింది నెమ్మ దిగా.

“ ఏం లేదమ్మా... నీకు, మీ పెద్ద అన్నయ్య ముకుంద్ కి చంద్రం మామయ్య పిల్లలతో పెళ్లి చేయాలని అనుకుంటున్నాము...

కుండమార్పులసంబంధం... ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటో కనుక్కుందామనీ...'' అన్నాడు రాఘవ రావు.

కాసేపు మాట్లాడలేదు సలిల. కలవరపడ్డాడు రాఘవరావు, కూతురు తన పెద్దరికాన్ని త్రోసిరాజంటుందేమోనన్న సందేహం కలిగింది ఆయనకి.

'' మీ ఇష్టం నాన్నగారూ... పిల్లలకి ఏది మంచో– ఏది చెడో నిర్ణయించగలిగిన నేర్పు తల్లిదండ్రులకే ఉంటుంది. ఈ వివాహం వలన మీరు ఆర్థికంగా గానీ, హార్దికంగా గాని నష్టపోరన్న నమ్మకం మీకుంటే అలాగే కానివ్వండి...

సలిల తన అభిప్రాయాన్ని మృదువుగాను, నిక్కచ్చిగానూ తెలియజేసింది. రాఘవరావు దంపతుల ఆనందానికి అంతే లేదు.

“ఆ... నాన్నగారూ... పెద్దన్నయ్యకిష్టమో కాదో కనుక్కున్నారా!'' అడిగింది సలిల అనుమానంగా.

“ ఆ సంశయం నీకక్కరలేదమ్మా... అయినా నీ తృప్తి కోసం వాడికి ఫోన్ చేసి విషయం కనుక్కుంటాను...'' అన్నాడు రాఘవరావు.

అయితే... ఎన్నిసార్లు ఫోన్ చేసినా ముకుంద్ అందుబాటులోకి రాలేదు.

ఆఫీసర్ కి ఫోన్ చేసినా నిష్ప్రయోజనమైంది. గత వారం రోజులుగా అతడు లీవ్ లో ఉన్నాడని చెప్పారు ఆఫీస్ వాళ్లు. చేసేది లేక, దేవుడిపై భారం వేసి ముందుకు వెళ్లాలనే అనుకున్నాడు.

“సరే... మంచిరోజు చూసుకుని మీ అన్నయ్య వాళ్లని రమ్మని చెప్తాను... ముహూర్తాలు పెట్టుకుందాం... పెద్దాడు నా మాట కాదనడని నమ్మకం...” నిట్టూర్చాడు రాఘవరావు. ''అవునవును అంతే...” అంది వైదేహి. అరవింద్, చెల్లెల్ని ఆట పట్టించడం మొదలుపెట్టాడు.

★★★

“ ఏంటి నాన్నా! ఏంటలా ఉండిపోయారు... పెద్దన్నయ్య ఏం రాశాడు...” అప్పుడే అందిన ఎయిర్–మెయిల్ కవర్ చదువుతూ నిస్తేజంగా కుర్చీలోకి ఒరిగిపోయిన తండ్రిని చూస్తూ కంగారుగా అడిగింది సలిల.

రాఘవరావు సమాధానం చెప్పకుండా అలా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు. తండ్రినంత షాక్ కు గురిచేసిన వార్త ఆ లేటర్లో ఏముందా! అన్న ఆలోచనతో ఆయన చేతిలోంచి ఆ ఉత్తరాన్ని తీసుకుని చదివింది సలిల.

అందులోని విషయం చదివిన ఆమె కూడా దిగ్భ్రాంతికి గురయింది.

ముకుంద్ తనతో పాటు పనిచేసే శివాని అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్నదే దాన్లో సారాంశం.

ప్రేమించిన అమ్మాయిని వదులుకోలేక, కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రుల అనుమతి లేకుండా పెళ్లి చేసుకోవాల్సి వచ్చిందనీ, అందుకు తనను క్షమించవలసిందిగా కోరుతూ రాశాడు ముకుంద్.

''ఇప్పుడేం చేయాలి? వీడి మీద నమ్మకంతో అవతల నిశ్చితార్థం కూడా జరిపించేశాను...'' బాధగా కణతలు నొక్కుకున్నాడు రాఘవరావు..

నాలుగు రోజుల క్రితమే చంద్రం తన కుటుంబంతో కూడా వచ్చేడు. మంచిరోజు కుదరడంతో తాంబూలాలు పుచ్చేసుకున్నారు కూడా. ఇప్పుడు నెత్తిన పిడుగుపడిన చందంగా, ఇలాముకుంద్ ఉత్తరం రాయడంతో ఏం చేయాలో తోచక, మీషన్లో చెరుకులా నలిగి పిప్పి అయిపోతున్నాడు రాఘవరావు.

విషయం తెలుసుకున్న వైదేహి పరిస్థితీ అందుకు భిన్నంగా లేదు.

''ఇప్పుడెలాగండీ... అవతల తాంబూలాలు పుచ్చేసుకున్నాం... వీడు చూస్తే ఇలా చేశాడు... ఇప్పుడేం దారి? ఈ విషయం చంద్రం అన్నయ్యకెలా చెప్పాలి... సలిల సంగతి ఏమవుతుందోనని భయంగా ఉందండీ...” గగ్గోలు పెట్టింది వైదేహి.

" తప్పు నాదే వైదేహి... ముకుంద్ తో మాట్లాడకుండా, వాడి పర్మిషన్ తీసుకోకుండా నేనే తొందరపడ్డాను..." కంఠం రుద్ధమైంది రాఘవరావుకి.

" మీరు మాత్రం ఇలా జరుగుతుందనుకున్నారా ఏం? అయినా, పెద్దాడికేం మాయరోగం వచ్చింది... తల్లిదండ్రులం మనం బ్రతికే ఉన్నామన్న విషయం మరచిపోయాడా...." ఉక్రోషంగా అంది వైదేహి.

"వాడినేం అనద్దు వైదేహి.... వాడి మనసుకి నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు... ఇప్పుడేం చేయాలో పాలుపోకుండా ఉంది..." అన్నాడు రాఘవరావు.

"సలహా ఇస్తాడంటే సమయానికి చిన్నాడు కూడా ఇంట్లో లేడు..." కలత చెందింది వైదేహి. అరవింద్ రెండ్రోజుల క్రితమే హైదరాబాద్ వెళ్లిపోయాడు.

లోపల నుండి మంచినీళ్ల గ్లాస్ తో వచ్చిన సలిల దాన్ని తండ్రి చేతికి అందిస్తూ "ముందీ నీళ్ళు తాగండి నాన్నా... తాపీగా ఆలోచిద్దురు గాని..." అంది.

మంచినీళ్లు తాగి, కాస్సేపు రిలాక్స్డ్ గా కూర్చుని స్థిమితపడ్డాడు రాఘవరావు.. మనసు మాత్రం ఈ గండం నుండి బయటపడే మార్గాలని అన్వేషిస్తూనే ఉంది.

" అమ్మా, నాన్నా... మీకు సలహా చెప్పే పాటి వయసుగానీ, అనుభవం గానీ నాకు లేదు... అయినా చెప్పాలనిపించింది... మీరు వెంటనే వెళ్లి చంద్రం మామయ్యని కలిసి విషయం అంతా చెప్పి క్షమించమని కోరండి... ఆ తరువాత ఆయన ఏం చెప్తారో వినండి... ఆ తరువాత ఏం జరగాలో భగవంతుడే చూసుకుంటాడు..." బిడియపడుతూనే చెప్పింది సలిల.

రాఘవరావు వదనంలోకి వెలుగు వచ్చింది. చిన్నపిల్లైనా సమయానుకూలంగా సలహా ఇచ్చిన కూతురిపై వాత్సల్యం పెల్లుబికింది.

" అమ్మాయి చెప్పిన మాట బాగుంది. వైదేహీ... వెంటనే వెళ్లి చంద్రాన్ని కలిసొస్తాను..." అంటూ బయలుదేరాడు ఉత్సాహంగా..

★★★

వెళ్లిన గంట తరువాత ముఖం వేలాడేసుకుని తిరిగి వచ్చిన రాఘవరావును చూసి ఏం జరిగిందోనన్న విషయాన్ని కొంతవరకు అంచనా వేయగలిగారు ఇంట్లోనివారు.

“ఏమన్నాడండీ మా చంద్రం అన్నయ్య..." ఆతృతగా అడిగింది వైదేహి.

" అమ్మా... నాన్నగారిని కాస్త కుదుటపడనియ్యమ్మా... వెంట వెంటనే అన్నీ అడిగేస్తే ఎలా?? "తల్లిని వారించింది సలీల.

కాస్త సర్దుకున్న తరువాత చెప్పాడు రాఘవరావు. పెద్దాడు చేసిన పని గురించి చెప్పగానే వాళ్లూ కాస్త షాక్ తిన్నారు... ఆ తరువాత " నీకు తెలియకుండా వాడా పెళ్లి చేసుకుంటే నువ్వు మాత్రం ఏం చేయగలవని ఓదార్చాడు చంద్రం... సలిలను పెళ్లి చేసుకోవడం తన కొడుక్కిష్టమేనని... ఆ పెళ్లి తప్పిపోయినంత మాత్రాన ఇదీ ఆగిపోవాలనేం లేదని చెప్పాడు...”

మరి! మీరెందుకలా ఉన్నారు?" వైదేహి అడిగింది సంశయంగా,.

"మన పెద్దాడు చేసిన పొరబాటుకి పెనాల్టీగా మనం ఆరు లక్షలని చెల్లించాల్సి ఉంటుంది.”

“అంటే?”

“అంటే... సలిలను కోడలిగా చేసుకునేందుకు గాను, తన కొడుక్కి వరకట్నం ఇవ్వాలని డిమాండ్ చేశాడే వెర్రిదానా” రాఘవరావు నవ్వాడు. విరక్తిగా.

“ఇదేం అన్యాయం అండీ..." వైదేహి విలవిలలాడింది. రక్తసంబంధానికి విలువనివ్వకుండా అతడు కట్నాన్ని ఆశించడం ఆమెకు మింగుడుపడడం లేదు.

ఇందులో అన్యాయం ఏముందే... కుండమార్పుల సంబంధం కాబట్టి తన కూతురి పెళ్లి కానీ ఖర్చు లేకుండా జరిగిపోతుందనుకున్నాడు.. కానీ... మనవాడి నిర్వాకం వలన ఆ అవకాశం చేజారిపోయింది. ఇప్పుడు గీతకు పెళ్లి చేయాలంటే అవతలవాళ్లకి కట్నం ఇవ్వక తప్పదు కదా... ఆ నష్టాన్ని మనద్వారా భర్తీ చేసుకుందామని అతగాడి ఉద్దేశ్యం..." అన్నాడు రాఘవరావు.

“ అయినా సరే... చెల్లెలి కూతుర్ని చేసుకోవడానికి కూడా కట్నమా..." అప్పుడు కలుగజేసుకుంది సలిల...

"ఇందులో తప్పేముందమ్మా? ఈ పరిస్థితుల్లో వాళ్ళకి మనకీ, బయట వాళ్ళకీ గల వ్యత్యాసం గుర్తుండదు. ఎలాగోలా తమ కన్న కూతురి జీవితం సెటిలవ్వాలనే చూస్తారు... కానీ... నాకోసం మీరు అప్పులపాలవ్వక్కరలేదు... ఈ సంబంధం వద్దనుకుంటేనే మంచిది..." నిబ్బరంగా చెప్పింది సలిల.

" నిశ్చితార్థం కూడా జరిగిపోయాక ఇప్పుడు క్యాన్సిల్ చేసుకుంటే నీ భవిష్యత్తు ఏమిటవుతుందమ్మా... ఎలాగోలా వాళ్ళు అడిగిన కట్నం సర్దుబాటు చేసి నీ పెళ్లి జరిపించడమే తక్షణ కర్తవ్యం..." ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లుగా తలూపాడు రాఘవరావు.

"ఆరు లక్షలంటే మాటలా... మధ్యతరగతి సంసారులం... అంత మొత్తం ఎక్కడి నుండి తెస్తాం?" వైదేహి అంది బాధగా. మనకేమే... బంగారుబాతు లాంటి కొడుకు అమెరికా నుండి డాలర్లు పంపిస్తాడు. వాడు చెప్పాపెట్టకుండా చేసిన ఈ పనికి అపరాధ రుసుముగా వాడినే ఆ ఆరులక్షలుపెట్టుకోమందాం..." శుష్కహాసం వెలిసింది రాఘవరావు పెదవుల మీద.

సలిల ముఖంలో ఏదో తెలియని భావం కొట్టుమిట్టాడిందీ కాస్సేపు. ఆ తరువాత పెదవి విప్పింది.

"పెద్దవారు మీ మాటలకి అడ్డు తగులుతున్నందుకు మన్నించండి నాన్నా... నా పెళ్లి కోసం మీరు అన్నయ్యలని డబ్బులడగవలసిన అవసరం లేదు... ఈ పెళ్లి చేసి మీరు నడిరోడ్డు మీద రిక్తహస్తాలతో నిలబడడమూ నేను భరించలేను... అందుకే... ఈ పెళ్లి క్యాన్సిల్ చేసుకుంటున్నామని వాళ్లకి కబురు చేయండి... ఎవరో మనకి తగినవాడు రాక పోడు... అప్పుడే నా పెళ్లవుతుంది..." చెప్పింది ఖచ్చితంగా.

"అమ్మా... అదీ..." ఏదో చెప్పబోయాడు రాఘవరావు.

"ప్లీజ్ నాన్నా... మీ మాట కాదంటున్నందుకు క్షమించండి. అన్నయ్య గీతను పెళ్లి చేసుకోలేదన్న కక్ష మనసులో పెట్టుకుని వారు ఆ తరువాత నన్ను సాధించే ప్రమాదం కూడా లేకపోలేదు... అందుకే నా మాట వినండి. అన్నయ్యలా నేనూ "మీ మాటను ధిక్కరిస్తున్నందుకు మన్నించండి...

చేతివేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరం తీసి టేబుల్ మీద పెట్టింది సలీల.

పోనీ... గీతను మన అరవింద్ కి చేసుకుంటే... తరుణోపాయం సూచించింది వైదేహి.

"అది మరీ తప్పమ్మా... పెద్దన్నయ్యకి వాగ్దత్త అయిన అమ్మాయిని తను చేసుకోవాల్సి వస్తే చిన్నన్నయ్య ఎంతగానో ఇబ్బంది పడవచ్చు... బయటకు మీ మాట కొట్టేయలేక అడ్జస్టయిపోయినా, లోపల మధనపడతాడు. గీత సంగతీ అంతే... ఇన్నాళ్లుగా తన మనసులో ముద్రపడిన అన్నయ్య స్థానంలో తమ్ముడిని నిలబెడితే ఆమె కూడా తట్టుకోలేదు... బయట సంబంధం చేసుకుంటే కొన్నాళ్లు బాధపడినా ఆ తరువాత సర్దుకుపోతుంది.

దయచేసి ఈ విషయంలో చిన్నన్నయ్యని ఇరికించకండి... ముక్కుసూటిగా తన మనసులో మాట చెప్పింది సలిల.

వయసులో చిన్నదైనా, దూరదృష్టితో ఆలోచించి సమస్య పరిష్కారమయ్యే విధానాన్ని తెలియజేసిన సలిలను ముచ్చటగా చూశారు రాఘవరావు, వైదేహిలు.

" అమ్మాయి ఎందుకు చెప్పిందో ఏమో! ఈ సంబంధం విరమించుకుంటేనే అన్ని విధాల శ్రేయస్కరం వైదేహీ..." అన్నాడు రాఘవరావు..

"అవునండీ... భగవంతుడేది చేసినా మన మేలుకే అనుకుంటే మనసుకి ఏ బాధా ఉండదు..." వేదాంత ధోరణి ఆవరించుకుంది వైదేహిని.

వెంటనే చంద్రానికి కబురుచేశాడు రాఘవ రావు... అంత కట్నానికి తాము తూగలేనందున వేరే సంబంధం చూసుకోమని.

ఆ తరువాత వారా విషయం మరచిపోయి, సలిలకు వేరే సంబంధాలు చూడ్డంలో మునిగిపోయారు.

★ ★ ★

" ఏమిటో వైదేహీ... ఎన్ని సంబంధాలు చూసినా సలిలకు ఒక్కటీ కుదరడం లేదు... చూసుకుని, తరువాత కబురు చేస్తామంటూ వెళ్లి పోతున్నారు. ఆ తరువాత ఏ కబురు కాకరకాయ ఉండడం లేదు... మనం ఫోన్ చేస్తే మీ అమ్మాయికి మరో సంబంధం చూసుకోండని చావుకబురు చల్లగా చెప్పేస్తున్నారు... నాకంతా అయోమయంగా ఉంది..." అన్నాడు రాఘవరావు.

అయిన సంబంధం క్యాన్సిల్ చేసుకున్నాక ఇప్పటికి సలిలకు ఆరు సంబంధాలు చూశారు. అందరూ పిల్ల నచ్చిందనే చెప్తున్నారు. కానీ... అటుపైనే... ఏ సంగతీ తేల్చడం లేదెవరూ...

తల్లిదండ్రులుగా వాళ్లకిది భరింపశక్యం కాకుంది. తూగలేమని ఆ సంబంధం వద్దనుకోవటంతో సమస్య తీరిపోతుందనుకున్నారు... కాని సలిల పెళ్లి సమస్య ఇంత జటిలమవుతుందనుకోలేదెవరూ...

దీని వెనుక చంద్రం తాలూకు హస్తం ఉంటుందన్న ఆలోచన కూడా రాలేదు వారికి.

ఆ తరువాత సలిలకు మరొక సంబంధం తీసుకొచ్చిన మధ్యవర్తి చెప్పాడు అసలు సంగతి.

తన కూతురికి అలా జరిగిందన్న అక్కసుతో చంద్రమే సలీల జాతకంలో ఏదో దోషముందని దుష్ప్రచారం చేస్తున్నాడట... అందుకే తాము ఈ సంబంధం వద్దనుకున్నామని మగపెళ్లివారికి ఉత్తరాలు కూడా రాస్తున్నాడని నమ్మకంగా చెప్పాడతడు. సలిలే తమ సంబంధాన్ని వదులుకోమని తల్లిదండ్రులకి సూచించిందని తెలిశాక ఆమె మీద కక్ష మరీ ఎక్కువైంది అతడికి.

అందుకే ప్రతీకారం ఈ విధంగా తీర్చుకుంటున్నాడు.

"అభం-శుభం తెలియని ఈ పసిదేం చేసిందండీ... ఇలా దుష్ప్రచారం చేస్తున్నాడు" ఆవేదనగా అంది వైదేహి.

"ఊరుకో అమ్మా... అది వారి కుసంస్కారానికి నిదర్శనం.. సాటి ఆడపిల్ల జీవితంతో ఆడుకోకూడదన్న ఇంగితం లేనివారు... వారి పాపం వారే పోతారు..." తల్లిని ఓదార్చిందే గానీ మనసులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి సలిలకు.

ఎందుకు తన మీద అంత కసి! జరగబోయే అనర్థాన్ని ముందుగా ఊహించి తప్పుకోవడమే తన పాపమైందా? ఇలా తన మీద చెడుగా ప్రచారం చేస్తే ఆయనకి ఒరిగేదేంటి? ఒక ఆడపిల్లకి తండ్రి అయ్యుండి సాటి ఆడపిల్ల బ్రతుకులో నిప్పులు పోయడానికి ఆయనకి మనసెలా వచ్చింది?

తన పెద్దన్నయ్య తీసుకున్న నిర్ణయం వలన వారి అమ్మాయి జీవితం కొన్ని ఒడిదుడుకులకి లోనై ఉండవచ్చు... కానీ దానికి తను కారణం కాదే!? తన ప్రమేయం లేకుండా జరిగినదానికి తను బాధ్యురాలెలా అవుతుంది? దానికి తనను శిక్షించడం భావ్యమా!

అయినా తన పిచ్చిగానీ, ప్రతీకారం తీర్చుకోవడమే పరమావధిగా బ్రతికేవారికి న్యాయాన్యాయాల ప్రసక్తి దేనికుంటుంది? వాళ్ల అబ్బాయిని చేసుకోమని నిక్కచ్చిగా చెప్పి, నిశ్చితార్థపు ఉంగరం తిప్పి

పంపిన తన మీద పగ తీర్చుకోవడం వారి ధ్యేయమైనప్పుడు తప్పొప్పుల గురించి ఆలోచించే పనేముంది వారికి... సలిల హృదయం కల్లోల సంద్రంలా ఉంది. కాలం మారుతున్నా, మనిషి మనసులో చేసే వికృత విన్యాసాలు మాత్రం మారనందుకు తీరని వేదనగా ఉంది.

" మీరు బెంగ పెట్టుకోకండమ్మా... అమ్మాయికి మంచి సంబంధం తెచ్చే పూచీ నాది... ఈసారి పెళ్లి వారికి అన్ని విషయాలు ముందుగానే చెప్పి జాగ్రత్తపడదాం.." సూచించాడు మధ్యవర్తి.

"చాలా సంతోషమండీ... భారం అంతా మీపైనే వేశాం... ఏం చేస్తారో మీ ఇష్టం..." అన్నాడు రాఘవరావు నిర్వికారంగా. వారి వద్ద సెలవు తీసుకుని వెళ్లిపోయాడాయన.

ఏం చేయాలో తోచని పరిస్థితిలో అరవింద్ ని రమ్మని ఫోన్ చేశాడు రాఘవరావు.

★ ★ ★

"మొదట్నుంచీ అది వద్దంటోందనే ఆలోచిస్తున్నాను కానీ... నా ఫ్రెండ్స్ సర్కిల్లో చాలా మంది ఉన్నారు... సలిలను ఎగిరి గంతేసి మరీ చేసుకోకపోరు ఎవరో ఒకరు..." తల్లిదండ్రుల మానసిక క్షోభనంతా విన్న అరవింద్ అన్నాడు..

"నా మీద నీకున్న అనురాగానికి థాంక్స్ అన్నయ్యా.... కానీ అంత గొప్ప స్టేటస్ లో ఉన్న వారు నాకవసరం లేదు. నా కనీసావసరాలు తీరుస్తూ, నన్ను ప్రేమగా చూసుకునే మనిషి కావాలని నా కోరిక."అదీ కాక అమ్మ-నాన్నలను విడిచి దూరంగా వెళ్లాలని లేదు. అందుకే ఈ చుట్టుపక్కల సంబంధాలకే నేను ప్రిఫరెన్స్ ఇస్తున్నాను..." లోస్వరంతో చెప్పింది సలిల.

అరవింద్ ఆశ్చర్యంగా చూశాడు. ఆమె వైపు, అమ్మాయిలలో చాలా మంది తమ కోరికలన్నీ తీర్చేంత సంపాదన కలిగినవాడిని, ఆడంబరంగా జీవించేందుకు అవకాశమున్న ఉద్యోగంలో ఉన్నవాడిని భర్తగా పొందాలని తపించిపోతారు. కానీ సలిల మాత్రం?

" అదేంటి చెల్లాయ్ .. అలా అంటావు? నీ అందం చూసి ఏ రాజకుమారుడో వరించి వస్తాడు... నువ్వు మాత్రం సాదాగా ఉండే అబ్బాయైతే సరిపోతుందన్నట్లుగా మాట్లాడుతున్నావు... ఏమ్మా... అంత గొప్పసం బధం తెస్తే నాన్నగారు కట్నకానుకలు ఎలా ఇస్తారనేగా నీ భయం..." అన్నాడు అరవింద్.

"నువ్వు దాని గురించి ఆలోచించకమ్మా... ఒక్కగానొక్క ఆడపిల్లవి... నీ అచ్చట ముచ్చట తీర్చడమే మాకు ఆనందం" అన్నాడు రాఘవరావు.

అయినా సలిలా... ఇద్దరం అన్నయ్యలమున్నాం... ముద్దుల చెల్లెలి పెళ్లి కోసం ఆపాటి ఖర్చు చేయలేమా... అవన్నీ నువ్వు మనసులో పెట్టుకోకు. ఇక అమ్మా-నాన్నల మాటంటావా! వాళ్లని పువ్వుల్లో పెట్టి చూసుకోవడం మా కనీస ధర్మం. నాతో పాటే వాళూ ఉంటారు... మేం వాళ్లని సరిగ్గా చూసుకోమని నీకనుమానమా!! అడిగాడు అరవింద్ నిలదీసినట్లుగా. .

సలిల కలవరపడింది. అన్నయ్యకు తన మీద ఉన్న ప్రేమ చూసి ఆమె కళ్లు నీటి చెలమలయ్యాయి. మనసు ఆర్ద్రమైంది.

"ఛ... ఛ... అదేం లేదు చిన్నన్నయ్యా... నాకే ఎందుకో ఇష్టం లేదు. నాకు మొదట్నుంచీ కూడా ఆడంబరాల మీద మోజు లేదు. విలాసవంతమైన జీవితం గడపాలని ఏనాడూ అనుకోలేదు... అందుకే అలా అన్నాను..." చెప్పింది సలిల నెమ్మదిగా.

కానీ... నీకు మంచి సంబంధం చేసి నువ్వు సుఖంగా ఉంటే చూడాలని మాకూ అనిపిస్తుంది కదా..." అన్నాడు అరవింద్ చెల్లెలి తల నిమురుతూ,

తామిద్దరి తరువాత పుట్టిన సలిలంటే అతడికి ఎంతో ప్రేమ. అంతులేని గారాబం.

అతడలా అడుగుతూంటే మనసులోని మాట వెల్లడించక తప్పలేదు సలిలకు.

"అదికాదురా అన్నయ్యా... పెద్దన్నయ్య ఫారిన్లో ఉన్నాడు. మూడు, నాలుగేళ్ల కోసారి కాని రావడం లేదు. ఇక నీకా... పెద్ద ఉద్యోగం నుండి బాధ్యతలనేకం. అందుకే... అమ్మనాన్నలను కనిపెట్టుకుని ఉండాలని నా ఆశ... ఏ ఇంజనీర్ నో కట్టుకుని వాళ్లకి దూరంగా పోవాలని లేదు..." అంది సలిల తలవంచుకుని.

రాఘవరావు దంపతుల మది కదిలి పోయింది. అరవింద్ అపురూపంగా చూశాడు చెల్లెలి వైపు. నిన్న, మొన్నటి వరకు తప్పటడుగులు వేసి, తమ భుజాల మీద గుమ్మడి ఊగిన చిన్నారి నేడు ఎంత పెద్దరికంగా మాట్లాడుతోంది!?

అందినంత పుచ్చుకొని అత్తవారింటికి పెళ్లిపోదామన్న స్వార్థం మచ్చుకన్నా కానరావడం లేదు ఆమెలో.

''సలిలా... ఏరా!? పెద్దన్నయ్యలాగే నేనూ అమ్మ-నాన్నలని గాలికొదిలేస్తానని భయమా!?' అడిగాడు అరవింద్ ఆర్తిగా. సలిల కంగారుపడింది... తన ఉద్దేశ్యాన్ని అన్నయ్య తప్పుగా అర్థం చేసుకున్నాడా!?

''నువ్వలా భావించకు చిన్నన్నయ్యా.. నా మాటలని నువ్వపార్థం చేసుకోవద్దు. మీరు వారిని చూడరని కాదు... వాళ్లని విడిచి మరీ దూరం వెళ్లలేక... అర్థం చేసుకో..." అతడిని కన్విన్స్ చేసే ప్రయత్నం చేసింది సలిల.

నిజానికి సలిల తన మనోభావాల్ని సగమే బయటకు వెళ్లడించింది. అరవింద్ సందేహం కూడా కొంతవరకూ నిజమే.

రాఘవరావు తన పిల్లల్లో చిన్నప్పటి నుండీ కాన వస్తున్న అపారమైన తెలివితేటల్ని గమనించి వారిని పెద్ద పెద్ద చదువులు చదివించాలని ఆశించాడు. దానికి తగినట్లే ముకుంద్, అరవింద్లు చక్కగా చదువుకున్నారు.

బి.టెక్ పూర్తి చేసిన ముకుంద్ ఎమ్.ఎస్. చేయడానికి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. అతడికిష్టమైన అమ్మాయిని పెళ్లి చేసుకొని తల్లిదండ్రులకు మానసికంగా కూడా దూరమైనాడు.

అలాగని కన్నవారి మీద అతడికి ప్రేమ లేదని కాదు. వారి ప్రేమని అతడు డాలర్లతో తూస్తున్నాడు. కానీ... తల్లిదండ్రులు పిల్లల దగ్గర్నుండి ఆశించేది కేవలం వారి సంపాదన మాత్రమే కాదని ముకుంద్ తెలుసుకోలేదు.

అరవింద్ విషయానికొస్తే అతడూ ఇంజనీర్గా పెద్ద మొత్తాన్నే ఆర్జిస్తున్నాడు. అతడుండేది హైదరాబాద్లోనే కాబట్టి తరుచుగా వచ్చి అమ్మ-నాన్న లని, చెల్లెల్ని చూసి, వారి యోగక్షేమాలు విచారించి పోతూ ఉంటాడు.

అతడికీ మనసులో కోరికుంది... అవకాశం వస్తే ఆకాశయానం చేసి విదేశాలు ఓసారి చూసి రావాలని.

వారి అభిప్రాయాల్ని, ఆకాంక్షలనీ తప్పుపట్టడం లేదు సలిల. నేడు పోటీ ప్రపంచంలో అవకాశాల వెంట యువత పరుగులు తీయడం ఆమె కనిపెడుతూనే ఉంది. కానీ... డబ్బు సంపాదనే ధ్యేయంగా, తమని తాము యంత్రాల్లా మార్చుకుంటూ, జీవితంలోని సున్నితమైన అనుభూతులేన్నింటినో కోల్పోతూ... తాము ఏం పోగొట్టుకుంటున్నామో తెలియని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ జీవిస్తున్న వాళ్లని చూస్తే ఆమెకు జాలిగా అనిపిస్తుంది.

మనిషి సుఖంగా బ్రతకడానికి పైకం అవసరం... కానీ, అది మనిషిని లోబరచుకొని, తనకు వసూలయ్యేటట్లుగా చేయడాన్ని సలిల భరించలేదు.

విదేశీ వ్యామోహంలో పడి, ఖండాంతరాలు దాటి వెళ్లిపోయి అయినవారి క్షేమాన్ని పట్టించు కోని ముకుంద్ ప్రవర్తన ఆమెను గాయపరిచింది.

ఏమో! ఎవరు చూడొచ్చారు... రేప్పొద్దున్న అరవింద్ కూడా అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లిపోతాడేమో! వారి ఇష్టా– ఇష్టాలను నియంత్రించే అధికారం తనకు లేదు...

అందుకే తనకు అన్నివిధాల సరిపోయిన సంబంధాన్ని చేసుకొని, కన్నవారిని కని పెట్టుకొని ఉండే స్వేచ్ఛను ఆమె ఆకాంక్షించింది.

అందుకే... అన్నగారి ప్రపోజల్ ని సున్నితంగా త్రోసిపుచ్చింది.

"సలిలా... మాకోసం నువ్వు నీ సుఖాన్ని త్యాగం చేయనవసరం లేదమ్మా. ఎక్కడున్నా మీరు చల్లగా ఉంటే అంతే చాలు... మాదేముంది? నేడో–రేపో రాలిపోయే పండుటాకులు లాంటి వాళ్లం... చిరుమొగ్గల లాంటి మీ భవిత ఆదిలోనే వసివాడకూడదు తల్లీ..." రాఘవరావు నచ్చచెప్ప చూశాడు కూతురికి.

ఆయన బాధ ఆయనది. ప్రస్తుత పరిస్థితులలో సలిల ఈ ప్రదేశం నుండి దూరంగా వెళ్లి, హాయిగా ఉంటే చాలునని ఆకాంక్షిస్తున్నాడతడు. అతడి ఆలోచన తప్పన్నట్లుగా తల అడ్డంగా ఆడించి " మీ కోసమనే కాదు నాన్నా... ధన సంపాదనే ముఖ్యోద్దేశ్యంగా బ్రతికే మగవాడు నాకు అక్కరలేదు. తనకున్న దాంట్లోనే తృప్తిగా జీవిస్తూ, తనను నమ్ముకున్నవారికి న్యాయం చేస్తూసుఖంగా గడిపే

అల్పసంతోషిని మీ అల్లుడిగా తీసుకురండి... అంతే చాలు...స్థిరంగా చెప్పింది సలీల. చేసేది లేక ఊరుకున్నాడు రాఘవ రావు.

''అమ్మాయిగారు వరించబోయే అల్పసంతోషి ఎక్కడున్నాడో దుర్బిణీ వేసి గాలించాలి కాబోలు.. హతవిధీ.. ఏమీ ఈ అగచాట్లూ! చెల్లెలు అంత నిక్కచ్చిగా మనసులో మాట బయట పెట్టాక, తాము చెప్పేందుకేంలేదని గ్రహించిన అరవింద్ వేడెక్కిన వాతావరణాన్ని తేలికపరిచేందుకు హాస్యభరితంగా అన్నాడు. నవ్వేశారందరూ. రాఘవరావు కూతురి తల ఆప్యాయంగా నిమురుతూ ' ఇందాకే చెప్పాడు ఆ విశ్వం. సలిలకు మంచి సంబంధం తానే కుదురుస్తానని, కానీ మీ చంద్రం మామయ్య మళ్లీ ఏ అడ్డుపుల్ల వేస్తాడోనన్నదే నా భయం'' అన్నాడు కాస్త బెదురుగా. అరవింద్ కోపంగా చూశాడు. ''ఈసారి అలా గనుక జరిగితే వెళ్లి నాలుగు తన్ని మరీ వస్తాను. ఇక్కడ మనం చేతులు ముడుచుకు కూర్చున్నామనుకుంటున్నాడు కాబోలు'' అన్నాడు. అతడి కళ్లల్లో ఎర్రజీరలు, అతడిలో కోపం ఏ స్థాయిలో ఉందో తెలియజెప్పాయి.

''నువ్వు తొందరపడకురా. పెళ్లిచూపులకి ముందే అన్ని విషయాలూ మగ పెళ్లి వారికి చెప్పేయడం మంచిదని నిశ్చయించుకున్నాను. అప్పుడు కొత్తగా వాడు చాటింపు వేసేందుకేం మిగలదు" అన్నాడు రాఘవరావు.

"అలా అయితే మరీ మంచిది. నాకు త్వరగా మన సలిలమ్మను పెళ్లికూతురిగా చూడాలని ఉంది'' అరవింద్ అన్నాడు సలిల నెత్తిన చిన్నగా మొట్టి.

"ఛీ..పో.. చిన్నన్నయ్యా'' గారాలుపోయింది సలిల. ఆనందంగా నవ్వింది వైదేహి.

★ ★ ★

అన్నట్లుగానే మధ్యవర్తి విశ్వం సలిలకు ఒక మంచి సంబంధాన్ని తీసుకొచ్చాడు. అది అన్ని విధాల సలిలకు తగినది.. ఆమె కోరుకున్న లక్షణాలన్నీ కలిగినది. .

''కుర్రాడు అనకాపల్లిలో టీచర్గా పని చేస్తున్నాడు. తల్లి, అక్క, చెల్లి తప్ప వేరెవరూ లేరు. అక్క పెళ్లి అయిపోయి తన ఇల్లు తాను దిద్దుకుంటోంది. ఏ బాదరబందీలు లేని చక్కటి సంబంధం'' చెప్పాడు విశ్వం.

"మరే... మంచి రోజు చూసుకొని వాళ్లని పెళ్లిచూపులకి రమ్మందాం. అయితే మన సలిలమ్మకు సంబంధించిన వివరాలు.." అర్థోక్తిలో ఆగిపోయాడు రాఘవరావు.

విశ్వం నవ్వి " మీకా భయం అక్కరలేదు. వాళ్లకి అన్ని విషయాలు తెలుసు. పైగా ఈ జాతకాలు అవీ అంటే కుర్రాడికి నమ్మకం కూడా లేదట. కాకపోతే చిన్న లిటిగేషన్" అన్నాడు. .

"ఏంటయ్యా విశ్వం త్వరగా చెప్పు" తొందర చేశాడు రాఘవరావు.

"మరేం లేదు రాఘవా. తన చెల్లెలికి మంచి వరుడిని తెచ్చి వివాహం చేసే బాధ్యత తన భుజాల మీదే ఉంది కాబట్టి కుండమార్పిడి సంబంధానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కుర్రాడి ఆలోచన" అసలు సంగతి నెమ్మదిగా బయట పెట్టాడు విశ్వం.

రాఘవరావు ముఖం వెలవెలబోయింది. ఓసారి అలాంటి సంబంధం జోలికి వెళ్లి తాను అనుభవించిన మనఃసంక్షోభం చాలు. మళ్లీ కుండమార్పుల సంబంధం చేయాలని తల పెట్టడమా!

"ఈ సంబంధం అన్ని విధాల నప్పుతుందన్నా. ఈ లింకొకటి ఉంది కదా మధ్యలో, ఇదివరకో సారి ఇలాంటిదే తల పెట్టి బుర్రబొప్పి కట్టి ఉంది. మళ్లీ అలా చేయడం నాకిష్టం లేదు. సలిలకు సంబంధం కుదరడమంటే మాకు ఆనందమే. కానీ దాని కోసం అరవింద్ ని, బలవంతపు వివాహంలో ఇరికించడం సబబు కాదు" చెప్పాడు రాఘవరావు. అది నిజమేనన్నట్లుగా తలూపింది వైదేహి.

అక్కడే ఉన్న అరవింద్ అంతా వింటూనే ఉన్నాడు. అతడికి ప్రేమవ్యవహారాలేమీ లేవు. ఎలాగైనా తల్లిదండ్రులు నిర్ణయించిన సంబంధం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నాడు. .

"ఎలాగూ అమ్మ-నాన్నల అభిమతానికనుగుణంగా నడుచుకోవాలని అనుకుంటున్నప్పుడు, కుండమార్పుల సంబంధం చేసుకుంటే మాత్రం తప్పేంటి? అమ్మాయి తనకి నచ్చితేనే చేసుకుంటాడు. లేకపోతే అప్పుడే సలిలకింకో సంబంధం చూడవచ్చు ఇలా తలపోసిన అరవింద్ తండ్రితో తాననుకున్నది చెప్పాడు."

“ అరవింద్.. ఇందులో బలవంతం ఏమీ లేదు. ఇది కాకపోతే మరొకటి. నువ్వు కమిట్ అవ్వవలసిన అగత్యం ఏమీ లేదు" కొడుకు తన చెల్లెలి కోసం త్యాగం చేస్తున్నాడేమోనన్న అనుమానం కలిగిన రాఘవరావు అన్నాడు.

అరవింద్ తల అడ్డంగా ఊపుతూ "నేను కమిట్ అవుతున్నానని" ఎందుకనుకుంటున్నారు నాన్నగారూ. నాకు ఉద్యోగం చేసే అమ్మాయే కావాలన్న రూల్ ఏమీ లేదు. ఎటువంటి లవ్ ఎఫైరూ అంతకన్నా లేదు. అలాంటప్పుడు మనమీ సంబంధం చూసొస్తే వచ్చిన నష్టం ఏమిటి?” అన్నాడు సర్దిచెప్తూ.

కొడుకు మనస్ఫూర్తిగానే అంటున్నాడని గ్రహించిన రాఘవ రావు తదుపరీ కార్యక్రమాల కోసం ప్రణాళికలు ఏర్పరచుకోసాగాడు.

★★★

ఆ రోజు మంచి రోజు కావడంతో విశ్వం తెచ్చిన సంబంధం గురించి వాకబు చేయడానికి వాళ్లూరికి బయలుదేరారు రాఘవరావు, అరవింద్.

పెళ్లికొడుకు పేరు మధుసూదన్, ఎమ్.ఎ, బి.యిడి చదివి, హైస్కూల్లో ఇంగ్లీష్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్నాడు. పల్లెలో రెండెకరాల సుక్షేత్రం. ఓ మోస్తరు డాబా ఇల్లు.. ఇవీ అతని ఆస్తిపాస్తులు.

తండ్రి చిన్నతనంలోనే పోతే తల్లి కష్ట పడి ముగ్గురు పిల్లల్నీ సాకింది. పెద్దమ్మాయిని పొరుగూర్లోనే ఇచ్చారు. మధుసూదన్ మధ్యవాడు. అతడి తరువాత ఉన్న అమ్మాయి పెళ్లి కోసమే అతడు ఈ షరతు విధించాడని తెలిసింది.

తండ్రీ కొడుకులను సాదరంగా ఆహ్వానించింది అతడి తల్లి గిరిజ.

చల్లని మంచినీళ్లు తాగి సేద తీరారిద్దరూ.

“బాబూ విశ్వం మీకన్ని వివరాలు చెప్పే ఉంటాడు” రాఘవరావు ప్రారంభించాడు.

“ అవునండీ. ఆయన మీకు సంబంధించినదంతా మాతో చెప్పేశారు. మీరు రాఘవరావు గారు, ఈయన మీ అబ్బాయి అరవింద్, హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నారు. మీరు మీ అమ్మాయి 'సలిల' పెళ్లి విషయమై ఇలా వచ్చారు. అంతే కదూ'' అన్నాడు మధుసూదన్ చిరునవ్వుతో..

“ అవును బాబూ. అంతే. నీతో ఇంకో ముఖ్య విషయం కూడా చెప్పాలి'' నుదుట అలముకున్న చిరుచెమటలను తుడుచుకున్నాడు రాఘవరావు.

'' మీరేమీ చెప్పనవసరం లేదు. నాకంతా తెలుసు. సంస్కారం లేని మనుష్యుల మాటలు నేనంతగా పట్టించుకోను. అయినా స్త్రీ పురుషులు సఖ్యంగా కాపురం చేయడానికి ముఖ్యం మనసులు కలవడమే కానీ జాతకాలు కలవడం కాదు. కాబట్టి ఈ విషయంలో మీరు ఆందోళన చెందడం అనవసరం'' సౌమ్యంగా చెప్పాడు మధుసూదన్.

రాఘవరావు హృదయం కుదుటపడింది.

'ఈ సంబంధం కుదిరితే బాగుణ్ను' అనుకున్నాడు తనలో తనే.

అరవింద్ ఇంటి పరిసరాలను పరికిస్తూ కూర్చున్నాడు. ఇల్లు ఎటువంటి హంగులు, ఆడంబరాలు లేకుండా సామాన్యంగా ఉంది. ఉన్నంతలోనే పరిశుభ్రంగా, చక్కగా అలంకరించారు.

నేలమీద తెల్లని పెయింట్ తో వేసిన రంగవల్లికలు, గుమ్మాలకి అల్లిన పూసల తోరణాలు అరవింద్ నెంతో ఆకట్టుకున్నాయి.

ఇంతలో కాఫీ తెచ్చి అందించింది గిరిజ.

''చూడండి.. మీకు విశ్వంగారు అన్ని విషయాలు చెప్పే ఉంటారు. ఇప్పట్లో నా పెళ్లికి తొందర లేకపోయినా మా చెల్లెలి గురించి ఈ సంబంధం చూద్దామని ఒప్పుకున్నాను. మా చెల్లి నీరజ అంతగా చదువుకోలేదు. చదువుకోలేదు అనడం కన్నా చదువబ్బలేదు అనడం సబబుగా ఉంటుందేమో! దానికి మంచి సంబంధం తేవాలన్న తపనతోనే ఈ కండిషన్ పెట్టడం జరిగింది'' నవ్వాడు మధుసూదన్.

తనూ నవ్వాడు అరవింద్, మధుసూదన్ చూడ్డానికి అందంగానే ఉన్నాడు. ప్రవర్తన కూడా సౌమ్యంగానే ఉంది. ఈ లెఖ్కన చూస్తే ఆ నీరజ కూడా బాగుండే ఉండాలి. సలిల అదృష్టం బాగుంటే ఈ సంబంధం కుదురుతుంది. ఆమె కోరుకున్న జీవితం లభిస్తుంది ఇలా అనుకున్న అతడు పెళ్లికూతురిని చూడాలని ఆరాటపడ్డాడు.

“ మీ అమ్మాయి నాకు, మా అబ్బాయికీ కూడా నచ్చింది. శ్రీమహాలక్ష్మిలా ఉంది అన్నయ్యగారూ... మా అమ్మాయిని చూసి మీ ఉద్దేశ్యం చెబితే....” సలిల ఫోటో చూస్తూ అంది గిరిజ.

“ ఫోటోలో కన్నా బయట ఇంకా బాగుంటుంది మా సలిల. ఓసారి వచ్చి చూస్తే మీకే తెలుస్తుంది? గర్వంగా అన్నాడు అరవింద్.

' ' ఆగండాగండి .మీ చెల్లాయ్ కన్నా అందగత్తె మా నీరజ. మీరు చూసి అప్పుడు చెప్పండి'' చిలిపిగా అన్నాడు మధుసూదన్.

నవ్వాడు అరవింద్.

“మా సలిల గురించి నేను గొప్పలు చెప్పుకోకూడదుగాని మనిషి ఎంత అందమైనదో మనసూ అంతే సున్నితం. పట్టుపురుగులను హింసించి తయారుచేస్తారని పట్టు చీరలు కట్టుకోదు. అన్నీ కాటన్ చీరలే వాడుతుంది. వీధిలో ఊరకుక్క ప్రసవించినా సరే, జంతు సంరక్షణ సమితికి ఫోన్ చేసి వాటి ఆలన పాలన అప్పగిస్తుంది'' చెప్పాడు మెరిసే కళ్లతో..

మధుసూదన్ మనసు కదిలింది. సలిల మీద ఒక ప్రేమభావం ఉత్పన్నమైంది అతడి హృదయంలో..

" నీరజా... ఓసారి ఇలా రామ్మా'' లోపలికి చూస్తూ పిలిచింది గిరిజ. మరి కాసేపటికి గది లోంచి బయటకొొచ్చింది ఓ నవయవ్వన సుందరాంగి. ఆమె లలిత లావణ్యరాశి. అద్భుత సౌందర్యాన్ని స్వంతం చేసుకున్న కోమలి. అరవింద్ నోట మాట రాలేదు ఆమె అందం చూసి.

ఆమె అక్కడికి రాగానే ఓ మృదుమధుర పరిమళం తనని చుట్టుముట్టిన అనుభూతి కలిగిందతడికి. మీనలోచని, గజగామిని, మధురహాసిని. ఇలా ఎన్ని బిరుదులైనా ఆమెకి ప్రదానం చేయవచ్చుననిపించింది.

ఆ అమ్మాయి అరవింద్ వైపోసారి చూసి చటుక్కున తలదించుకుంది. అతడు మాత్రం చూపు తిప్పుకోలేకపోతున్నాడు.

" ఏమంటారు అరవింద్ గారూ... నే చెప్పింది నిజమేనా?" మధుసూదన్ పిలుపుతో ఉలిక్కిపడి చూపు మరల్చాడు అరవింద్.

అమ్మాయి చదువుకోకపోయినా వంట–వార్పు, కుట్లు అల్లికలు అన్నీ నేర్చుకుంది. ఇంట్లో ముగ్గులన్నీ అది పెట్టినవే. ఆ గుమ్మాలకు, వేళాడుతున్న తోరణాలు, టీపాయ్ మీద వేసిన ఈ లేస్లు అన్నీ అది అల్లినవే" కూతురి గురించి చెప్పుకొచ్చింది గిరిజ.

అరవింద్ మెదడుకి మరి ఏమీ ఎక్కడం లేదు. మదిని దోచే ముగ్ధ మనోహర ప్రతిమలాంటి నీరజ అందం అతడిని ఆకట్టుకుంది అమితంగా.

చదువు లేకపోతేనేం? చక్కదనాల చుక్క లాంటి నీరజని చేసుకోవడమే పెద్ద అదృష్టం.. తండ్రి చెవిలో చెప్పేశాడు అరవింద్ అమ్మాయి తనకు నచ్చిందని, సలిల, వాళ్లకు నచ్చితే ముహూర్తాలు పెట్టేసుకోవచ్చునని.

ఆ మాటే బయటకు చెప్పాడు రాఘవరావు.

మంచి రోజు చూసుకొని పెళ్లిచూపులకొస్తామని చెప్పారు గిరిజ మధుసూదన్లు. చెల్లెలి కోసం ఈ సంబంధం చూడడానికి వచ్చిన అరవింద్, సలిలని మధుసూదన్ కిచ్చి తీరాలని ప్రార్థిస్తున్నాడు. ఎందుకంటే నీరజ అతడి హృదయాన్ని ఆక్రమించుకు కూర్చుంది.

మధుసూదన్ కి సలిల నచ్చితేనే నీరజ తనదవుతుందన్న సత్యం అతడికి తెలుసు. అన్నగారికి ఆ అమ్మాయి పిచ్చిగా నచ్చేసిందని తెలుసుకున్న సలిల అరవింద్ ని ఆటపట్టించడం మొదలుపెట్టింది.

" నీకూ ఆయన నచ్చకపోతాడా. నేనూ ప్రతీకారం తీర్చుకోకపోతానా .." అన్నాడు అరవింద్ చెల్లెలీ ఆకతాయి తనానికి మురిసిపోతూ.

సలిల చెంపల్లో కెంపులు విరిశాయి. అంత సేపు అరవింద్ ని హాస్యాలాడిన..ఆమె గొంతు సిగ్గుతో మూగబోయింది.

తన జీవితంలో కళ్యాణి రాగాలు పలికించే కళ్యాణ శుభవేళ గురించి తియ్యటి కలలు కనసాగింది.

★★★

మధుసూదన్ సలిలను చూడ్డం, ఆమె అందానికి బందీ అయి ఆమె నచ్చిందని పెద్దలకు చెప్పడం, ముహూర్తాలు నిర్ణయించడం వెంట వెంటనే జరిగిపోయాయి. మధుసూదన్–సలిల పెళ్లి ముందుగా జరిగేటట్లు తదుపరి వారు పీటలమీద కూర్చుని నీరజని కన్యాదానం చేసేట్లు కుదిరాయి లగ్నాలు. ..

ఏ విషయానికీ కొరత రాకుండా, అన్ని మర్యాదలు ఘనంగా జరిపాడు రాఘవరావు.

పెళ్లికి ముకుంద్ రాలేదు. ఎయిర్మెయిల్ కవర్ ద్వారా తన ఆశీర్వాదాలు, చెల్లికి పెళ్లికానుకగా వెయ్యి డాలర్లు పంపి తన బాధ్యత తీర్చుకున్నాడు. .. మధు–సలిల పెళ్లి అయిన రెండు రోజులకి అరవింద్–నీరజల పెళ్లి జరిగింది. కొత్త పెళ్లికూతురైన సలిల, కొత్తగా వచ్చిన వదిన హోదాలో ఆడపడుచు కన్యాదాన మహోత్సవంలో తన వంతు పాత్ర

పోషించింది ఎంతో ఆరిందాలా.

వివాహమైన వెంటనే రెండు జంటలు, ఇంకా ఇరువైపుల పెళ్లి పెద్దలు కలసి సింహాద్రి అప్పన్న దర్శనానికి బయలుదేరారు. దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణమయ్యారు. కొత్త జంటలు రెండూ ఓ కార్లో కూర్చున్నారు.. అప్పటికే చిరు చీకటి పడసాగింది. కాస్త దూరం పోయాక ఓ చోట కారాపాడు డ్రైవర్.

''ఎందుకాపావు?'' అడిగాడు మధుసూదన్.

"ఆకలేస్తోంది సార్. పోయి టిఫిన్ చేసొస్తాను'' అన్నాడు డ్రైవర్.

పర్స్ లోంచి యాభై తీసిచ్చి ''చేసి రా పో'' అన్నాడు అరవింద్.

వెనుక బంధువులతో బయలుదేరిన ఇంకొక కారు వీళ్లని దాటుకొని ముందుకుపోయింది.

తన పక్కనే, ముగ్ధసింగారం ఒలికిస్తున్న సలిలను ప్రేమగా చూశాడు మధుసూదన్. ఆమె ప్రశాంత వదనంతో, ఏ అలజడీ లేకుండా పారుతున్న నిండుగోదారిలా గంభీరంగా ఉంది.

కన్నార్పకుండా తననే చూస్తున్న భర్తను చూస్తే సిగ్గు ముంచుకొస్తోంది సలిలకు, అరవింద్ పరిస్థితి అలాగే ఉంది. ఒదిగి కూర్చున్న నీరజ సౌందర్యం అతడిని వివశుడిని చేస్తోంది.

అక్కడ నుండి తిన్నగా అన్నవరం వెళ్ళి, సత్యనారాయణవ్రతం చేసుకున్నాక గానీ మిగిలిన తంతు చేయకూడదని గిరిజ మొక్కుకుంది.

అందుకే... తమకి అతి సమీపంలో మెలుగుతూ ఉన్న భార్యల స్పర్శను ఆస్వాదిస్తూ, తొలి రేయి కోసం కలలు కనడం మినహా మరేమీ చేయలేకపోతున్నారు నూతన వరులు.

ఇంతలో టిఫిన్కని వెళ్లిన డ్రైవర్ తిరిగి వచ్చాడు. రోజూ అదే సమయానికి గొంతులోకి మెల్లగా జారుతూ, నరనరాల్లో వేడిని పుట్టించే మదిర మీద మోహం వీడలేక టిఫిన్ తినడానికని అబద్ధం చెప్పి మందు కొట్టడానికి పోయాడతడు. అరవింద్ ఇచ్చిన యాభైతో మరికొంచెం తాగి వచ్చాడు.

కారు కొంత దూరం పోగానే అతగాడికి కిక్కు తలకెక్కింది. మత్తుతో కళ్లు మూతలు పడసాగాయి. స్టీరింగ్ చేతులలోంచి అదుపు తప్పుతోంది.

ఇవేమీ పట్టని స్థితిలో తేలిపోతున్నారు నవదంపతులు.

ఇంతలో... ఎదురుగా వస్తున్న భారీ వాహనాన్ని తప్పించబోయి పక్కకి టర్నింగ్ తీసుకున్నాడు డ్రైవర్ నిషా వలన కంట్రోల్ తప్పాడు. కార్ వెళ్లి రోడ్డుపక్కనున్న పెద్ద చెట్టుని ఢీకొంది.

ఏం జరిగిందో తెలుసుకునే లోపు... కార్ కుదుపుకి బ్యాక్ డోర్ ఓపెన్ కావడం, డోర్ పక్కనే కూర్చున్న మధుసూదన్ ఎగిరి రోడ్డు మీద పడడం, వెనుకే అతి స్పీడ్ గా వస్తున్న లారీ చక్రాల కింద పడి అతని దేహం నుజ్జు నుజ్జవ్వడం క్షణాలలో జరిగిపోయాయి.

కళ్ల ముందు జరిగిన ఘోరాన్ని చూసి వెర్రిగా కేక పెట్టి స్పృహ కోల్పోయింది సలిల. డ్రైవర్ కి పెద్ద దెబ్బలే తగిలాయి. మిగిలిన వారు ఓ మోస్తరుగా గాయపడ్డారు.

క్షణం క్రితం ఎన్నో ఆశలను మూటగట్టుకుని, ఊసులాడుకుంటున్న ఆ జంట కళ్లుమూసి తెరిచే లోపు శాశ్వతంగా దూరమైంది.

వీళ్ల కారు కన్నా ముందు వెళ్తున్న కార్లోని వారు ఎంతకీ వీళ్లు రాకపోవడంతో అనుమానం కలిగి కార్ వెనక్కు తిప్పమన్నారు. .

అక్కడ ప్రత్యక్షమైన ఘోర దృశ్యాన్ని చూసి దుఃఖంతో తల్లడిల్లిపోయారు.

చెట్టంత కొడుకును పోగొట్టుకున్న గిరిజ ఒక రకంగా ఆక్రోశిస్తే, కాళ్ల పారాణి కూడా ఆరక ముందే కూతురు పసుపు-కుంకుమ పోగొట్టుకోవడంతో రాఘవరావు దంపతులు ఇంకో రకమైన షాక్ కి గురయ్యారు.

అరవింద్ తేరుకోలేని తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్నాడు. నీరజ, ఆమె అక్కల పరిస్థితి సరేసరి.

బంగారం లాంటి చెల్లెలి జీవితం అంధకారబంధురమవ్వడంతో అరవింద్ నవనాడులు కృంగిపోయినట్లయ్యింది.

దయలేని విధిని నిందిస్తూ మిగిలిన కార్యక్రమాలు పూర్తి చేశారు.

విధినించితయై సలిల పుట్టింట చేరింది. కుడి కాలు పెట్టి అత్తవారింట గృహప్రవేశం చేయవలసిన నీరజ ఏ ముచ్చటకీ నోచుకోకుండా మగ్గిపోసాగింది.

★★★

''అమ్మా... మీరు చెప్పిన అడ్రస్ వచ్చేశాం'' ఆటోవాలా పిలుపుతో ఉలిక్కిపడింది సలిల.

అంతసేపూ తను గత జ్ఞాపకాలలో తేలియాడానని గ్రహించింది..

చటుక్కున ఇహలోకంలోకి వచ్చి పడి ఆటో ఫేర్ చెల్లించి లోపలకి నడిచింది.

గోడవతల నుండి హిమజ పలకరించింది.

"ఏమ్మా సలిలా.. మా తమ్ముడింట్లో లేడని షికార్లు కొట్టి వస్తున్నావా!'' అంది హాస్యంగా..

'' అదేం లేదాంటీ.. అమ్మవాళ్లని చూద్దామని వెళ్లి వస్తున్నాను" నవ్వుతూనే బదులు చెప్పింది సలిల.

''ఇంతకీ మా తమ్ముడెప్పుడొస్తున్నట్లో...''

'' ఈ రోజు సాయంత్రానికి రావచ్చు. అందుకే ఇప్పుడు వెళ్లివచ్చేస్తున్నాను." బదులిచ్చింది సలిల.

"త్వరగా వెళ్లి మా తమ్ముడి స్వాగత సత్కారాలుకి ఏర్పాట్లు చెయ్యి" కవ్వించింది హిమజ.

"మరే... మీ తమ్ముడు మహా రాజుగారనీ" నవ్వుతూనే అని తలుపు తాళం తీసి లోపలికి వెళ్లింది సలిల..

" అంతేగా మరి!" హిమజ మాటలు గాలిలో తేలిపోయాయి.

తలుపు మూసి గృహకృత్యాల్లో మునిగిపోయింది సలిల. "

" కిరణ్...త్వరగా రావూ, నీ కోసం వేచి వేచి, ఎదురుచూసి తనువు కనులు కూడా అలసిపోతున్నాయి" విరహోత్కంఠిత అయ్యింది సలిల.

★★★

తపతీ... సాయంత్రం హోటల్ "సిరి ఇంటర్నేషనల్ కి వస్తావా" చేతి గోళ్లకున్న పాలిష్ చూసుకుంటూ అడిగింది వందన."

"ఎందుకూ?" అనాసక్తంగా అడిగింది తపతి.

"ఇవాళ ముఖేష్ బర్త్ డే కదా! పార్టీకి రమ్మని మనందరినీ ఇన్వైట్ చేశాడు కూడా మరచిపోయావా?" గుర్తు చేసిందింకో అమ్మాయి.

"ఆ... అవును" ఏ భావమూ లేకుండా అంది తపతి.

ఆమెకిలాంటివి గుర్తుంచుకోవాల్సిన అవసరం పడదు. హిమజ ఆమెను బయటకు పంపకపోవడం వలన ఇలాంటి వాటిని ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తుంది.

"దాన్నెందుకు అడుగుతారే. అది ఎక్కడికైనా వస్తుందా, ఏమన్నానా!" గేలి చేసినట్లుగా అంది. ఇంకొక అమ్మాయి.

" అది అమ్మకూచి. అమ్మనడగనిదే ఏ పనీ చేయదు" వందన వ్యాఖ్యానించింది.

"అవునవును. ఆవిడకి తన కూతుర్ని ఎవరైనా కొరుక్కు తినేస్తారేమోనని భయం. ఇది మహా అందగత్తె కదా. అందుకే దిష్టి తగులుతుందని ఎక్కడికీ పంపదు అసూయగా" అంది మరొక అమ్మాయి.

విషనాగుల్లా తను చుట్టుముట్టి, వేధిస్తున్న స్నేహితురాళ్ల కామెంట్స్ వింటూంటే చచ్చిపోవాలనిపిస్తుంది తపతికి. తల్లి తన చుట్టూతా ఏర్పరచిన ఆంక్షలనే అడ్డుగోడలను ఛేదించుకొని ఈ సువిశాల ప్రపంచంలో స్వేచ్ఛావిహంగమై ఎగిరిపోవాలనుంది. కానీ తల్లి అందుకు అవకాశమివ్వదు.

"దీని పిచ్చి గాని ఈ రోజుల్లో కూడా అమ్మ-నాన్నలకి భయపడడం ఏంటి అసహ్యంగా. మా మమ్మీ-డాడీ చూడు నాకు ఎంత ఫ్రీడం ఇచ్చారో. నేనెలా తిరిగినా ఏం చేసినా అడ్డు చెప్పరు" తల్లిదండ్రుల అదుపు-ఆజ్ఞలు అస్సలు ఎరుగని ఓ యువతి అంది గర్వంగా.

విచ్చలవిడితనాన్ని, ఆధునికతగా భావించే అజ్ఞానం ఆమెది.

"అవును. వాళ్ల పర్మిషన్ కోసం వెయిట్ చేస్తే వద్దనే అంటారు. వాళ్లకి తెలియకుండా ఎస్కేప్ అయిపోతే ఆ థ్రిల్లే వేరు" మరొక అమ్మాయి రెచ్చగొట్టింది ఇలాంటి విషయాలు తనకి కొట్టినపిండేనన్నట్లు.

" అవును తపతీ అన్నీ అమ్మకు చెప్పే చేయక్కరలేదు. ఆ వయసు మీరిన వాళ్లకేం తెలుసు మన యూత్లో ఉండే సరదాలు, సంతోషాలు" అంది వందన.

తపతి ఆలోచనలో పడింది. అవును.. తను బ్రతిమాలినకొద్దీ తల్లి బిగుసుకుపోతోంది. చెప్పకుండా వెళ్తే ఏం చేయగలదు!

అమ్మో! ఇన్ టైమ్లో ఇల్లు చేరకపోతే ఏమన్నా ఉందా! తల్లి నానా గందరగోళం చేయదూ.

తప్పు-ఒప్పులు తేల్చుకోలేని డోలాయమాన స్థితిలో ఊగిసలాడుతోంది ఆమె మనసు.

స్నేహితుల మాటలు అడుగు ముందుకేయమని ప్రోత్సహిస్తున్నాయి.

మనసు ఏదో సంకోచంతో, ఆచి తూచి వ్యవహరించమని హెచ్చరిస్తోంది.

"ఇది బి.సి.లో పుట్టవలసిన మనిషే... అది. కాదు కానీ దాన్ని బ్రతిమలాడి మన టైమ్ వేస్ట్ చేసుకోవడం దేనికి?" అంది వందన వ్యంగ్యంగా.

అందరూ లేచారు. ఆమెను వదిలిపోవడానికి ఉద్యుక్తులయ్యారు.

"ఆగండి.. ఈ రోజు పార్టీకి నేనూ వస్తాను" ఏదో తెలియని తెగింపు ఆవరించగా దృఢంగా అంది తపతి.

అమ్మాయిలందరి వదనాలూ వికసించాయి.

"యస్. దిసీజ్ ద స్పిరిట్. ఈ వయస్సులో ఎంజాయ్ చేయకపోతే ఇంకెప్పుడు చేస్తాం? కాస్త లేట్గానైనా కళ్లు తెరిచావు" అభినందించింది వందన ఆమె ఏదో ఘనకార్యం తలపెట్టినట్లుగా.

అందరూ కదిలారు. కాలేజ్ అయిపోగానే తిన్నగా ఇంటికి వెళ్లి, చదువుకునే తపతి, ఆ రోజు మాత్రం వందన ఇంటికి వెళ్లి, అక్కడే రిఫ్రెష్ అయ్యి వందన డ్రెస్సే ధరించి పార్టీకి వెళ్లింది.

అద్భుత సౌందర్యరాశి అయిన ఆమె తన పార్టీకి 'సెంటర్ ఎట్రాక్షన్'గా నిలిచినందుకు పొంగిపోయాడు ముఖేష్

★★★

హిమజకి కాళ్లు చేతులు ఆడడం లేదు. ఆమె దృష్టి హాల్లో ఉన్న గడియారం మీదే ఉంది. టైమ్ ఎనిమిది కావస్తోంది. తపతి జాడలేదు.

రోజూ అయిదు కొట్టగానే ఠంచనుగా ఇంటికొచ్చే తపతి, ఆ రోజు ఇంకా రాకపోవడం ఆమెలో భయాందోళనలను రేకెత్తిస్తుంది.

భర్త కూడా ఇంకా ఇల్లు చేరలేదు. మహతి లోపల చదువుకుంటోంది. కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి బయటకు తిరుగుతున్న తల్లిని చూసి " వస్తుంది లేమ్మా. అదేమన్నా చిన్న పిల్లా ఏదో పనుంటే గాని లేట్ చేయదు" అంది చిరాగ్గా.

తల్లి అతి ధోరణి చూస్తే ఆమెకు ఒళ్లుమంట. చెల్లెలిని రూపసి అని అతిగా పొగుడుతూ, తనని చులకన చేస్తున్నారేమోనన్న బాధ ఆమెది..

" నీకు తెలియదు మహతీ. అది ఈమధ్య కోపిష్టిలా తయారైంది. ఏం మాట్లాడినా విరుచుకుపడుతోంది" బెంగగా అంది హిమజ.

మహతి మరి మాట్లాడలేదు. పుస్తకంలోకి బుర్ర దూర్చింది తిరిగి, గేటు చప్పుడవ్వడంతో తొంగి చూసింది హిమజ. తపతి హుషారుగా నడుచుకుంటూ లోపలికి వస్తోంది.

ఇదివరకెన్నడూ ఆమెలో అంత హుషారు చూడలేదు.

“తపతీ ఎందుకింత లేటైంది?'' ఆతృతగా ప్రశ్నించింది హిమజ.

“ ప్రైవేట్ క్లాస్ కండక్ట్ చేశారు అందుకే లేటయ్యింది” కాస్త శాంతంగా బదులిచ్చింది తపతి.

"అంతేనా.. నేనింకా ఏమో అని భయపడ్డాను. చీకటిపడితే చాలు రౌడీ వెధవలు విజృంభిస్తారు. నీలాంటి కంటికీ నదురైన పిల్ల కనబడితే వెంటబడి అల్లరి చేస్తారు. అందుకే నాకంత భయం'' ఆదుర్దా తగ్గిన హిమజ అంది కూతుర్ని అపురూపంగా చూస్తూ.

“ నీ భయం నీది గానీ నన్నెవడూ ఏమీ అనడులే. పోలీసు కుక్కలా నువ్వు నామీద నిఘా వేసుంచినన్నాళ్లూ నాతో మాట్లాడే సాహసం ఎవడికుంటుంది?'' అంది తపతి కాస్త వెటకారంగా.

అదేమీ గమనించని హిమజ తపతి తనను పొగుడుతోందని భావించింది. తన సమర్ధతకు సర్టిఫికెట్ ఇస్తోందని మురిసిపోయింది.

ఆమె ప్రవర్తనలోని తేడాను గమనించింది మహతి మాత్రమే.

'ఇవాళ దీని ప్రవర్తన రోజుకన్నా తేడాగా ఉంది. తల్లి నిలదీయగానే భద్రకాళిలా విరుచుకుపడి, నానా రభస చేసే తపతి ఈ రోజంత సౌమ్యంగా సమాధానమిచ్చిందంటే సమ్థింగ్ ఈజ్ రాంగ్' సాలోచనగా అనుకుంది తనలో తానే.

కూతురు తన హితోక్తులను పెడచెవిన పెట్టి, తనకు కావల్సిన స్వేచ్ఛను అన్వేషించే ప్రయత్నంలో పడిందని ఊహించని హిమజ తన ప్రయోజకత్వానికి కూతుర్ని తన కనుసన్నల్లో మెలిగేలా చేయగలచిన చాకచక్యానికి మెచ్చుకుంటోంది తనను తానే.

★★★

హాల్లో ఆపకుండా ఫోన్ రింగ్ అవుతూ ఉంటే గబగబ వచ్చి లిఫ్ట్ చేసింది సలిల.

వంటింట్లో కిరణ్ కి ఎంతో ప్రీతిపాత్రమైన గోబీ పరాటా చేయడంలో నిమగ్నమై ఉంది ఆమె. అవంటే అతనికి చాలా ఇష్టం.

అప్పటికి కిరణ్ వచ్చి నాలుగు రోజులైంది. ఈ నాలుగు రోజులుగా సలిలను సినిమాలనీ, షికార్లనీ ఊదరగొడుతున్నాడు. ఇవాళ కూడా 'కళాభారతిలో జరిగే ఏదో మ్యూజిక్ ప్రోగ్రామ్కి వెళ్లామని ఫిక్స్ చేశాడు. అతడొచ్చేసరికి టిఫిన్ రెడీ చేస్తే తినేసి బయలుదేరచ్చని ఆ ప్రయత్నంలో ఉంది ఆమె.

'ఈ టైమ్ లో ఎవరో ఫోన్' అనుకుంటూ 'హలో' అంది కాస్త విసుగ్గా.

''నేనే సలిలా అమ్మను'' అటు నుండి వైదేహి పలకరించింది.

'' అమ్మా నువ్వా! ఎలా ఉన్నావు? నాన్నగారు క్షేమమేనా?'' తల్లి గొంతు విన్న సంబరంతో ప్రశ్నించింది సలిల.

"ఆ.. అందరూ క్షేమమే. అల్లుడుగారు ఊరి నుండి వచ్చేశారా?" అడిగింది వైదేహి.

'ఆ.. వచ్చేశారు. ఏంటి విశేషం? ఈటైమ్ లో ఫోన్ చేశావు

" విశేషమే.. వదిన నెల తప్పిందట. చిన్నన్నయ్య ఫోన్ చేసి చెప్పాడు" ఆనందంగా చెప్పింది వైదేహి.

సంతోషంతో ఉప్పొంగిపోయింది సలిల, నీరజ కన్సీవ్ అయ్యిందన్న శుభవార్త విని ఆమె మది ఉత్సాహంతో పరవళ్లు తొక్కింది.

"అమ్మా నిజమేనా. ఎంత గుడ్ న్యూస్ చెప్పావు?'' సంబరంగా అంది సలిల.

ఆమె ఆనందాన్ని పసిగట్టిన వైదేహి చిన్నగా నవ్వుతూ "అవునే పిచ్చితల్లీ.. నువ్వు అత్తయ్యవి కాబోతున్నావు అదీ ఇద్దరు భడవలకి'' అంది.

సలిల చిన్నగా అరిచింది. "రియల్లీ.. వదిన కడుపులో కవలలున్నారా?'' నమ్మలేనట్లుగా అడిగింది.

"అవును తల్లీ. అప్పుడే అయిదో నెల వచ్చేసిందట. ఇన్నాళ్లూ సిగ్గుపడి మాకు కూడా చెప్పలేదు, ఒంట్లో అనీజీగా ఉందని చెకప్ కి వెళ్తే డాక్టర్ చెప్పిందట కవలలున్నట్లుగా. అంతేకాదు పూర్తి బెడ్రెస్ట్ అవసరమని కూడా చెప్పిందట. అందుకే నేను, మీ నాన్నగారు వెంటనే బయలుదేరి వెళదామనుకుంటున్నాం. డెలివరీకి కూడా పుట్టింటికి పంపనంటున్నాడు చిన్నన్నయ్య. అప్పటి

సంగతి చూసుకోవచ్చు. ముందు మేం వెళదాం అనుకుంటున్నాం. వాళ్లమ్మగారికీ ఇప్పటివరకూ చెప్పలేదుట'' గుక్క తిప్పుకోకుండా ఏకబిగిన చెప్పింది వైదేహి.

''అవునమ్మా.. నువ్వు వెళ్లి కొన్నాళ్లు ఉంటే తరువాత అత్తయ్య వెళ్లారు. అవునూ ఇప్పటికిప్పుడు ప్రయాణమంటే రిజర్వేషన్ అదీ దొరక్క ఇబ్బందవుతుందేమో!

ట్రైన్ కి దొరకడం కష్టమే. అందుకే కాస్త ఖర్చ యినా 'గరుడ' బస్ కి రిజర్వ్ చేయించారు నాన్న గారు. ఎల్లుండి రాత్రే ప్రయాణం. నువ్వొకసారి వస్తావా?'' అడిగింది వైదేహి..

''తప్పకుండా, నేను, ఆయన కలసి వచ్చి మిమ్మల్ని బస్ ఎక్కిస్తాం. సరేనా'' హామీ ఇచ్చింది సలీల.

''సరే ఉంటానయితే. అబ్బాయితో కూడా ఈ గుడ్ న్యూస్ చెప్పు'' అని ఫోన్ పెట్టేసింది వైదేహి.

తనకెంతో ప్రీతిపాత్రమైన చిన్నన్నయ్య తండ్రి కాబోతున్నాడంటే భూమ్మీద కాలు నిలవడం లేదు సలిలకు.

ముకుంద్ కి ఇద్దరు పిల్లలు పుట్టినా వారిని ఫోటోలలో తప్ప ప్రత్యక్షంగా చూసే యోగం కలగలేదిప్పటికి. అందుకే అంత సంబరం. తమకి దగ్గరగా మసలేందుకు ఇద్దరు బుజ్జి పాపాయిలు తమ ఇంట పారాడబోతున్నారు. ఆ ఊహే ఎంతో మధురంగా అన్పించింది సలిలకు.

వెంటనే అరవింద్ కి డయల్ చేసింది. నీరజ ఫోన్ ఎత్తింది.

'' నీరూ... నేవిన్నది నిజమేనా ఇద్దరు బుజ్జి గాళు పుడతారట'' ఎంత దాచుకుందామన్నా దాగని సంతోషం చిందులేసింది సలిల స్వరంలో.

' అవును సలిలా' సిగ్గు దొంతరల మధ్య చెప్పింది నీరజ.

''కంగ్రాట్స్ నీరూ, అన్నయ్య కలలు ఫలించబోతున్నాయి'' అంది సలిల.

అంతా నీ పుణ్యమే సలిలా గాద్గదికంగా అంది నీరజ.

'' భలే దానివే ఇప్పుడదంతా దేనికి గానీ.. నేను మీ మీద అలిగాను'' కినుకగా అంది సలిల..

'అలకా.. దేనికీ?'

'' ఇంత మంచి వార్తను ముందు నాకు చెప్పనందుకు''

''సారీ సలిలా ఎందుకో... చెప్పాలంటే సిగ్గేసింది'' అంది నీరజ.

'' సిగ్గెందుకమ్మా. రేపు నెలలు నిండాక కంటావు కదా'' అంది సలిల కొంటెగా.

'' అయినా సరే మొహమాటంగా అనిపించింది. అందుకే చెప్పలేదు. ఏమీ అనుకోవు. కదూ'' రిక్వెస్టింగ్గా అంది నీరజ..

“హు... ఇప్పుడేమనుకున్నా ప్రయోజనం లేదు గానీ అన్నయ్య లేడా?'

'' లేరు.. ఇంకా ఆఫీస్ నుండి రాలేదు'' అంది నీరజ.

'' అన్నయ్యకు కంగ్రాట్స్ చెప్పానని చెప్పు. నేను మళ్లీ ఫోన్ చేస్తాను'' అంది సలిల..

'' అలాగేలే గానీ నువ్వెప్పుడు చెప్పబోతున్నావు. గుడ్ న్యూస్!

ఈసారి సలిల సిగ్గుపడింది. ''ఆ మాట మీ అన్నగారినడుగు'' తప్పించుకోజూసింది.

''ఆ పప్పులేం ఉడకవు. నువ్వూ అమ్మాయినో అబ్బాయినో రెడీ చేయి'' అంది నీరజ.

''బాప్రే.. ఇప్పుడప్పుడే అంత భారం మోయ లేను. ప్రస్తుతానికి నువ్వు కను నా సంగతి తరువాత చూద్దాం'' భయం భయంగా అంది సలిల.

'' ఏం గడుసుతనం చూపిస్తున్నావమ్మా, మా అన్నయ్యని అమాయకుడిని చేసి నీ కొంగున ముడేసుకున్నావన్నమాట'' మేలమాడింది నీరజ.

' అవును పాపం! మీ అన్నయ్య కూచి పిల్లాడు. ''అందుకే నా కొంగునే ఉయ్యాల చేసుకు ఊగుతున్నారు'' తనూ ' ఏమాత్రం తగ్గకుండా బదులిచ్చింది సలిల..

కిలకిల నవ్వింది నీరజ. కాస్సేపు కబుర్లాడుకున్నాక ఫోన్ పెట్టేసింది. సలిల. మనసంతా ఎంతో హాయిగా మారింది. వంటింట్లో పని చేసుకుంటూనే కిరణ్ రాక కోసం ఎదురుచూడసాగింది.

ఎంత త్వరగా అతని చెవినీ శుభవార్త వేయాలా అని ఆత్రంగా ఉందామెకి.

ఇంతలో రానే వచ్చాడు కిరణ్.

"వచ్చారా.." అంటూ ఉత్సాహంగా ఎదురెళ్ళింది సలిల. " ఏంటో.. సలిలాదేవిగారివ్వాళ చాలా హ్యాపీ మూడ్ లో ఉన్నారు" అడిగాడు కిరణ్ ఆమె ఆనందం గమనించి.

" అవును మీకో గుడ్ న్యూస్ చెప్పాలి" అంది. సలిల.

*ఏమిటో.. శ్రీమతిగారిని ఇంత ఉత్సాహభరితంగా చేసిన ఆ శుభవార్త"

విషయం చెప్పింది సలిల. "ఐసీ.. నేనింకా నువ్వు కన్సీవ్ అయ్యావన్న వార్త చెప్తావనుకున్నాను" నిరాశగా అన్నాడు కిరణ్.

"ఛ..పొండి.." గారాలుపోయింది సలిల.

" ఏయ్.. అలా సిగ్గుపడుతూంటే ఎంతముద్దుగా ఉన్నావో తెలుసా?" ఆమెను సందిట బంధిస్తూ అన్నాడు కిరణ్.

"త్వరగా రెడీకండి. ప్రోగ్రామ్ ఏదో ఉందన్నారుగా" అంది అతడి కౌగిలి పట్టు విడిపించుకుంటూ.

" అదే చెప్పబోతున్నాను. ఆ ప్రోగ్రామ్ క్యాన్సిల్ అయ్యిందట. దానికి బదులుగా లోకల్ ఆర్టిస్ట్ దెవరిదో పెట్టారుట. వెళదామా?" ఆమెను విడిచి పెట్టకుండా అడిగాడు కిరణ్.

"అలాగా అయితే ఎక్కడికీ వెళ్లొద్దు. ఇంట్లోనే హాయిగా కబుర్లు చెప్పుకుందాం. సరేనా?" అంది సలిల.

"సరే.. వట్టి కబుర్లు అంటే కుదరదు. ఏమైనా కథాకమామిషూ..." అల్లరిగా అన్నాడు కిరణ్.

"ఎప్పుడూ అదే ధ్యాసా శ్రీవారూ. అయినా కబుర్లు చెప్పడమంటే మీ నిఘంటువులో అర్థమే వేరు కదా" అరుణిమతో అలరారే ప్రియసఖి వదనం ఎంతో ముచ్చట గొలిపింది కిరణ్ కి.

చటుక్కున వంగి ఆమె పెదవులందుకున్నాడు. సలిల కూడా కిమ్మనకుండా అధరసుధామృతాన్ని ఆస్వాదించింది..

కాస్సేపయ్యాక బలవంతంగా అతడిని దూరంగా నెట్టేసి "మాటల్లో పెట్టి మాయచేయడం మీకే తగును. ఫ్రెష్ అయి రండి. మీకిష్టమైన గోబీపరాఠా రెడీగా ఉంది" అంది కొంగుతో ముఖం తుడుచుకుంటూ.

''వావ్.. ముందు వాటి పని పట్టి తరువాత నిన్ను నమిలి మింగుతా'' కైపుగా చూస్తూ అన్నాడు కిరణ్.

'' అలాగే మహానుభావా ముందు వెళ్లి స్నానం చేయండి

అతడిని బాత్రూమ్లోకి తోసినంత పనిచేసింది సలిల..

అతడు ఫ్రెష్ అయి వచ్చి, టిఫిన్ చేశాక తనూ స్నానం చేసి తయారయ్యింది. లేత గులాబీరంగు ఆర్గండీ వాయిల్ చీర, అలాంటిదే జాకెట్, మెడలో సూత్రాల గొలుసు, చేతికి నాలుగు బంగారు గాజుల మధ్య మట్టి గాజులు, నల్లగా ఓత్తుగా ఉన్న జడలోంచి మెడమీదికి జారిన విరజాజి దండ, కళ్లల్లో నైర్మల్యం, పెదవులమీద దరహాసం ప్రశాంతమైన వదనం....

నిరాడంబరంగా ఉన్నా కూడా తళుక్కుమనే సౌందర్యంతో ఆకట్టుకుంటోంది సలిల రూపం.

''ఇకమీదట దొరగారు క్యాంపులనీ తగ్గించుకోండి. అమ్మవాళ్లు ఊరెళుతున్నారు'' చెప్పింది సలిల తన మెడలోని సూత్రాలతో ఆడుకుంటూన్న కిరణ్ తో.

''ప్రయత్నిస్తాను ప్రాణేశ్వరీ'' ఆమె ఒళ్లో తల పెట్టుకున్న వాడల్లా లేచి కూర్చున్నాడు కిరణ్.

“అదేం.. అయ్యగారు చెలి ఒడి వీడారు''

నవ్వింది సలిల.

''వెళ్లి మీ అన్నయ్యకి ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పాక మన పని ప్రారంభిద్దాం''

''ఎప్పుడూ రౌడీ మాటలు, వేషాలేనా... కాస్తయినా పెద్దమనిషి తరహా కావద్దూ'' చెవి మెలేసింది సలిల.

'అయ్యబాబోయ్ వదలవే సలిలా... నొప్పెడుతోంది' గోల పెట్టాడు కిరణ్ –

'' అల్లరి మానేసి బుద్దిగా ఉండండి'' అతడికి వార్నింగ్ ఇచ్చి చెవి వదిలింది సలిల.

''రాక్షసీ.. ఎంత గట్టిగా తిప్పావే. ఇంతకింత ప్రతీకారం తీర్చుకుంటాను చూడు'' కక్షగా అన్నాడు కిరణ్.

గల గల నవ్వింది సలిల." ముగ్ధుడై చూశాడు కిరణ్

ఇద్దరూ కలసి అరవింద్ కి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు.

“అది సరే గానీ సలిలా.. సీరియస్గా అడుగుతున్నాను నువ్వెప్పుడు తింటావు చింతకాయలు, పుల్లమామిడికాయలూను" అడిగాడు కిరణ్.

"నాదేముంది అంతా శ్రీవారి కటాక్షం'! చిలిపిగా అంది సలీల.

" ఏయ్.. నన్ను రౌడీవేషాలు, డబల్ మీనింగ్ డైలాగులని తిడతావుగానీ, నువ్వూ ఏం తక్కువ కాదు" సుడిగాలిలా ఆమెను కమ్ముకున్నాడు కిరణ్.

"సావాస దోషం మరి!" రసరమ్య లోకాల ద్వారాలు తెరవమంటూ రెచ్చగొడుతున్న సలిల మాటలు, కులుకులొలుకుతూ దోచుకోమంటూ ఆహ్వానిస్తున్న ఆమె పరువాలు కిరణ్ని నిలువనీయడం లేదు.

మాటలతో జాప్యం చేయడం ఇష్టం లేనట్లుగా ఆమెని అల్లుకుపోయాడు.

..........................................................................

రెండు రోజుల తరువాత రాఘవరావు దంపతులను బస్ ఎక్కించి వచ్చారు సలిల , కిరణ్. ఆ రోజు ఉదయాన్నే వెళ్లి వాళ్ళ సమన్లు సర్దిపెట్టడంలో సహాయం చేసి వాళ్ళు బస్సు లో తినడానికి టిఫిన్ తయారు చేసి పెట్టింది సలిల .

వైదేహి హడావుడికి అంతే లేదు. నిమ్మకాయ, ఉసిరిపచ్చడి, చింతకాయ తొక్కు ఇలాంటివన్నీ ప్యాక్ చేసింది కోడలి కోసం. ఇరుగుపొరుగుల సహాయంతో జంతికలు, చెగోడీలు, కారప్పూస, కజ్జికాయలు, మైసూర్పాక్ లాంటీ పిండివంటలన్నీ తయారుచేసింది.

“కోడలికి సూడిదలు ఘనంగానే తీసుకెళ్తోందమ్మా మీ అమ్మ” ఎగతాళి చేసినట్లుగా అన్నాడు రాఘవరావు.

"పెద్ద కోడలికి ఎలాగూ ఏమీ చేయలేకపోయాను. నా చేతుల మీదుగా సాగే తొలి సందడి మనింట్లో ఇదే. ఎవరెన్ని విధాల వెక్కిరించినా చేసేది, చేయకమానను" వైదేహి చెప్పింది ధీమాగా.

"చూడమ్మా.. నాయనమ్మ హోదా రాగానే మీ అమ్మకి ఎంత గర్వం హెచ్చిందో" రాఘవరావుకి సరదాగా ఉంది భార్యని వేళాకోళమాడుతూ ఉంటే.

నవ్వింది సలిల. వైదేహీ శృతి కలిపిందామెతో. వాళ్ళు అన్నాళ్లపాటు దూరంగా వెళ్తూ ఉంటే సలిల మది బరువెక్కింది.

" జాగ్రత్తయ్యా కిరణ్. ఏ అవసరం వచ్చినా ఫోన్ చేయండి. వెంటనే వచ్చేస్తాం" చెప్పాడు రాఘవరావు బస్ కదిలిపోతూండగా.

ఇంటికి వచ్చాక భోజనాలవీ పూర్తయ్యాక వంటిల్లు సర్ది పెట్టుకుని సలిల వచ్చేసరికి కిరణ్ గాఢనిద్రలో ఉన్నాడు.

రోజూ ఆమెను కవ్వించి, శృంగార రసాంబుధిలో ఓలలాడే అతడు ఆ రోజు అంత త్వరగా పడుకోవడం గమనించిన సలిల బాగా అలసిపోయుంటాడు అనుకుంది ప్రేమగా అతడి నుదురు ముద్దాడుతూ, ..

నిద్రలో కదిలాడు కిరణ్, అతడికి నిద్రాభంగమవ్వడం ఇష్టంలేని దానిలా కాస్త దూరంగా జరిగి పడుకుంది సలిల.

ఆమె మనసులో అరవింద్, నీరజలకు సంబంధించిన ఆలో చనలు చెలరేగాయొక్కసారి, వాళ్లు అమ్మ-నాన్నలు కాబోతున్నారంటే ఎంతో ఆనందంగా అనిపిస్తోందామెకి. ఆనాటి వారి పరిస్థితి తలుచుకుంటే ఆమెకు భయమేసింది.

ఏనాటికైనా వారి దాంపత్య వీణ మధుర రాగాలు ఆలపిస్తుందా' అనిపించేది. కానీ భగవంతుడు దయామయుడు. వారి జీవితాన్ని చక్కదిద్ది సంతాన భాగ్యం కలిగించాడు. ఆనాడు... ఆ దుర్ఘటన జరిగిన తరువాత...

★★★

" నీరజని చీర-సారె పెట్టి కాపురానికి పంపాలనుకుంటున్నాను వదినగారూ. ఎప్పుడు దిగబెట్టమంటారు?" అడిగింది గిరిజ.

వెంటనే సమాధానమివ్వలేదు వైదేహి. కళ్లముందరే కన్నకూతురి నూరేళ్ల జీవితం సమాధి అయిపోవడాన్ని ఆమె ఇంకా జీర్ణించుకోలేకపోతోంది.

ఆమె మనఃస్థితి గిరిజ ఎరుగనిది కాదు. పుత్రశోకంతో ఆమె కూడా అల్లాడిపోతోంది. అయినా సరే అదంతా దిగమ్రింగుకొని కూతురి విషయం కదిపేందుకు వచ్చింది.

అన్నదమ్ముడిని పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న నీరజను భర్త ఆదరణ తేరుకోనేలా చేస్తుందని ఆమె ఆశ. ఈ విషయం కదుపుదామా, వద్దా అని తనలో తనే మథనపడి, చివరకు ఏదైతే అదవుతుందని తెగించి వచ్చేసింది.

కూతుర్ని ఇలా చూస్తూ మీరు ఎంతో కృంగిపోతున్నారని నాకు తెలుసు. చెట్టంత ఎదిగిన కొడుకును కోల్పోయి నేనూ అంతే బాధతో ఉన్నానని మీరు గ్రహించండి. నాకు మా నీరజోకటి, సలిలోకటి కాదు. సలిలను లక్ష్మీదేవిలా మా ఇంటికి తీసుకెళ్లాలనుకున్నాను. కానీ విధి అనుకూలించలేదు. మీ కోడల్ని మీ ఇంటికి పంపి, నా కోడల్ని నాతో తీసుకెళదామని వచ్చాను. ఆమెను నా కడుపులో పెట్టి కాపాడుకుంటానని మాట ఇస్తు న్నాను'' గిరిజ చెప్పింది నమ్మకంగా.

వైదేహి నెమ్మదిగా గొంతు పెగల్చుకుంది. వియ్యపురాలు అంతలా చెప్తూ ఉంటే తాను ఏమీ అనకుండా కూర్చోవడం మర్యాద కాదనిపించింది.

'మా కోడల్ని ఇంటికి తెచ్చుకోవాలని మాకు మాత్రం ఉండదా వదినగారూ.. ఇలా జరగడంతో అబ్బాయి కూడా ఎంతో మనోవేదన అనుభవిస్తున్నాడు. వాడితో ఒక్క మాట చెప్పి మీకు కబురు చేస్తాను' అంది నెమ్మదిగా.

గిరిజ నిట్టూర్చింది భారంగా. లోపలికి వెళ్లింది సలిలను పలకరిద్దామని. . జీవచ్ఛవంలా మిగిలిన ఆ అపరంజి బొమ్మను చూస్తే గుండెల్లో కలుక్కుమంది. కళకళలాడుతూ తన నట్టింట నడయాడవలసిన ఆమె 'అలా మోడులా మిగిలిపోవడం ఆమెకు భరింపశక్యం కాకుంది.

" అమ్మా.. సలిలా'' అత్తగారి పిలుపుతో ఉలిక్కిపడింది శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్న సలిల.

చటుక్కున కూర్చున్న చోటు నుండి లేస్తూ "రండి అత్తయ్యా'' అంది ఎంతో ఆదరంగా..

పీక్కుపోయిన చెంపలు, జీవరహితమై లోతుకుపోయిన కళ్లు.. రంగు వెలసిన బొమ్మలా కళావిహీనంగా ఉంది సలిల.

''ఎలా ఉన్నావమ్మా?'' ఆ మాట అడగడం అర్థరహితమని తెలిసినా అడిగింది గిరిజ.

శుష్కహాసం ఒకటి జాలువారింది సలిల పెదవుల మీద.

"నిన్ను మన ఇంటికి తీసుకెళ్తామని వచ్చానమ్మా" అంది గిరిజ సలిల తల నిమురుతూ.

'' ఏ ఆశ మిగిలి ఉందని నన్ను అక్కడికి రమ్మన్నారత్తయ్యా'' అంది సలిల, ఆమె స్వరం ఏదో అగాధాల లోతుల్లోంచి వస్తున్నట్లు బలహీనంగా. ఉంది.

'' వాడు పోయాక కూడా నన్ను నువ్వు '' అత్తయ్యా అనే పిలుస్తున్నావు. ఆ బంధంతోనే అడుగుతున్నాను ఏమ్మా... నిన్ను అమ్మలా చూడలేనేమోనని నా మీద అనుమానమా' గద్గదమైంది గిరిజ స్వరం.

కదిలిపోయింది సలిల చప్పున అత్తగారి చేతులందుకొని ''నా ఉద్దేశ్యం అది కాదత్తయ్యా. ఈ పరిస్థితుల్లో నేనక్కడికి రాలేను. కొత్త కోడలిగా కుడిపాదం మోపవలసిన నేను ఇలా.. విధవలా.." గొంతు రుద్రమై మాట జీరవోయిందామెకు.

అర్థమైంది గిరిజకు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆడపిల్లకు అమ్మ ఒడే ఓదార్పునందించగలదు. ఆమె మదిలో చెలరేగే మంటలను తల్లి ప్రేమే చల్లార్చగలదు.

'' నీ మనసు నాకర్థమైంది సలిలా. ఎప్పుడైనా నీకు విసుగుపుట్టి గాలిమార్పు కావాలనుకుంటే మాత్రం నీ ఇల్లు నీకుందని మరచిపోకు'' చెప్పేసి నిష్క్రమించింది గిరిజ.

ఆ సమయంలో రాఘవరావు ఇంట్లో లేడు. అతడు రాగానే విషయం తెలియజేసింది వైదేహి.

రాఘవరావు కాళ్లు చేతులు కడుక్కొని భోజనానికి కూర్చున్నాడు.

కంచంలో అన్నం వడ్డిస్తూ ''మంచి రోజు చూసి కోడల్ని కాపురానికి తీసుకురావాలని ఉందండీ'' అంది వైదేహి.

అన్నంలో కూర కలుపుకుంటూ "నీకా! వాళ్లమ్మగారికా'' అడిగాడు రాఘవరావు.

“ఇద్దరికీనూ. వాడు మాత్రం నాతి గల బ్రహ్మచర్యం ఎన్నాళ్లు అనుభవిస్తాడు. ఎవరి అదృష్టం వారిదే. దాని ఖర్మ ఇలా కాలింది. కనీసం ఆ అమ్మాయయినా సుఖపడితే అంతే చాలు” వైరాగ్యంగా అంది వైదేహి.

“ అవునవును అదీ పాయింటే. రాత్రే అరవింద్ కి ఫోన్ చేసి మాట్లాడతాను" అన్నాడు రాఘవరావు.

ఆ రాత్రి అరవింద్ కి ఫోన్ చేసినప్పుడు "చెల్లాయ్ పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పుడు నేను సరసాలు, సంబరాలు ఎలా సాగిస్తాననుకున్నారు నాన్నా!" అన్నాడు.

అతడి స్వరంలో ముద్దుల చెల్లెలి జీవితం మోడువారిపోయిందన్న ఆవేదన ఉంది.

“ అవుననుకో.. కానీ కోడల్ని మాత్రం ఎన్నాళ్లని పుట్టింట్లో ఉంచేస్తాం చెప్పు. పెళ్లయి మూడు నెలలు కావస్తోంది. నీరజ విషయంలో వాళ్లకి కూడా కొన్ని కలలు, కోరికలు ఉంటాయి కదా!” అన్నాడు రాఘవరావు అనునయంగా.

వెంటనే సమాధానమివ్వలేదు అరవింద్. అతడికీ బాధగానే ఉంది. ఎన్నో ఆశలతో నీరజను తన అర్థాంగిగా చేసుకుంటే ఇలా జరిగిందేమిటి? అని చాలాసార్లు కలత చెందాడు.

చెల్లెలు భర్తను పోగొట్టుకొని కుమిలిపోతూ ఉంటే తను మాత్రం పడుచుపెళ్లాంతో కులకడానికి మనస్కరించలేదతడికి.

కొడుకు అలా ఉలుకు– పలుకు లేకుండా ఉండిపోవటంతో ఫోన్ లైన్ కట్ అయ్యిందని భావించిన రాఘవరావు "హలో..హలో.." అన్నాడు కంగారుగా.

అరవింద్ ఉలిక్కిపడి "చెప్పండి నాన్నా” అన్నాడు.

"చెప్పేందుకేముంది? నీ పెళ్లాన్ని నీ దగ్గరకు పంపించాలనుకుంటున్నాం. ఆ అమ్మాయి పరిస్థితే ఆలోచించు. మొగుడు తనని పుట్టింట్లోనే వదిలేశాడు. అంటే ఆమెకి అది ఎంత అవమానం!" అన్నాడు రాఘవరావు.

“కావచ్చు. కానీ చెల్లాయి...” నసిగాడు అరవింద్.

పక్కనే ఉన్న సలిలకు అరవింద్ మాటలు వినిపిస్తున్నాయి చిన్నగా.

అతడి మనసు డోలాయమాన స్థితిలో ఉందని గ్రహించి తండ్రి చేతిలోంచి ఫోన్ తీసుకుంది.

''అన్నయ్యా'' పిలిచింది ప్రేమగా.

''సలిలమ్మా.. ఎలా ఉన్నావురా?'' అరవింద్ కంఠంలో లాలన తొంగి చూసింది.

''బాగానే ఉన్నానన్నయ్యా. వదిన్ని కాపురానికి "తీసుకెళ్లు అన్నయ్యా'' ప్రాధేయంగా అంది సలిల.

''నువ్వు ఒంటరి బ్రతుకు బ్రతుకుతూంటే నేను మాత్రం..

విరక్తిగా నవ్వి ''ఎవరి కర్మకు ఎవరు కర్తలు చెప్పు! నా నుదుటి రాత ఇలా ఏడిసింది. నీరజ కూడా నాలాంటి ఆడపిల్లే. నా కోసం బాధపడి ఆమెనెందుకు ఉసురు పెట్టాలి. కనీసం, మీరన్నా సుఖంగా ఉంటే...”

చెల్లెలు వెక్కడం గమనించిన అరవింద్ కరిగిపోయాడు.

“బంగారం.. ఎందుకురా ఏడుపు? నువ్వు చెప్పినట్లే వింటాగా. నా తల్లివికదూ ఊరు కోమ్మా'' బుజ్జగించాడు.

కూతురు చేతిలోంచి ఫోన్ అందుకున్న రాఘవరావు “నువ్వన్నా సుఖంగా ఉండాలని దాని ఆకాంక్ష. ఏమంటావు?'' అన్నాడు.

“ మీకేది మంచిదనిపిస్తే అలా చేయండి'

రాఘవరావుకి కూతుర్ని చూస్తే జాలితో పాటు గర్వం కూడా కలిగింది. ''

'సలిల ఉత్తమురాలు. అందుకే తన బ్రతుకు పోయినా సాటి అమ్మాయి క్షేమాన్ని కోరుకుంటోంది. ఇటువంటి కూతురిని కన్న తాము ఎంతో అదృష్టవంతులు' అనుకున్నాడు.

వెంటనే శాస్త్రిగారిని సంప్రదించి మంచి ముహూర్తం చూపించాడు.

ఆనాటికి చీర-సారెతో సహా నీరజను అత్తింట దిగవిడిచింది ఆమె అక్క.

''నేను వచ్చి తీసుకురావాలంటే వీలు పడదు. అమ్మ మీరు కలిసి నీరజను తీసుకొచ్చేయండి. సలిలను కూడా తీసుకురండి'' చెప్పాడు అరవింద్.

కానీ సలిల , అంగీకరించలేదు. శుభమా అని కొత్తకాపురానికి అడుగు పెట్టేవేళ తను శనిపాదం పెట్టనని

భీష్మించుకు కూర్చుంది. తల్లి, తండ్రి... ఆఖరుకి నీరజతో సహా ఎవరెన్ని విధాల చెప్పినా వినలేదు.

''నాకు అలాంటి పట్టింపులు లేవు సలిలా. అన్నీ సవ్యంగా జరిగితే నీవే నన్ను దిగబెట్టి ఉందువు గద'' కళ్ల నీళ్లు పెట్టింది నీరజ.

ఆమె కళ్ల వెంట ఉబుకుతున్న కన్నీళ్లను తుడుస్తూ ''నా మాట విను నీరూ.'' అమ్మ-నాన్న వచ్చి నీకన్నీ సర్దిపెట్టి వచ్చేస్తారు. ఆ తరువాత నేనొస్తాగా.. నాకూ మీతో కలసి ఉండాలనే ఉంది. నువ్వు సెటిల్ అయ్యాక తప్పక వస్తాను'' అంది సలిల ఊరడింపుగా.

ఆ మాటలకు శాంతించింది నీరజ.

రాఘవరావు దంపతులు ''కూతుర్ని పక్కింటి వాళ్లకి అప్పగించి, కోడల్ని తీసుకుబయలుదేరారు.

ఆమెకన్నీ అమర్చి పెట్టి అన్ని జాగ్రత్తలు చెప్పి వారం రోజుల్లోనే తిరుగు ప్రయాణం కట్టారు. ఉండమని నీరజెంతగా బ్రతిమాలినా వినలేదు.

" ఇంటి దగ్గర సలిల ఒంటరిగా ఉందమ్మా. నువ్వు నెల తప్పావన్న శుభవార్త చెవిన పడగానే మళ్లీ వచ్చి నీకన్ని సపర్యలు చేస్తాగా'' అంది వైదేహి ఎంతో ఆప్యాయంగా.

తలదించుకుంది నీరజ. అది సిగ్గుగా భావించింది వైదేహి. అక్కడే ఆమె పొరబడింది. కొడుకు 'నాతి గల బ్రహ్మచర్యం' అనుభవించడం ఇష్టంలేని వారు కోడల్ని తీసుకొచ్చి పెట్టారు.

కానీ... అరవింద్ అదే యాతనను అనుభవించబోతున్నాడని వారికి తెలియదు.

★★★

''సలిలా.. అలా ఖాళీగా ఉండే బదులు ఫర్ దర్ ఏమన్నా చదవచ్చుగా. సెలవు దొరికిందని తల్లిదండ్రులను చూడ్డానికి వచ్చిన అరవింద్ సూచించాడు చెల్లెలికి.

ఏదన్నా వ్యాపకం సృష్టించుకుంటే ఆమెకూ ఉపశమనంగా ఉంటుందన్న భావన అతనిది.

"చదవచ్చనుకో.. కానీ ఏం చదవాలో తోచడం లేదు'' అంది సలీల. డిగ్రీ తరువాత ఎన్నో కోర్సులు చేయడానికి ఆస్కారమున్నా వేటి మీదా ఆమెకు మనసు పోవడం లేదు.

''ఏమ్మా.. నేనన్నదానికి మాట్లాడ్డం లేదేం?" కంగించాడు అరవింద్.

"చదవచ్చనుకో. కాకపోతే ఏం చదవాలో తోచడం లేదు'' అంది సలిల.

"క్రియేటివిటీ అంటే నీకిష్టం కదా. దానికి ఆస్కారమున్నదేదన్నా ఆ... ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ చేస్తే?" అన్నాడు అరవింద్.

''నేను చేయగలనంటావా?'

" ఏంరా! ఎందుకా డౌట్? నువ్వు ఏకసంథాగ్రాహివి. ఏం చెప్పినా చిటికెలో , అర్థం చేసుకోగలవు. నా మాట విని నేను చెప్పినట్లు చేయి"

''కానీ... అటువంటి కోర్స్ లు మంచి పేరున్న సంస్థల్లో చేస్తేనే ఫలితం ఉంటుంది. మనకి అంత మంచి ఇన్స్టిట్యూషన్స్ ఇక్కడ అందుబాటులో లేవు'' అంది సలిల.

" అందుకే నాతో బాటు హైదరాబాద్ వచ్చేయి. అక్కడేదన్నా మంచి ఇన్స్టిట్యూట్లో నిన్ను చేర్పిస్తాను'' అన్నాడు అరవింద్.

"అక్కడికా! మీమధ్య నేనెందుకు?" అంది సలిల బిడియంగా.

అరవింద్ ముఖంలో రంగులు మారాయి. చక చక ముఖం రక్తం చుక్క లేనంతగా పాలిపోయింది. అంతలోనే సర్దుకున్నాడు.

"మా మధ్య అంత రోమాన్సేమీ ఏడిసిపోవడం లేదులే. అయినా నువ్వు నాకు అడ్డేందుకు అవుతావు? నువ్వు నా బాధ్యతవీ" అన్నాడు ముఖం చిన్నబుచ్చుకొని. "

"మరి.. వదిన?"

''నిన్ను నాతో తీసుకురమ్మని ఆమె చెప్పింది! చెప్పాడు అరవింద్.

"ఒరేయ్ అరవిందూ" పిలిచింది.వైదేహి.

“ ఏంటమ్మా?”

“కోడలు ఏమన్నా... విశేషం?” అటుపైన అడగలేనట్లుగా ఆపేసిందామె.

“కొత్త విశేషాలేముంటాయమ్మా! అంతా మామూలే'' ఆమె ఆంతర్యం అర్థం కాని అరవింద్ అన్నాడు విసుగ్గా.

కొడుకు వైపు మురిపెంగా చూసి “వట్టి మట్టి బుర్ర. నేనడుగుతున్నదీ కోడలు నీళ్లుపోసుకుందా అని ఓహో.. ఇలా అన్నా నీకర్ధమవ్వదు కాబోలు. అదేరా... నీరజ కడుపుతోగాని ఉందేమోననీ..!! అడిగింది వైదేహి మాతృసహజమైన మమకారాన్ని, కుతూహలంతో మేళవించి..

అరవింద్ వదనంలో నీలినీడలు అలుముకున్నాయి. కోపంగా ముఖం పెట్టి ''నేను మాట్లాడుతున్న టాపిక్ ఏమిటి? నువ్వడుగుతున్నదేమిటి? సలిలను నేను తీసుకెళ్లదలచుకున్నాను. తన ప్రయాణానికన్ని ఏర్పాట్లు చేయండి'' కటువుగా పలికాడు.

కొడుక్కంత కోపం ఎందుకొచ్చిందో అర్థం కాని వైదేహి చిన్నబుచ్చుకుని లోపలికి వెళ్లిపోయింది.

“సలిలా.. నీకు కావాల్సినవన్నీ సర్దుకోమ్మా”! సౌమ్యంగా చెప్పి ఏదో పనుందని బయటకు వెళ్లాడు అరవింద్.

అలాగనేనని తలూపి పనిలో మునిగిపోయింది సలీల.

చేతులు వాటి పని అవి చేసుకుపోతున్నాయి యాంత్రికంగా. కానీ మెదడు మాత్రం ఇందాకటి అరవింద్ ప్రవర్తననే విశ్లేషిస్తోంది. వారి దాంపత్యం గురించి ప్రస్తావించగానే అతడిలో అంత చిరాకు దేనికొచ్చింది!

ఎప్పుడూ ఎవరినీ కసురుకొని ఎరుగని అతడు అమ్మనెందుకలా కేకవేశాడు! వ్యక్తిగతంగా ఏదైనా సమస్యలు చుట్టుముట్టాయా లేక అతడి సంసారవీణ అపశృతులు పలుకుతోందా? ఎన్నో రకాల సందేహాలకు మెదడు నిలయమైంది.

“సరే.. వెళ్లాక అక్కడి పరిస్థితుల్ని.. నీరజ స్వభావాన్ని గమనిస్తే అన్నీ తెలుస్తాయి” అనుకుంది సలిల.

★★★

అరవింద్ తో సహా వచ్చిన సలిలను చూసి నీరజ ఆశ్చర్యానందాలలో మునిగిపోయింది.

"సలిలా.. రా.. ఇన్నాళ్లకి మా మీద దయ కలిగిందా? ఇప్పుడు ఇల్లెంత నిండుగా ఉందో చూడు" అంటూ సాదరంగా, సంబరంగా ఆహ్వానించింది.

తనని చూడగానే ఆమె వదనమంతా పరుచుకున్న కాంతి రేఖల్ని గమనించిన సలిల మనసు ప్రశాంతంగా మారింది.

" ఆడపడుచుకి మర్యాదలు ఘనంగా చేసింది నీరజ. ఆ తరువాత ఇల్లంతా తిప్పి చూపించింది. ముచ్చటైన త్రీ బెడ్ రూమ్ అపార్ట్ మెంట్ అది. ఇంట్లో ఉన్న ప్రతి అణువులో నీరజ అభిరుచి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇల్లంతా ఎంతో కళాత్మకంగా, అత్యంత శ్రద్ధతో తీర్చిదిద్దింది. తను, తన ఇల్లు అన్న భావన లేని ఇల్లాలు, ఇంటిని అంతగానీ,అందంగా అలంకరించలేదు.

బాల్కనీలో ఇనుప ఊచల మీదుగా పాకించిన మాలతీలత, సిమెంట్ కుండీలలో అందాలు విరజిమ్ముతున్న పలు వర్ణాల గులాబీలు, రకరకాల క్రోటన్స్.. ఒక క్రమపద్ధతిలో పెంచుతున్నట్లుగా చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి ఆ మొక్కలు.

“ఫెంటాస్టిక్...నీ గార్డెన్ చాలా బాగుంది..." అభినందించింది సలిల.

"ఇదిగో... ఈ ప్లెయిన్ శారీస్ మీద వర్క్ చేస్తున్నాను... ఎలా ఉన్నాయో చెప్పు..." అంటూ తన రూమ్లోకి తీసుకెళ్లి చీరలు చూపించింది నీరజ.

లైట్ బ్లూ కలర్లో ఉన్న చీర సలిలకనీ, వాజ లైన్ కలర్ శారీ తనకనీ చెప్పింది. అతిమెత్తని లేజర్ షిఫాన్ శారీస్ మీద బీడ్స్, కుందన్స్ మొదలైన వాటితో ఆర్టిస్టిగ్గా ఎంబ్రాయిడరీ చేసింది.

ఇంత అందంగా ఇంటిని చక్కదిద్దుకొని, తన వారి కోసం తాపత్రయ పడుతున్న నీరజ భర్తను అలక్ష్యం చేస్తుందా! ఊహు... నమ్మబుద్ధి కావడం లేదు సలిలకు.

తొందరపడి విషయమేంటని ఆరాతీస్తే ఆమె మనసు గాయపడుతుంది. ఆడపడుచుకి తన జీవితంలోకి తొంగి చూసే పాడుబుద్దేమిటీ అని బాధ పడుతుంది.

అందుకే తను ఓపిక పట్టాలి. నెమ్మదిగా చూసి వారి సమస్య ఏంటో కనిపెట్టాలి..

"చీరలు చాలా బాగా కుట్టావు నీరూ... ఇల్లు చక్కగా సర్దావు... వంట అద్భుతంగా చేశావు... మొక్కలు బాగా పెంచుతున్నావు... నీకింత ఓపిక ఎలా వస్తుంది... రియల్లీ యు ఆర్ గ్రేట్..." అభినందించింది సలిల తన కంచంలో వడ్డించిన పదార్థాలను రుచి చూస్తూ. " ఇవి చేయడం తప్ప నాకేమన్నా చదువా! సామా! ఇంటిపట్టున ఉండి ఇంతకన్నా నేను చేసేదీ, చేయగలిగేది ఏముంది కనుక" నవ్వేసింది నీరజ.

మామిడికాయ పప్పు కలుపుకుంటూ "అలా అనకు... ఇంటి పట్టునే ఉన్న ఆడవాళ్లు అందరూ ఇలాగే ఉంటారని లేదు... టీవీ ప్రోగ్రామ్స్ కు అతుక్కుపోయి భర్తను, పిల్లల్ని కూడా పట్టించుకోని ఇల్లాళ్లు ఎంతమందో ఉన్నారు..." అంది సలిల.

మళ్లీ నవ్వింది నీరజ. నవ్వినప్పుడు బుగ్గమీద సొట్ట సొగసుగా పలకరించింది సలిలను.

" నిజంగా నీరజ స్టన్నింగ్ బ్యూటీ... అన్నయ్య అందుకే ఏరికోరి వరించాడు..." అనుకుంది మదిలోనే.

ఆ మర్నాడే అరవింద్ ఆమెను తీసుకెళ్లి ఒక ప్రైవేట్ ఇన్స్టిట్యూట్లో చేర్పించాడు. తనే అమౌంట్ అంతా పే చేశాడు.

పగలు క్లాసులో... సాయంత్రం ఇంటి పనుల్లో నీరజకు సహాయపడడం...

అప్పుడప్పుడు హైదరాబాద్ సిటీలో విహరించడాలు. వీటితో తన మదిలోని వ్యథను మరచిపోసాగింది సలిల కొంత వరకు.

నీరజ ప్రవర్తనను జాగ్రత్తగా గమనిస్తూ ఉన్న సలిలకు, ఆమెను తప్పు పట్టే ఆస్కారం కానరావడం లేదు ఏ విషయంలోనూ కూడా.

అరవింద్ నోరు తెరచి అడగనవసరం లేకుండానే అన్నీ అమర్చి పెడుతోంది. మనిషి ఎప్పుడూ కూడా కడిగిన ముత్యంలా నీట్ గా ఉంటుంది. మృదువైన మాట తీరు, సంస్కారపూరితమైన ప్రవర్తనతో అందరినీ ఆకట్టుకుంటుంది.

మరి... ఏ విషయంలో అరవింద్ కు, ఆమెకు పొసగడంలేదో సలిలకు అర్థమవ్వడం లేదు. "

బహుశా... ఆ సమస్య ఆంతరంగికం కావచ్చునేమో! ఒకానొక అనుమానం తలెత్తింది సలిలలో.

ఆ రోజు రాత్రి మంచినీళ్లకని లేచిన సలిల వారి గదిలోంచి ఏవో మాటలు వినరావటంతో ఆగిపోయిందొక్కసారిగా. ఇతరుల మాటలు చాటుగా వినడం సభ్యత కాదని తెలిసినా, దాని వల్ల విషయం క్లియర్ గా బోధపడుతుందనిపించి వినసాగింది.

" నీరూ... ఏమిటిది? పగలంతా దాసీదానిలా అన్ని రకాల సేవలు చేస్తావు. అమ్మ కన్నా మిన్నగా కొసరి కొసరి తినిపిస్తావు. కానీ... భార్యాభర్తలను మానసికంగా దగ్గరచేసి, వారి అనుబంధాన్ని పటిష్టం చేసే దాంపత్య సుఖాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తావు... మీద చెయ్యి వేస్తే మొగ్గలా ముడుచుకుపోతావు... దీనికర్థం ఏమిటి? నేనంటే నీకు ఇష్టం లేదా!" ఆవేదనగా అడుగుతున్నాడు అరవింద్.

నీరజేమందో వినిపించలేదు సలిలకు. బహుశా ఆమె మౌనం దాల్చి ఉండవచ్చు.

"పోనీ... నువ్వెవరినన్నా ప్రేమించావా?", ఈసారి అసహనంగా అడిగాడు. దానికీ బదులు లేదు. " లాభం లేదు నీరూ... నువ్విలా పెదవి విప్పకుండా కూర్చుంటే నీ మనసులో ఏముందో ఎలా తెలుస్తుంది? పల్లెటూరి పిల్లవైనా పద్ధతిగా పెరిగావని, బుద్ధిమంతురాలివని, అందగత్తెవని కోరి చేసుకున్నాను. మనతో పాటు పెళ్లయిన సలిల బ్రతుకు బండలైంది... కనీసం మనమన్నా సుఖంగా ఉన్నామా అంటే అదీ లేదు... కాపురానికొచ్చి ఆరు నెలలు దాటుతోంది. ఇప్పటివరకు మన మధ్య ఆ సంబంధం మాత్రం లేదు. మగవాడి స్పర్శకు మగువ పరవశించిపోవాలి. ఒళ్లంతా పులకింతలు రేగి అతడిలో మమేకమైపోవాలన్న భావన కలగాలి... కానీ నేను టచ్ చేస్తే నీలో ఏ స్పందనా ఉండదు. పైపెచ్చు బిగుసుకుపోతావు. ఏంటి దీనికర్థం? నా స్పర్శ నీలో ఏ చైతన్యమూ కలిగించదా!" అరవింద్ దీనంగా అడుగుతూ అన్నాడు భార్యని. అతడంతగా ఆవేదన చెందుతూంటే తను మౌనంగా ఉండడం భావ్యం కాదనుకుందో ఏమో... "నన్ను క్షమించండి.. భార్యగా మీకు న్యాయం చేయలేకపోతున్నాను... ఏ సుఖమూ అందివ్వలేకపోతున్నాను... కానీ... మీరంటే నాకు ఇష్టమే..." చెప్పింది నీరజ వినీవినబడనట్లుగా.

"థాంక్ గాడ్... నేనంటే ఇష్టమని చెప్పావు? మరి... నాతో అంటీ ముట్టనట్లుగా ఎందుకుంటావు?" ఆతృత తొంగి చూసింది అరవింద్ మాటలలో.

" మీరు... మీరు నా మీద చేయి వేసినప్పుడు..." కాస్త జంకింది నీరజ.

"ఆ... నీ మీద చేయి వేసినప్పుడు... ప్లీజ్ టెల్ మీ... ఈ టెన్షన్ నేను తట్టుకోలేకపోతున్నాను..." పిచ్చివాడిలా కేకలేశాడు అరవింద్.

"నాకు గొంగళి పురుగులు పాకినంత జుగుప్సగా అనిపిస్తుంది... మీరు దగ్గరకు తీసుకుంటే ఏదోలా ఉంటుంది... అయినంత మాత్రాన మీరంటే ఇష్టం లేదనుకోకండి..."

బయట నుండి వింటున్న సలిలే నీరజ మాటలకు నిర్ఘాంతపోయింది... చేష్టలు దక్కి నిలబడిపోయింది... తనకే ఈ మాటలు ఇంత షాక్ కి గురిచేశాయంటే లోపల ఉన్న అరవింద్ పరిస్థితి ఏమిటి!?

తమకాలు సృష్టించి, శరీర వీణియమై గమకాలు పలికించాల్సిన భర్త స్పర్శ, భార్యకు అంతులేని అసహ్యాన్ని కలుగజేస్తోందంటే అతడి మనసు ఎంతగా గాయపడి ఉంటుంది!

ఏ భర్తకైనా , ఇంతకన్నా దుర్భరమైన క్షణాలు ఏముంటాయి!

ఇంతలో... గది తలుపు తీసిన శబ్దం... విసురుగా బయటకొచ్చిన అరవింద్ ఫ్రిజ్ డోర్ తీసి మంచినీళ్ల బాటిల్ ఎత్తి గడగడ తాగేశాడు. అతడికి కనబడకుండా కిచెన్ లోకి తప్పుకుంది సలిల. చెల్లెలు తననా స్థితిలో చూసిందని తెలిస్తే అతడు మరింత న్యూనత చెందుతాడు.

ఆ బెడ్ లైట్ వెలుగులో అరవింద్ వాలకం చూసి బాధతో మూలిగింది సలిల మనసు. కళ్లు ఎర్రగా జ్యోతుల్లా మండుతున్నాయి. ముఖం అవమానభారంతో జేవురించి ఉంది.

అతడిని అలాంటి స్థితిలో ఇదివరకెన్నడూ చూడలేదు సలిల, అరవింద్ తలుపు తీసుకొని బాల్కనీలోకి వెళ్లగానే, తన గదిలోకి వెళ్లిపోయింది సలిల ఏ సవ్వడీ చేయకుండా, నీరజ సన్నగా ఏడవడం ఆ నిశ్శబ్ద నిశీధిలో ప్రతిధ్వనిస్తోంది..

కన్ను పొడుచుకున్నా కునుకు రావడం లేదు సలిలకు. నీరజ మాటలను ఏ విధంగా అర్థం చేసుకోవాలో ఆమెకు తెలియడం లేదు.

భర్త మీద ఇష్టముందంటోంది... ముట్టుకుంటే మాత్రం అసహ్యమంటోంది... అంటే... ఆమె సమస్య మానసికమైనదా! మనసు మీద ఏనాటి గాయాలో మిగిలిపోయి మానని పుళ్లుగా మారి ఆమెని వేధిస్తున్నాయా!

ఎందుకంటే ' ఫ్రిజిడిటీ' అనే సమస్య మానసికమైనదని చాలామందికి తెలియదు.

మనసు చేసే వింత గారడీలకు లోబడే మనిషి ఆడతాడన్న సత్యం చాలా మంది అర్థం చేసుకో లేదు.

మనిషిలో శారీరకంగా కలిగే అనేకానేక ఉద్వేగాలకు కారణం ఆకారం లేని మనసే అని ఎరుగక కుమిలిపోతుంటారు చాలామంది.

నీరజ సమస్య మానసికమైనదైతే ఆధునిక వైద్యవిధానాల ద్వారా దాన్ని బాగుచేయవచ్చు.

అసలు... ముందు నీరజ మనసులో మాటేమిటో తెలుసుకోవాలి... ఆమెను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లేముందు ఆమె మైండ్ ట్యూన్ చేయాలి.

ఎవరూ చొరవ తీసుకొని పరిష్కారం గురించి ఆలోచించకపోతే సమస్య సమస్యగానే మిగిలిపోతుంది.

తనను ప్రాణాధికంగా ప్రేమించే అన్న, వదినల దాంపత్యం సుఖశాంతులతో నిండి, హాయిగా ఉండాలంటే తనే స్టెప్ వేయాలి.

ఆ ఆలోచన వచ్చాక సలిలకు నిద్ర పట్టింది.

అప్పుడు సమయం తెల్లవారుఝాము నాలుగైంది.

★★★

“సారీ నీరూ... తెలివి రాలేదు...” ఆలస్యంగా నిద్ర లేచిన సలిల స్నానాదికాలు

ముగించుకొని వంట గదిలో ప్రవేశించింది.

పలకరింపుగా నవ్వి ''పోనీలే... ఇప్పుడేమంత ఘోరం జరిగిపోయిందనీ...'' అంది నీరజ.

ఆమె అందించిన కాఫీ సిప్ చేస్తూ '' అన్నయ్య వెళ్లిపోయాడా'' అడిగింది సలిల చుట్టూ పరికిస్తూ.

''ఆ...'' ముభావంగా చెప్పింది నీరజ.

సమయం పది దగ్గరవుతున్నా సలిల కాలేజీకి వెళ్లే ప్రయత్నమేమీ చేయనందుకు ఆమెకు ఆశ్చర్యం కలిగింది.

''ఇవాళ కాలేజీకి ఎగనామమా!'' అడిగింది హాస్యంగా.

“ఆ... నీతో కాస్త మాట్లాడే పనుంది... అపాయింటిమెంట్ ఇస్తావా...” అంది సలిల.

నీరజ నొసలు ముడివేస్తూ “నాతోనా!'' అడిగింది విస్మయంగా.

''యస్... నీతోనే... నీ పని పూర్తయ్యాక రా...'' చెప్పేసి తన గదిలోకి వెళ్లిపోయింది సలిల.

కాస్సేపటి తరువాత నీరజ తన పని ముగించుకొని సలిల గదిలోకి వెళ్లింది..

బెడ్ మీద వెనక్కి చేరగిలబడి కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్న సలిల ఆమె అడుగుల సవ్వడి విని తలెత్తి చూసింది.

''రా... నీరూ... ఇలా కూర్చో'' తన సరసన చోటు చూపించింది.

''నాతో ఏదో మాట్లాడాలన్నావు...'' మెల్లిగా అంది నీరజ. ..

“ అవును... నేన్నిన్ను కొన్ని విషయాల గురించి అడగాలనుకుంటున్నాను... తీరా అడిగాక అపార్థం చేసుకోనని మాటివ్వు...'' చేయి ముందుకు చూపింది సలీల.

నీరజ నవ్వుతూ ''భలే దానివే... నిన్ను అపార్థం చేసుకోవడం ఏమిటి? అయినా నువ్వు మాత్రం నన్ను నొప్పించే విషయాలు అడుగుతావా ఏం?'' అంది.

'' అడగకూడనిదే అడగబోతున్నాను... అందుకే మాటియ్యి...'' అంది సలిల గంభీరంగా.

నీరజ వదనం కళ తప్పింది వసివాడిన లేత గులాబీలా, బలవంతంగా నవ్వుతూ సలిల చేతిలో చేయి వేసింది.

''ఇది నీ అంతరంగికమైన సమస్యే కావచ్చును. ఒక కన్నెపిల్లగా నేన్నిన్ను ఇలాంటి ప్రశ్నలు అడగడం సమంజసమో కాదో నాకు తెలీదు... కాని... సాహసించి అడుగుతున్నాను. అన్నయ్య, నువ్వు సక్రమంగా సంసారం చేస్తున్నారని నాకనిపించడం లేదు. మీ ఇద్దరు సన్నిహితంగా, సఖ్యంగా మాట్లాడుకోవడం కూడా ఇప్పటికి చూడలేదు. మీ జీవితాల్లోకి తొంగి చూసి, మిమ్మల్ని హింసపెట్టాలన్న ఉద్దేశ్యంతో అడగడం లేదు. మీ జీవితాలింత నిస్సారంగా ఎందుకు తయారయ్యాయన్న బాధతో అడుగుడుతున్నాను... అన్నయ్యంటే నీకిష్టం లేదా!... వేరే ఎవరినన్న ప్రేమించావా!'' సూటిగా, సుదీర్ఘంగా అడిగింది సలిల.

వినకూడని మాటలేవో చెవిన పడినట్లు విలవిలలాడింది నీరజ. కళ్లు నీటి కడవలయ్యాయి. దుఃఖభారంతో గుండెలెగసెగసి పడ్డాయి. చేతుల్లో ముఖం దాచుకుని రోదించసాగింది సన్నగా.

ఆమెను చేతుల్లో పొదవుకొని, వీపు నిమురుతూ అంది సలిల. '' నిన్ను హర్ట్ చేయాలని నేనీ ప్రశ్నలడగలేదు నీరూ... చేతనైతే నీ సమస్య పరిష్కరించాలన్న సదాకాంక్షతోనే అడిగాను... నన్ను నమ్ము... నేను నీ క్లోజ్ ఫ్రెండ్ ననుకొని నాతో నీ బాధేంటో చెప్పు... ప్లీజ్...'

నీరజ ఏడుపాపి, బుగ్గల మీద నుండి జారుతున్న కన్నీటిని తుడుచుకుంది..

''అవును సలిలా... ఇన్నాళ్లుగా నన్ను భయపెడుతున్న బూచి లాంటి సమస్యను నీతో చెప్పుకుంటే గుండె బరువు తీరుతుంది. ఇది పరిష్కారమయ్యేది అయినా కాకపోయినా నా ఎదలో వ్యధ పంచుకునే ప్రియనేస్తమొకటి దొరికిందన్న ఆనందంతోనన్నా చెబుతాను'' అంది నిబ్బరంగా. సలిల ముఖం వికసించింది. ఆమె తనను ఆప్తురాలిగా భావిస్తోందన్న సంగతి అర్థమై సంతోషంతో ఉప్పొంగిపోయింది మనసు.

''ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుండీ నాకు భార్యాభర్తల సంబంధం అంటే ఏవగింపు... పెళ్లి అన్న పదం వింటే చిరాకు... సన్నిహితంగా అంటిపెట్టుకు తిరిగే భార్యాభర్తలంటే కోపం...'' నీరజ మాటలు విని సలిల ఆశ్చర్యపోయింది...

''జీవితంలో పెళ్లి అన్న బంధం అంటేనే అసహ్యించుకునే నేను, మీ అన్నయ్యను తొలిసారిగా చూసినప్పుడు నాకు తెలియకుండానే ఆకర్షితురాలినయ్యాను. ఆయనకీ భార్యనవుతానని తెలిశాక

మదిలో ఏదో సంచలనం కలి గింది. హృదయవీణ తీయని రాగాలు ఆలపించనారంభించింది... ఎంతో ఇష్టంగా ఆయన్ను పెళ్లి చేసుకున్నాను... కానీ..."

" ఏం నీరూ... అన్నయ్యేమన్నా మొరటుగా బిహేవ్ చేశాడా..." లాలనగా అడిగింది సలిల.

"ఛ...ఛ... అదేం లేదు... ఆయనకి నేనంటే అపరిమితమైన ప్రేమ... నాకూ ఆయనంటే ఇష్టం.... ఆయన చాలా మంచి మనిషి..."

"మరి!" రెట్టించింది సలిల.

ఆయన ఎంతో ఆశగా నాకు దగ్గరవుదామని చూస్తున్నారు... ఆయన నా మీద చేయి వేయగానే... ఎందుకో నాకు చాలా అసహ్యంగా అనిపిస్తుంది. ఒళ్లంతా కంపరం కలుగుతుంది... దానికి కారణం నాకు తెలియదు....

మనసులో ఆయన పట్ల గల ఇష్టమంతా ఒక్క సారిగా మాయమవుతుంది... వెక్కసాగింది నీరజ...

సలిల కదిలిపోయింది. కరిగి నీరైపోయింది. నీరజ పట్ల జాలి ముంచుకొచ్చింది.

ఆప్యాయంగా ఆమెను స్పృశిస్తూ " నీ సమస్య వింటే నాకు చాలా బాధనిపిస్తుంది. ఇది పరిష్కారం లేనంత తీవ్రమైనది మాత్రం కాదు. నీకు అందరు ఆడవాళ్లలాగే సుఖంగా సంసారం చేసుకోవాలని లేదూ..." అడిగింది లాలన ఉట్టిపడే స్వరంతో.

"ఎందుకు లేదు... మా అక్క, నా స్నేహితులు వీళ్లందరూ సంసారంలో ఉండే మాధుర్యాన్ని గురించి చెప్పుకుంటూంటే విన్నాను... అలాగే ఉండాలని నాకూ అనిపిస్తుంది. కానీ... నేను అసహాయురాలిని... మీ అన్నయ్యను హింస పెడుతున్న పాతకిని..." గొంతు రుద్ధమైంది నీరజకు.

ఫరవాలేదు... ఈమె తను అనుకున్నంత జడురాలు కాదు. దాంపత్యమంటే ఆమెకు ఆపాటి అవగాహన ఉంది. మిగిలినది మానసిక వైద్యులే చూసుకుంటారు....

" అయితే నా మాట వింటావా... అప్పుడు నువ్వు, అన్నయ్య సుఖంగా ఉండచ్చు..." అడిగింది సలిల.

"మా జీవితాలు ఆనందమయం కావటానికి నేనేమైనా చేస్తాను... చెప్పు ఏం చేయాలి?" ఆతృతగా అడిగింది నీరజ.

" అన్నయ్య నిన్ను సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకెళ్తాడు... వెళ్తావా!"

" సైకియాట్రిస్ట్ అంటే మెంటల్ డాక్టరేగా... అమ్మో! నేను వెళ్లను... వాళ్లు ఒళ్లంతా కరెంటు పెట్టి వైద్యం చేస్తారుగా..." అమాయకంగా అంది నీరజ. ఆమె అజ్ఞానానికి నవ్వొచ్చింది సలిలకు.

“సైకియాట్రిస్ట్ అంటే మెంటల్ డాక్టరని నీకెవరు చెప్పారు? ఆయనా డాక్టరే... కాకపోతే మనసుని మరమ్మతు చేసే డాక్టర్... ఆయనా షాక్ ట్రీట్ మెంట్ ఇస్తారు... కానీ శరీరానికి కరెంటు పెట్టి కాదు... మనసుకి మాటల ద్వారా కౌన్సిలింగ్ చేసి..." వివరించి చెప్పింది.

"కాని ... డాక్టర్తో ఇదంతా చెప్పుకుంటే సిగ్గు చేటు కాదూ... ఇంటిగుట్టు బయట పెట్టుకుంటే పరువు పోదూ..” కళ్లు వెడల్పు చేసి అడిగింది నీరజ.

'ఏం పోదు... నీలాగ ఆలోచించే... చాలా మంది స్త్రీలు డాక్టర్ ని కలవడానికి మొహమాట పడి బ్రతుకు నరకం చేసుకుంటారు... డాక్టర్స్ కూడా మనసున్న మనుషులే... మన సమస్యలను సానుభూతితో విని, తగు పరిష్కారం సూచిస్తారు. అంతేకాదు... మనకు సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు... లేకపోతే వారి

వృత్తికే తీరని కళంకం ఏర్పడుతుంది. అందుచేత నువ్వు నిర్భయంగా ట్రీటిమెంట్ కి వెళ్లచ్చు...” పసిపిల్లకి చెప్పినట్లుగా అనునయంగా విడమరచి చెప్పింది సలిల.

నీరజ ఆలోచనలో పడింది. చూపుడువేలితో చుబుకం మీద తట్టుకుంటూ, తల గోక్కుంటూ ఉండిపోయిందెంతోసేపు.

చివరకు అంది "సరే సలిలా... నేను డాక్టర్ దగ్గరకు వస్తాను... అయితే చిన్న కండిషన్... లేడీ డాక్టర్ దగ్గరకైతేనే వస్తాను... అదీ... నాతో పాటు నువ్వు కూడా రావాలి..."

సలిల వదనం విప్పారింది. "థాంక్ గాడ్... తన శ్రమ వృధాపోలేదు... నీరజ డాక్టర్ ని చూడ్డానికి ఒప్పుకుంది..." అనుకుని "ష్యూర్... నేనూ నీతో వస్తాను... సరేనా..." అంది ఆనందంగా.

ఆనందంగా నీరజ బుగ్గ మీద ముద్దు పెట్టి "మా మంచి వదిన" అంది సలిల

అరవింద్ ఆఫీసు నుండి రాగానే అతడికి ఎదురెళ్లింది సలిల.

" ఏరా! ఏంటి సంగతి? ఇంట్లో బోర్ గా ఉందా? ఉండు... ఫ్రెష్ అయి వస్తా... ఎటైనా వెళదాం." అన్నాడతడు ప్రేమగా.

" అదేం కాదు గాని... నువ్వే అర్జెంట్గా ఎవరైనా సైకియాట్రిస్ట్ కి ఫోన్ చేసి అపాయింట్ మెంట్ తీసుకో.., అరవింద్ ముఖంలో ఆదుర్దా కనబడింది. '

' సైకియాట్రిస్ట్ కా! ఎందుకు?" అడిగాడు కంగారుగా.

"నువ్వు అనవసరంగా వర్రీ కాకు... అంత గాబరా చెందవలసిన విషయమేం కాదు... వదినని తీసుకెళ్లి ఓమారు సైకియాట్రిస్ట్ ని కలిస్తే మంచిదనీ..." అంది సలిల..

" నీరజకా... ఏం? ఆవిడగారికేమైంది?... బాగానే తిరుగుతోందిగా?" ఎంత సౌమ్యంగా మాట్లాడాలన్నా సాధ్యపడలేదు అరవింద్ కి.

నీరూ నీకు చెప్పుకోలేని భయాలతో, అంతులేని మానసిక వేదనతో కుమిలిపోతోందని నా అనుమానం... మీ ఇద్దరి జీవితాలు హాయిగా . ఉండాలంటే నేను చెప్పినట్లుగా చేస్తే మంచిది..." అందీ సలిల.

అయితే... నీకు..." అరవింద్ ముఖం వివర్ణమైంది. చెల్లెలికి తమ విషయం తెలిసిపోయిందంటే చాలా సిగ్గుగా అనిపిస్తోంది.

"నన్ను క్షమించు చిన్నన్నయ్యా... నిన్న రాత్రి అనుకోకుండా మీ మాటలు వినవలసి వచ్చింది. వదినతో మాట్లాడాను... ఏవో అర్థం పర్థం లేని భయాందోళనలచే ఆమె పీడింపబడుతోందని గ్రహించాను. ఆ నీలినీడలే ఆమె మదిలో అలముకొని జీవనమధురిమలను ఆస్వాదించకుండా చేస్తున్నాయని గ్రహించాను. ఒక చెల్లెలు ఒక అన్నతో ఇలాంటి విషయాలు చర్చించకూడదని నాకు తెలుసు... కానీ మీ ఇద్దరి క్షేమం కోరే 'వెల్ విషర్'గా చెప్తున్నాను.... తగు ట్రీట్మెంట్ చేయించి ఆమెతో ఆనందంగా ఉండు చిన్నన్నయ్యా...' రుద్దమైన స్వరంతో చెప్పింది సలిల.

అరవింద్ చలించిపోయాడు... ఒక స్త్రీ మనసు సన్నిహితురాలై సాటి స్త్రీయే అర్థం చేసుకోగలదంటారు... సలిల, నీరజను బాగా స్టడీ చేసినట్లుంది. ఫామస్ సైకియాట్రిస్ట్ని కనసల్ట్ చేస్తే తన సమస్య తేలిపోతుంది. తన జీవితంలో నవవసంతం ప్రవేశించి, తన బ్రతుకును నందనవనం చేస్తుంది. ఇనుమడించిన ఉత్సాహంతో 'థాంక్స్ రా సలిలా... మీ వదిన మనసు కనుగొని నాకు చాలా ఉపకారం చేశావు...' చెల్లెలి చేతులు పట్టి ఊపేశాడు ఆనందంగా..

సంతోష తరంగిణిలా గలగల నవ్వింది సలిల.

వెనువెంటనే సిటీలో పేరుమోసిన సైకీయాట్రిస్ట్ 'డాక్టర్ వంశీరవళి'కి ఫోన్ చేసి అప్పాయింట్ మెంట్ తీసుకున్నాడు అరవింద్.

నీరజకు ట్రీటిమెంట్ స్టార్టయ్యింది. అదేమీ భయపడవలసినంత సీరియస్ ప్రాబ్లం కాదని--- కొద్దిపాటి కౌన్సిలింగ్తో అంటే మూడు నుండి

ఆరు సిట్టింగ్స్ తీసుకుంటే సరిపోతుందనీ చెప్పింది "వంశీరవళి'.

ఇలాంటి కేస్లెన్నింటినో డీల్ చేసిన అనుభవం ఆమెకుంది. "సక్సెస్ ఫుల్ సైకియాట్రిస్ట్" అన్న మంచి పేరూ వుంది.

బెదిరిపోతున్న నీరజను హిప్నాటిక్ స్లీప్లోకి పంపి ఆమె మనసు పొరల్లో దాగి ఉన్న జ్ఞాపకాలను బయటకు లాగే ప్రయత్నం చేసింది వంశీరవళి.

తన మది తలుపులు తెరచి, అందులో సమాధి అయినా కొన్ని చేదు అనుభవాలను బయల్పరచింది నీరజ.

నీరజ పసి మనసు మీద దారుణమైన మరకలు ఏర్పరచిన కొన్ని సంగతులు వింటూంటే వాళ్లకు మతిపోతోంది.

మనసు ఎంత చిత్రమైనదో... మనిషిని లోబరుచుకుని ఎన్ని రకాలుగా ఆడిస్తుందో తేటతెల్లమైంది వారికి.

★ ★ ★

అప్పుడు నీరజకి పదకొండేళ్లు... ఆ వయసుకే యవ్వనంలోని హంగులు, పొంగులు కొద్దికొద్దిగా ప్రోది చేసుకొని, వెన్నెల బొమ్మలా చూపరుల కళ్లు చెదరగొట్ట సాగింది. ఆ వేసవిలో పెద్దనాన్నగారి కూతురి పెళ్లికని "ఏలూరు వెళ్లిందామె తల్లితో కలసి,పెళ్లి వారింట్లో తన ఈడు పిల్లలతో ఆడి ఆడి అలసిపోయి తల్లి ఉన్న చోటుకి వెళ్లి ఆమె ఒ తల పెట్టుకు పడుక్కుంది నీరజ. అదే గదిలో ఉన్న పెళ్లికూతురిని అలంకరిస్తూ రకరకాల ముచ్చట్లు చెప్పుకుంటూ, మధ్యమధ్య కాబోయే వధువును ఆటపట్టిస్తున్నారు ఆడంగులంతా.

మాటల మధ్య అందొక అతివ. "జాగ్రత్తే "పిల్లా... బందరులడ్డులా ఉన్న నిన్ను అమాంతం కొరుక్కు తినేయగలడు మీ ఆయన...".

"మన పిచ్చిగాని వదినా... ఇన్ని అలంకారాలు చేయడం వృధా కార్యక్రమం... రేపు రాత్రి ఈ పాటికి ఇవన్నీ దీని ఒంటి మీద ఉంటాయా ఏమన్నానా!?" మేనత్త వరుసైన మరొక మగువ మేలమాడింది.

"చాల్లే ఊరుకోండి... కొత్త పెళ్లికూతురు చూడు... ఎలా బెదిరిపోతోందో... మందలించింది ఇంకొకావిడ పెళ్లికూతురి అవస్థ గమనించి.

ఆమెకీ చర్చ ఇబ్బందికరంగా ఉందని ఆమె ముఖకవళికలే తెలియజేస్తున్నాయి.

"ఇప్పటి పిల్లలకి ఏమీ చెప్పనవసరం లేదోదినా... సినిమాలు చూసి, పుస్తకాలు చదివి అన్నీ వాళ్లే నేర్చేసుకుంటున్నారు... పన్నెండేళ్లకి పెళ్లి చేసినా, కాపురానికి పంపేవరకూ సంసారమంటే ఏమిటో ఎరుగుదుమా! మొగుడిని చూస్తేనే చాలు హడలెత్తిపోయేవాళ్లం..." ఒక పూర్వ సువాసిని గతపు అనుభవాలను నెమరువేసుకుంటోంది..

"మరే ... కార్యం గదిలో మా ఆయన దగ్గరకు తీసుకుంటే ఒళ్లంతా కంపరెమత్తిపోయిందంటే నమ్ము... ఎలుగుబంటి జాజిమొగ్గను నలిపేసినట్లుగా నలిపిపారేశాడు నన్ను. ఆ భయంతో ఆయన దగ్గరకు పొయ్యేది లేదని మొండిపట్టు పట్టుకు కూర్చున్నాను. మా అమ్మ నచ్చచెప్పి, సంసారమంటే స్త్రీకి నరకంతో సమానమని, అయినా సరే... అందులోనే మగ్గాలని, మొగుడికి స్వర్గసుఖాలు అందించడంలోనే ఆడదానికి సార్థకత ఉందని... బుజ్జగించి, నన్ను లోపలకి పంపింది..." ఇంకొక వృద్ధముత్తయిదువ తన అనుభవాలను ఏకరువు పెట్టింది.

ఆ చర్చ అలా పాకి పాకి ఒక అభిప్రాయ వేదికగా మారింది.

వారు అలా పచ్చిగా మాట్లాడుతూ, ఘల్లున నవ్వుతూ ఉంటే... గుండెలో ఏదో భయం మొదలైంది నీరజకు.

ఆ గదిలో దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టబోయే నవవధువుతో పాటు, బంగారు కలల ఊయలలూగే పడుచు పిల్లలూ, సంసారం అంటే ఏమిటో కూడా తెలియని నీరజ లాంటి అమాయకపు పసితల్లులూ కూడా ఉన్నారని వాళ్లు విస్మరించారు.

తమ సంభాషణ వారి లేత హృదయాల మీద చెరిగిపోని ముద్ర వేస్తుందనీ మరిచారు. ఆ మరక జీవితాంతం వారిని వెంటాడి వేధించి, అశాంతి పాలు చేస్తుందని వారనుకోలేదు.

తల్లిచాటున ఒదిగి కూర్చుని అన్నీ వింటున్న నీరజ హృదయంలో పెళ్లి అంటే స్త్రీకి నరకంతో, సమానమని, మొగుడి సమక్షంలో గడపడమంటే సింహం నోట్లో తల పెట్టడమేనని ప్రగాఢమైన నమ్మకం ఏర్పడిపోయింది.

ఆమెలో అంకురించిన భావం ఆ సాయంత్రం జరిగిన మరొక సంఘటనతో బలపడి వేళ్లూనింది.

పెళ్లి పందిట్లో ఎవరో సంగీత విద్వాంసుడి గాత్ర కచేరి జరుగుతోంది. కుర్రకారుకిదంతా బోరుగా అనిపించినా, పెద్దవాళ్లు మాత్రం తాళం వేస్తూ ఆలకించి ఆనందిస్తున్నారు.

అటుగా వెళ్తున్న గిరిజని ఓ పెద్దాయన కేకేసి పిలిచి "నువ్వు సర్వారాయుడి కూతురు గిరిజవే కదూ..." అని అడిగాడు.

" అవును మామయ్యా... బాగున్నావా" పలకరించింది గిరిజ.

"ఆ... ఆ... అదే బాగు... అన్నట్లు ఇది నీ కూతురా!" అడిగాడు తల్లికొంగుచాటు నుండి తొంగి చూస్తున్న నీరజని.

అవునన్నట్లుగా తలాడించింది గిరిజ. చిదిమితే పాలుగారేలా ఉన్న నీరజను దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకున్నాడా పెద్దాయన.

ఒళ్లంతా రోమాలతో, దున్నపోతును తలపింపజేస్తున్న అతడి విగ్రహం, బీడీకంపు వెదజల్లుతున్న అతడి నోరు వెగటు పుట్టించాయి నీరజకు.

అతడి పట్టు నుండి విడిపించుకోవాలని గింజుకుంది. కూతురి అవస్థ గమనించిన గిరిజ, అతడి చేతుల్లోంచి కూతుర్ని దూరంగా లాగేసింది.

" ఏంటే గిరిజమ్మా... నీ కూతురు మరీ సుకుమారంలా ఉంది. రేప్పొద్దున్న మొగుడొచ్చి కౌగిలించుకున్నా ఇలాగే తోసేస్తుందా ఏం?'' గల గల నవ్వాడు పెద్దాయన.

ఆ మాటలు కూతురు ఎక్కడ వింటుందోనన్న భయంతో మొహమాటంగా నవ్వేసింది గిరిజ. జరగాల్సిన అనర్థం అప్పటికే జరిగిపోయింది. నీరజ ఆ మాటలను విననే వింది.

'ఛీ... ఈ తాతయ్య చెప్పినట్లుగా మొగుడు పెళ్లాన్ని ఇలాగే పట్టుకుంటాడా... అబ్బ! ఎంత అసహ్యంగా ఉంది! పాపం... అక్కకి కూడా పెళ్లయ్యింది కదా! బావ అక్కని ఇలాగే ముద్దు పెట్టుకుంటాడా!''

నీరజ చిన్నారి మనసు నిండా ఎన్నో రకాల సందేహాలు. భయాలు. ఉదయం అమ్మలక్కల కబుర్లు, సాయంత్రం ముసిలాయన మోటుమాటలు, ప్రవర్తన... దుష్ప్రభావం చూపనారంభించాయి ఆమె లేత మనసు మీద.

చాలామంది పెద్దవాళ్లు, పిల్లల ఎదుటే వాళ్లకేం అర్థమవుతుందిలే అని భావిస్తూ... పచ్చిగా, ద్వందార్థ సంభాషణలు చేస్తారు... మొరటు హాస్యాలాడతారు... అద్దం లాంటి ఆడపిల్లల హృదయాల మీద మసిమరకలు ఏర్పడతాయని వారికేం తెలుసు!

పెళ్లికూతురిని కార్యం గదిలోకి పంపిస్తూ, అమ్మలక్కలందరూ శృంగార బాణాలు గుప్పించసాగారు ఆ రాత్రి.

“ఇవన్నీ విని, దాంపత్యమంటే ఇంత దరిద్రంగా ఉంటుందా!'' అన్న విముఖత మొదలైంది నీరజ మనసులో. వయసుతో పాటే ఆ వ్యతిరేకతా పెరగసాగింది.

పెళ్లి చేసుకోవడమంటేనే ఇష్టం లేని ఆమె, తన పెళ్లి గురించి ఇంట్లోని వారు కలత చెందడం చూసి బలవంతంగా తల ఒగ్గింది. నలకూబరుడి లాటి అందగాడు అయిన అరవింద్ ఆమె కన్నెమదిని కదిలించి, కలవరం సృష్టించాడు.. కాదనలేక పెళ్లికి ఒప్పుకుంది. కానీ... ఆమె మనోఫలకం మీద ముద్రించుకుపోయిన గతపు అనుభవాలు పీడకలల్లా ఆమెను వెంటాడసాగాయి.

అందుకే... అరవింద్ తనను తాకినప్పుడల్లా అసహ్యంతో ముడుచుకు పోసాగింది... మగడు తనని' ముట్టుకోగానే ఆ పెద్దాయనే మదిలో మెదిలేవాడు. మొరటుగా, ముళ్లకంప చుట్టుకున్నట్లుగా ఉండే అతడి కౌగిలి, గరుకుగా ఒళ్లంతా గుచ్చుకున్న అతడి ఒంటి మీద వెంట్రుకలు... కడుపులో తిప్పేసినట్లుగా ఉన్న చెమట కంపు... అప్పటి ఆ స్పందననే ఇప్పుడూ కలిగేవి. మగని గాఢమైన కౌగిలి కలిగించాల్సిన పరవశం బదులు, అంతులేని జుగుప్ప చోటు చేసుకోసాగింది.

★★★

ట్రాన్స్‌కి వెళ్లిన నీజ ఒక్కొక్కటిగా చెప్పిన సంగతులు విని నివ్వెరపోయారు అరవింద్, సలిలలు.

“విన్నారుగా... అదీ ఆమె ప్రాబ్లం... కేవలం ఆనాటి ఆ చేదు జ్ఞాపకాల మూలంగానే ఆమెలో జడత్వం చోటు చేసుకుంది. ఆ ఫ్రిజిడిటీయే... ఆమె దాంపత్య మధురిమలను ఆస్వాదించనీయకుండా అడ్డుపడుతోంది..."

"అయితే డాక్టర్... దీనికి సొల్యూషన్ ..." అరవింద్ భయంగా అడిగాడు.

“డోంట్ వర్రీ మిస్టర్ అరవింద్... షి విల్ బి ఆల్ రైట్... మీరు కాస్త ఓపిక పట్టాలి అంతే... అన్ని అడ్డుగోడలు తొలగిపోతాయి..."

చిరునవ్వుతో అభయమిచ్చింది వంశీరవళి.

"థాంక్యూ డాక్టర్..." అరవింద్ ముఖం వికసించింది.

" మీరు కాస్సేపు బయట వెయిట్ చేయండి. ఆమెకు కొన్ని హిప్నాటిక్ సజెషన్స్ ఇవ్వాలి..." మర్యాదపూర్వకంగా చెప్పింది వంశీరవళీ.. .

"ఓ.కే. డాక్టర్..." అంటూ బయటకు నడిచారు అన్నా చెల్లెళ్లు.

★ ★ ★

ఆ రోజెందుకో సలిలకు తొందరగా మెలకువ వచ్చేసింది. లేచి బ్రష్ చేసుకొని ఫిల్టర్ వేసి, వంట గది క్లీన్ చేసి టైమ్ చూసింది. గడియారం ఆరు చూపిస్తోంది. నీరజ ఇంకా నిద్రలేవలేదు.

రోజూ అయిదుకే లేచి పని చక్కబెట్టుకునే ఆమె ఇంకా నిద్రలేవకపోవడం ఆశ్చర్యంగా అనిపించిందీ సలిలకు..

ఫిల్టర్ది గాక, పెద్ద మగ్ నిండా కాఫీ కలుపుకొని, హాల్లో సోఫాలో కూర్చుని అప్పుడే వచ్చిన న్యూస్ పేపర్ ముందేసుకుంది.

ఇంతలో అరవింద్ గది తలుపు తెరుచుకున్న చప్పుడు అవడంతో అటువైపు దృష్టి మరలింది.

నెమ్మదిగా పిల్లిలా చడీచప్పుడు లేకుండా, అడుగులో అడుగు వేసుకుంటూ బయటకు వస్తున్న నీరజ, తననే పరిశీలనగా చూస్తున్న సలిలను చూసి దొరికిపోయిన దొంగలా ముఖం చాటేసింది.

ఏనాడూ ఆమె ముఖంలో కనిపించని సిగ్గు దొంతరలు, ఆనాడు పుష్కలంగా అలుముకొని ఉన్నాయి. చెదిరిన కుంకుమ, రేగిన తల వెంట్రుకలు, పొడవుగా సాగి అక్కడక్కడ తెగిన విరజాజి దండ... ఇవన్నీ నీరజను పట్టిచ్చాయి.

సలిల విషయం తెలిసిపోయిందన్నట్లుగా అల్లరిగా నవ్వి కళ్లెగరేసింది.

ఆ చూపులకు తాళలేనట్లుగా తల దించుకుని, నెమ్మదిగా సలిల దగ్గరగా వచ్చి, చటుక్కున వంగి ఆమె బుగ్గ మీద ముద్దు పెట్టి రివ్వున లోపలకి పారిపోయింది.

''హమ్మ నీరూ... అసాధ్యురాలివే...'' మురిపెంగా అనుకుంది సలిల.

ఆమె ఫ్రెష్ అయి వచ్చాక ఆమెకూ కాఫీ కలిపి తీసుకొచ్చింది సలిల. ''తాగమ్మా వదినమ్మా... రాత్రల్లా అన్నయ్య నిన్ను పడుకోనిచ్చినట్లు లేదు. కాస్త అలసటన్నా తీరుతుంది...'' అంది కొంటెగా చూస్తూ.

నీరజ అలిగినట్లుగా బుంగమూతి పెట్టి "ఇదిగో... ఇలా ఉడికిస్తే నేన్నీతో మాట్లాడను ఫో...'' అంది.

“అమ్మమ్మా... అంత పని మాత్రం చేయకు... నేను తట్టుకోలేను... నిన్నిలా చూస్తూంటే నాకెంత ఆనందంగా ఉందో తెలుసా!?” అంది సలిల గారాబంగా ఆమె చెంపలు రాస్తూ,

" ఇదంతా నీ చలవే వదినా... నువ్వే లేకపోతే నేనేమైపోదునూ..." అంది నీళ్లూ నిండిన కళ్లతో.

అప్పుడే అక్కడకు వచ్చిన అరవింద్ " తను అందని కాదుగాని... ఈ క్రెడిట్ అంతా నీకే చెందాలి... నా బ్రతుకులో సంతోషం నింపావు. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోను. ఆ.. చచ్చి నీ కడుపున పుడతా..." అన్నాడు అరవింద్ కృతజ్ఞతగా చూస్తూ. సలిల ముఖం వెలవెలపోయింది. కళ్లు ఊటబావులయ్యాయి. అప్పటికిగాని అరవింద్ కి అర్థం కాలేదు, అప్రయత్నంగా అన్నా తానెంత తప్పుగా మాట్లాడాడో.

ఇప్పుడిప్పుడే మనుషుల్లో పడుతోంది సలిల. ఆనందసంద్రంలో ఉన్న ఆమె మదిలో అలజడులు సృష్టించాడతడు.నీరజ నివ్వెరపోయి చూసింది భర్తవైపు. నోరు జారిన అరవింద్ బాధగా కణతలు రుద్దుకున్నాడు.

సలిల దగ్గరగా వెళ్లి ఆమె చేతులు పట్టుకొని “సారీరా! అనకూడని మాటలని నిన్ను నొప్పించాను. కానీ... ఇప్పటికీ నా కోరిక అదే..." అన్నాడు తాపీగా. సలిల విస్తుపోయి చూసింది. అనకూడని మాట అన్నానని మన్నించమంటూనే... అదే తన కోరికంటాడేమిటి మళ్లీ!

" చిన్నన్నయ్యా!... నువ్వేమంటున్నావో అర్థమవుతోందా!" అరిచింది ఆవేశం నిండిన స్వరంతో. “ఏమండీ... ఏమిటా మాటలు... సలిలెంతబాధ పడుతుందో చూడండి.."

నీరజ అంది మందలింపుగా.

“ ఏం? ఎందుకు మాట్లాడకూడదు... తను మళ్లీ పెళ్లి చేసుకుంటే అది సాధ్యమేగా!" వివరించాడు అరవింద్. సలిల నిర్ఘాంతపోయింది. ప్రతిమలా నిలబడి పోయింది కాస్సేపు.. దుఃఖ భారంతో పెదవులు వణకుతూండగా “నాకా! మళ్లీ పెళ్లా!" అంది హీనస్వరంతో.

“ ఏమ్మా! ఎందుకు చేసుకోకూడదు? జీవితం నువ్వేం అనుభవించావనీ... నిండా పాతిక ఏళ్లన్నా లేని నీకీ వైధవ్యం ఏమిటి? ఏ సుఖాలకు నోచుకోకుండా నువ్వు ఒంటరిగా బ్రతుకుతూంటే,

మాకెంత బాధగా ఉంటుందో తెలుసా.. అందుకే నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోవాలి...” అన్నాడు అరవింద్ ఓదార్పుగా..

నీరజ భర్తను బలపరచింది. అతడి ఈ ఆలోచనను మనస్ఫూర్తిగా సమర్ధించింది.

"నువ్వు ఆనందంగా కళకళలాడుతూ, కాపురం చేస్తూ ఉంటే అమ్మ నాన్నలకి కూడా ఆనందంగా ఉంటుంది..." చెల్లెల్ని ఒప్పించి చూశాడు అరవింద్.

సలిల వెంటనే బదులు పలకలేకపోయింది. ఆమె మనసులో ఏ భావమూ లేదు. తనకో తోడు వెతుక్కోవాలన్న అభిప్రాయమూ లేదు.ఆసక్తి లేదు... విరక్తి లేదు... నిశ్చల తటాకంలా ఉంది ఆమె మది.

"నేను ఈ విషయం గురించి ఇప్పటివరకు ఆలోచించనే లేదు చిన్నన్నయ్యా... నా క్షేమం కోరి మీరు ఇలా చెప్తున్నారు... అది నాకానందమే... ప్రస్తుతానికైతే ఈ ఉద్దేశ్యం లేదు..." సలిల పలికింది నెమ్మదిగా.

“ నీకు ఇష్టమైనప్పుడే చేసుకో... కానీ పెళ్లి వద్దని మాత్రం చెప్పకు.”

జీవితం కడదాకా ఏ తోడు లేకుండా జీవించడం అసంభవం. జీవితం పరిపూర్ణం కావాలంటే మనసుకి నచ్చినవారి సాహచర్యం అవసరం... ప్లీజ్... నా మాట విని నీ బ్రతుకు పండించుకో..." ఆర్తిగా అన్నాడు అరవింద్.

"నాకు వివాహం మీద సుముఖత కలిగినప్పుడు నీ సూచన తప్పక పాటిస్తాను...ఇప్పటికి నన్ను వదిలేయి... దయ చేసి నామీద ప్రెషర్ తేవద్దు.. ప్లీజ్...ప్రాధేయపూర్వకంగా అంది సలిల.

"సరే... సరే... నీకు మనసైనప్పుడే చేసుకో... ఇప్పటికీ... నా మిత్రబృం దంలో, నిన్నే పెళ్లి చేసుకోవాలని కలలు గంటున్న అభాగ్యుడు ఒకడున్నాడు. నువ్వు ఊ అంటే చాలు నీ మెడలో తాళి కట్టేస్తాడు..." హాస్యంగా నవ్వుతూ అన్నాడు అరవింద్ వాతావరణాన్ని తేలికపరచడానికి అన్నట్లుగా. సలిల విస్మయంగా చూసింది అతడివైపు.. ఏదో తెలియని కొత్త విషయం వింటున్నట్లుగా కళ్లు విప్పార్చి చూసింది.

"చిన్నన్నయ్య... నువ్వు ... ఏమంటున్నావు?" అయోమయంగా అడిగింది. "

"అవునమ్మా... నా క్లోజ్ ఫ్రెండ్... రాజ్ అని... సాఫ్ట్ వేర్ ఇంజనీర్. " ఎప్పుడో... నీ పెళ్లికాక ముందే... నా రూమ్లో ఉన్న నీ ఫోటో చూసి... నా కబుర్లలో తరుచుగా దొర్లే నీ ప్రసక్తి విని... నీమీద మనసు పారేసుకున్నాడు. నిన్ను పెళ్లి చేసుకోవాలని కలలు కన్నాడు..." అర్ధోక్తిలో ఆపేశాడు అరవింద్.

"నన్ను ఒక్కసారి కూడా కలుసుకోకుండానే... నా మీద ఇష్టం ఎలా ఏర్పడింది చిన్నన్నయ్యా... అన్ బిలీవబుల్..." నమ్మశక్యం కానట్లుగా అడిగింది సలీల.

" అదేనమ్మా ప్రేమంటే... ఎవరికి, ఎవరి పట్ల, ఎప్పుడు ప్రేమ కలుగుతుందో ఎవరూ చెప్పలేరు. ప్రేమ హృదయజనితం... అది ఒక అమర భావన... దానికి మనిషి రూపురేఖలతోటీ, స్థితిగతులతోటీ ప్రమేయం లేదు..." కవితాధోరణిలో అన్నాడు అరవింద్.

"ఒక్కసారి కూడా అతడిని మనింటికి తీసుకు రాలేదు నువ్వు... అంత క్లోజ్ ఫ్రెండ్ అంటున్నావూ..." సందేహంగా అడిగింది సలిల.

" లేదమ్మా... అతడిప్పుడు ప్రస్తుతం ఈ ఊర్లో లేదు. ప్రాజెక్టు నిమిత్తం విదేశాలు వెళ్లాడు. నిన్ను ఎంతగానో ఆరాధించిన అతడు, నువ్వు పెళ్లి చేసుకుంటున్నావని తెలియగానే తట్టుకోలేకపోయాడు... ఆ బాధ నుండి తప్పించుకోవడానికే ఈ ప్రాజెక్టు ఒప్పుకొని దూరంగా వెళ్లిపోయాడు... ఫోన్ ద్వారా నీకిలా జరిగిందని తెలియడంతో చాలా బాధ పడ్డాడు...

నీకు మళ్లీ పెళ్లి చెయ్యాలన్న తలంపు నాకుందని తెలిసి, నీకభ్యంతరం లేకపోతే నిన్ను పెళ్లి చేసుకుంటానన్న శుభవార్త నా చెవిన వేశాడు.

అతడు ఇప్పటికీ నిన్నే ఆరాధిస్తున్నట్లుగా అర్థంమైంది , అతడి మాటల ద్వారా... రాజ్ చాలా మంచివాడు... మనసున్నవాడు... నీకు తగిన వాడు.. నా మాట విని అతడిని చేసుకో..." సుదీర్ఘంగా చెప్పిన అరవింద్ మాటలలో చెల్లెలికి కొత్త జీవితం ప్రసాదించాలన్న తపన దాగుంది.

కానీ... సలిల మనసు ఎందుకో అంగీకరించడం లేదు... ప్రస్తుతానికి పెళ్లి మీద వాంఛ లేదు... భవిష్యత్తులో కలిగినా తన ఆశలకు, ఆశయాలకు తగిన వాడిని చేసుకుంటుంది గానీ ఇలాంటి పెద్ద

ఉద్యోగస్తులను మాత్రం చేసుకోదు... తను కటువుగా కాదంటే అన్నయ్య కలత చెందవచ్చు. నెమ్మది మీద విషయం దాటవేయాలి.

“ ఏమో అన్నయ్యా... ఇప్పుడప్పుడే నేనేమీ చెప్పలేను... నా మనసు మారిన నాడు చూద్దాంలే...అంది సున్నితంగా.

“ నీ ఇష్టం.... నేనింతలా చెప్పిన తరువాత కూడా నువ్వు కాదంటే నేను చేసేదేం లేదు. కానీ ఒక్కటి గుర్తుంచుకో... ఈ అన్నయ్య ఏం చెప్పినా, ఏం చేసినా నీ మేలు కోసమేనని... నీకు పెళ్లి మీదికి గాలి మళ్లినప్పుడు, నీకు నచ్చినవాడి చేయి చేపట్టాలనుకున్నప్పుడు, నిన్ను ఆశీర్వదించడానికి నేను ఎప్పుడూ ఉంటాను..." అరవింద్ కళ్లు చెమర్చాయి.

అన్నయ్య తన గురించి, అంతగా ఆవేదన చెందడం చూసిన సలిల కళ్లూ సజలమయ్యాయి.

తను అతడిని నొప్పించిందని తెలుస్తూనే ఉంది... కానీ... తన మనసు రాజీపడనంటోంది... ఏం చేయాలి? సలిల హృదయం రగిలే అగ్నిగుండమైంది. మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లిపోయింది. నీరజ, అరవిందు‌లు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"చూద్దాం... దాని రాత ఎలా రాశాడో ఆ దేముడు...” నిట్టూర్చాడు అరవింద్.

అతడితో ఏకీభవించింది నీరజ.

ఆ సంభాషణానంతరం కాస్త మూడీగా, డల్గా తయారైట్లుగా అనిపిస్తుంది సలిల. ఆమె చేస్తున్న కోర్స్ పూర్తి కావస్తోంది. మరొక పది రోజుల్లో ఎగ్జామ్స్ కూడా జరగబోతున్నాయి... అవి పూర్తవ్వగానే ఊరికి వెళ్లిపోవాలన్నది ఆమె ఆలోచన.

అప్పుడే అమ్మనాన్నలను చూసి ఆరు నెలలకు పైగా కావస్తోంది.

కోర్స్లో జాయినైన మూడు నెలలకి వాళ్లని చూసింది సలిల. మళ్లీ ఇప్పటివరకు వీలు పడలేదు. అరవింద్ వెళ్లి వాళ్ల క్షేమ సమాచారాలు తెలుసుకొస్తున్నాడు. అందుకే... ఎగ్జామ్స్ మొదలయ్యే ముందే అతడితో చెప్పేసింది సలిల... తనకు రిజర్వేషన్ చేయించమని.

“ ఏమ్మా... ఇక్కడ నీకేదైనా అసౌకర్యంగా అనిపిస్తోందా! మేం నిన్నే రకంగానన్నా బాధించామా...'' అడిగాడు అరవింద్ ఆర్తిగా.

''ఛ...ఛ.... అదేం లేదన్నయ్యా... నాకే... అమ్మ నాన్నల మీదకి గాలి మళ్లింది. వారిని చూడాలని మనసు తహతహలాడింది...” చెప్పింది సలిల.

''పోనీ... ఇక్కడే ఏదన్నా జాబ్ వెతుక్కోకూడదూ...'' ఆశగా అడిగింది నీరజ.

సలిల నవ్వుతూ ఆ జాబ్స్ నా ఒంటికి సరిపడవులే... ఇంటి పట్టునే ఉండి ఆర్జించుకునే విద్యను చిన్నన్నయ్య నేర్పించాడు. దాన్ని సార్థకం చేసుకుంటే తృప్తికి తృప్తి, సంపాదనకు సంపాదన, అమ్మ నాన్నల సేవ చేసుకునే మహద్భాగ్యం కలుగుతాయి...' అంది స్థిరంగా.

ఆమె మాటలెంత సున్నితంగా ఉన్నాయో, అంతే పదునుగా కూడా ఉన్నాయి.

సలిల ఒక నిర్ణయం తీసుకుంటే, సాధ్యమైనంతవరకు దానికి కట్టుబడే ఉంటుంది. అది అరవింద్ కి బాగా తెలుసు.

''నువ్వెళ్లిపోతావంటే ఏదో బాధగా ఉంది సలిలా... పోనీ మీ అన్నయ్య చెప్పినట్లుగా ఆ రాజ్ ని చేసుకుని ఇక్కడే ఉండిపోకూడదూ... కావలిస్తే అత్తయ్య, మామయ్యే ఇక్కడకు వస్తారు...'' నీరజ అడిగింది అరవింద్ బయటకు వెళ్లిన సమయం చూసి. ఇబ్బందిగా కదిలింది సలిల. తనకు బొత్తిగా పరిచయం లేని వ్యక్తి గురించిన ప్రస్తావన ఆమెను చికాకు పరిచింది.

''ప్లీజ్ నీరూ... ఆ టాపిక్ తేవద్దు. నాకు మొదటి నుండీ అమ్మ నాన్నలకు దూరంగా గడపాలని లేదు. నాకంటూ జీవితంలో పెద్ద పెద్ద ఆశలేమీ లేవు. నా కనీస అవసరాలు గమనిస్తూ, నన్నూ ఓ వ్యక్తిగా ట్రీట్ చేసే మనిషి అయితే చాలనుకున్నాను. అందుకే మీ అన్నయ్యని పెళ్లి చేసుకున్నాను. కానీ... ఆయనతో జీవితం గడిపే అదృష్టాన్ని కోల్పోయాను...

''కానీ... రాజ్ చాలా మంచి వాడట... మనసున్నవాడట... అతడు నిన్ను ప్రేమగా చూసినప్పుడు ... అతడు చేసే ఉద్యోగంతో నీకు పనేముంది... అత్తయ్యని, మామయ్యగారిని కంటికి రెప్పలా చూసుకునే పూచీ నాది...'' తల్లిదండ్రుల గురించి తల్లడిల్లుతున్న సలిలకు హామీ ఇచ్చింది నీరజ.

“అది కారణం కాదు... ఎందుకో... ఇప్పుడిప్పుడే పెళ్లి చేసుకోవాలన్న తలంపు లేదు నాకు... చేసుకున్నప్పుడు సంగతి చూద్దాం... ఎన్నాళ్లగానో అమ్మ నాన్నలకి ఆ ఊరు అలవాటయిపోయింది. వాళ్లనీ వయసులో ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేదు... అందుకే వాళ్లకి దూరంగా ఉండడం ఇష్టం లేక నేనే వెళ్లిపోతున్నాను... నా మీద ఆశలు పెంచుకోవద్దని ఆ రాజ్ కి చెప్పేయమను... నిర్లిప్తంగా చెప్పింది సలిల.

" ఆమె మీద మరి ఒత్తిడి తేలేదు నీరజ. ప్రేమతో విషం తినిపించగలం కాని, బలిమిని అమృతం తాగించలేమన్న సత్యం ఆమెకు తెలుసు.” అందుకే సలిలను బలవంతం చేయడం మానేసి మిన్నకుండిపోయింది.

పరీక్షలు పూర్తవ్వగానే ఊరికి బయలుదేరింది సలిల.

★ ★ ★

నిద్రలో పక్కకు ఒత్తిగిల్లిన కిరణ్ చేయి తన మీద పడగానే ఉలిక్కిపడింది సలిల.

గడియారం మూడు గంటలు చూపెడుతోంది. నీలాకాశం మధ్యన ప్రకాశిస్తున్న జాబిలి, ఇక తన విధులకు సెలవివ్వాలన్న దిగులుతో కృంగిపోతున్నాడు.

అతడికి వీడ్కోలు పలికేందుకు సన్నాహాలలో ఉన్నట్లుగా మందంగా వీస్తోంది పిల్లగాలి.

గాఢనిద్రాపరశుడైన కిరణ్ ముఖం అమాయకంగా ఉంది. జుత్తు చెదిరి, నుదుటి మీద చిందర వందరంగా అలముకుంది.

పచ్చని అతడి వదనానికి అలంకారంగా భాసించే దరహాసం, గాఢ నిదురలో కూడా వదలనంటోంది కాబోలు. కిరణ్ పెదవులు చిన్నగా విచ్చుకున్నాయి.

సలిల హృదయంలో విభుడిపై వలపు ఉధృతంగా పొంగుకొచ్చింది. అతడి ముఖంపైకి వంగి సున్నితంగా చుంబించింది.

ఆ స్పర్శకు చిన్నగా కదిలాడు కిరణ్. అతడికి మరింత దగ్గరగా జరిగి తన చేతులను అతడి చుట్టూ పెనవేసి, అతడి గుండెల్లో ముఖం దాచుకుంది సలీల.

ఆ కౌగిలి అతడికి నిద్రాభంగం గావించింది.

కళ్లు తెరచి చూసి ''ఇంకా నిద్రపోలేదా...'' అడిగాడు కిరణ్ తనకేసే చూస్తూ, గుండెలపై పవలించిన ప్రియసతిని. ''ఎందుకో... నిద్ర రాలేదు...'' అంది సలిల.

“ ఏం? ఒంట్లో ఏమన్నా...'' ఆదుర్దాగా అడిగాడు.

''ఉహు... అదేం కాదు... ఏవో ఆలోచనలు! అతడి క్రాఫ్తో ఆడుకుంటూ అంది సలిల.

వాటిని వెళ్లగొట్టే మంత్రం వేయనా...'' అల్లరిగా అడిగాడు కిరణ్.

''అందుకేగా... మిమ్మల్ని అల్లుకున్నదీ...” సిగ్గు బరువుకి మోము కందగా నెమ్మదిగా అంది సలిల.

వావ్... నీకు తెలుసా సలిలా... తెల్లవారు ఝాము శృంగారం దంపతులకి కొత్త ఉత్తేజాన్ని అందిస్తుందట...ఉత్సాహంగా అన్నాడు కిరణ్ అర్ధాంగిని ఆత్రంగా ఆక్రమించుకుంటూ.

''నాకు తెలుసుగాని... ఇది అలుసుగా తీసుకుని మీరు రోజూ ఇదే టైమ్ నన్ను నిద్రలేపితే బాగుండదు మరి...” హెచ్చరికగా అంది సలిల అతడికి సహకరిస్తూనే.

''ఇంతకీ... ఇప్పుడు నిద్ర లేపినది ఎవరో !!! ఆశ్చర్యంగా నటిస్తూ అన్నాడు కిరణ్.

మాటలు రానిదానిలా అతడిని మరింత హత్తుకుపోయింది సలిల.

“కాదంటే ఔననిలే... ఔనంటే కాదనీలే... ఆడవారి మాటలకూ...'' రాగాలాపన ప్రారంభిం చాడు కిరణ్...

“ లెస్ టాక్... మోర్ వర్క్...” గొణిగింది సలిల.

'' అబ్బో...రాణీవారు చాలా అడ్వాన్స్ అయిపోతున్నారు...” తమకంతో తహతహలాడుతూ తనువుల మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో పడ్డాడు కిరణ్. ''

శరీరాన్నే కాదు, మనసుని కూడా సేదతీర్చే పరమౌషధం లాంటి దాంపత్య సౌఖ్యం వారి స్వంతమైంది.

అలసిన శరీరాలు, ఆదమరచి నిద్రపోవాలని ఆశించాయి... చంద్రుడు అస్తమించే వేళకి వారి కన్నులు మూతబడ్డాయి.

“ బై సలిలా డార్లింగ్... వెళ్ళొస్తాను... సాయంత్రం నేనొచ్చేసరికి రెడీగా ఉండు. అలా బయటకు వెళదాం..." వాకిట్లో నిలబడి చెయ్యూపుతున్న సలిలతో చెప్పి బైక్ ముందుకురికించాడు కిరణ్.

అతడు వెళ్లేవరకు చూసి లోపలికి నడిచింది సలిల.

బైక్మీద కొంతదూరం ప్రయాణించిన కిరణ్ తనని ఎవరూ గమనించడం లేదని నిర్ధారించుకున్నాక ఒక ఇంటిలోపలకి తన బైక్ ని మళ్లించాడు.

అత్యాధునికంగా కట్టబడిన ఓ పెద్ద భవంతి అది..

గేటు దగ్గర నిలబడి ఉన్న వాచ్ మాన్ కిరణ్ కేసి చూస్తూనే వినయంగా సెల్యూట్ చేశాడు. బైక్ పార్క్ చేసి లోపలికి వెళ్లిన కిరణ్ ఒక పది నిముషాలలో బయటకు వచ్చాడు.

అతడి వస్త్రధారణ పూర్తిగా మారిపోయి ఉంది. ఇందాకటి జీన్స్, టీ షర్ట్ స్థానంలో, రేమాండ్స్ సూట్ వచ్చి చేరింది అతడి ఒంటి మీదికి.

కళ్లకి ఖరీదైన గాగుల్స్, చేతికి బ్రేస్లెట్, ఇంపోర్టెడ్ వాచ్తో చాలా డిగ్నిఫైడ్ గా కనిపిస్తున్నాడు. అతడి రాక కోసమే ఎదురుచూస్తున్నట్లుగా, పోర్టికోలో కారు నిలచి ఉంది. కిరణ్ ఎక్కి కూర్చోగానే స్టార్ట్ అయ్యింది.

ఇదంతా తనకు మామూలే అన్నట్లుగా కార్ సాగిపోతూనే, గేటు మూశాడు వాచ్మన్.

కాస్త దూరంగా ఉన్న కిళ్లీబండి మాటు నుండి, కిరణ్ నిష్క్రమణను గమనించిన ఓ రెండు కళ్లు ఎర్రబడ్డాయి చింతనిప్పుల్లా.

ఏదో తెలియని పైశాచికానందంతో నవ్వుకున్నాడు క్రూరంగా ఆ కళ్ల తాలూకు స్వంత దారు.

★★★

తపతీ... తపతీ..." కాలేజీకి టైమైపోతోందని వేగంగా నడుస్తున్న తపతి నడిరోడ్డు మీద తనని పేరు పెట్టి పిలిచేదెవరానన్న ఆలోచనతో వెనుదిరిగి చూసింది.

ఆమెకు నాలుగడుగుల దూరంలో... ఆమె వైపుకే నడిచి వస్తున్న కార్తీక్ కనిపించాడు. అతడు.. ఆమె స్నేహబృందంలో ఒకరైన లలితకు అన్నయ్య.

రెండు మూడుసార్లు లలిత కోసమని వాళ్లింటికి వెళ్లినప్పుడు పరిచయం అయ్యాడు. కానీ... ఆ కొద్ది పరిచయానికే, ఇలా నడిరోడ్డు మీద తను పేరు పెట్టి పిలుస్తాడని తపతి ఊహించలేదు.

అతడు వడి వడిగా అడుగులేస్తూ వచ్చి, ఆమె సరసన నిలిచాడు.

ఈ కాలపు అబ్బాయిల్లాగే చాలా స్టయిలుగా ఉన్నాడతడు. కార్లోస్ ప్యాంట్, లేటెస్ట్ మోడల్ టీ షర్ట్, జేబులో సెల్... నేటి యువతకు ప్రతినిధిలా కనిపిస్తున్నాడు.

''ఎందుకూ? నన్ను పిలిచారు?'' అసహనంగా అడిగింది తపతి.

“ నీతో కొద్దిగా మాట్లాడాలి...'' అన్నాడు కార్తీక్.

ఏమిటో చెప్పు? ''

“ఇక్కడ కాదు... అలా పార్క్ కి వస్తే...”

“సారీ... నాకు కాలేజీకి టైమవుతోంది." ముక్తసరిగా చెప్పింది తపతి.

ఆమెకు తన స్నేహితులతో సన్నిహితంగా మెలగాలన్న కోరికే తప్ప, ప్రత్యేకించి ఏ ఒక్కరితోనో అతిస్నేహం కొనసాగించాలన్న తలంపు లేదు..

“పోనీ... నీకెప్పుడు వీలవుతుందో చెప్తే...”

'' అసలు మీరే విషయం గురించి మాట్లాడాలనుకుంటున్నారో చెప్తే... నాకు వీలవుతుందో లేదో నన్నది చెప్తా...'' నిర్మొహమాటంగా అంది తపతి.

“అది మీరొస్తే చెప్తాను... ప్లీజ్... నా కోసం కాస్త టైమ్ స్పెండ్ చేయండి...'' అతడి వేడికోలు తపతిని మెత్తబడేలా చేసింది.

''సాయంత్రం అయిదు దాటాక...” నెమ్మదిగా చెప్పింది.

"ఓ.కే... సాయంత్రం అయిదు దాటాక... ఇందిరా పార్క్లో... మరచిపోకండి..." చెప్పేసి వెళ్లిపోయాడతడు.

తపతి ఆలోచిస్తూనే నడవసాగింది. ఆ నడకలో ఇందాకటి వేగం లేదు.

ఏం మాట్లాడతాడతడు? అందరు అబ్బాయిల్లా తన అందాన్ని పొగుడుతాడా! తనకి పొగిడే వాళ్లంటే అసహ్యం... ఇంట్లో పదే పదే తల్లినోట ఆ మాట విని విని ఆ పదమంటేనే ద్వేషం మొదలైంది.

ఒకవేళ తనని ప్రేమించానంటూ పోచికోలు కబుర్లు మొదలెడితే...

అంతవరకు వస్తే తను మాత్రం ఊరుకుంటుందా... లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేసి ఛడా మడా దులిపి పారేస్తుంది. .. ఎందుకో... అతడిని కాదనాలనిపించలేదు తపతికి. . ఆ రోజంతా, ఆమె అన్యమనస్కంగానే గడిపింది. క్లాస్లో పాఠాలు కూడా వినలేదు.

అయిదు దాటాక ఇందిరా పార్క్ కి బయలుదేరింది స్నేహితురాళ్ల దగ్గర వీడ్కోలు తీసుకొని.

తపతి వెళ్లేసరికి, గుబురుగా ఉన్న ఒక పొద దగ్గర కూర్చుని ఎదురుచూస్తూ కనిపించాడు కార్తీక్.

ఆమెను చూడగానే అతడి వదనం జిగేల్ మంటూ వెలిగిపోయింది.

ఆమెకు ఎదురుగా వస్తూ " మీరు వస్తారని అనుకోలేదు... నన్ను ఒక రోడ్ సైడ్ రోమియోలా జమ కట్టారేమోనని భయం వేసింది..." అన్నాడతడు.

తపతి ఏమాత్రం స్పందించకుండా "నన్ను రమ్మన్న కారణం ఏంటో సెలవిస్తే, వినేసి వెళ్లిపో తాను..." అంది.

అతడు మాట్లాడకుండా తన నోట్ బుక్ తెరచి ఓ పేపర్ కటింగ్ బయటకు తీశాడు. అది... ఒక వారపత్రిక వారు నిర్వహిస్తున్న కవితల పోటీకి సంబంధించిన ప్రకటన.

దానివైపు అయోమయంగా చూస్తూ ' ఇదీ...' అంది తపతి.

"మీ కోసమే... కవితల పోటీలో మీరూ పాల్గొంటారని తెచ్చాను..." నింపాదిగా చెప్పాడు కార్తీక్

కదిలిపోయింది తపతి. "నేను... కవితలు రాస్తానని మీకెలా తెలుసు?" ప్రశ్నించింది ఆశ్చర్యంగా.

“అదొక్కటే కాదు... మీ గురించి చాలా తెలుసు... . అందంగా ముగ్గులు పెడతారనీ, పెయింటింగ్స్ వేస్తారని, కోకిలతో పోటీ పడి తీయగా పాడతారనీ కూడా...”

"లలిత చెప్పిందా?" కనురెప్పలు ఆర్పుతూ తడబాటుగా అడిగింది తపతి.

"అవును... ఆనాటి నుండి మీరంటే నాకు ఆరాధన మొదలైంది. నిన్న వీక్లీ తిరగేస్తూ ఉంటే అందులో ఈ అడ్వర్టైజ్‌మెంట్ కనబడింది... దీనిలో మీరు పాల్గొవాలన్న ఆకాంక్షతో తెచ్చాను..." అన్నాడు కార్తీక్ ఆమె కళ్లల్లోకి కళ్లు పెట్టి చూస్తూ.

తపతీ మనసు కరిగిన వెన్నపూసైంది. తనకు ఊహ తెలిసిన దగ్గర్నుండీ ఈనాటి వరకు చూస్తూనే ఉంది... తన అందాన్ని తప్ప తనలో ఉన్న ఇతర టాలెంట్స్ గురించి ప్రస్తావించినవారు గానీ, ప్రశంసించినవారు గానీ లేరు... ఆఖరుకి తల్లిదండ్రులు, స్నేహితులతో సహా.

తల్లికెంతసేపూ "నువ్వు అందగత్తెవి ... దిష్టి తగులుతుంది... అలా నవ్వకు...అటు వెళ్లకు... , ఇటు చూడకు..." లాంటి హెచ్చరికలు చేయడం తప్ప ఇతర విషయాల గురించి పట్టదు..

తండ్రి సరేసరి... ఎంతసేపూ తన ఆఫీస్ వ్యవహారాలు, బయటపనులు, ఇదే అతడి వ్యాపకం.

మహతికి తనంటే అసూయ... తనను మించి అందంగా ఉంటుందన్న అక్కసు...

తొలిసారి... తొలిసారిగా ... తనలో దాగి ఉన్న ఇతర సృజనాత్మక అంశాల్ని గురించి అడుగుతున్న మొదటి వ్యక్తి ఇతడు.

తపతి అతడివైపే చూస్తూ " మీరు తెచ్చారు దేనికీ? లలిత చేత పంపితే సరిపోతుంది కదా!” అంది.

“ అదా! సరేలెండి... దానికిలాంటివన్నీ సొక్కవు... అదిగాని మరచిపోయి మీకివ్వడం మానేసిందంటే అంతే సంగతులు... గడువు దాటి పోకుండా పంపిస్తారని నేనే స్వయంగా తెలియజేయాలని ఇలా వచ్చాను... తప్పుగా అనుకోరు కదూ!" అభ్యర్థన పూర్వకంగా అంటున్న అతని వైపు సాభిప్రాయంగా చూసింది తపతి.

అతడి మాటలకు పూర్తిగా ఫ్లాట్ అయిపోయిందామె. తనలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను బయటకు లాగి, ప్రోత్సహించడానికే... ఇంత దూరం పనికట్టుకు వచ్చాడితడు... కేవలం... తన కోసమే.

"థాంక్స్ కార్తీక్... నా కోసం అనవసరంగా శ్రమ తీసుకున్నారు." చెప్పింది తపతి కృతజ్ఞతాపూర్వకంగా.

మనకెలాగూ చేత కాదు... కనీసం ఆ అభిరుచి ఉన్నవారిని ఎంకరేజ్ చేస్తే ఏం పోతుంది చెప్పండి! మంచి కవిత రాసి పోటీకి పంపండి... ఆల్ ది బెస్ట్. బైదివే... బహుమతి వస్తే చెప్పడం మాత్రం మరచిపోకండి..." హుందాగా కదిలిపోయాడు కార్తీక్.

అతడు వెళ్లిన వైపే చూస్తూ ఉండిపోయింది తపతి సామరస్య భావన నిండిన దృక్కులతో. ఇంతసేపు తనతో మాట్లాడిన అతడు ఎక్కడా తన అందాన్ని గురించి పొగడకపోవడం గమనించిన ఆమె మనసు అతడి పట్ల అనురక్తమయ్యింది. అతడు మంచివాడేనన్న ముద్ర పడింది ఆమె మనసులో.

తన చేతుల్లో ఉన్న ఆ పేపర్ కటింగ్ ని అపురూపంగా తడుముతూ ఉండిపోయింది కాస్సేపు. తేరుకొని చూస్తే చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయప్పటికే.

" అమ్మో! ఇంకా ఆలస్యం చేస్తే ఆ మహా తల్లి వేసే యక్షప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక చావాలి... ఎందుకొచ్చిన గొడవ...తొందరగా ఇంటికెళ్లిపోతే తీరిపోతుంది... రంకెలేసే తల్లిని తలుచుకుంటూ చక చక పార్క్లోంచి బయట పడింది తపతి.

అయితే ఆమెకు తెలియనిది ఒకటుంది... కార్తీక్ కావాలనే ఆమె అందాన్ని స్తుతించకుండా జాగ్రత్త పడ్డాడని, ఏ రకంగా మాట్లాడితే ఆమె మెల్ట్ అవుతుందోనని సర్వకోణాల్లోంచీ పరిశీలించి, అతడు అడ్వాన్స్ అయ్యాడన్న విషయం ఆమె గ్రహించలేకపోయింది.

ఇది ఆమె జీవితంలో ఏ పెనుమార్పులకు నాందీ గతం అవుతుందో!?

★★★

హాల్లో ఆపకుండా ఫోన్ రింగ్ అవుతూంటే పెరట్లో మొక్కలకి నీరు పెడుతున్న 'సలిల పరుగెత్తుకొచ్చింది కంగారుగా..

"ఇప్పుడేగా అమ్మవాళ్లతో మాట్లాడి ఫోన్ పెట్టింది... అంతలోనే ఎవరూ!" విసుగ్గా అనుకుంటూ ఫోన్ లిఫ్ట్ చేసింది.

"హలో... సలిల స్పీకింగ్..." అంది కాస్త చిరాగ్గా.

" మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి..." అవ తల నుండి గంభీరంగా పలికిందో స్వరం...

అది పూర్తిగా అపరిచితమైన కంఠస్వరం.

"నాతోనా! ఇంతకీ మీరెవరో తెలుసుకో వచ్చా?" మర్యాదగా అడిగింది సలిల.

అవతల వ్యక్తి గల గల నవ్వి " అది మీకనవసరం... మీకు నేను చెప్పే రహస్యంతోటే సంబంధం... నా గురించిన వివరాలు అప్రస్తుతం" అన్నాడు.

"రహస్యమా! ఏమిటి మీరంటున్నది?" విస్మయంగా అడిగింది సలిల.

" అవును... రహస్యమే... కిరణ్... అదే మీ పతిదేవులుంగారు... ఆయనకి సంబంధించిన సీక్రెట్ ఒకటి చెప్దామని..." మళ్లీ నవ్వాడు అతను.

"నా భర్తకి, నాకు నడుమ ఎటువంటి రహస్యాలూ లేవు... ఆయన గురించి నాకు బాగా తెలుసు..." గర్వంగా చెప్పింది సలిల..

"నీ భర్త మీద నువ్వేర్పరచుకున్న నమ్మకానికి హ్యాట్సాఫ్... కానీ నీ భర్త నిన్ను మోసం చేస్తున్నాడు..." పలికింది ఆ స్వరం.

"నేవ్వర్... ఆయనెన్నటికీ నన్ను మోసం చేయరు... చేయలేరు..." దృఢంగా అంది సలిల.

" అలా అనుకోవడం నీ అమాయకత్వం... అంతదాకా ఎందుకు... అతడొక కాలేజ్ లెక్చరర్ అని నీతో చెప్పాడు అవునా!"

" అవును... ఆయన సిద్ధార్థ కాలేజ్లో మ్యాథ్స్ లెక్చరర్... అది నాకు బాగా తెలుసు..." అంది సలిల..

"అక్కడే నువ్వు పప్పులో... సారీ తప్పులో కాలేశావు... కిరణ్ లెక్చరర్ కానే కాదు..." .

"మరి!" ఆతృత ఆపుకోలేకపోయింది సలిల.

" అమ్మా! అప్పుడే అన్ని వివరాలు చెప్పేస్తే మజా ఏముంటుంది? తరువాయి భాగం కొద్ది రోజుల్లో..." నవ్వేసి ఫోన్ పెట్టేశాడవతల వ్యక్తి.

సలిల ఆలోచనలో పడింది. ఎవరీ అపరిచితుడు? కిరణ్ తనను మోసం చేశాడంటాడేమిటి?

తన కిరణ్... తనంటే ప్రాణిమిచ్చే కిరణ్ తనను వంచిస్తాడా!?

నో... ఎన్నటికీ కాదు... ఎవరో పేరు, ఊరు తెలియని మనిషి ఫోన్ చేస్తే కిరణ్ గురించి అవాకులు చవాకులు పేలితే తాను వాటిని నమ్మడమంత అవివేకం మరొకటి ఉండదు.

తను కిరణ్ ని శంకించడమంటూ జరిగితే అది తనను తాను అవమానించుకోవడమే...

కిరణ్ లాంటి ప్రేమికుడు దొరకడం తన అదృష్టం. ఎవరో చెప్పిన గాలి కబుర్లను ఆధారంగా తీసుకొని అతడిని అవమానిస్తే తను ప్రేమసౌధం బీటలువారే ప్రమాదముంది.

ఇలాంటి కబుర్లని ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయాలి.

ఈ ఆలోచన రాగానే స్థిమితపడింది సలిల మనసు. కిరణ్ గురించి ఆ అజ్ఞాత వ్యక్తి అన్న మాటలను మరచిపోయింది వెంటనే.

★★★

"సలిలా... సలిలా...." గోడమీద నుండి గావుకేకలు పెట్టడం అలవాటైపోయిన హిమజ అరిచింది గట్టిగా.

" ఏంటాంటీ..." అప్పుడే కిరణ్ ని సాగనంపి ఇల్లు సర్దే ప్రయత్నం పడిన సలిల పెరటి గుమ్మంలోకి వచ్చి అడిగింది.

"ఏం లేదు... కాస్త బజారు పని ఉంది... సాయం వస్తావేమోననీ..." సలిలకు గుర్తొచ్చింది... తనకీ స్టిచ్చింగ్ మెటీరియల్ కావాల్సి ఉందనీ.

" అలాగే ఆంటీ... ఇంటి పని అయిపోగానే బయలుదేరి వెళదాం..." చెప్పింది.

" ఆ... అయితే నేనూ పని త్వరగా ఫినిష్ చేసి రెడీ అవుతాను..." అనేసి లోపలికి వెళ్లిపోయింది హిమజ.

వాషింగ్ మిషన్లో బట్టలుతికే పనిని మర్నాటికి వాయిదా వేసి, హిమజతో మార్కెట్ కెళ్లడానికి నిశ్చయించుకున్న సలిల క్షణాల్లో ఇల్లంతా క్లీన్ చేసేసి తయారైపోయింది.

హ్యాండ్ బ్యాగ్ తీసుకొని, డోర్ లాక్ చేసి బయటపడింది.

ఇంటికి కావలసిన నిత్యావసర సామగ్రి, తపతికి రెండు నైటీలు, మహతికి కాస్మటిక్స్ ఇంకా తనకి కావలసిన గృహోపకరణాలు చాలానే కొంది హిమజ.

సలిల తనకి కావల్సినవి మాత్రమే కొనుక్కుంది. ఏవి పడితే అవి కొనేసి ఇల్లు కంగాళీ చేయడం ఆమెకు నచ్చదు.

అసలు ఆమె కాస్మటిక్స్, సుగంధద్రవ్యాలు వాడదు. జంతువులను హింసించి తద్వారా వాటిని తయారుచేస్తారని ఏదో మ్యాగజైన్లో చదివింది ఆమె. అందుకనే సౌందర్యసాధనాలు వాడడం పట్ల విముఖత చూపుతుంది.

సలిల పట్టుచీరలు కట్టదని తెలుసుకున్న హిమజ బోలెడు ఆశ్చర్యపోయింది. ఇదెక్కడి వింతని నిలదీసింది.

“పట్టుపురుగులను హింసించి, తయారుచేసే పట్టు చీరలు కట్టుకోకపోతే వచ్చే నష్టం ఏమిటి ఆంటీ..." ఎదురు ప్రశ్నించింది సలిల.

“నష్టం అని కాదు... పట్టు చీరలు ఇష్టపడని ఆడవాళ్లుంటారా! అని...”

"నేనున్నానుగా... అయినా నాకు మొదట్నుంచీ కాటన్స్, నేత చీరలు అంటే ఇష్టం... సింపుల్గా చెప్పి అక్కడితో ఆ టాపిక్ కట్ చేసింది సలీల.

ఇప్పుడూ అదే... కాస్మటిక్స్ వాడని సలిల పురాతన భావాల్ని విమర్శిస్తూనే ఉంది హిమజ.

సలిల అవేమీ పట్టించుకోలేదు. హిమజ మాట తీరు ఆమెకు తలనొప్పిని తెప్పిస్తోంది.

సామాన్లు ప్యాక్ చేయించుకొని ఆటో మాట్లాడుకున్నారిద్దరూ.

హిమజ అనర్గళంగా అనేక విషయాల గురించి చర్చిస్తూనే ఉంది.

ఆటో కాస్త దూరం పోగానే లెఫ్ట్ సైడ్న సిద్ధార్థ జూనియర్ కాలేజ్ అన్న బోర్డ్ కనబడింది. ఆ రోజు ఫోన్లో ఆ అపరిచిత వ్యక్తి అన్న మాటలు జ్ఞప్తికొచ్చాయి సలిలకు అప్రయత్నంగా.

"స్టాప్... స్టాప్..." ఆమె ప్రమేయం లేకుండానే నోటి వెంట వెలువడ్డాయా మాటలు.

"సలిలా... ఏమైంది?" అడిగింది హిమజ తెల్లబోతూ.

" ఏం లేదాంటీ... నాక్కాస్త పని పడింది... మీరు వెళ్లండి... నేను తరువాత వస్తాను..." అంది సలిల.

"ఫరవాలేదు... ఆటోని వెయిట్ చేయమందాం... కావలిస్తే పదో, అయిదో ఎక్కువియ్యవచ్చు..." సలహా ఇచ్చింది హిమజ.

" అదేం వద్దాంటీ... మీరు వెళ్లండి... నాక్కాస్త టైమ్ పడుతుంది... నా సామన్లు మీ దగ్గరే ఉంచండి... నేనొచ్చి తీసుకుంటాను..." చెప్పింది సలిల నిక్కచ్చిగా.

"సరే... నీ ఇషం" ఆటో ముందుకు దూసుకుపోయింది.

కిరణ్ ని శంకించి, అతడి మీద సి.ఐ.డి. పని చేయాలన్న ఉద్దేశ్యంతో సలిల అక్కడ దిగలేదు. ఆ అపరిచిత

వ్యక్తి మాటల్లోని నిజానిజాలను దర్యాప్తు చేయాలన్న ఉద్దేశ్యమూ ఆమెకు లేదు.

కేవలం... అతడు ఎందుకలా తనను హెచ్చరించాడో తెలుసుకోవాలన్న తపనతో మాత్రమే ఆమె ఆ కాలేజీలో అడుగు పెట్టింది. అదీగాక... ఇంతకు ముందు ఆమె అక్కడికి ఎప్పుడూ రాలేదు. అందుకే... హఠాత్తుగా కిరణ్ ముందు ప్రత్యక్షమై అతడికి సడెన్ సర్ప్రైజ్ ఇవ్వాలన్నదే ఆమె కోరిక.

తనను చూడగానే కిరణ్ ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరైపోవడం చూడాలన్న వాంఛతోనే అలా చేసింది.

అది లంచ్ అవర్ కావడంతో విద్యార్థులంతా సందడి సందడిగా కనిపిస్తున్నారు.

"తను కరెక్ట్ టైమ్కే వచ్చింది... ఇలాంటప్పుడయితేనే కిరణ్ ఫ్రీగా దొరుకుతాడు" అనుకుంటూ అక్కడే ఉన్న ప్యూన్ని "ఇక్కడ కిరణ్ సార్ అనీ..." అడిగింది సలిల.

“ఆ... కిరణ్ సారా! ఉన్నారమ్మా... కాస్తాగండి పిలిపిస్తాను..." అంటూ అక్కడే నిలబడి ఉన్న ఆయాని పిలిచి "ఇదిగో ముత్తమ్మా... మన ఇంగ్లీష్ సార్ కిరణ్ గారి గురించి ఎవరో వచ్చారని చెప్పు..." అని ఆజ్ఞ జారీ చేశాడు అతడు.

సలిల అంది కంగారుగా " ఆయన ఇంగ్లీష్ లెక్చరర్ కాదు...మ్యాథ్స్ లెక్చరర్."

"మా కాలేజీలో ఉన్నది ఒక్కరే కిరణ్ సార్... అది కూడా ఇంగ్లీష్ డిపార్ట్ మెంట్లోనే ఉన్నారు...” అసహనంగా అన్నాడతడు.

ఆమె తను సిగరెట్ కాల్చుకోనీయకుండా అడ్డు తగిలి, ప్రశ్నలు వేస్తోందన్న కోపం అతడిది.

“పోనీ... ఆయన్నే పిలవండి...” బెదురుగా అంది సలిల.. ఆయా వెళ్లింది కబురు చెప్పడానికి. విజిటర్స్ రూమ్లో కూర్చున్న సలిల ఆలోచనలో పడింది. కిరణ్ మ్యాథ్స్ లెక్చరర్గా పనిచేస్తున్నట్లుగానే తనకు తెలుసు. కానీ... అతడు ఇంగ్లీష్ లోకి ఎప్పుడు మారినట్లు!?

"ఎక్స్క్యూజ్ మి మేడమ్... నా కోసం ఎవరో వచ్చారని ఆయా చెప్పింది... మీరేనా!" తనకు ఏమాత్రం పరిచయం లేని స్వరం వినబడి తలెత్తి చూసింది సలిల.

అనుకోని షాక్ ఏమాత్రం పరిచయం లేని స్వరం వినబడి తలెత్తి చూసింది సలిల.

అనుకోని షాక్ తగిలింది ఆమెకు... ఎందుకంటే అతడు కిరణ్ కాదు.

"హలో మేడమ్... నేనే కిరణ్. మీరు నా గురించి అడిగారట?" విస్మయంగా చూశాడు అతడు.

"సారీ ఫర్ ది డిస్టబెన్స్... యాక్ట్యువల్ గా నేను వచ్చింది మ్యాథ్ లెక్చరర్ కిరణ్ గారి కోసం..." నొచ్చుకుంటూ చెప్పింది సలిల.

"యూ ఆర్ మిస్టేకన్ ... ఇక్కడి టీచింగ్ స్టాఫ్ లో నేనొక్కడినే కిరణ్. క్లారికల్ డిపార్ట్ మెంట్లో మరెవరైనా ఉన్నారేమో నాకు తెలీదు." చెప్పాడతడు.

" మీరు ఇక్కడ చేరక ముందు ఇంకేవరన్నా కిరణ్ ఇక్కడ పనిచేశారా" ఆశ చావని సలిల అడిగింది.

అవన్నీ నాకు తెలియదు మేడమ్. నేను రీసెంట్గా జాయినయ్యాను... మీరు వెళ్లి ప్రిన్సిపాల్గారిని కలిస్తే వివరాలేమన్నా తెలియవచ్చు... సౌమ్యంగానే చెప్పాడతడు. కూర్చున్నచోట నుండి లేస్తూ " అయాం సారీ... నేను పొరబడ్డాను... మీ వాల్యుబుల్ టైమ్ వేస్ట్ చేసినందుకు మన్నించండి..'' అంది సలిల.

" ఇట్సాల్ రైట్..." అన్నాడతడు.

ప్రిన్సిపాల్ రూమ్ దగ్గర ఆగి స్ప్రింగ్ డోర్స్ మీద తడుతూ ''మే ఐ కమిన్ సర్...'' అడిగింది సలిల మర్యాద ఉట్టిపడే స్వరంతో.

''యస్ కమిన్..." గంభీరమైన గొంతు వినబడింది.

లోపలికి వెళ్లి ప్రిన్సిపాల్ ని విష్ చేసి, బయట ఆ కిరణ్ ని అడిగినట్లే అన్ని వివరాలు అడిగింది సలిల.

"మేం ఈ కాలేజ్ పెట్టి దాదాపు టెన్ ఇయర్స్ కావస్తోంది. అప్పటి నుండీ ఇప్పటివరకు కూడా మా స్టాఫ్లో 'కిరణ్' అన్న పేరు గల వ్యక్తి ఎవరూ లేరమ్మా... ఈమధ్యే... ఇంగ్లీష్ ఫాకల్టీగా 'కిరణ్' అన్న కొత్త అబ్బాయి చేరాడు. మిమ్మల్నెవరో మిస్గైడ్ చేసినట్లున్నారు. ఇంతకీ మీరడుగుతున్న ఆ 'కిరణ్' ఎవరమ్మా? కుతూహలంగా అడిగాడు ప్రిన్సిపాల్.

" ఏదో పెళ్లి సంబంధం కోసం ఎంక్వైరీ లెండి..." చెప్పేసి బయటపడింది సలిల..

కిరణ్ తన భర్త అని చెప్పాలనిపించలేదామెకి. అతడు తనని మాయ చేశాడన్న విషయం బయటకు తెలిస్తే చులకనయ్యేది తనే అని తెలుసామెకి.

బయటకొచ్చి ఆటో ఎక్కి కూర్చుందే కానీ సలిల మనసు మనసులో లేదు.

కిరణ్ తనతో ఎందుకు అబద్ధం చెప్పాడు? తననెందుకు ఫూల్ ని చేశాడు? ఇదేనా?... ఇది కాకుండా అతడు తనను ఇంకేరకంగానన్నా మోసపుచ్చాడా!

తను అబద్ధాన్ని, మోసాన్ని ద్వేషిస్తుందన్న సంగతి తెలిసి కూడా అతడిలా చేశాడంటే దానర్థం ఏమిటి? తన పట్ల అతడు ప్రదర్శించే ప్రేమ కూడా కల్లేనా! పక్కాగా ప్లాన్ చేసి తన జీవితంలోకి అడుగు పెట్టలేదు కదా!

ఆ ఊహ రాగానే సలిల వణికిపోయింది చిగురుటాకులా...

'నో' కిరణ్ గురించి తప్పుగా ఆలోచించడం సాధ్యపడడం లేదు.

అతడి ప్రేమలో కల్మషం లేదు. కపటం అసలే లేదు. అతడి కళ్లు తన రూపాన్నే ప్రతిబింబించి, ఆరాధనను వెలిబుచ్చే నిలువుటద్దాలు. అతడు తనను వంచించాడన్న విషయాన్ని అంగీకరించడం లేదు మది.

కాని... అతడు అబద్ధం చెప్పాడన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతోంది ఆమె.

"చూద్దాం... ఇప్పుడప్పుడే తను బయట పడకూడదు... విషయం ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఎంత దూరం పోతుందో గమనించి అప్పుడు నిర్ణయం తీసుకోవాలి..."

శరవేగంతో, రకరకాల ఆలోచనలవెనుక పరుగులు తీస్తున్న మనసుని అదుపులో పెట్టేందుకు విఫలయత్నం చేయసాగింది సలిల.

★★★

ఆగకుండా ఫోన్ మోగుతూంటే లిఫ్ట్ చేసింది సలిల..

"హలో... ఎవరూ?" అడిగింది యధాలాపంగా.

"నేనే... మీ శ్రేయోభిలాషిని..."

తనకు తెలియకుండానే నిటారుగా అయ్యింది సలిల. ఆ ఫోన్ వ్యక్తి ఎవరో గాని తనకు కరెక్ట్ ఇన్ఫర్మేషన్ ఇచ్చాడని ఆ రోజే అనుకుంది సలిల.

కాని... అతడు తిరిగి ఇంత త్వరగా తనను కాంటాక్ట్ చేస్తాడని మాత్రం ఊహించలేదు.

"చెప్పండి..." తను అతడి మాటలను విశ్వసిస్తోందన్న ఫీలింగ్ బయటపడకుండా అడిగింది.

"నేను కాదు... మీరే చెప్పండి. మీవారు ఆ కాలేజ్లో పనిచేయడం లేదన్న సంగతి కనుక్కున్నారని నాకు తెలిసిపోయింది లెండి." నవ్వాడతడు.

ఆ స్వరంలో వెటకారం సలిల మదిని నొప్పించింది.

“అవును... కిరణ్ ఆ కాలేజీలో పని చేయడం లేదు...'' హీనస్వరంతో పలికింది. చేతిలో ఉన్న రిసీవర్ పట్టు తప్పి కింద పడిపోతుందేమోనన్నంత నిస్సత్తువ ఆవరించింది శరీరాన్ని.

''...ఆ రోజు నేను చెప్పింది నిజమేనని ఇప్పటికైనా ఒప్పుకుంటున్నందుకు థాంక్స్...'' అన్నాడతడు. .

చెమటలు పట్టిన నుదుటితో అరచేత్తో రాసుకుంటూ కిరణ్ ఆ కాలేజీలో పనిచేయడం లేదు అన్న నిజం చెప్పిన మీరు... అతడెక్కడ పని చేస్తున్నాడో కూడా చెప్పి పుణ్యం కట్టుకోండి...'' అంది సలిల బింకంగా.

'' అమ్మమ్మా... అంత వేగం అతడిని బయట పెట్టేస్తే ఎలా? మీ అంతట మీరుగా అతడి గుట్టును కనుక్కనే ప్రయత్నం చేయండి... మీ వల్ల కాకపోతే అప్పుడాలోచిద్దాం'' అన్నాడతను ఎగతాళిగా..

భర్త గురించి పరాయి వ్యక్తితో మాట్లాడాల్సి రావడం చాలా ఇబ్బందికరంగా ఉంది సలిలకు.

అతడి ముక్కు మొహం తెలియకపోయినా, అతడు చెప్పే వివరాలు ఆసక్తికరంగా ఉండడం చేత అతడితో మాట్లాడడం తప్పడం లేదు.

''ఇంతకీ మీరెవరు? కిరణ్ గురించి మీకెలా తెలుసు?'' ఆతృతగా అడిగింది సలిల.

“ ఆ ఒక్కటీ అడక్కండి...” ఠక్కున ఫోన్ పెట్టేసిన శబ్దం వినబడింది.

''నిస్సహాయంగా ఫోన్ వైపు చూస్తూ క్రెడిల్ చేసింది సలిల.

ఆమె అంతరంగంలో కల్లోలం బయలుదేరింది. అసలు కిరణ్ గురించిన వివరాలు చెప్తున్న ఇతడెవరు? ఇతడికీ కిరణ్ కి ఏమిటి రిలేషన్?

కిరణ్ లెక్చరర్నని అని తనతో అబద్ధం ఎందుకు చెప్పినట్లు?

అసలు కిరణ్ ని ఎంపిక చేసుకోవడంలో తనేమన్నా పొరపాటు చేసిందా!?

ఉలిక్కి పడింది సలిల. ఏనాడూ కలుగని ఈ భావన ఈ రోజే కలిగిందంటే తను కిరణ్ ని శంకిస్తోందా!?

ఇన్నాళ్లుగా కిరణ్ ప్రవర్తన గమనిస్తూ, అతడితో సహజీవనం సాగిస్తున్న తనకి ఎన్నడూ అతనిపై అతడి అనురాగంపై అనుమానం కలగలేదు.

కాని... ఈరోజు... ఎవరో... అపరిచిత, అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం వలన ప్రాణవల్లభుడినే సందేహించే పరిస్థితి ఏర్పడింది. ఇది ఎక్కడకు దారితీస్తుంది?

భర్త సౌజన్యమూర్తి, చతురుడు, రసికుడు అయి ఉడాలని ఏ మగువైనా వాంఛిస్తుంది. ప్రతి స్త్రీకి అన్ని మంచి లక్ష ణాలు మూర్తీభవించిన భర్త లభిస్తాడని ఏం లేదు.

కాని... తన భాగ్యం కొద్దీ ఇన్ని మంచి లక్షణాలు అన్నీ ఒకచోట సాకారమై నిలచినట్లుగా దొరికాడు కిరణ్.

అసలైన భర్త ఎలా ఉండాలోనన్నదానికి సరైన నిర్వచనంలా నిలిచాడు.. అతడిలో హాస్యప్రియత్వం, స్త్రీలను గౌరవించే సౌశీల్యం, సాటి మనిషికి సహాయపడే సహృదయత, అర్ధాంగి అంతరం గాన్ని రంజింపచేసే సరసపూరిత ప్రవర్తన... వీటన్నింటికి తను దాసోహమంది.

మళ్లీ పెళ్లి మాట తలపెట్టకూడదని అనుకున్న తనను, అతడి పట్ల ఆకర్షితురాలయ్యేటట్లుగా చేసింది అతడి సత్ప్రవర్తనే.

కానీ... షోడశ కళలతో విరజిల్లే చంద్రుడిలో మచ్చ దాగున్నట్లు, తన కిరణ్లో తనకు తెలియని మరికొన్ని కోణాలున్నాయా!

ఏమో! ఆ ఫోన్ వ్యక్తి చెప్తున్న విషయం వింటుంటే ఉన్నాయనే అనిపిస్తోంది.

అసలు.. కిరణ్ తనకి పరిచయమైన రోజు తలుచుకుంటే...

కిరణ్తో పరిచయం, తామిద్దరూ పెళ్లిపీటల దాకా నడవడానికి దోహదపడిన సంఘటనలూ అన్నీ సలిల మస్తిష్కంపై ప్రత్యక్షమయ్యాయి.

★★★

"అమ్మా... అలా నర్సరీదాకా వెళ్ళొస్తా..." చెప్పులు తొడుక్కుంటూ కేకేసింది సలిల.

దొడ్లో వడియాలు పెడుతున్న వైదేహి " త్వరగా వచ్చేయమ్మా... వెళ్లేటప్పుడు గేటు సరిగ్గా వేసుకు వెళ్లు..." అంది గట్టిగా.

అలాగే..." అంటూ గేట్ తీసుకుని వీధిలోకి వచ్చి మళ్లీ యధాప్రకారం వేసేసి గడియ పెట్టింది సలిల.

హైదరాబాద్ నుండి వచ్చిన దగ్గర్నుండి సలిల ఖాళీగా లేదు. తనకు బాగా పరిచయమున్న వారందరికీ చెప్పింది... తను ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్లో డిప్లొమా చేసి వచ్చినట్లు..

తనకోసారి అవకాశమిచ్చి చూడమని అభ్యర్థించింది. నేర్చుకున్న విద్యకు, సృజనాత్మకత మే ళవించి చక్కగా దుస్తులు కుడుతూ అందరి మన్ననలు పొందసాగింది.

తనకు సహాయంగా ఉండేందుకు ఇద్దరు అమ్మాయిల్ని కూడా నియమించుకుంది.

మానసిక ఉపశాంతికై గార్డెనింగ్ కూడా చేపట్టింది.

సలిల విధి వంచితయై పుట్టింట చేరినా ఆ చంద్రం మామయ్య కళ్లు చల్లబడలేదు.

ఆమె జాతకం మంచిది కాకపోవడం వలననే, ఆమె భర్త మరణించాడని కొత్త ప్రాపకాండా ప్రారంభించాడు.

కొందరి నైజం అంతేనని ఎంతగా సరిపెట్టుకున్నా, అతడి ప్రవర్తన మదిలో ముల్లై గుచ్చుకోసాగింది సలిలకు. అలాంటి ఆవేదన నుండి బయట పడడానికే ఇలాంటి కార్యక్రమాలను ఆశ్రయిస్తోంది.

తోట పని వలన మనశ్శరీరాలు రెండూ ఫ్రెష్ గా ఉంటున్నాయి. ఇతరుల వ్యాఖ్యానాల వలన మనసు కష్టపడినప్పుడు, పచ్చని మొక్కలను పలకరించి వాటి ఆలనా పాలన చూస్తూ గడిపితే, ఎవరో చేయి పెట్టి తీసినట్లుగా మానసిక అశాంతి అంతా పటా పంచలవుతుంది.

అందుకే... సలిల మొక్కలతో సాహచర్యం ప్రారంభించింది.

పెరట్లో ఉన్న కాసింత మట్టి జాగాని శుభ్రం చేయించి సారవంతమైన మట్టి, పశువుల ఎరువు కలిపి వేయించింది. అక్కడ కనకాంబరాలు, మందారాలు నాటింది.

పెద్ద పెద్ద సిమెంట్ కుండీలలో గులాబీలు, చేమంతులు వేసింది.

ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకుని వాటిని సంరక్షించడం వలన అవన్నీ గుబురుగా ఎదిగి చక్కగా పూయనారంభించాయి.

వారి ఇంటికి దగ్గర్లోనే కొత్తగా ఓ నర్సరీ ప్రారంభించారు.

సలిలకు పూలమొక్కల పెంపకం పట్లున్న అభిరుచిని గుర్తించిన ఆ నర్సరీ యజమాని రకరకాల పూలమొక్కలను తెప్పించి ఆమెకందించసాగాడు.

ఆమధ్య ఏదో పని మీద ఒక స్నేహితురాలింటికి వెళ్లినప్పుడు అక్కడ నల్ల గులాబీ మొక్కను చూసింది సలిల. వాళ్ల స్నేహితులు బెంగుళూర్ నుండి తెప్పించి బహుకరించారట దానిని.

అశుభమని తీసిపారేస్తారు గాని నలుపులో ఉన్న ఆకర్షణ మరి దేంట్లోనూ కనిపించదు సలీలకు.

నలుపు వర్ణం శోకానికి చిహ్నంగా వాడడం నుండి శుభకార్యాలప్పుడు గానీ, ఎవరికైనా పెట్టుపోతలు చేయవలసి వచ్చినప్పుడు గానీ దానిని పక్కకు నెడతారు.

శుభసూచకం కాదంటూనే నవవధువుకి నల్లపూసలు వేస్తారు. పసిపాపలకు దిష్టి తగలకుండా అగరుచుక్క పెడతారు. చేతులకి నల్ల గాజులు తొడిగి, మొలకి దిష్టి పూసలు కడతారు.

ఒకే రంగు పట్ల ఈ ద్వైదీభావమేంటో ఆమెకి అర్థం కాదు.

అంతేకాదు... మనిషి సౌందర్యం పెరిగేందుకు దోహదపడే కురులను ఎప్పటికీ నల్లగా ఉంచుకోవాలనే తాపత్రయపడడం సహజం.

ఇప్పుడంటే ఫ్యాషన్ వెర్రితలలు వేసి తలవెంట్రుకలకు వివిధ వర్ణాలు పులిమి ఆనందిస్తున్నారు గానీ, నీలాల కురులు మనిషి వదనానికి ఎంత ఆకర్షణను పెంచుతుందో ఎవరూ ఎరుగనిది కదా.

అలాంటి నలుపు రంగులో ముద్దగా విరిసిన గులాబీని చూసి సలిల హృదయం పులకించిపోయింది.

వెంటనే ఆ నర్సరీ యజమానిని కలసి తనకూ ఓ నల్లగులాబీ మొక్కను తెప్పించమని కోరింది.

తప్పకుండా తెప్పించుతానని హామీ ఇచ్చాడు అతడు.

అన్నట్లుగానే దానిని తెప్పించి, ఈ రోజు వచ్చి కలెక్ట్ చేసుకొమ్మని ఫోన్ చేసి చెప్పాడు.

నర్సరీ దగ్గరకు వెళ్లిన సలిల, యజమాని చెప్పిన సమాధానానికి విస్తుపోయింది, నిరాశ చెందింది.

“సారీ అమ్మా! మీకోసమనే దానిని స్పెషల్గా తెప్పించాను. వేరే ఎవరడిగినా ఇవ్వకూడదనుకున్నాను. కానీ..." నసుగుతూ చెప్పాడు అతను.

"కానీ..." ఆదుర్దాగా అడిగింది సలీల.. .

" ఇప్పుడే... ఒకాయన వచ్చి దాన్ని తీసుకెళ్లిపో యారు..." చేతులు నలుముకున్నాడతడు..

' ' అలా ఎలా ఇచ్చేశారండీ... నేను అడ్వాన్స్ కూడా పే చేశాను కదా!" కాస్త కోపంగా అడిగింది సలిల,

' నిజమేనమ్మా... చెప్తున్నానుగా, ప్రత్యేకించి మీ కోసమే తెప్పించానని... కాని అతడు ఎవరికో గిఫ్టా ఇవ్వాలి, అర్జెంటుగా ప్రాధేయపడితే ఇచ్చేయాల్సి వచ్చింది... మీకు మళ్లీ తెప్పించి ఇస్తాగా..." ఆమెను చల్లబరచాలని చూశాడు అతడు.

సలిల కోపమంతా ఆ మహానుభావుడి వైపే మళ్లింది. "ఆయన ఎవడో గానీ తను ముచ్చటపడి తెప్పించుకున్న మొక్కను తన్నుకుపోయాడు గద్ద లాగా..." అనుకుంది ఉక్రోషంగా.

“సాధ్యమైనంత తొందర్లోనే మరొక మొక్క తెప్పించి, నాకు మాత్రమే ఇయ్యండి..." విసురుగా అనేసి బయటపడింది సలీల.

ఆమె మనసు చిరాగ్గా మారింది. ఆశించనిది అందకపోతే, ఎదురైన ఆశాభంగం ఎలా ఉంటుందో అనుభవంలోకి వచ్చింది. నిరాశగా నడుచుకుంటూ ఇవతలకీ వస్తూంటే "ఎక్స్క్యూజ్మీ మిస్...' పిలిచాడు ఓ యువకుడు.

అతడు సన్నగా, ఎర్రగా, పొడుగ్గా ఉన్నాడు. క్లీన్ షేవ్ చేసుకుని చాలా హ్యాండ్ సమ్గా కూడా ఉన్నాడు.

అతడు తనని పలకరించగానే సలిల ఆశ్చర్యపోయింది.

ఎవరో తెలియని వ్యక్తి తనను పలకరించడం వలన ఏర్పడిన విస్మయం కాదది. తను కావాలని కోరుకున్న 'నల్లగులాబీ మొక్క అతడి చేతిలో ఉన్నందుకు కలిగినది.

“ మీరూ..." అసహనంగా అడిగింది.

“ మీరు మనసు పడి స్వంతం చేసుకోవాలని అనుకున్న ఈ మొక్కని గద్దలా తన్నుకుపోయినవాడినీ..." నవ్వుతూ చెప్పాడతడు..

మైగాడ్... తను మనసులో అనుకున్న మాటలు ఇతడికెలా తెలిశాయి? ఇతగాడికి మనసుల్ని చదివే విద్య వచ్చునా ఏం?

"సారీ అండీ... మిమ్మల్ని డిస్సపాయింట్ చేశాను. మీకు కాకుండా, నేను దీన్ని తీసుకెళ్లిన పర్పస్ నేరవేరలేదు..." చెప్పాడతడు విచారంగా.

" ఏమైంది?" అప్రయత్నంగా అడిగింది సలిల.

ఈ రోజు నా ఫ్రెండ్ చెల్లెలి బర్త్డే... ఆమెకెంతో ఇష్టమైన మొక్కనొకదాన్ని కొని ప్రెజెంట్ చేద్దామనీ షాప్ ఓనర్ గడ్డం పుచ్చుకు బ్రతిమిలాడీ మరీ తీసుకున్నాను... కాని... ఈ రోజు ఉద యమే ఆమెకు చిన్న యాక్సిడెంట్ జరిగి హాస్పిటల్లో ఉందని తెలిసింది. నలుపు అశుభమని అందుకే అంటారేమో... ఆ సెంటిమెంట్తోనే దీన్ని తిరిగిచ్చేద్దామని వచ్చాను..." కారణం వివరించాడతడు.

బాగా చదువుకున్నవారిలా కనిపిస్తున్నారు. ఈ రోజుల్లో కూడా ఇలాంటివి నమ్ముతున్నారా? విచిత్రంగా చూసింది సలిల.

"ఎంతగా చదువుకున్నా, అంతరి.క్షంలోకి ఎగిరినా తన చుట్టూ అల్లుకుపోయిన మూఢ విశ్వాసాలు ఇనుప వలలను ఛేదించుకుని బయట పడలేకపోతున్నాడు సగటు మానవుడు... దానికి నేనూ మినహాయింపేమీ కాదు..." అతడి ముఖం కాస్త వాడింది.

"సారీ... మీ నమ్మకాలను దెబ్బతీసినట్లున్నాను... రియల్లీ అయాం వెరీ వెరీ సారీ... మీరేమీ అనుకోకుంటే దీన్ని నాకిచ్చేయగలరా!" నొచ్చుకుంటూనే అడిగింది సలిల.

"ఫరవాలేదులెండి... దీన్ని మీ కోసమనే తెప్పించాడీ నర్సరీ ఓనర్... ఇది మీకే చెందాలని రాసి పెట్టినట్లుంది... తీసుకోండి..." మొక్కను ఆమె చేతికందించాడు అతడు.

"థాంక్స్..." బ్యాగ్ తెరిచింది సలిల డబ్బులివ్వడానికిగాను..

" ఫరవాలేదు ఉంచండి. దీన్ని నా కానుకగా స్వీకరించండి" అన్నాడు అతడు ఆమెను వారిస్తూ.

సలిల వదనం ఎర్రబడింది. "అపరిచితుల దగ్గర కానుకలు తీసుకునే అలవాటు లేదు నాకు" అంది నోట్లు బయటకు తీస్తూ.

"సారీ.. మీక్కోపం వచ్చిందనుకుంటాను. దీని ఖరీదు అక్షరాలా అరవై రూపాయలు. తక్షణం చెల్లించండి మరి. ఇప్పుడు కలిగిన ఈ పరిచయాన్ని పురస్కరించుకొని ఎప్పుడైనా ఎదురైతే పలకరించండి. అంతే చాలు" తమాషాగా అంటూ చేతులు ముందుకు చాచాడతడు.

సలిల నవ్వింది చిన్నగా, అందంగా విచ్చుకున్న అరుణాధరాల వైపు ఆరాధనగా చూశాడతడు.

“మనమిద్దరం మళ్లీ కలుసుకోవాలని రాసుంటే తప్పక కలుస్తాం. వన్సెగెన్ థాంక్యూ వెరీమచ్" హుందాగా పలికింది సలిల.

"బైదివే నా పేరు కిరణ్. మీ పేరు... వద్దు లెండి. అపరిచితులకు పేరు చెప్పే అలవాటు లేదంటారు.. అంతేనా" అన్నాడతడు అల్లరిగా.

"ముమ్మాటికీ అంతే. అయినా తొలి పరిచయంలోనే అమ్మాయిల వివరాలు సంపాదించాలన్న ఆత్రం దేనికి మీకు? మరొక్కసారి మనం కలుసుకోవడం తటస్థపడితే అప్పుడు చెప్తాను" సున్నితంగా అయినా సూటిగా చెప్పింది సలిల...

“ఇట్స్ ఓ.కే. దయామయుడైన ఆ దేవుడు .. మరొకసారి మిమ్మల్ని మీట్ అయ్యే చాన్స్ నాక్కల్పించకపోడు. గుడ్ బై" అంటూ ముందుకు సాగిపోయాడతడు.

అతడు వెళ్తున్న వైపే చూస్తూ నిలబడిపోయిన సలిలకు అప్పుడు స్ఫురించింది తను అవసరానికి మించి అతడితో మాట్లాడిందని.

'ఛ..ఛ.. ఏమైందీ రోజు తనకి' అప్పుడు ఆమె తెలుసుకోలేకపోయింది హృదయం. తనుండాల్సిన స్థానం నుండి మాయమైందని.

★★★

'జై సాయిరాం' సాయిమందిరంలోకి ప్రవేశిస్తూ గడపను కళ్లకద్దుకొని మనసులోనే స్మరించుకుంది సలిల..

గుళ్లోకి వెళ్లి, అది హారతి సమయం కావడంతో హారతి స్తోత్రాలను శ్రావ్యంగా ఆలపిస్తున్న భక్తుల సరసన నిలబడింది ఎనలేని భక్తి ప్రపత్తులతో.

హారతి ముగిశాక పూజారిచ్చిన విభూదిని మెడకి రాసుకొని, చిటికెడు నోట్లో వేసుకుంది.

మరొకమారు సాయినాథుని దివ్యమంగళ విగ్రహానికి నమస్కరించి ధుని చుట్టూ ప్రదక్షిణలు చేయనారంభించింది.

ముమ్మారు తిరిగాక గుడి ఆవరణలోకి వచ్చి అక్కడున్న చల్లిమీద కూర్చుంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. సాయి భగవానుని నామస్మరణంతో గుడి

మారుమ్రోగిపోతోంది.

''హలో.. మిస్..'' ఎవరిదో పలకరింపు వినబడి తలెత్తి చూసింది సలిల.

ఎదురుగా కిరణ్.

" మీరు.. ఇక్కడ..? ''

"ఏం? గుడికి మీరొక్కరే వస్తారనుకున్నారా లేక గుడి మీ తాతగారి జాగీరా. మాకూ ప్రవేశార్హత ఉందండీ'' అన్నాడు కిరణ్ నవ్వుతూ.

" అహ.. నా ఉద్దేశ్యం అది కాదు'' తడబడింది సలిల.

''ఊరికే.. జస్ట్ జోకింగ్ అంతే. నేనానాడే చెప్పాను చూశారా! ఆ దేవుడు దయామయుడని. మరొక్కసారి మీ దర్శన భాగ్యం కలిగింది నాకు. థాంక్యూ దేవుడా'' గుడి లోపలికి తొంగి చూస్తూ అరిచాడు కిరణ్.

మొహమాటంగా నవ్వింది సలిల. ఆమెకు తెలియని వారితో సన్నిహితంగా మాట్లాడే అలవాటు లేదు. అలాగని ఇతడితో మాట్లాడకుండా ఉండలేకపోతోంది. " మీకు నాతో పరిచయం పెంచుకోవాలన్న ఆసక్తి దేనికి?'' అని అతడిని నిలదీయలేకపోతోంది.

' ' మీరు సాయిభక్తులా'' ఏదో ఒకటి మాట్లాడాలి కదాని అడిగింది.

''కాబట్టేగా ఇక్కడ ప్రత్యక్షమైందీ'' నవ్వాడు కిరణ్.

''ఆ... అన్నట్లు మరిచిపోయాను మనం మళ్లీ కలుసుకోవడమంటూ జరిగితే మీ పేరు చెప్తానన్నారుగా'' గుర్తు చేశాడు కిరణ్.

"చెప్తాను కానీ పూర్తిగా కాదు.. కొన్ని క్లూలిస్తాను. మీరే కనుక్కోవాల్సి ఉంటుంది" ఆమెలో ఇందాకటి జంకుపోయి స్వేచ్ఛగా మాట్లాడగలుతోంది.

"చచ్చాం పొండి. ఇదొక ఫిట్టింగ్ పెట్టారూ. అయినా మీ పేరు చెప్పడానికింత సంకోచిస్తారేం? మీ కళ్లకి నేను రోడ్సైడ్ రోమియోలాగా కనిపిస్తున్నానా!" అడిగాడు కిరణ్ చిరుకోపం నటిస్తూ.

" అలా ఎందుకనుకుంటారు? జస్ట్... మీ మెదడుకి మేత పెట్టడానికి అనుకోవచ్చు కదా. పజిల్స్ సాల్వ్ చేస్తే బ్రెయిన్ మరింత షార్ప్ గా తయారవుతుంది తెలుసా?" అతడి అవస్థకు ముసిముసిగా నవ్వింది సలిల.

"సరే.. ఆ క్లూలేవో విసరండి!"

" నీటికి పర్యాయ పదమే నా పేరు. కాస్త జాగ్రత్తగా ఆలోచిస్తే తెలిసిపోతుంది"

" నీటికి పర్యాయపదమా. కొంపదీసి మీరు తెలుగుమాస్టారి కూతురు కారు కదా!" భయం నటిస్తూ అన్నాడు కిరణ్.

" ఏం? మీకెందుకొచ్చిందా అనుమానం?" సలిల అడిగింది సందేహంగా.

" ఏం లేదు. పర్యాయపదాలు, నానార్థాలు అడుగుతూంటేను" ఫక్కున నవ్వింది సలిల. కిరణ్ ముగ్ధుడై చూశాడు. "అలాంటిదేం లేదు గాని సత్తా ఉంటే నా పేరు కనుక్కోండి" ఛాలెంజ్ విసిరింది.

" నీటికి పర్యాయపదాలంటే.. జలం,నీరం, వారి, ఉదకం, తోయం... కాని ఇవేమీ పెట్టుకోదగినవిలా లేవే. పోనీ వీటికి 'జ' లాంటివేమన్నా చేర్చమన్నారా?" సందేహంగా అడిగాడు కిరణ్..

" అవసరం లేదు. ఆ పర్యాయపదంలోని ఆఖరునున్న సున్న తీసేస్తే అదే నా పేరు చాలా సులభంగా కనుక్కోవచ్చు. ప్రయత్నించండి" సలిల అంది చిరునవ్వుతో.

" ఏంటబ్బా" చూపుడు వేలితో చుబుకం మీద తట్టుకుంటూ దీర్ఘాలోచనలో పడ్డాడు కిరణ్

అలా యోచించగా చించగా అతడికి స్ఫురించింది.. ఆమె పేరేంటో. విజయగర్వంతో చిన్నగా నవ్వుకుంటూ.. ''ఆ... ఐ గాట్ ఇట్...సలీల.. అదే.. అదే మీ పేరు'' అన్నాడు సంతోషంగా. కొలంబస్ అమెరికా కనుక్కున్నప్పుడు కూడా అంత సంబరపడి ఉండడు...

" ఫరవాలేదే. మీ తెలుగు నాలెడ్జ్ బాగానే ఉంది. ఇంతకీ మీరేం చేస్తున్నట్లో. కొంపదీసి తెలుగు మాస్టారు కాదు కదా!" అంది పెదవి అంచున నవ్వును అదిమి పెడుతూ.

'' అబ్బ... దెబ్బ కొట్టారండీ. మనకంత సీన్ లేదులెండి. నేను ఎమ్మెస్సీ ప్యాసయ్యాను. స్థానికంగానే ఉన్న సిద్దార్థ జూనియర్ కాలేజీలో మ్యాథ్స్ లెక్చరర్ గా పనిచేస్తున్నాను. తెలుగుభాష అన్నా, సాహిత్యమన్నా ఎనలేని మక్కువ. ఇళయరాజా సంగీతమంటే ప్రాణం. ఎత్తు ఆరడుగుల రెండంగుళాలు, బరువు ఎనభై కేజీలు, పుట్టుమచ్చలు శరీరంలో అనేక చోట్ల ఉన్నాయి. కానీ సర్టిఫికెట్స్లో మాత్రం కుడి బుగ్గ మీద ఉన్న పెసరబద్దంత పుట్టు మచ్చనీ, ఎడమ భుజంమీద సెనగబద్దంత పుట్టుమచ్చనీ మెన్షన్ చేశాను. ప్రస్తుతానికి ఒంటరివాడిని... వీరాంజనేయుడి భక్తుడినీ'' ఇంకా ఏదో చెప్పబోతున్న అతడిని వారించింది సలిల కంగారుగా.

'స్టాప్..స్టాప్.. మాటవరసకి తెలుగు మాస్టారా అని అడిగిన పాపానికి ఇలా ఈ సోదంతా వినిపిస్తున్నారేంటి? అసలు మీ బయోడేటా అంతా నాకెందుకు చెప్తున్నట్లు?'' అతడి ధోరణికి నవ్వకుండా ఉండలేకపోయింది సలిల..

''నా గురించి తెలుసుకోవాలని ఆరాటపడిన వారికి నా ఆటోబయోగ్రఫీ అంతా వివరించడం నాకలవాటు'' అమాయకంగా చెప్పాడు కిరణ్.

చంపారు పొండి. గొప్ప అలవాటే ఎదుటి వ్యక్తిని చంపుకుతినే ఈ వింత అలవాటేంటి మీకూ గలగల నవ్వింది సలిల.

చాలా రోజుల తరువాత సర్వం మరచి పసిపాపలా నవ్వింది ఆమె. అదీ ఓ పురుషుడి సమక్షంలో.

"మీరు నవ్వుతూంటే చాలా బాగున్నారు"

అద్మయిరింగ్గా ఆమెనే చూస్తూ అన్నాడు కిరణ్.

అంతే... నవ్వుతున్న సలిల ముఖం గంభీరంగా మారిపోయిందొక్కసారిగా,

“ఛ… తనేంటి? ఇంతలా విరగబడి నవ్వింది.. తన గురించి అతడేమనుకుంటాడు?” తనను తానే నిందించుకుంది.

" అలా అన్నందుకు నవ్వడం ఆపేస్తారనుకోలేదు.. అయాం సారీ. ఈసారి నవ్వినప్పుడు ఏ కామెంట్ చేయను. సరేనా" హాస్యంగా అన్నాడు కిరణ్.

ముఖంలోని కండరాల కదలికల ద్వారా ఏర్పడే నవ్వును నివారించడం సలిలకు సాధ్యం కాలేదీసారి.

"చూడండి సలిల గారూ.. సృష్టిలో ఉన్న సమస్త జీవరాశులలోనూ ఒక్క మనిషికి మాత్రమే

నవ్వగలిగే అదృష్టం, అవకాశం ఉన్నాయి. దాన్ని అణచి పెట్టి ఉంచాలనుకోవడం మహాప్రమాదకరం. హాయిగా… మల్లెలు విరిసినంత స్వచ్ఛంగా నవ్వే మీరు ఎప్పుడూ కూడా దాన్ని ఆపాలని ప్రయత్నించకండి" సిన్సియర్గా చెప్పాడు కిరణ్.

సాలోచనగా తల వంచింది సలిల. కూర్చున్న చోటు నుండి లేచి నిలబడుతూ "వస్తాను కిరణ్ గారూ. నేనింకా రాలేదేమని అమ్మ-నాన్న ఎదురుచూస్తుంటారు" అంది.

"నా బైక్ మీద డ్రాప్ చేయనా?” అడిగాడు కిరణ్ చొరవగా.

“నో థాంక్స్. మా ఇల్లు దగ్గరే. నడచి వెళ్లగలను" సున్నితంగా తిరస్క రించి గుడిలోంచి బయటపడింది సలిల.

తన తలపులలో నెలవేర్పరచుకున్న కిరణ్ ని మాత్రం బయటకు నెట్టేయలేకపోతోంది.

పునర్వివాహం చేసుకొమ్మని అన్న-వదినేలెంతగా చెప్పినా చలించని ఆమె మనసులో తొలిసారిగా ఏదో కలవరం మొదలైంది.

★★★

కిరణ్, సలిలల పరిచయం దినదిన ప్రవర్ధమానమవుతుంది. నానాటికీ.

ఆమె ఆహ్వానం మేరకు రెండు మూడు సార్లు ఇంటికి కూడా వచ్చాడతడు.

సంస్కారపూరితమైన ఆతని ప్రవర్తనకు ముగ్ధులయ్యారు రాఘవరావు దంపతులు. చక్కటి మాట తీరుతో, మర్యాద మన్నన కలబోసిన నడవడికతో వారిని ఆకట్టుకున్నాడు కిరణ్.

మాటల సందర్భంలో ఓసారి వైదేహి అంది. అబ్బాయి బుద్ధిమంతుడిలా ఉన్నాడు. చక్కగా చదువుకొని మంచి ఉద్యోగం చేస్తున్నాడు. నాకెందుకో మన సలిల గురించి అడగాలనిపిస్తుంది. అబ్బాయితో ఓసారి కదిపి చూస్తే ఆగిపోయింది వాక్యం పూర్తి చేయలేక.

" నీ ఉద్దేశ్యం మంచిదే. కానీ సలిల మనసులో ఏముందో మనకు తెలియదు. వారిద్దరి మధ్యనా ఉన్నది అభిరుచులొకటైన స్నేహమేనా లేక మరింకేమైనానా అన్న విషయం బయటపడేవరకు మనం మౌనం వహించడం మంచిది'' అన్నాడు రాఘవ రావు నిట్టూరుస్తూ,

"అవునవును అంతే. ఆమధ్య చిన్నాడూ ఇదే అన్నాడు సరిగ్గా'' అంది వైదేహి.

వీరి సంభాషణను విన్న సలిల మదిలో ఏదో అలజడి బయలుదేరింది.

తామిద్దరీ మధ్యన ఉన్నది కేవలం స్నేహమేనా లేక దానికి అతీతమైన భావన వేరేదన్నా ఉందా? ఎందుకో తెలియదు... కిరణ్ తన సమక్షంలో ఉంటే మనసుకెంతో హాయిగా, ప్రశాంతంగా అనిపిస్తుంది. హృదయం అనుక్షణమూ అతడి సాన్నీధ్యాన్ని ఆకాంక్షిస్తూ ఉంటుంది.

వివేకం.. అది తప్పని హెచ్చరిస్తూ ఉంటుంది. అతడి మనసులో మాట తెలుసుకోకుండా తను అలాంటి ఆశలు పెంచుకోవడం అవివేకమనిపిస్తుంది. ఆమధ్య మాటల సందర్భంలో సలిల తన గతాన్ని గురించి చెప్పింది అతడికి.

తరచూ అతడు తనని 'మిస్ సలిల' అని సంబోధించడం విని తప్పు చేసిన దానిలా తల్లడిల్లుతూ చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది.

''నన్ను 'మిస్' అని పదేపదే పిలవకండి కిరణ్ గారూ. నేను 'నూరేళ్ల పంట' ను 'మిస్సయిన మిస్సెస్ ని' మ్లానమైన వదనంతో చెప్పింది.

అప్పుడు కిరణ్ వదనంలో కనబడిన దిగ్భ్రాంతి తనీనాటికీ మరచిపోలేకపోతోంది. అనుకోని ' ఆశని పాతం' సంభవించినప్పుడు కలిగే షాక్ లాంటి ఫీలింగ్ కనబడింది అతడిలో.

తీరని ఆవేదనతో కణతలు రాసుకుండిపోయాడు కాసేపు.

"అయాం సారీ సలిలగారూ. ఇన్నాళ్లూ ఆ దేవుడు కరుణామయుడని భావించేవాడిని. కానీ విశాలమైన ఆకాశం లాంటీ మీ నుదుటికి అంతు లేని అందాన్నిచ్చే కుంకుమను నిర్ధయగా తుడిశాడంటే మాత్రం నమ్మలేకపోతున్నాను. రియల్లీ అయాం వెరీ సారీ.వెరీ సారీ" అనుకుంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

ఆ వెళ్లిపోవడం... పోవడం నేటికీ కనబడలేదు. తను విధవ అని తెలియగానే ముఖం చాటేశాడు. తన పురుష ప్రవృత్తిని చాటి చెప్పాడు. సాధారణంగా అనాఘ్రాత కుసుమం లాంటి అమ్మాయే భార్య కావాలని ఆశిస్తారు మగవారు. అలాంటి నైజం నుండి ఇతడికీ మినహాయింపు లేదు కాబోలు.

మూడుముళు పడ్డాయన్నమాటేగానీ... భర్తతో ఏ ముద్దు-ముచ్చట్లకి నోచుకోని తను నిజంగా అనాఘ్రాత కుసునుమే,

తనూహించినట్లుగా కిరణ్ నవీన ఆదర్శాలు కలిగిన యువకుడు కానందుకు బాధపడింది సలీల.

"ఏమ్మా సలిలా.. కిరణ్ ఈమధ్యన రావడం మానేశాడు" ఆత్మీయంగా అడిగిన కన్న తండ్రితో

"ఏమో నాన్నా... అతడికెన్నో పనులుం టాయి. తరుచుగా రావడం కుదరదు. అయినా అస్తమానం అతడు మనింటికి రావడం కూడా అంత మంచిది కాదు" నిర్లిప్తంగా చెప్పింది సలిల.

"ఆ.. అవునవును. అదీ నిజమే" సమర్ధంచింది వైదేహి, అక్కడితో మాటలు తుంచేసి గదిలోకి వెళ్లి పోయిన సలిలు ఆలోచనల నిండా కిరణే చోటుచేసుకున్నాడు.

తనకి తెలియకుండానే అతడి మీద ఆశలు పెంచుకుంటోంది. ఆనాడు అన్నయ్య, నీరజ ఎంతగా సర్దిచెప్పినా మనసు చలించలేదు.. కాని ఈ రోజు మాత్రం ఎంతగా వద్దనుకున్నా కిరణ్ వైపే పరుగులు తీస్తోంది పిచ్చి మనసు. తన ప్రమేయం లేకుండానే వాయువేగంతో అతడి వైపు ఆకర్షితమవుతున్న ఈ మూగమనసుని నియంత్రించేదెలా?

అంతులేని సంఘర్షణకు అనుభనించిన సలిల ఆ రాత్రి తెల్లవారే వరకు ఆలోచనల్లో మునిగి తేలుతూనే ఉంది.

★ ★ ★

కార్తీకమాసం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన 'శ్రీరామతీర్థం' భక్తజన సందోహం సందడిగా ఉంది.

చుట్టుపక్కల ఉన్న చారిత్రక విశేషాల్నీ చూసేందుకు వచ్చిన పర్యాటకులు కూడా ఈమధ్య ఎక్కువవ్వడంతో వాహనాలన్నీ కిటకిటలాడుతున్నాయి.

ఆటో దిగి, కొబ్బరికాయ తదితర పూజా సామాగ్రిని కొనుగోలు చేసిన మీదట ఆలయం వెనక వైపున్న పుష్కరిణిలో కాళ్ళు చేతులు కడుక్కొని గుడిలోకి ప్రవేశించారు రాఘవరావు కుటుంబసభ్యులు.

గుడి ఆవరణంతా రద్దీగా ఉంది. క్యూ చూస్తే కొండవీటి చాంతాడంత పెద్దది ఉంది. స్వామివారిని దర్శించుకోవాలన్న ఆతృతతో ఒకరినొకరు తోసుకోసాగారు క్యూలో నిలబడిన భక్తులు.

"ఇంత రష్ గా ఉన్నప్పుడు రాకపోతేనేమమ్మా... ఖాళీగా ఉన్నప్పుడు రావలసింది' ఆ తోపులాట భరించలేని సలిల అందీ చిరాగ్గా.

వైదేహి ఆ చెంప ఈ చెంప టపటప వాయించుకుంటూ "అపచారం, అపచారం. ఇవాళ కార్తీక శుద్ధ ఏకాదశి. అంటే పెద్ద ఏకాదశి అన్నమాట. ఇలాంటి పర్వదిన సమయాల్లో ఇలా పుణ్యక్షేత్ర సందర్శన చేస్తే మనం తెలిసి తెలియక చేసిన పాపాలన్నీ పోతాయంటారు పెద్దలు" ఎవరి ద్వారానో విన్న విషయాల్ని ఏకరువు పెట్టింది. "పాపాలు పోవడం మాట ఏమోగాని ఈ క్యూలో కాస్సేపు నిలబడితే ఊపిరాడక ప్రాణాలు పోవడం ఖాయం" గొణుక్కుంది సలిల.

ఆమెకు ఇలాంటి ఉత్సవాల సమయంలో ఆలయాలకి వెళ్లడం అంత ఇష్టముండదు. ప్రసన్న దృక్కులతో భక్తులను చల్లగా చూసే ఆ పరమాత్ముని దర్శనం కాస్త ప్రశాంత వాతావరణంలోనే చేసుకుంటే బాగుండునన్న అభిప్రాయం ఆమెది.

కాని... తల్లి బలవంతం మీద ఇవాళ ఇలా రాక తప్పలేదు.

గుడిలో శ్రీరామచంద్రుని దర్శనం, ప్రసాద స్వీకరణ ఇత్యాదులన్నీ పూర్తవ్వడానికి రెండు గంటల సమయం పట్టింది. ... బయటకొచ్చిన సలిల దృష్టి, కనుచూపు దూరంలో కనిపిస్తున్న బోడికొండపై పడింది.

ఏనుగు ఆకారంలో నిగనిగ మెరిసే ఆ రాతి కొండ ఓ అద్భుతమైతే, ఏటవాలుగా అడుగేస్తే జారిపోయేటట్లున్న దానిపై ఆలయ నిర్మాణం మరొక అద్భుతం.

ఆలయంలోని సిబ్బందినడిగి ఆ కొండ గురించి తెలుసుకుంది సలిల. .. దాన్ని నీలాచలమంటారని దానిపై వెలసిన ఆ దేవాలయంలో సీతారాములు కొలువై ఉంటారని చెప్పాడతడు.

అంతే కాదు... అక్కడ వారికి సంబంధించిన చిహ్నాలు మాత్రమే కాకుండా, పాండవులకు కూడా సంబంధించినవి ఉన్నాయని వివరించాడు.

" అమ్మా.. కొండ ఎక్కుదామా?" ఉత్సాహంగా అడిగింది సలిల.

" అమ్మో ఆ కొండా! నా వల్ల కాదు బాబూ. ఏటవాలుగా ఉన్నదాన్ని ఎక్కడం మహా కష్టం. ఏమాత్రం కాలు జారినా కపాలమోక్షం అవుతుంది. పైగా నాకీ కాళ్లనొప్పుల సంకటం ఒకటి. నేను రాలేను తల్లీ" ఉస్సురనీ నిట్టూర్చింది వైదేహి.

రాఘవరావూ అదే అభిప్రాయం వెలిబుచ్చాడు.

"ఛ.. ఇప్పుడెలా? ఒక్కర్తినీ వెళ్లేందుకు భయం వేస్తుంది" తనలో తనే అనుకుంటున్నట్లుగా పైకే అంది సలిల. " మీకాభయం అక్కరలేదు మేడమ్. రోజూ వందలాది మంది యాత్రికులు కొండ ఎక్కుతూనే ఉంటారు. అదిగో చూడండి" అంటూ చూపించాడు ఆలయం తాలూకు నైట్ వాచ్ మెన్.

తలెత్తి మీదికి చూసింది సలిల. అతడు చెప్పినది నిజమే. అక్కడక్కడ గుంపులు గుంపులుగా నడచిపోతున్నారు జనం. అయినా సరే ఒక్కర్తీ వెళదామంటే బోర్. వెళ్ళాలన్న తపన ఉన్నా ఏదో తెలియని సందేహాలు వెంటాడాయి సలిలను.

" మీకు దగ్గరుండి కొండంతా తిప్పి చూపించడానికి ఇక్కడో అమ్మాయి ఉందమ్మా. మిమ్మల్ని క్షేమంగా తీసుకెళ్లి తిరిగి తీసుకొస్తుంది" చెప్పాడు అతడు మళ్లీ.

'ఈ ఐడియా ఏదో బాగున్నట్లుంది' అనుకొని .

"సరే ఆ అమ్మాయి ఎవరో రమ్మనండి" అంది సలిల..

"కాసేపు కూర్చోండి మేడమ్..ఎవరినో తీసుకొని వెళ్లినట్లుంది. ఓ పావు గంటలో వచ్చేస్తుంది!" కుర్చీ చూపించాడు అతడు..

పావుగంట కాదుగానీ అరగంట నిరీక్షణ అనంతరం వచ్చిందీ రాములమ్మ అనబడే ఆ అమ్మాయి. చింపిరి జుట్టు, మాసిన బట్టలు, పిచ్చి చూపులు... ఇదీ ఆమె వాలకం.

సలిలకు బెదురు పుట్టింది. 'ఈ శార్దీనా! తనకు కొండంతా తిప్పి చూపించేది! గొప్ప గైడే దొరికింది' అనుకుంది అసహనంగా, ఆమె సంశయాన్ని కనిపెట్టిన వాడల్లా అన్నాడతడు "మరే భయం లేదమ్మా. చూపులకట్లా ఉంటుంది గానీ, అమ్మాయి మహా మంచిది. మిమ్మల్ని జాగ్రత్తగా తిప్పి తీసుకొస్తుంది.

ఆ హామీతో ఊరడిల్లింది సలీల. "వెళ్లిరా తల్లీ. నువ్వొచ్చేవరకు మేమీ గుడిలోనే కృష్ణా రామా అనుకుంటూ కూర్చుంటాం" అన్నాడు రాఘవరావు.

"అలాగే నాన్నా. వేగంగానే వచ్చేస్తాను" చెప్పేసీ ఆ అమ్మాయి వెనుక బయలుదేరింది సలిల.

నెమ్మదిగా ఆ పల్లె వీధుల్లో నడుచుకొని కొండ మొదలుకి చేరారు వాళ్లు.

ఏటవాలుగా, జారుగా ఉన్న ఆ కొండ చూస్తే తాను ఎక్కగలదో లేదోనన్న శంక కలిగింది సలిలకు.

"పరవానేదు ఎక్కండమ్మా. నేనుండగా అభయం ఇచ్చింది రాములమ్మ,

" మీకభ్యంతరం లేకపోతే నేనూ ఉన్నాను. నాతో నడుస్తారా" సుపరిచితమైన స్వరం విని వెను తిరిగి చూసిన సలిల తన కళ్లను తనే నమ్మలేకపోయింది.

ఆమె వెనుగ్గా నవ్వు ముఖంతో నిలబడిన కిరణ్ కనిపించాడు.

' మీరు...' పట్టలేని ఆనందాశ్చర్యాలు కలిగాయి సలిలకు ఏక కాలంలో.

"అవును నేనే. నన్ను కిరణ్ అంటారు. సిద్దార్థ జూనియర్ కాలేజ్లో మ్యాథ్ లెక్చరర్గా పనిచేస్తున్నాను. ఎత్తు ఆరడుగుల రెండంగుళాలు"

"స్టాప్ స్టాప్... ఆటో బయోగ్రఫీ వద్దు బాబూ" హడలెత్తిపోయినట్లుగా ఆపేసింది సలిల.

"అమ్మయ్య గుర్తుపట్టారన్నమాట" నవ్వాడు కిరణ్.

“జోక్లు చాల్లెండి. ఏమైపోయారన్నాళ్లూ' చనువుగా అడిగింది సలిల.

ఆమె మనసు అతడిని చూసిన వెంటనే కారు మొయిలీని చూసి నర్తించిన వనమయూరమల్లే పురివిప్పి నర్తించింది.

" ఏమండీ... తీవ్రవాదుల్లో కాని కలిసిపోయాననుకున్నారేంటి కొంపదీసి.

" మీరు తీవ్రవాదుల్లో కలిస్తే మీ సంగతేమో కానీ వారి పని తా" అంది సలిల నవ్వుతూ.

“అదేంటి సలిలాజీ అంత మాట అనేశారు?" అలిగినట్లుగా అన్నాడు కిరణ్.

"రోజూ మీ ఆటో బయోగ్రఫీ వినిపించి వారి మెదళ్లు తినేస్తారుగా”

భుజాలు కదిలేలా విరగబడి నవ్వాడు కిరణ్. ఆ కొండరాళ్లల్లో అతడి హాస్యధ్వని అలలు అలలుగా ప్రతిధ్వనించింది.

"ఇంతకీ నానుండాలా? ఎల్లాలా?" అసహనంగా అడిగింది రాములమ్మ వీళ్లు తనని గమనించకపోవడం చూసి. "ఈవిడెవరు?" అడిగాడు కిరణ్.

“లోకల్ గైడ్. ప్రస్తుతానికి మనకు దారి చూపే దేవత ఈమే” చెప్పింది సలీల.

"అలాగా.. రామ్మా..రా.. నువ్వు ముందు నడుస్తూ విశేషాలు చెప్పు" అన్నాడు కిరణ్.

ప్రసన్న వదనంతో అతడిని చూసి ముందుకు దారి తీసింది రాములమ్మ.

" అది సరే గాని.. ఇన్నాళ్లు ఎక్కడికి వెళ్లారు?" అడిగింది సలిల.

“చాలా అర్జెంటు పని మీద బెంగళూర్ వెళ్లాను. మీకు ఇన్ఫామ్ చేసేందుకు కూడా వీల్లేకపోయింది. సారీ." చెప్పాడు కిరణ్.

" ఐసీ" పెదవి కొరుక్కుంది సలిల.

కబుర్లు చెప్పుకుంటూ కలసి నడుస్తూ ఉంటే అలుపన్నది తెలియడం లేదిద్దరికీ. కొంత దూరం నడిచేసరికి కొండ యాంగిల్ మారింది. నిలువుగా, నిచ్చెన మెట్లలా ఉన్న ఆ కొద్దిపాటి దూరాన్ని అధిరోహిస్తుంటే గుండెల్లో దడ మొదలైందిద్దరికీ..

"జాగరతమ్మా... ఈడే కూత్త కట్టంగా ఉంటాది" హెచ్చరించింది రాములమ్మ

నెమ్మదిగా ఆ దూరాన్ని దాటేసి, మళ్లీ మామూలు నడక ప్రారంభించారు. కొండమీదున్న గుడిలోకెళ్లి స్వామిని సేవించుకొని ఆలయం బయటున్న నీటి గుండాన్ని చూశారు.

" దీని లోతెంతో ఎవరికీ తెలియదట" అంది సలిల.

గుండంలో అందంగా విరిసిన నల్లకలువలు కనువిందు చేస్తున్నాయి. రాతికొండ అయినా అక్కడక్కడ పచ్చని చెట్లతో రమణీయంగా కనిపిస్తోంది. రాళ్ల మధ్య చెట్లు మొలవడం వింతే మరి!

“ఒక్కరే వచ్చారా?" ప్రశ్నించింది సలిల.

“అవును... చాలామంది ఫ్రెండ్స్ చెప్పారు. ఈ ఊరు బాగుంటుందని అందుకే చూడాలనిపించి వచ్చాను. బస్ దిగి నడుచుకుంటూ వస్తూ ఉంటే కింద కొబ్బరిబోండాల దుకాణం దగ్గర మీ అమ్మగారు వాళ్లు కనిపించారు. మీరు ఇలా కొండ వైపు వెళ్లారని చెప్పగానే మీ వెనుకే వచ్చేశాను" చెప్పాడు కిరణ్.

" అదేంటి? దేవుడిని దర్శించుకోకుండా?" అంది సలిల.

"ముందుగా దేవతని చూద్దామనీ" చెప్పాడు కిరణ్ సలీల మది పులకించింది. కలవరం నిండిన కళ్లు మీనాల్లా అటు ఇటు కదిలాయి చంచలంగా. సమాధానం చెప్పలేక మౌనంగా ఉండిపోయింది.

కొండమీదున్న పాండవుల పంచ, సీతమ్మవారి పురుటి మంచం, భీముడి బుర్ర ఇత్యాదులన్నీ సందర్శించారు రాములమ్మ వాటి గురించి వివరిస్తూ ఉండగా,

" ఇప్పుడు మనం కొండ వెనుకభాగాన ఉన్నట్టున్నాం" అన్నాడు కిరణ్ పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ.

"రేతిరైతే ఈడ వెలుగుబంట్లు తిరుగాడతాయి" చెప్పింది రాములమ్మ

“హమ్మో!” అప్రయత్నంగా కిరణ్ కి దగ్గరగా జరిగింది సలిల.

“బయం నేదునేమ్మా.. పగటి పూట ఇటురావునే'' అంది రాములమ్మ.

ముగ్గురూ వెనకవైపు నుండి కొండ దిగడం మొదలెట్టారు.

అలవాటైన వ్యవహారం కావడంతో చకచక నడవసాగింది రాములమ్మ. ఎవరో పుణ్యాత్ముడు కాస్త సులువుగా దిగడానికి వీలుగా చిన్న చిన్న మెట్లు కట్టించాడు. అందుకే అలుపు తెలియడం లేదంతగా.

హఠాత్తుగా.. కాలు స్లిప్ అయి పడబోయింది సలిల.

చప్పున ఆమె చేయినందుకుని, జారిపడకుండా ఆపాడు కిరణ్. ఏదో... కలవరం కలిగిందతడి స్పర్శతో.

“థాంక్సండీ. మీరు చేయి అందివ్వకపోతే ఈపాటికి కైలాసంలోకి అడుగు పెట్టుండేదాన్ని'' చెప్పింది సలిల అతడి చేతిలో ఉన్న తన చేతిని విడిపించుకోవాలని చూస్తూ.

కానీ... అతడు పట్టు విడవలేదు సరికదా.... ఇంకాస్త బిగించాడు. సలిల కంగారుగా చూసింది అతడికేసి.

“మీరు అనుమతిస్తే జీవితాంతం మీ చేయినందుకుని ఇలాగే నడవాలని ఉంది'' ఆమె కళ్లల్లోకే తదేకంగా చూస్తూ అన్నాడు కిరణ్.

ఆ చూపులకి సూదంటు రాయికున్నంత శక్తి ఉంది.

★★★

కొండ దిగి వచ్చిన వెంటనే, కిరణ్ రాఘవరావు దంపతుల్ని కలసి తనకి సలిలను పెళ్లి చేసుకోవాలని ఉందని చెప్పడం, వాళ్లు అరవింద్ తో సంప్రదించి ఆమోదముద్ర వేయడం క్షణాల్లో జరిగిపోయాయి.

గిరిజను కూడా సంప్రదించి, నిర్ణయం తీసుకోవాలనుకున్న రాఘవరావు ఆమె దగ్గర కూతురి పునర్వివాహం గురించి ప్రస్తావిం చాడు.

"నాకు నీరజొక్కటి, సలిలొక్కటి కాదు అన్నయ్య గారూ... బంగారుతల్లి సలిల జీవితం అలా అయిపోయిందన్న బాధ నన్ను వేధిస్తోందిన్నాళ్లుగా. ఇవాల్టితో అది తీరిపోయింది. ఆ అబ్బాయిలో నా కొడుకును చూసుకుంటాను. ఈ పెళ్లి నాకిష్టమే" చెప్పింది గిరిజ బాధగా కకళ్ళొత్తుకుంటూ.

ఆ బాధ అర్థాంతరంగా అశువులు బాసిన కొడుకును తలచుకొని అని అర్థమైంది ఆయనకి. గిరిజ పెద్ద మనసుకి ఆయన ఎంతగానో సంతసించాడు.

"బాబూ... మీ వాళ్లకి కూడా కబురు చేసి పిలిపిస్తే ముహూర్తాలు పెట్టుకుందాం" అన్నాడు రాఘవరావు.

"ప్రస్తుతానికి నేను ఎవరూ లేని అనాథను అంకుల్. సమయం కలసివచ్చినప్పుడు వివరాలు చెప్తాను. సలిలను నా ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకుంటాను. నన్ను నమ్మండి" చెప్పాడు స్థిరంగా.

ఆ స్వరంలో ధ్వనించిన నిజాయితీ రాఘవరావుని ఊరడిల్లేలా చేసింది.

"నిజం చెప్పండి కిరణ్.. మన పెళ్లికి మీ ఇంట్లో వారు ఒప్పుకోలేదు కదూ. నా మూలాన మీరు మీ వాళ్లకి..." రుద్దమైంది సలిల స్వరం..

"ఛ..ఛ.. అలాంటిదేం లేదు. కాకపోతే కొన్ని విషయాలు బయటపడాలంటే టైమ్ రావాలి. అప్పటి దాకా నువ్వు వేచి చూడగలిస్తే నన్ను పెళ్లి చేసుకో. ఎందుకంటే ఇప్పుడు నేనేమీ వెల్లడించే స్థితిలో లేను. ప్లీజ్ ట్రై టు బిలీవ్ మి. జీవితాంతం నీకు తోడుగా, నీడగా నిలచి, నిన్ను, నీ వ్యక్తిత్వాన్ని కాపాడుతూ నీకు ఆనందాన్ని అందిస్తాను. ఇది నా మనస్సాక్షిగా నేను చేస్తున్న ప్రాణం" అన్నాడు కిరణ్ గంభీరంగా.

అతడి సిన్సియారిటీకి దర్పణం పట్టినట్లున్న ఆ మాటలు సలిలలోని భయాందోళనలన్నింటినీ తరిమేశాయి.

అతికొద్దిమంది ఆప్తుల సమక్షంలో తామిద్దరి బ్రతుకు బంధాన్ని ముడివేయదలచిన కోదండరాముడి సన్నిధిలో వివాహం జరిగింది వారిరువురికీ.

ఆ తరువాత సివిల్ మ్యారేజ్ రిజిస్టర్ చేయించుకున్నారు.

తొలి రాత్రి అతడి కౌగిలిలో ఒదిగిపోయిన సలిల తనకన్నా అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది.

తమకి మాత్రమే పరిమితమైన చల్లని ఏకాంతంలో కమ్మని కలలు పండించుకొని జీవితాంతం గుర్తుంచుకోవలసిన మధురస్మృతులను గుండె గదులలో పదిలపరుచుకుంటూ... స్త్రీ, పురుష సంగమ సౌఖ్యాన్ని మనసారా అనుభవించారిరువురూ.

వాగ్దానం చేసినట్లుగానే కిరణ్ ఆమెను అపురూపంగా చూసుకోసాగాడు. ఆమెను, ఆమె ఇష్టాలను నమ్మకాలను గౌరవిస్తూ ఎంతో ప్రేమగా ఆమెతో గడపసాగాడు.

అతడి అనురాగంలో కల్మషం లేదు. ఆరాధనలో ఏ తేడా లేదు.

పుట్టింటికి దగ్గరలోనే చిన్న ఇల్లు చూసుకుని అందులోకి మారిపోయారు సలిలా కిరణ్లు. తమతోనే ఉండమని ఎంతగానో బలవంతం చేశారు రాఘవరావు దంపతులు.

కానీ కోరికలు పండించుకునే కొత్త జంటల మధ్య తాము అవరోధంగా ఉండడమెందుకని సరేనన్నారు.

వారి కొత్త కాపురానికి కావల్సినవన్నీ అరవిందే సమకూర్చాడు. సలిల , ఎంతగా వారించినా వినకుండా వారి సంసారం కొత్తకుండలో నీటిలా, తీయగా సాగిపోసాగింది.

★ ★ ★

"సలిలా... సలిలా..." వీధి తలుపులు విరిగేలా బాదుతూ గావుకేకలు పెడుతున్నట్లుగా హిమజ పిలుస్తూంటే గత స్మృతుల వెల్లువలోంచి బయటపడింది సలిల.

అంతసేపూ తను ప్రియవిభుడికి సంబంధించిన మధుర జ్ఞాపకాల్లో తేలియాడిన సంగతి గ్రహించిన సలిల పెదవులు అందంగా విచ్చుకున్నాయి.

అదీ.. క్షణకాలం మాత్రమే.

తనున్న ప్రస్తుత పరిస్థితి జ్ఞాపకం వచ్చి ఆమె హృదయం బాధగా మూలిగింది.

నిజంగా కిరణ్ తనని మోసం చేయాలనుకుంటున్నాడా!

ఏమో! వేచి చూడాలి.

ఇంతలో మరొకసారి తలుపు చప్పుడైంది. గబ గబ వెళ్లి తలుపు తీసింది.

" ఏమ్మా సలిలా... తలుపు తీయడానికింత సేపేంటీ? మా తమ్ముడిని తలుచుకుని మైమరచి పోయావా ఏంటి?" అడిగింది హిమజ హాస్యంగా.

సలిల బుగ్గలు ఎర్రబడ్డాయి. తడబాటును కప్పి పుచ్చుకుంటూ.

" పొండి ఆంటీ... మీరు మరీనూ" అంది. హిమజ వెనుదిరిగింది. "అదేంటి ఆంటీ.. వెళ్లిపోతున్నారు?" గాభరాగా అంది సలిల.

"నువ్వేగా పొమ్మన్నావు" అంది హిమజ అలుకగా పెదవులు బిగించి సలిల నవ్వేస్తూ " లోపలకి రండి" అంది.

తన చేతిలో ఉన్న స్టీల్ టిఫిన్ బాక్స్ ను టీపాయ్ , మీద ఉంచుతూ "ఇదిగో సలిలా.. నీకిష్టమని క్యారెట్ హల్వా చేశాను" అంది హిమజ.

సలిల మనసు ఉప్పొంగిపోయింది. "హిమజ ఆంటీ ప్రేమ అమ్మని తలపిస్తుంది. మరపిస్తుంది, కూడా" అనుకొని "థాంక్స్ ఆంటీ" అంది.

కాస్సేపు ఆ కబురు ఈ కబురు అయ్యాక హిమజ అంది సడన్గా... " తపతి గురించి నీతో మాట్లాడాలి"

సలిలకు ఆమె ఏం చెప్పబోతోందో అర్థమైనా " ఏంటి ఆంటీ" అని అడిగింది.

" తపతి ఈమధ్య ఆలస్యంగా ఇంటికి వస్తోంది. కారణం అడిగితే ప్రైవేట్ క్లాస్లని చెప్తోంది.

అది చెప్పేది అబద్ధమనిపిస్తోందెందుకో!

" అబద్ధమని ఎందుకు అనుకుంటారంటీ. తను నిజమే చెప్తోందేమో!" అంది సలిల సాలోచనగా..

"లేదు సలిలా.. తను ఖచ్చితంగా అబద్దమే చెప్తోంది. అబద్ధం ఆడే వాళ్ల ముఖంలో, కదలికల్లో మార్పులను ఇట్టే పసిగట్టేయవచ్చు" నిట్టూర్చింది హిమజ.

''పోనీ... లాలించో బుజ్జగించో అసలు విషయం రాబట్టండి''

'' ఆ ముచ్చటా అయ్యింది. నాది ఉట్టి అనుమానమేననీ, తన మీద నిఘా వేసుంచాను కనకే తన ప్రతి చేష్ట అనుమానాస్పదంగా తోస్తోందని నా మీద నిష్ఠూరం వేస్తోంది. ఏం చేయాలో తోచక నీతో చెప్పుకుంటున్నాను'' హిమజ కళ్లల్లో నీళ్లూరాయి.

ఆమె కంట తడి పెట్టడం చూసి, సలిల మది జాలితో నిండిపోయింది.

'' మీరేమనుకోనంటే ఒక్క మాట ఆంటీ'' అంది నెమ్మదిగా..

''నువ్వు ఏం చెప్పినా ఏమీ అనుకోను చెప్పు'' అంది హిమజ.

"ఇదంతా చేసినది మీరే ఆంటీ. తపతిలో లేనిపోని ఆలోచనలు రేకెత్తించింది మీరే!"

హిమజ తెల్లబోయింది. సలిలేంటి? ఇలా అంటోంది! కన్నబిడ్డ క్షేమాన్ని ఆకాంక్షించే తను, ఆమె దారి తప్పేందుకు హేతువేలా అవుతుంది?

అదే అంది సలిలతో. '' మీరు ఏమని భావించినా ఇది నిజం. తపతి మీకు తెలియకుండా సినిమాలకి, షికార్లకీ వెళ్లడం అంటే దానర్థం ఏమిటి? మీకు చేప్తే మీరు బయటకు పంపరనేగా!'' అంది సలిల.

''అవును.. తనను నేను ఎక్కడికీ పంపాలనుకోను. దానికి కారణం కూడా నీకు తెలుసు'' గర్వంగా అంది హిమజ..

" అదే తప్పంటున్నానంటీ.. తను అందగత్తె కాబట్టి ఆమెను నిర్బంధించి ఉంచాలని అనుకుంటున్నారే గానీ మీరు బలవంతంగా కట్టడి చేయడం మూలాన తను మీ కళ్లు కప్పి తిరగాలని ఆశిస్తోందని ఎందుకు తెలుసుకోరు?" సూటిగా ప్రశ్నించిందీ సలిల.

హిమజ ఎప్పటిలాగా ఆమె మాటలు కొట్టిపారేయలేదు. ఆలోచనలో పడింది. సలిల చెప్పేది నిజమనిపిస్తోంది.

"నా బాధ నీకు తెలియదు సలిలా.. రోజులసలే బాగా లేవు. నీకిదివరకే చెప్పాను నా భయానికి గల కారణం ఏంటో... తపతి కూడా దానిలాగే మోసపోతుందేమోనన్నదే నా భయం" హిమజ అంది గద్గదికంగా.

"మీరు అనవసరంగా టెన్షన్ పడుతున్నారు. అలా ఎందుకు అనుకోవాలి? దురాలోచన చేస్తున్న ఆమెను వింతగా చూసింది సలిల.

“సిరి అబ్బకపోయినా చీడు మబ్బుతుంది అంటారు పెద్దలు. దాని అందం వచ్చినట్లే దాని పెడబుద్దులూ వస్తాయేమోనని ఒకటే బెంగగా ఉంది నాకు!

మరింక తర్కించక ఆగిపోయింది సలిల. తానెన్ని చెప్పినా ఆవిడ తన ధోరణి మార్చుకోదు. తన మాట తనదేనంటుంది. అందుకే... ఆవిడ చెప్పినది వింటూ నోరుమూసుకు ఉండడమే మేలు.

కానీ వీళ్లిద్దరికి తెలియని విషయం ఒకటుంది

తపతి విషయంలో హిమజ ఊహించినట్లుగానే జరగబోతోందనీ.

తల్లి తన పట్ల విధించిన అర్థరహితమైన ఆంక్షలకు వ్యతిరేకంగా స్పందించిన తపతి, ఆ రక్షణ వలయాలను ఛేదించుకునే ప్రయత్నంలో ఉందని హిమజకి ఆ క్షణాన తెలియదు. "

"పొద్దుపోతోంది సలిలా. మీ అంకుల్ ఆఫీసు నుండి వచ్చే వేళయ్యింది. ఆయన వచ్చేసరికి ఇంట్లో కనిపించకపోతే పెత్తనాలకి వెళ్లావంటూ చిరాకుపడతారు." చాలా సేపు పిచ్చాపాటీ మాట్లాడిన మీదట ఇంటికి బయలుదేరింది హిమజ.

“ఆంటీలో అన్నీ మంచి లక్షణాలే... ఎదుటి వారి టైమ్ ని అప్పుడంలా నమిలేయడం తప్పు” అనుకుంది సలిల సరదాగా.

ఆవిడ నిష్క్రమణ తరువాత ఇల్లంతా గాలివాన వచ్చి వెలిసిపోయినంత ప్రశాంతంగా అనిపించింది.

సలిల తన సమస్యను తాత్కాలికంగా మరచిపోయింది.

★★★

" కంగ్రాట్స్ తపతీ... నేనూహించినట్లుగానే నీకు బహుమతి వచ్చింది" ఆమె చేతులు పట్టి ఊపుతూ అభినందనలు తెలియజేశాడు కార్తీక్. సంతోషసముద్రమే అయ్యింది తపతి మది.

తనలోని ప్రతిభను వెలికి తీసి తనను ప్రోత్సహించి పోటీలో పాల్గొనేలా చేసినది ఈ కార్తీకే.. ఈ విజయం వెనుక అతడి చేయూత ఉంది.

"ఈ క్రెడిట్ అంతా మీదే కార్తీక్. మీరు ఎంకరేజ్ చేయడం వలనే నాకీ బహుమతి వచ్చింది" గాలిలో తేలిపోతున్నంత ఆనందం కలిగింది తీపతిలో.

"మరి నాకు ట్రీట్ ఇవ్వరా" గారంగా అడిగాడు కార్తీక్.

' ఓ.కే. ష్యూర్. పదండి హోటల్కెళదాం '! అంది తసతి ఉత్సాహంగా.

"పదండి... పదండి" హుషారుగా ముందుకు నడిచాడు కార్తీక్.

తపతి దృష్టిలో కార్తీక్ దేవుడయిపోయాడు ఒక్కసారిగా. 'నిజంగా కార్తీక్ స్నేహాన్ని పొందిన తానెంతో అదృష్టవంతురాలు' అనుకుంది పరవశంగా.

తనకు తెలియకుండానే దీపం చుట్టూ తిరిగే శలభంగా మారింది తపతి.

★ ★ ★

" ఏంటీ... మళ్లీ బెంగ్యూర్ ప్రయాణమా? ఈ నేలలో ఇది రెండవ సారి. ఏదో పక్కనున్న అనకాపల్లి వెళ్లొచ్చినంత ఈజీగా వెళ్లొచ్చేస్తున్నారు. అసలు నాకు తెలియక అడుగుతాను. మీ ప్రిన్సిపాల్కి మీరు తప్ప ఇంకొకరు దొరకరా?" అడిగింది సలిల కిరణ్ సూట్కేస్ సర్ది పెడుతూ.

"దొరకరని కాదు అతడికి నా మీద నమ్మకం ఎక్కువ. అందుకే స్వంత పనులు నాకు కాక మరెవరికీ అప్పజెప్పడు. అయినా బెంగళూర్లో నాకు కావల్సిన వాళ్లు, నేను కలుసుకోవాలనుకునే వాళ్లు చాలామందే ఉన్నారు. రెండు పనులూ...." కలసివస్తాయని వెళ్తున్నాను" అన్నాడు కిరణ్ ముఖం అదోలా పెట్టి.

'ఎవరో , అంతగా కావాల్సిన వారు, కలవాలనుకునే వాళ్ళు' అడిగింది ఓరగా అతడినే చూస్తూ.

"ఉన్నారులే. అయినా నిన్ను కావాలనుకున్నంతగా నేనెవరినీ కావాలనుకోవడం లేదు. నువ్వు నా దేవతవి" అన్నాడు కిరణ్ తన మనసులోని ప్రేమనంతా స్వరం నిండా నింపుకుంటూ.

"ఈ మాటలకేం బాగానే చెప్తారు. కానీ తరుచూ నన్ను విడిచి పరుగులు పెడుతుంటారు" కినుకగా అంది సలిల.

"సారీ డియర్. తప్పక వెళ్లాల్సిన అవసరం కలుగుతోంది కాబట్టే వెళ్తున్నాను. నిన్ను విడిచి ఉండడం నాకు మాత్రం ఇష్టమనుకున్నావా? ఎందుకో కిరణ్ ముఖం మ్లానమైంది.

అతడి ముఖ కవళికల్లో వచ్చిన మార్పును బట్టి అతడు ఎందుకో హర్ట్ అయ్యాడని గ్రహించింది సలిల, అయితే అది ఎందుకోనన్నది మాత్రం అర్థం కాలేదామెకి. !

వాతావరణం వేడెక్కడం గమనించి " అయినా దొరవారు అస్తమానం ఇలా క్యాంపులంటూ పరుగెడితే విద్యార్థుల సంగతేంటి పాపం? వారు అన్యాయమై పోరూ. మీ ప్రిన్సిపాల్ కి ఆమాత్రం సెన్స్ కూడా లేదేంటో!"

సలిల అలా నిర్మగర్భంగా మాట్లాడ్డంతో కిరణ్ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. ఏం చెప్పాలో తోచక నజ్జుగుజ్జులాడాడు.

అదీ.. అదీ.. మిగిలిన లెక్చరర్స్ ఎలాగో మ్యానేజ్ చేస్తారులే సర్ది చెప్పుకున్నాడు అప్పటికీ.

అతడు సమాధానం చెప్పిన విధానం అంత సంతృప్తికరంగా అనిపించలేదామెకి.

'ఎన్నాళ్లు ఆడతారు మహాశయా దాగుడుమూతలాట. త్వరలోనే మీ గుట్ల మట్లు అన్నీ కనిపెట్టకపోతే నా పేరు సలిల కాదు' అనుకుంది గుంభంగా నవ్వుకుంటూ,

కిరణ్ తన సూట్కేస్ అందుకుంటూ "బై సలిలా, త్వరగా వచ్చేస్తాగా" అని చెప్పేసి బయట పడ్డాడు.

'లాభం లేదు. సలిలకు తన మీద అనుమానం మొదలైంది. ఒకసారి సందేహం పుట్టిందంటే దాని అంతు తేల్చేవరకు నిద్రపోని రకం సలిల. వెంటనే ఆమె అనుమానాలకి ఫులిస్టాప్ పెట్టేయాలి. లేకపోతే అసలు విషయం తనే కనుక్కొని, నిజం దాచినందుకు .

తనను ఏవగించుకోవచ్చు. ఆమెలో జనించిన శంకలను సమూలంగా తుడిచి పెట్టేదెలా! ఎలా?! కిరణ్ మస్తిష్కంలో అంతులేని ఆలోచనల పరంపరలు మొదలయ్యాయి.

★★★

తపతికి, కార్తీక్ కి మధ్య గల స్నేహం బలపడుతోందంతకంతకీ. సాక్షాత్తూ ఆ పరమాత్ముడే దిగి వచ్చి 'కార్తీక్ చెడ్డవాడు' అని సర్టిఫై చేసినా సరే నమ్మనంత విశ్వాసం ఏర్పడింది అతడి మీద. ఇద్దరూ కలసి పార్క్ లలో కూర్చుని సాహిత్యపరమైన విషయాలు, కుటుంబ విషయాలు అన్నీ చర్చించుకునేవారు గంటల తరబడి.

అతడితో మాట్లాడుతుంటే విసుగు-విరామం కలిగేవి కాదామెకి.

అతడు ప్రతీ విషయానికి సంబంధించి తన సూచనలు అందజేసేవాడు. వాటిని అమూల్యంగా భావించిన తపతి శిరసా వహించేది తు.చ తప్పక.

తనకు తెలియకుండానే ఒకానొక ఊబిలో కూరుకుపోతోంది తపతి. అది తెలుసుకునే సరికి ఆమె జీవితం చేజారుతుందా? ఏమో!?

కార్తీక్ సలహా మీద పలు టీవీ ఛానెల్స్ వాళ్లు నిర్వహిస్తున్న మ్యూజికల్ ప్రోగ్రామ్స్కి తను పాడిన పాటల క్యాసెట్స్ పంపించింది. .

ఒక సుశీల... ఒక జానకీ... ఒక చిత్ర... ఒక లతామంగేష్కర్, వీళ్లందరి తరువాత ఒక తపతి. అవును తపతీ... నిన్ను ఆ స్థాయిలో చూడాలని నా కోరిక. నా మాట విని క్యాసెట్ పంపు. నువ్వు తప్పక సెలక్టవుతావు'' చెవుల్లో అమృతం పోసినంత తీయగా పలికాడు కార్తీక్.

'అవును... తనలో ఉన్న టాలెంట్స్ నలుగురికీ తెలియాలంటే, తను ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొవాలి' అంటూ తలపోసిన తపతి అతడి సమక్షంలో పాటలు పాడి, రికార్డ్ చేయించింది.

వాటిని అతడే కొరియర్లో పంపించాడు.

"చూస్తుండు.. సూటినీలో కూడా నువ్వు సెలక్టవుతావు భరోసా ఇచ్చాడు కార్తీక్.

పొంగిపోయింది తపతి.

" అంతకన్నానా నీ నోటి మాట నిజమై తీరుతుంది'' అంది భగవంతుని గాంచినంత భక్తి ప్రపత్తులతో అతడిని తిలకిస్తూ.

తను పాకుడురాళ్ల మీద నడుస్తోందని, ఏనాటికైనా కాలుజారి అగాథాలలోకి పడిపోవడం ఖాయమని ఎరుగని అమాయకురాలు తపతి.

ఆమె అమాయకత్వమే కార్తీక్ లాంటి గోముఖ వ్యాఘ్రాలకి శ్రీరామరక్ష

★★★

''ఎంతవరకు వచ్చింది మీ పరిశోధన" సలిలకు మళ్లీ ఫోన్ చేసిన అపరిచిత వ్యక్తి ఆరా తీశాడు.

''అది మీకనవసరం... ఇంతకీ మీరెవరు? నాతో పరాచికాలు ఎందుకు ఆడుతున్నారు?'' కటువుగా ప్రశ్నించింది సలిల.

'' మీతో పరాచికాలాడవలసిన అవసరం లేదు. పోతే... మీరు మీ భర్త గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకే నా ఈ ఆరాటమంతా..." నమ్మకంగా అన్నాడతడు.

''అంత ఆరాటమున్నప్పుడు ఆయన గురించిన నిజాలన్నీ మీరే చెప్పి పుణ్యం కట్టుకోవచ్చుగా'' వ్యంగ్యంగా అంది

సలిల.

" అమ్మమ్మా... అంత పని మాత్రం చేయను. మీ అంతట మీరుగా పరిశోధించి, నిజాలు తెలుసుకుంటేనే నాకు ఆనందం, మీకు తృప్తి... ఏమంటారు?" కవ్విం పుగా అన్నాడు అతడు.

సలిల మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది.

ఎవరితడు? ఏమాశించి తనకి ఈ రకంగా ఫోన్ కాల్స్ చేస్తున్నాడు? ఇతడు కిరణ్ కి ఏమవుతాడు? మిత్రుడా? శత్రువా?

స్నేహితుడైతే అతడి గుట్టు బయటపెట్టాలని చూడడు.

అయితే ఇతడు శత్రువే అయ్యుంటాడు. కిరణ్ మీద పగ తీర్చుకునేందుకే ఇలా తనకి ఫోన్స్ చేసి మిస్ గైడ్ చేస్తున్నాడా?

ఈ నేపథ్యంలో కిరణ్ కేమన్నా అపకారం తలపెట్టనున్నాడా? "

ఆ ఆలోచన రాగానే గుండె గుభిల్లుమంది సలిలకు.

నో... అలా జరిగేందుకు వీల్లేదు. తనే అసలు విషయమేమిటో కనుక్కొని కిరణ్ ని రక్షించుకోవాలి. కిరణ్ పూర్వాపరాలు ఏంటో తనే

పరిశోధించి తెలుసుకోవాలి.

కీడెంచి మేలెంచమన్న సూత్రాన్ని పాటించింది. సలిల ఆ క్షణాన. ఏ రకంగా ప్రొసీడ్ అవ్వాలోనన్న ఆలోచనతో మునిగి తేలింది కాస్సేపు. పాదరసంలా పరుగులు తీస్తున్నాయి బుర్రలోని రకరకాల యోచనలు.

చివరకు ఓ నిర్ణయానికి వచ్చింది సలిల. అప్పుడామెకి ప్రశాంతంగా అనిపించింది. నిశ్చింతగా నిట్టూర్చి పనుల్లో పడింది.

★★★

' ' మీరు ఏ రకంగా చేస్తారో తెలీదు. ఇతడి గురించిన అన్ని వివరాలు నాకు కావాలి. అదీ సాధ్యమైనంత తొందరగా" కిరణ్. ఫోటోని ఇస్తూ చెప్పింది సలిల ఆ డిటెక్టివ్ ఏజెన్సీ మేనేజర్ తో.

'కిరణ్ గురించిన వివరాలు తనంత తానుగా తెలుసుకోవడం కాస్త కష్టతరమైన కార్యం అనీ భావించిన ఆమె, ఆ పని చేసి పెట్టడానికి ఒక ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీని ఆశ్రయించింది. కిరణ్ ఫోటోనిచ్చి వివరాలు సేకరించమని చెప్పింది.

యూ డోంట్ వర్రీ మేడమ్. యాజ్ ఎర్లీ యాజ్ పాజిబుల్...మేం మీక్కావలసిన సమాచారాన్నంతా అందిస్తాం" మర్యాదపూర్వకంగా చెప్పాడు మేనేజర్ ఆమెకు కాఫీ ఆఫర్ చేస్తూ..

"నో థాంక్స్... ఆ... అన్నట్లు మరొక్క విషయం... ఈ విషయం చాలా కాన్ఫిడెన్షియల్ గా ఉంచాలి. ఏమాత్రం బయటకు పొక్కడానికి వీలు లేదు" అంది సలిల గంభీరంగా.

ఎందుకంటే తన గురించి వివరాలు సేకరిస్తోందని తెలిస్తే కిరణ్ హర్ట్ అవచ్చు... భార్య తనను శంకిస్తోందని బాధ పడవచ్చు. అది ఆమెకు ఇష్టం లేదు.

' మీకా భయం' అవసరం లేదు. మా దగ్గరకొచ్చే క్లయింట్స్ తాలూకు రహస్యాలు కాపాడవలసిన నైతిక బాధ్యత మా మీద ఉంది చెప్పాడు మేనేజర్.

"థాంక్యూ సర్. పని కాస్త వేగం జరిగేటట్లు చూడండి. చాలా అర్జెంటు" ఫీజు చెల్లిస్తూ అంది సలీల.

"యస్ మేడమ్... మా దగ్గర చాకుల్లాంటి కుర్రాళ్లున్నారు. వాళ్లు చాలా యాక్టివ్గా పనిచేసి , క్షణాల్లో మీకు రిపోర్టు అందిస్తారు. బై ది వే... మేం మిమ్మల్ని కాంటాక్ట్ చేయాలంటే ఎలా మేడమ్! మీ పర్సనల్ ఫోన్...ఐ మీన్.. సెల్ నంబరిస్తారా?" అడిగాడు మేనేజర్.

"ష్యూర్.. ఇస్తాను. కానీ తరుచూ ఫోన్ చేయకండి. అత్యవసరం అనుకుంటేనే నన్ను కాంటాక్ట్ చేయండి. నేనే ఫోన్ చేస్తుంటాను" హెచ్చరించింది సలిల.

"ఓకే మేడమ్. అలాగే. నాదొక్క డౌట్ మేడమ్... అడగమంటారా?" ఉత్సుకత ప్రదర్శించాడతడు.

"అడగండి "

"ఈయన మీకేమవుతారు?" ఆసక్తిగా అడిగాడు అతడు.

చురుగ్గా చూసింది సలిల, కళవేళపడ్డాడతడు.

"జస్ట్.. తెలుసుకుందామని అడిగాను. ఏమీ అనుకోకండి" నొచ్చుకున్నాడతడు.

సలిల నవ్వుకుంది. నిజానికి కిరణ్ తనకేమవుతాడో తెలుసుకోవడం అతడికేమంత కష్టం కాదు. అతని వృత్తే అది. కానీ ఎందుకో అతడిని ఆటపట్టించాలనిపించిందామెకి. తను రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇస్తే దాన్ని ఎంతవరకు పసిగడతాడో తెలుసుకోవాలన్న కోరిక కలిగింది.

"మా బంధువులమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. ఈయనే పెళ్లికొడుకు. అమ్మాయినిచ్చే ముందు అబ్బాయికి సంబంధించిన మంచి-చెడ్డ విచారించడం మన కర్తవ్యం కదా! బంధువుల ద్వారా అయితే నిజానిజాలు సరిగ్గా రాబట్టలేము. మీరైతే కరెక్ట్ ఇన్ఫర్మేషన్ ఇస్తారనీ.." ఓరగా చూస్తూ చెప్పింది సలిల.

అతడు తృప్తి చెందాడు ఆ సమాధానంతో.. " మీరు వెళ్లి రండి మేడమ్. చెప్పాగా అతిత్వరలో మీరు కోరిన వివరాలు మీకందిస్తాము" చెప్పాడు మేనేజర్.

''ఓ.కే.. థాంక్యూ'' చెప్పేసి బయటకు నడిచింది సలిల.

ఆమెకు తెలియని విషయం ఒకటుంది. ఆమె తన భర్తకు సంబంధించిన విషయాలు అతి గోప్యంగా సేకరించాలని ప్రయత్నిస్తోంది. కానీ ఆమె మదిలో అగ్గి రాజేసి, ఆమె ప్రతి కదలికల్ని గమనిస్తున్న ఓ వ్యక్తి ఆమెనే నీడలా వెంటాడుతున్నాడని ఆమె ఎరగదు.

★★★

'' ఏయ్ కిరణ్... ఇదిగో ఇలా రండి'' పెరట్లోంచి సలిల కేకలు వినిపించి గాభరాగా బయటకెళ్ళాడు కిరణ్.

పెరటి వరండాలో కూర్చుని ఏదో పరిశీలనగా చూస్తున్న సలిల కనిపించింది.

" ఏమైంది సలిలా అంతలా కేకవేశావు?'' అడిగాడు ఆశ్చర్యంగా అటుకేసి వెళ్తూ.

''మన స్వీటీ పిల్లల్ని పెట్టింది చూశారా'' గోడ వారగా ఉన్న బుజ్జి బుజ్జి పిల్లిపిల్లల్ని చూపించింది సలిల.

'' ఇంకా కళ్లు తెరవని కూనలు 'కుయ్.. కుయ్.. 'మంటూ తల్లి దగ్గరగా ఒదిగి పాలు కుడుస్తున్నాయి.''

స్వీటీ సలిల పెంపుడు పిల్లి. సలిలలాగే అదీ సమయపాలన పాటిస్తుంది.. ఇల్లు ఖరాబు చేయకుండా వేళ ప్రకారం వచ్చి పాలు బువ్వ తినేసి పోతుంది.

'' నీలాగే... నీ పిల్లి టైమ్ మేనేజిమెంట్ చక్కగా నేర్చుకుంది'' కిరణ్ ఆట పట్టిస్తాడు సలిలను.

''ముద్దుగా ఉన్నాయి కదూ'' కాస్త దూరం నుండే వాటిని చూస్తూ తన్మయత్వంగా అంది సలిల..

'ఊ..'' అన్నాడు కిరణ్ వాటి పక్కనే కూర్చుంటూ.

'' దగ్గరకు పోకండి. కళ్లు పీకేయగలదు'' వారించింది సలిల

'' అదేంటి? స్వీటీ మన పెంపుడు పిల్లి కదా. మన కళ్లు పీకేయడమేంటి?'' అశ్చర్యపోయాడు కిరణ్.

" అదంతే. ఎంత పెంపుడు పిల్లయినా తన బిడ్డల్ని మనమేమన్నా చేస్తామేమోనన్న భయంతో మీద పడి, రక్కుతుంది" చెప్పింది సలిల వాటి మీద నుండి చూపు మరల్చకుండా.

కిరణ్ ఏదో అర్థమైనట్లుగా తల పంకించాడు. నోరు లేని మూగజీవైనా అది తన మాతృత్వాన్ని చాటి చెప్పే విధానం అతడిని అబ్బురపరిచింది.

పొరపాటున కూడా దాని జోలికి పోకండి మరొకమారు హెచ్చరించి లోపలికి వెళ్లింది సలిల.

ఆమె మాటలకు తలూపి కాస్త దూరం జరిగాడు కిరణ్.

సలిల లోపల నుండి గిన్నె నిండా పాలు తెచ్చి స్వీటీ ముందు పెట్టిన బౌల్ నిండా పోసింది.

" అన్ని పాలెందుకు?" అడిగాడు కిరణ్ వింతగా.

అతడి జుట్టులో వేళ్లు పోనిచ్చి క్రాఫ్ చెరుపుతూ అంది సలిల. "మొద్దబ్బాయి ఏమీలేదు. అది ఇప్పుడు పిల్లల తల్లి. అదీ కడుపు నింపుకుంటేనే గానీ వాటి కడుపు నింపలేదు"

కిరణ్ మాట్లాడకుండా సలిలనే చూస్తూ ఉండిపోయాడు. అతడి చూపుల్లో ఆరాధనను గమనించిన

సలిల అడిగింది " ఏంటలా చూస్తున్నారు?"

" ఏం లేదు.. అన్ని జీవరాశులను ప్రేమగా చూడడం నీకెలా సాధ్యమవుతోందా అని అన్నాడు కిరణ్ ప్రేమగా. సలిల నవ్వింది మనోహరంగా, ఆమె భుజాల చుట్టూ చేయి వేసి దగ్గరగా లాక్కుని బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు కిరణ్.

అందుకే సలిలా నువ్వంటే నాకిష్టం. నీ మనసు అమృతం. అది అందరికీ ప్రేమను పంచుతుంది. "ఐ లవ్యూ సోమచ్ రా" అన్నాడు ఆమె చెవిలో గుసగుసగా.

ఏ సంకోచాలూ లేకుండా అతడి కౌగిలిలోని ఇంటిమసీని ఆస్వాదించింది సలిల.

★★★

కిరణ్ బర్త్డే దగ్గరపడడంతో అతడికి మంచి డ్రెస్ కొందామని షాపింగ్ కి వెళ్లింది సలిల.

అతడిని కూడా రమ్మనమందామంటే “నాకు ఏ డ్రెస్ వద్దు. అసలు నేను బర్త్డేనే చేసుకోను'' అని గొడవ చేస్తాడేమోనని చెప్పలేదు.

నగరంలో పేరుమోసిన రెడీమేడ్ షాప్ కి వెళ్లింది సలిల.

''రండి మేడమ్. ఏం చూపించమంటారు... చుడీదార్స్, నైటీస్ లిస్ట్ చదువుతూ సాదరంగా ఆహ్వానించాడు'' షాప్ యజమాని.

''అవేం వద్దు గాని జెంట్స్ వేర్ చూపించండి'' చెప్పింది సలిల.

''సైజ్ చెప్పండి మేడమ్” అడిగాడు కౌంటర్లో ఉన్న సేల్స్ బాయ్. చెప్పింది సలిల.

''నా బట్టలు నువ్వే సెలెక్ట్ చేస్తావు. నాకేది ఇష్టమో తెలుసుకుని రుచికరంగా వండి పెడతావు. అనుక్షణం నన్ను కంటికి రెప్పలా శ్రద్ధగా చూసుకుంటావు. ఇలా పారసైట్లా అన్ని విషయాలకీ నీ మీద ఆధారపడితే కొన్నాళ్లకి నేను నేనుగా మిగలను'' అంటాడు కిరణ్ భార్య తన మీద చూపిస్తున్న అనురాగానికి ముగ్ధుడౌతూ.

స్త్రీ పురుషుల్ని ఒకరికి ఒకరుగా చేసేది ఈ వివాహ బంధం. దాన్లో ఎవరికి వారుగా ఉండడం అంటూ ఏమీ ఉండదు. ఇద్దరూ పరస్పరం మమేకమైపోయే మహోత్కృష్టమైనది ఈ బంధం. వేరు వేరుగా తమ తమ వ్యక్తిత్వాలను కాపాడుకుంటూనే ఇరువురూ ఏకమవ్వాలి. అదే అర్థనారీశ్వరతత్వం'' నవ్వేస్తుంది సలిల అతడికి బదులిస్తూ.

''రియల్లీ ఐ లవ్యూ సోమచ్'' ఆమెను అల్లుకుపోతాడు కిరణ్.

''రోజుకి యాభైసార్లన్నా ఈ మాట చెప్తారు. విసుగు రాదూ” గోముగా అడుగుతుంది సలిల.

'' శ్రీరామ నామంలా జపించిన కొద్దీ జపించాలనిపించేది ప్రేమ మంత్రం. విశ్వవ్యాప్తమైన ఈ ప్రేమే లేకపోతే మనం ఒకటయ్యే వాళ్లమా! చెప్పు'' ఆమెను అల్లుకుంటూ గుసగుసలాడేవాడు కిరణ్.

అతడు జ్ఞప్తికి రాగానే హృదయంలో ఏవో తీయని ప్రకంపనలు చెలరేగాయి ఆమెకు.

అసలైన ప్రేమికుడికి అర్థం కిరణ్. నిజమైన భర్తకు నిర్వచనం కిరణ్.

''చూడండి మేడమ్.. ఇవన్నీ లేటెస్ట్ ఫ్యాషన్స్. ఈ వెరైటీ చూపించమంటారా?" సేల్స్ బాయ్ ప్రశ్నించడంతో ఇహలోకంలోకి వచ్చింది సలిల.

“ఇవి వద్దు. కాస్త అఫీషియల్ లుక్ ఉండేవి చూపించండి'' అంది.

లైట్ పింక్ షేడ్ ఉన్న షర్ట్, బ్లాక్ కాటన్ జీన్స్ తీసుకుని డబ్బులు చెల్లించింది సలిల.

“ ఒకవేళ సూటబుల్ కాకపోతే ఎక్స్చేంజ్ చేయాల్సి ఉంటుంది'' రిక్వెస్ట్ చేసింది షాప్ యజమానిని.

“ఓకే మేడమ్ తప్పకుండా. కానీ పసుపు మాత్రం పెట్టకండి'' చెప్పాడతడు వినయంగా.

అక్కడ నుండి డిపార్ట్ మెంటల్ స్టోర్స్ కి వెళ్లింది సలిల ఆ నెల సామాన్లు తెచ్చుకునేందుకు.

ట్రాలీ తెచ్చుకొని సామాన్లు అందులోకి వేసుకోసాగింది.

“అదుగో ఆవిడే.. మన ఎం.డి.సార్ భార్య'' తన వెనుక ఏవో గుసగుసలు వినబడుతూ ఉండడం గమనించిన సలిల తన పని తాను కానిస్తూనే ఒక చెవి అటు పారేసింది.

“ఆవిడ కాదురా.. ఈవిడ చాలా సింపుల్ గా ఉంది. అంత పెద్ద కంపెనీకి ఎం.డి. అయిన ఆయన భార్య ఇంత సాదాసీదాగా ఉంటుందా?" అనుమానంగా అంటున్నాడో యువకుడు.

“సింపుల్గా ఉండడం ఆమెకిష్టమేమో.. అయినా మన ఎం.డి.సార్ పర్సెనల్ ఛాంబర్లో ఆవిడ ఫోటో లామినేషన్ చూడలేదూ. ఆవిడే ఈవిడ'' అంటున్నాడు మొదటి యువకుడు.

''నేను సార్ రూమ్లోకి ఎప్పుడూ వెళ్లలేదు. అందుకే చూడలేదు'' చెప్తున్నాడు రెండో అబ్బాయి.

సలిల నివ్వెరపోయింది. వాళ్లు ఏమనుకుంటున్నారో అర్థంకాలేదామెకి. అసలు వాళ్లెవరిని చూసి ఎవరనుకుంటున్నారో!

'మనుషులను పోలిన మనుష్యులు ఏడుగురుంటారట. వాళ్లు ఏ రెండో దాన్నో, మూడో దాన్నో చూసుంటారు' ఏదో సినిమా డైలాగ్ గుర్తుకు రాగానే చిరునవ్వు నాట్యం చేసింది సలిల పెదవులమీద.

''సార్ కి ఆవిడంటే ఎంతో ప్రేమట. ఆవిడని లవ్ చేసి పెళ్లి చేసుకున్నారట. అందుకే ఆవిడ పేరు మీదనే ఈ కంపెనీ ప్రారంభించారట''

తనకు తెలిసిన విషయ పరిజ్ఞానాన్ని వెల్లడిస్తున్నాడు మొదటి యువకుడు.

ఆహా.. ఇవన్నీ నీకెలా తెలిశాయి బాసూ కుతూహలంగా అడిగాడు రెండో కుర్రాడు.

'సార్ పి.ఎ. చెప్పాడొకసారి' బయటకు నడుస్తూ చెప్పాడు మొదటి కుర్రాడు.

వాళ్లు మాట్లాడుకుంటున్నది తన గురించేనేమోనన్న అనుమానం కలిగిన సలిల, ఇక ఆగలేకపోయింది.

వాళ్లని అసలు విషయమేంటో అడిగేయాలన్న ఆతృతతో వాళ్ల వెనుక పరుగెత్తింది.

ఇంతలో ఎదురుగా ఎవరో రావడం, సలిల తన ముందు వెళ్తున్న వాళ్లని కలుసుకునే ఆతృతలో ఆ వ్యక్తిని పట్టించుకోక ఢీకొనడం జరిగిపోయింది.

ఆ కుర్రాళ్లు బైక్ మీద తుర్రుమన్నారు సలిల తేరుకొనేంతలో,

“కళ్లు కనబడడం లేదా ఏంటా స్పీడ్'' కోపంగా అంటూ తలెత్తి చూసిన సలిల, తను ఢీకొట్టిన వ్యక్తిని గుర్తు పట్టింది.

వెనువెంటనే ఆమె వదనం సంభ్రమానందాలతో నిండిపోయింది. " ఆమె అరవింద. ఇంటర్ నుండి డిగ్రీ వరకు సలిల క్లాస్మేట్. ఇద్దరి నడుమ చెప్పుకోలేని స్నేహమే ఉంది. “

''నువ్వు... నువ్వు... అరవిందవి కదూ'' అంది సంతోషంగా.

"అవును. నువ్వు.. ఓ సలిలా.. మై గుడ్ నెస్ ఇన్నాళ్ల తరువాత ఇలా...'' అరవింద కూడా సలిలను వెంటనే గుర్తు పట్టింది.

చాలా కాలం తరువాత కలసిన స్నేహితురాళ్లు పట్టలేనంత ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు అది పబ్లిక్ ప్లేస్లో అన్న విషయం విస్మరించి.

అందరూ వీరినే కుతూహలంగా గమనించసాగారు.

అది చూసిన సలిల ''పద.. ఇక్కడికి మా ఇల్లు దగ్గరే. మా ఇంటికెళ్లి అన్ని విషయాలు చర్చించుకుందాం'' అంది బిల్ పే చేస్తూ.

ఇద్దరూ ఆటో మాట్లాడుకొని కూర్చున్నారు. అరవిందలో మునుపటి వాగ్ధాటి లేదనిపించింది సలిలకు.

నాన్ స్టాప్ గా గంటలు గంటలు మాట్లాడగల ఆ అరవింద వేరు.. ఏదో కోల్పోయినట్లుగా స్థబ్దుగా అడిగిన మాటకే సమాధానమిస్తూ గంభీరంగా ఉన్న ఈ అరవింద వేరు అనిపించింది.

అసలు అరవిందకు, 'అమెరికా అరవింద' అన్న నిక్ నేమ్ ఉండేది. కాలేజీలో చదివే రోజుల్లో అరవింద కబుర్ల నిండా అమెరికా ప్రస్తావన తప్ప మరేమీ దొర్లేది కాదు. అందుకే అందరూ కలసి ఆమెరికాపేరు తగిలించేశారు 'నేను పెళ్లంటూ చేసుకుంటే అమెరికా అబ్బాయినే చేసుకుంటాను. అక్కడే సెటిలవ్వుతాను. నా కోసం మా డాడీ ఎంత డబ్బు పోసైనా అమెరికా సంబంధం తెస్తారు' అనేది గొప్పగా.

" అయితే అరవిందా.. నువ్వు అమెరికా అబ్బాయినే పెళ్లి చేసుకున్నావా?" ఆనాటి ఆమె పలుకులు జ్ఞప్తికి వచ్చిన సలిల అడిగింది అరవిందను.

కాఫీ, టిఫిన్స్ సేవించి నింపాదిగా కూర్చున్నారప్పుడు.

సలిల ఆ ప్రశ్న వేయగానే అరవింద ముఖం వివర్ణమైంది ఒక్కసారిగా చేతుల్లో ముఖం దాచుకుని రోదించసాగింది. ఆమె ఏడుపు ఉధృతికి భుజాలు ఎగిసిఎగసి పడుతున్నాయి.

సలిల తెల్లబోయింది. "అరవింద ఎందుకలా రియాక్టయ్యిందో ఆమె ఊహకు అందలేదు."

" ఏమైంది అరవిందా? నేను ఏమన్నా తప్పుగా మాట్లాడానా? డిడ్ ఐ హర్ట్ యు?" అడిగింది ఆమె వీపు మీద నిమురుతూ.

అరవింద ఏడుపు ఆపి కళ్లు తుడుచుకుంది. కళ్లు ఎర్రగా మంకెన పువ్వుల్లా ఉన్నాయి.

" ఏం లేదు సలిలా.. ఆ అమెరికా మీద మోజే నా కొంప ముంచింది" అంది వెక్కుతూ.

"కాస్త అర్థమయ్యేట్లుగా చెప్తావా?" అడిగింది సలిల.

"మొదట్నుంచీ అమెరికా అన్నా, అక్కడి జీవనశైలి అన్నా నాకెంత ఇష్టమో నీకు తెలియనిది కాదు. ఒక్కగానొక్క కూతుర్ని అని నాన్న నేను కొండమీది కోతిని అడిగినా తెచ్చిచ్చేంత గారాబంగా

పెంచారు. నేను కోరుకున్నట్లుగానే పది లక్షల కట్నం ధారపోసి ఫారిన్ సంబంధం తెచ్చారు. అతడి వెంట ఆనందంగా అమెరికా వెళ్లిన నాకు దారుణంగా మోసపోయానని అర్థమైంది. అతడికి అప్పటికే వివాహమైందన్న చేదునిజం తెలుసుకున్న నేను షాక్ తిన్నాను. గ్రీన్ కార్డ్ హోల్డర్ అయిన ఒకమ్మాయిని ఇదివరకే పెళ్లి చేసుకున్న నా భర్త, కట్నం కోసం నన్ను కూడా పెళ్లి చేసుకుని నా గొంతు కోశాడన్న విషయం అర్థమైన నేను విలవిలలాడాను. గుండెలు పగిలేలా ఆక్రోశించాను. కానీ నా వ్యధ అరణ్యరోదనగానే మిగిలిపోయింది. ఇండియాలో ఉన్న నాన్నకు నా దీనస్థితి చెప్పేందుకు మనసు రాలేదు. కూతురు కోరుకున్నట్లుగానే అమెరికా సంబంధం తెచ్చిన ఆయన నేనేదో స్వర్గసుఖాల్లో తేలియాడుతున్న భ్రాంతిలో ఆనందంగా జీవిస్తున్నారు. ఆయన ఆనందాన్ని పాడు చేయకూడదనుకున్నాను. కానీ... నా భర్త అనే మానవమృగం నన్ను మనశ్శాంతిగా ఉండనీయలేదు. నా అసహాయతను అలుసుగా తీసుకొని తరుచూ డబ్బు కోసం పీడించేవాడు. నాలో సహనం నశించింది. ఓపిక చచ్చిపోయింది. అక్కడే ఉన్న మన తెలుగు సంఘం వాళ్లని ఆశ్రయించి న్యాయం జరపించమని ప్రార్థించాను. కొంతమంది సహృదయులు పూనుకొని నన్ను ఆ ఊబి లోంచి బయటపడేశారు. అతడి పాస్పోర్ట్ రద్దు చేయించారు. ఉన్న ఉద్యోగం ఊడింది. మొదటి భార్య ఛీకొట్టింది. అతడు చేసిన మోసాన్ని గుర్తించిన న్యాయస్థానం నాకు, అతడికి విడాకులు మంజూరు చేసింది. జీవితం మోడువారిందన్న బాధ తప్ప, నాలో ఇంకేం లేదు. నాలాగే ఎందరో ఆడపిల్లలు అమెరికా సంబంధాల మోజులో పడి ఇక్కట్లపాలవుతున్నారు. నా జీవితం వారికి గుణపాఠం కావాలి..."

సుదీర్ఘంగా చెప్పిన అరవింద కన్నీటి కథ విన్నాక సలిల బరువెక్కింది. యుగాలు నూరినా, తరాలు మారినా సగటు ఆడదాని వ్యధ మాత్రం మారలేదు. అనాదిగా రకరకాల హింసలకు గురవుతూనే ఉంది.

ఏమిటీ పరిస్థితి? ఎందుకీ అన్యాయం? మూగగా ఘోషించింది సలిల మది.

"సారీ అరవిందా! పాత కథనంతా తిరగతోడి నీ మనసు కష్ట పెట్టినట్లున్నాను" అంది సలిల.

"ఫరవాలేదు. ఆప్తుల ముందు బాధ వెళ్లగక్కితే మనసు బరువు తీరి హాయిగా ఉంటుంది" బలవంతంగా నవ్వింది అరవింద. కాస్సేపు ఆ మాట ఈ మాట చెప్పుకున్నారు.

ఏదో గుర్తొచ్చినట్లుగా సడెన్గా అడిగింది అరవింద.

“నా గురించి చెప్పాను. నీ సంగతి చెప్పు. శ్రీవారు ఏం చేస్తూంటారు?'' చెప్పింది సలిల. అరవింద కోరిక మీద కిరణ్ ఫోటో తీసుకొచ్చి చూపించింది.

ఫోటో చూస్తూనే ఆశ్చర్యపోయింది ఆమె.

''ఇతనూ...'' అడిగింది విస్మయంగా.

''మా వారు. పేరు కిరణ్. జూనియర్ కాలేజీలో మ్యాథ్స్ లెక్చరర్గా చేస్తున్నారు'' మళ్లీ చెప్పింది సలిల.

''ఇతడు కిరణ్. కానీ లెక్చరర్ మాత్రం కాదు!'' అంది అరవింద.

''మా వారు నీకు తెలుసా?'' వింతగా చూస్తూ అడిగింది సలిల.

“ఊ.. కిరణ్ నాకు బాగా తెలుసు'' ఎక్కడో ఉన్నాయి అరవింద ఆలోచనలు.

''ఎలా?'' ఆతృతగా అడిగింది సలిల. కిరణ్ గురించి కొత్త కొత్తగా తెలుస్తున్న నిజాలు ఆమె మదిలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పుడు అరవింద ఏం చెప్పబోతోందోనన్న ఆందోళన ఆమెను పట్టి కుదిపివేస్తోంది.

'భగవంతుడా! కిరణ్ గురించి నేను వినలేని విషయాల్ని మాత్రం చెవిన పడనివ్వకు' మనసులోనే దేముడిని వేడుకుంది.

ఆ తరువాత కిరణ్ గురించి తనకు తెలిసిన విషయాన్ని అరవింద చెప్తూంటే శ్రద్ధగా వింది సలిల.

ఆమె మనసు అల్లకల్లోలంగా ఉంది.

తనకు సంబంధించిన ఇన్ని విషయాల్ని అతడు తన దగ్గర ఎందుకు దాచినట్లు? అతడి ఆంతర్యం ఏమిటి? తనను ఏమార్చాలన్న ఉద్దేశ్యంతో ఇవన్నీ చేసినట్లయితే తననింతగా ప్రేమించడు.

రకరకాల భావాలు మెదడులో దూరి గందర గోళం సృష్టించసాగాయి.

"నీ అంత నువ్వుగా బయటపడకు సలిలా. నిజానిజాలు బయటపడే వరకు వేచి చూడు. భార్యాభర్తల మధ్య మూడో మనిషి జోక్యం ఉండకూడదు. తొందరపడి నేను చెప్పిన విషయాలను కదిపేవు సుమా!"

బయలుదేరే ముందు హెచ్చరించింది అరవింద.

అలాగే అన్నట్లు తలూపింది సలిల. ఆమె మనసు గాలివానలో పూలతీగలా అల్లాడిపోతోంది. మోసాల్ని సహించలేని ఆమె హృదయం గాయపడిన పావురాయిలా విలవిల తన్నుకుంటోంది.

కిరణ్ ఏ ప్రయోజనాన్ని ఆశించి ఇన్ని నిజాలు తన నుండి దాచాడో ఆమెకు బోధపడడం లేదు ఎంతగా ఆలోచించినా.

ఆమె ఆత్మాభిమానం దెబ్బతింది. ఇన్నాళ్ల సంసార జీవితంలోనూ ఏనాడూ ఇలా జరగలేదు.

ఏది ఏమైనా కిరణ్ ఎందుకింత నాటకమాడాడో కనుక్కొని తీరాలి.

యస్... తను సాధిస్తుంది. అతడి నాటకాన్ని బట్టబయలు చేసి తీరుతుంది.

ఏదో తెలియని కొత్త ఉత్సాహం ప్రవేశించింది సలిలలో.

★★★

తన గదిలో సర్వం కోల్పోయిన దానిలా దిగులుగా కూర్చుని ఉంది తపతి. ఆమె కళ్లు ఏడ్చి ఏడ్చి ఉబ్బి ఉన్నాయి.

ఆమె కూర్చున్న మంచం మీద ప్రముఖ టీవీ ఛానెల్స్ వాళ్లు ఆమె తమ ఛానెల్ వాళ్లు నిర్వహిస్తున్న సంగీత పోటీల్లో పాల్గొనేందుకు ప్రాథమిక అర్హత సంపాదించిందని తెలియజేస్తూ పంపించిన ఉత్తరాలున్నాయి.

వాటిని చూస్తూంటే ఆమెకు ఆనందం కలగడం లేదు సరికదా అంతులేని దుఃఖం ఆవరిస్తోంది. అవి తనకు తెలియకుండానే తను వేసిన తప్పటడుగుకి లభించిన బహుమానాలన్న భావన కలుగుతోంది.

తన శీలాన్ని పణంగా పెట్టి విజయానికి దారులు వెతుక్కుందా తను!

నైతికంగా పతనమయ్యి విజయసోపానాలు అధిరోహించబోతోందా? శారీరకంగా చెడిపోయిన తనకు ఇంకా ఈ లోకంలో జీవించే అర్హత ఉందా?

తల్లి మాటలను పెడచెవిన పెట్టినందుకు గొప్ప మూల్యమే చెల్లించాల్సి వచ్చింది.

తనలో ఉన్న టాలెంట్స్ ని వెలికి తీసి తనని ప్రోత్సహిస్తున్నట్లే నటించి అధఃపాతాళంలోకి తోసిపారేశాడు ఆ కార్తీక్.

అతడు గుర్తుకు రాగానే ఆవేశంతో పిడికిళ్లు బిగుసుకున్నాయి. ముక్కుపుటాలు అదరసాగాయి.

ఆ చీట్.. తననెలా వంచించాడో తలచుకున్న కొద్దీ ఆమెకు ఒళ్లు మండిపోతోంది. అమాయకమైన పావురం జిత్తులమారి వేటగాడి వలలో చిక్కినట్లు, తను అతడి మాయమాటల వలలో చిక్కుకుపోయింది.

కొత్తగా రెక్కలు వచ్చిన పక్షి పిల్ల లాంటి తను స్వేచ్ఛగా ఎగిరే విధానం తెలియక రెక్కలు తెగి నేల కూలింది.

ఛీ... తానెంత ఫూలిష్ గా అతడిని నమ్మిందో తలుచుకుంటే తన మీద తనకే జాలి, అసహ్యం కలుగుతున్నాయి.

ఆ రోజు... అతడి మాటలు నమ్మి అతడి వెంట వెళ్లి తన సర్వస్వమూ అర్పించిన రోజు.. కాదు.. కాదు తన సర్వస్వాన్నీ అతడంతట అతడుగా దౌర్జన్యంగా దోచుకున్న రోజు.. నిజంగా ఎంత దుర్దినం?

నాలుగు రోజుల క్రితం...పార్క్ లో కలసినప్పుడు కార్తీక్ అన్నాడు. "స్క్రూటీవీలో పాల్గొన్నావు సరే. నువ్వు కచ్చితంగా సెలక్ట్ అవుతావు. మరి ప్రాక్టీసేమైనా చేస్తున్నావా?"

"ప్రాక్టీస్ ఎందుకు? నాకు అన్ని పాటలు బ్రహ్మాండంగా వచ్చు" గొప్పగా చెప్పింది తపతి.

" కార్తీక్ నవ్వాడు. ఆమె అజ్ఞానానికి పడి పడి నవ్వాడు. చిన్న బుచ్చుకుంది తపతి.

"అయాం సారీ ఆ రావడం కాదు. ఇంస్ట్రుమెంట్స్ తో పాడగలగాలి. అప్పుడే పాట పెర్ఫెక్ట్ గా వస్తుంది. పోటీ జరిగినప్పుడు ఆర్కెస్ట్రాతో కలసి పాడాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పటి నుండి నువ్వు ఆ దిశగా కృషి చేయడం మంచిది" అన్నాడు.

" ఆర్కెస్ట్రానా... ఇప్పుడు నాకెలా దొరుకుతుంది?" నిరాశగా అంది తపతి.

ఆ క్షణాన ఆమెకు గుర్తు రాలేదు. రేడియోలోగానీ, సి. డి. ప్లేయర్లో గానీ పాటలు వస్తున్నప్పుడు దానితో గొంతు కలిపి పాడుతూ ఎక్కడ ఆపాలో ఎక్కడ స్టార్ట్ చేయాలో శ్రద్ధగా గమనిస్తే ఆటోమాటిక్ గా ఆమె ప్రాబ్లం సాల్వ్ అవుతుంది. అలా కొద్దిమార్లు సాధన చేయడం ద్వారా తనూ అంతే పెరఫెక్షన్ తో పాడగలదన్న చిన్న సంగతి ఆమె బుర్రకు తట్టలేదు.

పైగా ఆయా టీవీ ఛానెల్స్ వాళ్లు పోటీకి ముందు వాయిద్యాలతో కలిపి రిహార్సల్స్ చేయిస్తారన్న కనీస పరిజ్ఞానం కూడా లేదామెకు.

దాన్ని అడ్వాంటేజ్ గా తీసుకున్నాడు కార్తీక్.

"మరేం పర్వాలేదు. నా ఫ్రెండ్ ఒకడిది మ్యూజిక్ ఆర్కెస్ట్రా వుంది. నిన్ను అక్కడికి తీసుకెళ్తాను. వాళ్లతో కలిసి ప్రాక్టీసు చేస్తే సూపర్బ్ గా వుంటుంది" అన్నాడు ఆమె ఫేస్ ఫీలింగ్స్ ని తదేకంగా గమనిస్తూ.

"అమ్మో.. నేనెవరి రూమ్ రాను. నాకు భయం" అన్నాళ్లుగా తల్లి నూరిపోసిన నీతి పాఠాలు నరనరానా జీర్ణించుకుపోయిన తపతి బితుగ్గా అంది.

ఆడపిల్ల తన హద్దులు దాటితే ఎన్నో అనర్థాలు ఎదుర్కోవలసి ఉంటుందని ఆమెకు తెలుసు. పైగా మగపిల్లల వెంట వాళ్ల రూమ్లకీ వాటికీ తిరగడం అంత మర్యాదగా ఉండదని భావించింది తపతి.

తపతి తన మాటను తిరస్కరించిందని కోపం వచ్చింది కార్తీక్ కి.

'కొరకరాని కొయ్య' అని కసిగా అనుకోని నా మీద నీకు నమ్మకం లేదన్న మాట. నేనేమో నీ ఉన్నతి కోసం తపించిపోతూంటే నువ్వు మాత్రం నన్ను ఇన్సల్ట్ చేసేలా ప్రవర్తిస్తున్నావు. ఇన్నాళ్ల మన స్నేహంలో నువ్వు నన్ను అర్థం చేసుకున్నది ఇంతేనన్నమాట! అలిగినట్లుగా ఫేస్ పెట్టి, దీనంగా అడిగాడు కార్తీక్.

అందరు ఆడపిల్లలూ అలాంటి పంచదార బిళ్లల్లాంటి తియ్యటి మాటలకి కరిగిపోతారనుకోవడం పొరబాటు. కానీ తపతి ఉన్న పరిస్థితి వేరు. ఆమె మనసు తప్పొప్పులు ఆలోచించే స్థితిలో లేదు... ఉచితానుచితాలను ఎంపిక చేసుకునే ప్రక్రియలో ఆమె చాలా సంఘర్షణ అనుభవిస్తోంది.

అందుకే ఆ సమయంలో అతడి పాచిక పారింది. ఎత్తుగడ ఫలించింది.

అతడెంతో నేర్పుగా, చాకచక్యంగా విసిరిన ఉచ్చులో చిక్కుకుంది తపతి.

"ఛ...ఛ... నిన్ను నమ్మకపోతే వేరే ఎవరినీ నమ్మను. పద వెళదాం " అంది.

'శభాష్.. పిట్ట వలలో పడింది' అనుకున్నాడు కార్తీక్ సంబరంగా.

అతడితోపాటు అతడు చెప్పిన చోటుకి వెళ్లింది తపతి. ఆ రూమ్ వాలకం చూశాక కడుపులో దేవినట్లయ్యింది ఆమెకు.

రూమ్లో ఆ సమయంలో ఎవరూ లేరు. రూమ్ నిండా ఎక్కడ పడితే అక్కడ తాగి పడేసిన మంచి నీళ్ల గ్లాసులు, మాసిన బట్టలు, ఏవో తిని పడేసిన డిస్పోజబుల్ ప్లేట్స్, ఖైనీ పాకెట్స్ తాలూకు ఖాళీ కవర్లు... ఇలా నానా రకాల చెత్తాచెదారం వెదజల్లబడి ఉంది.

"బ్రహ్మచారి గాళ్ల గది కదా! ఇలాగే ఉంటుంది మరి!" ఆమె ఆలోచనల్ని చదివినట్లుగా అన్నాడు కార్తీక్

" ఏదో ఆర్కెస్ట్రా అన్నావు? .రూమ్లో చూస్తే ఎవరూ లేరు? ఏ ఇన్స్ట్రుమెంటూ కనిపించడం లేదు" అనుమానంగా అడిగింది తపతి. 'అఖండురాలు.. అన్నీ పసిగడుతోంది' గొణుక్కుంటూ, "ఎక్కడికో ప్రాక్టీస్ కి పోయుంటారు. ఉండు ఫోన్ చేసి పిలిపిస్తాను" అంటూ సెల్ తీసుకుని డాబా పైకి వెళ్లాడు.

జుగుప్స కలిగించే ఆ వాతావరణంలో ఇమడలేకపోతోంది తపతి. చీదరగా ఉన్న పరిసర ప్రాంతాలు చూస్తూంటే వాంతి వచ్చినట్లుగా అనిపిస్తోందామెకి.

కానీ వాళ్లు తన కళ అభివృద్ధి చెందేందుకు దోహదపడతారన్న ఆశ ఆమెని అక్కడ ఉండేలా చేస్తోంది.

ఇంతలో కార్తీక్ మేడ మీద నుంచి దిగివచ్చాడు..

“ఒక్క ఆఫ్ యాన్ అవర్లో వచ్చేస్తారు తపతీ... అందాక మనం కూల్ డ్రింక్ తాగుదాం'' అంటూ మినీ ఫ్రిజ్ ఓపెన్ చేసి రెండు కోకోకోలా టిన్స్ పట్టుకొచ్చాడు కార్తీక్.

సిప్ చేస్తూ కూర్చుంది తపతి. ఈలోగా రూమ్ని కాస్త సర్ది ఓ స్వరూపానికి తెచ్చాడు కార్తీక్.

''వెధవలు... ఒక్కొక్కడికీ ఒళ్లు బద్ధకాలు...చూడండి రూమ్ ఎలా గలీజు చేశారో'' బెడ్షీట్స్, పిల్లో కవర్స్ కూడా ఛేంజ్ చేశాడు క్షణాల మీద.

కూల్డ్రింక్ సిప్ చేస్తున్న తపతికి ఏదోలా అనిపిస్తోంది. కళ్లు వాలిపోతున్నాయి మత్తుగా. వింత మైకం కమ్ముకుంటోంది. బలవంతాన కనురెప్పలు ఎత్తి చూడాలన్న కోరిక కలిగినా అది సాధ్యపడడం లేదు. తూలిపోతున్న శరీరం ఒక పక్కకి ఒరిగిపోతూండగా కార్తీక్ తన చేతుల్లో పొదివి పట్టుకొని మంచం మీదికి చేర్చడం లీలామాత్రంగా తెలుస్తోంది ఆమెకు. అంతే.. ఆ తరువాత ఏం జరిగిందో ఆమెకి తెలియదు.

“కళ్లు తెరిచి చూసేసరికి రూమ్ అంతా చిమ్మచీకటిగా ఉంది.

కార్తీక్ అలికిడి లేదు ఎక్కడా. ఒళ్లంతా నొప్పులుగా ఉంది. లేచి కూర్చోవాలంటే శరీరం సహకరించడం లేదు. నెమ్మదిగా స్వాధీనపరుచుకొని తడుముకుంటూ వెళ్లి లైట్ స్విచ్ వేసింది. ''

ఆ లైట్ కాంతిలో తనను తాను పరికించుకున్న తపతి నివ్వెరపోయింది. నలిగిన బట్టలు, చెదిరినజుట్టు, ఒంటి నిండా ఎర్రగా కమిలిన ముద్రలు..

అస్తవ్యస్తంగా తనున్న స్థితి గమనించిన తపతికి వెంటనే అర్థమైంది తాను కన్యత్వాన్ని కోల్పోయిందని. గట్టు తెగిన గోదారిలా భోరుమంది ఒక్కసారిగా. కానీ అరణ్య రోదనను వినే నాథుడెవ్వడు.

కుమిలి కుమిలి ఏడుస్తున్న తపతి దృష్టి, తలగడ కింద గాలికి రెపరెపలాడుతున్న కాగితం మీద. వెంటనే దాన్ని తీసుకొని చదివింది. 'డియర్ తపతీ.... నువ్వందించిన అమరసుఖానికి థాంక్స్. కాకపోతే నువ్వు స్పృహలో ఉండి ఉంటే మరీ మజాగా ఉండేది. ఏం చేస్తాం? ఇప్పటికింతే ప్రాప్తం అని సరిపెట్టుకుంటాను. నెక్స్ట్ టైమ్ బెటర్ లక్. ఆ... మళ్లీ నాతో ఈ అనుభవం కావాలనుంటే ఇక్కడికే రా. అన్నట్లు ఈ కవర్లో అయిదు వందలున్నాయి. వాటిని ఉంచు. అవి నీ అందానికి

వెలకట్టి ఇచ్చినవి మాత్రం కాదు. నా ముచ్చట తీర్చుకున్నాను కాబట్టి ఏ కడుపో, కాలో వస్తే పనికొస్తాయి. బై... సీ యూ...

నీ కార్తీక్

మరొకసారి ఘొల్లుమంది తపతి. అంటే... అంటే... అతడు ఒక ప్రణాళిక ప్రకారమే తనను వశపరుచుకున్నాడన్నమాట. పిచ్చి మొద్దులా అతడిని నమ్మి సర్వం కోల్పోయింది.

తల్లి తరుచుగా తనకి హితబోధలు ఎందుకు చెప్పేదో అప్పుడు అర్థమైంది ఆమెకు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేంటి?

ఇప్పుడేం చేయాలి? ఎవరూ గమనించక ముందే ఇంటికి చేరాలి. ఆ డబ్బులు, లెటర్ తీసుకుంది.

గబగబ బట్టలు సవరించుకొని, చున్నీ తలమీద కప్పుకొని ఆటో మాట్లాడుకొని ఇంటికి చేరింది తపతి. ఆ తల్లి వీధిలోనే ఎదురుచూడకపోవడం గమనించి, హాయిగా ఊపిరి తీసుకుని చడీ చప్పుడు చేయకుండా బాత్రూమ్లో చేరి తలారా స్నానం చేసింది.

తల మీద పడుతున్న నీటి ధారలలో కళ్లల్లోంచి ఉబుకుతున్న అశృధారలు కలిసిపోతున్నాయి.

ఎంతసేపు స్నానం చేస్తే తను పునీతం అవుతుంది!

తన శరీరాన్ని శుభ్రం చేసుకుంది గానీ మోసపోయి పోగొట్టుకున్న తన కన్యత్వాన్ని ఎలా తిరిగి తెచ్చుకోలేదు!

శరీరానికి జరిగిన అన్యాయం కన్నా మనసుకి తగిలిన గాయమే ఎక్కువగా బాధపెడుతోంది ఆమెను.

నమ్మించి వంచించిన కార్తీక్ జిత్తులమారితనం తలుచుకుంటూంటే జీవితం మీదే రోత కలుగుతోంది.

ఇప్పుడేం చేయాలి? ఏం చేయాలి?

ఆ ప్రశ్నే పదే పదే మదిలో ముల్లులా మారి గుచ్చుకోసాగింది.

షవర్లోంచి పడుతున్న నీటి జల్లులు తనను అభిషేకిస్తూ ఉంటే, మోకాళ్లలో తలదాచుకొని ఎంతసేపో రోదించింది తపతి.

ఆ మర్నాడు సాయంత్రం మళ్లీ కార్తీక్ రూమ్కి వెళ్లింది. ఆమెను చూస్తూనే వంకరగా నవ్వాడు కార్తీక్.

తన గుహలోకి అడుగుపెడుతున్న అమాయకపు జింకపిల్లను కబళించే ఆనందంతో సింహం నవ్వుతున్న నవ్వులా ఉందది.

"నాకు తెలుసు నువ్వు మళ్లీ వస్తావని. నీకు తెలియని స్థితిలోనే నువ్వు దాన్ని ఎంజాయ్ చేశావన్న మాట. కమాన్ డార్లింగ్ ఈసారి మెలకువలోనే ఆ సుఖాన్ని చవిచూద్దువు గాని" విలాసంగా ఆమె చేయి పట్టుకుని వాగాడు కార్తీక్.

ఆ చేయి విడిపించుకుంటూ అతడిని కాల్చేసేలా చూసింది తపతి.

"కొంపదీసి శపిస్తావా ఏం?" వెటకారంగా అడిగాడతడు..

"యు చీట్... నన్నెందుకు మోసం చేశావు. నా జీవితంతో ఎందుకు ఆడుకున్నావు. ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్గా నిన్ను భావించి ఆరాధించిన నన్ను మత్తిచ్చి అనుభవించడానికి నీకు సిగ్గు అనిపించలేదూ ఆక్రోశించింది. తపతి.

భుజాలు కదిలేలా విరగబడి నవ్వాడు కార్తీక్. అతడి కళ్లల్లో క్రౌర్యం సుస్పష్టంగా గోచరిస్తోంది.

" ఏం చేయను? నిన్ను పడగొట్టాలంటే అలాంటి పథకమే వేసి తీరవలసిన అగత్యం ఏర్పడింది. నీ అందం గురించి పొగిడి దగ్గరవుదామంటే అందాన్ని పొగిడేవాళ్లని నువ్వు ఆమడదూరంలో ఉంచుతావని తెలిసింది. నీ అంతటి అందాలరాశిని పొందలేని నా జన్మ వృథా అనిపించింది. అందుకే... ఎలా అయితే నువ్వు బుట్టలో పడతావో, బుర్ర పగలగొట్టుకొని ఆలోచించి మరీ ప్లాన్ చేశాను. అయినా సరే... నువ్వు నన్నొక స్నేహితుడిగానే తలచావు. నీ కాలి గోరు కూడా ముట్టుకోనీకుండా, అతి జాగ్రత్తగా మసలావు. అందుకే నిన్ను మత్తులోకి పంపి అనుభవించాను"

కార్తీక్ అంటున్న ఒక్కొక్క మాట విని విరక్తితో చావాలనిపించింది తపతికి.

అతడి మాటల్లో పాపభీతి కానీ, ఒక అమ్మాయి బ్రతుకు నాశనం చేశానన్న అపరాధ భావన కానీ ఏ కోశాన లేవు.

తల్లి ఏ విషయంలో అయితే అప్రమత్తంగా ఉండమని తనని అనుక్షణం హెచ్చరిస్తూ ఉండేదో అదే జరిగింది ఇప్పుడు. కాకపోతే మరొక మార్గంలో.

అందాన్ని పొగిడితే పడదని తెలుసుకొని, తన బలహీనతల మీద దెబ్బకొట్టి మరీ తనను వశపరుచుకున్నాడు. ఇప్పుడు తల్లికి ముఖమెలా చూపాలి?

" అయినా నువ్వు మరీ అంత జడపదార్థానివేంటే? అందాన్ని పొగిడితే ఇస్ కానీ అమ్మాయుంటుందా అసలు! బోడి తెలివితేటల్ని, లలితకళల్ని ఎవడైనా ఏం చేసుకుంటాడూ!" వ్యంగ్యంగా అన్నాడు కార్తీక్.

తను సర్వస్వం అని భావించిన అతడి నిజస్వరూపం కళ్లముందు నగ్నంగా, నిస్సిగ్గుగా కనిపిస్తూ ఉంటే తట్టుకోలేకపోయింది తపతి.

ఆడదాని పట్ల ఇంతటి చులకన భావం ఉన్న ఇతడినా ఇన్నాళ్లూ తను దేవుడని ఆరాధించింది.

స్త్రీలంటే ఎంత తేలిక! ఆడదాని అందాన్ని చూస్తే అనుభవించాలన్న కోరిక తప్ప మరే భావమూ కలగదా! తన అందమే తనకు శాపమైంది.

"టైమ్ వేస్ట్ చేయకు తపతీ. బెట్టు చేయడానికి నువ్వు ఇంకా కన్నెపిల్లవి కాదు. త్వరగా వచ్చి నా కౌగిలిలో కరిగిపో" కార్తీక్ మత్తుగా అన్నాడు.

ఏదో పురుగును చూసినంత ఏహ్యాభావంతో చూసింది తపతి అతడివైపు. తనను ఇంతగా పరాభవించిన అతడిమీద ఉమ్మేయాలనిపిస్తోంది. కానీ ఒక తుచ్ఛుడిని శిక్షించడానికి ఎంతో విలువైన తన లాలాజలాన్ని ఖర్చు పెట్టడమెందుకని ఆగిపోయింది.

"నువ్వు ఇంతకింత అనుభవిస్తావు. అభం శుభం తెలియని అమ్మాయిల్ని వంచించిన పాపం ఊరికే పోదు" శాంతంగా చెప్తూనే అతడు నిన్న అక్కడ పెట్టిన అయిదు వందలు తీసి ముఖాన కొట్టింది.

వాటిని ఏరుకుంటూ వద్దా... ఓహో... నీ అందానికీ మూల్యం సరిపోదుకాబోలు అన్నాడు కార్తీక్ వెకిలిగా నవ్వుతూ.

"యు షటప్ రాస్కెల్ మరొక్కమాట వాగావంటే ఏం చేస్తానో నాకే తెలియదు" హిస్టీరిగ్గా అరిచి వెనుదిరిగింది.

"ఆగు...ఇదిగో...నువ్వు స్క్రూటినీలో సెల్టిక్టయ్యావంటూ వచ్చిన లెటర్స్. వ్రతం చెడ్డా ఫలం దక్కడమంటే ఇదే కాబోలు" వికటంగా నవ్వాడు కార్తీక్.

వాటిని అందుకొని కసిగా చూసింది తపతి వాటివైపు.

ఈ బలహీనతని ఆసరా చేసుకొనే తన బ్రతుకు నాశనం చేశాడు. కోపంతో వాటిని చించేయబోయి ఆగిపోయింది తపతి. మౌనంగా వాటిని తన బ్యాగ్ లో దాచుకుని గడప దాటింది.

ఆ ఊపున తిన్నగా వెళ్లి లలితను కలిసింది.తన గోడు వెళ్లబోసుకుంది.

“వాడిని నమ్మమని నీకెవడు చెప్పాడు? అయినా నువ్వు మాకెవరికీ తెలియకుండా వాడితో స్నేహం చేశావు. ఫలితం కూడా నువ్వే అనుభవించాలి” అంది లలిత నిక్కచ్చిగా..

అలా నిష్ఠూరంగా మాట్లాడకు లల్లీ. మీ నాన్నగారితో మాట్లాడి నాకేదైనా న్యాయం చేయమను'' బ్రతిమలాడింది తపతి.

''న్యాయం చేయాలా? ఎటువంటి న్యాయం? వాడితో నీ పెళ్లి జరిపించాలా?'' ఆశ్చర్యంగా అడిగింది లలిత.

''పెళ్లా! అటువంటి ఛీట్ నెవరు పెళ్లి చేసుకుంటారు?” తన గొంతు నిండా అసహ్యాన్ని నింపుకుంది తపతి.

"మరి!”

“మరొక అమ్మాయి జీవితంతో ఈ రకంగా ఆడుకోకుండా ఫనిష్ చేయమును”

“బాగుంది. అతడిని పనిష్ చేయడానికి మేమెవరం? అతడు నా స్వంత అన్నయ్య కాదు. చిన్నాన్న కొడుకు. అయినా జరిగిన దాంట్లో నీ పార్ట్ కూడా ఉంది కదా! వాడు రమ్మన్న చోటుకి నువ్వెందుకెళ్లాలి?” కోపంగా నిలదీసింది లలిత.

''నేను అతడితో స్నేహం మాత్రమే చేశాను. కానీ అతడు నన్ను మాయ చేశాడు. ప్లీజ్ లల్లీ... ఏదైనా చేయి. ఈ స్నేహితురాలి కోసం ఆపాటి సహాయం చేయలేవా?” దీనంగా అడిగింది తపతి.

''సారీ తపతీ ఐ కాంట్ హెల్ప్. ఈ విషయంలో నేన్నీకు ఏ విధంగానూ సాయపడలేను” అంది లలిత కచ్చితంగా. హతాశురాలైంది తపతి.

స్త్రీకి స్త్రీయే శత్రువంటారు ఇందుకేనా! లలిత కేవలం తనను మాత్రమే దోషిగా పరిగణిస్తోందెందుకు? అమ్మ తరుచుగా చెప్పే ' అరిటాకు– ముల్లు' సామెత అంటే ఇదే కాబోలు.

స్నేహానికున్న విలువ మరి దేనికీ లేదంటారు. కానీ ఆ స్నేహంలో నిజాయితీ లోపిస్తే, అయినా ఇందులో ఎవరిని నిందించీ ప్రయోజనం లేదు.

అంతా స్వయంకృతం. దానికి ఫలితం తనే అనుభవించి తీరాలి.

భారమై వికలమైన మనసుతో ఇల్లు చేరింది తపతి.

★★★

ఆనాడు జరిగిన ఆ సంఘటన నెమరు వేసుకుంటే మనసంతా చేదు మాత్ర మింగినట్లుగా అయ్యింది తపతికి.

ఇప్పుడు తనేంచేయాలి? తన కళ్ల ముందు చావు తప్ప మరే పరిష్కారం కనిపించడం కాదు. అంధకారబంధురమైన ఈ బ్రతుకు బ్రతికి తనేం సాధించాలి?

వద్దు... దీనికి పర్యవసానంగా తను గర్భవతి అయితే?

గడగడ వణికిపోయింది తపతి. వద్దు... అలా జరిగితే కనుక అమ్మనాన్నలు ప్రాణాలతో మిగలరు.

ఒకవేళ ఉన్నా తలెత్తుకు జీవించలేరు. కాలనీ వాళ్లందరి దగ్గరా, ఆఫీసులోనూ చులకనైపోతారు.

తోటి స్నేహితుల వలన మహతి అవమానాల పాలవడం ఖాయం.

వీటన్నింటికీ సమాధానం తన మరణమే. కానీ చచ్చే ముందు ఆ కార్తీక్ కి బుద్ధి చెప్పాలని కోరికగా ఉంది.

అది తన వలన కాని పని. అతడికి అంగ బలం– అర్థబలం అన్నీ ఉన్నాయి. తన తండ్రి ఆశక్తుడు. ఏ విధమైన పలుకుబడీ లేని సామాన్యుడు.

కాబట్టి తను ఆ పశువు మీద పగతీర్చుకోవడం అసాధ్యం.

అందుకే తనవాళ్లు మనశ్శాంతితో జీవించాలంచే తానీ లోకం నుండి నిష్క్రమించాలి.

‘అమ్మా–నాన్నా... నన్ను క్షమించండి. మీకు తలవంపులు తెచ్చి పెట్టిన ఈ పాపిష్టి దాన్ని మరచిపోండి' ఆక్రోశిస్తూ అల్మరాలోని బ్లేడ్ అందుకుంది తపతి.

కళ్ల ముందు తల్లి, తండ్రి, అక్క అందరూ ఊహా చిత్రాల్లా కదిలి మాయమవుతూంటే పదునుగా ఉన్న ఆ బ్లేడ్తో మణికట్టు మీద నరాన్ని కోసుకుంది.

“సర్ర్...” మంటూ నరం తెగిన చప్పుడు. ఆ వెనుకే వెచ్చని, చిక్కని రక్తం ధారగా ప్రవహించడం మొదలైంది.

వంట గదిలో పని చేసుకుంటున్న హిమజ ఆ సమయంలో తపతిని గురించిన ఆలోచనలోనే మునిగి ఉంది.

గడచిన నాలుగు రోజుల్లోనూ కూతురి ప్రవర్తన ఆమెకు వింతగానూ, అనుమానాస్పదంగానూ ఉంది. పదే పదే తపతి వైఖరిని విశ్లేషించుకుంటూనే ఉంది ఆమె మెదడు.

'ఎందుకో... తపతి బిహేవియర్లో ఏదో తేడా కనిపిస్తోంది. మనిషి మన మధ్య లేనట్లుగా అనిపిస్తోంది. ఏదైనా జరగకూడనిది జరగలేదు కదా?'

ఆ ఊహకే కంపించిపోయింది హిమజ. దానికి తోడు తపతి చాలా సేపటి నుండి గదిలోంచి బయటకు రాకపోవడం ఆమె అనుమానాన్ని బలపరిచింది.

ఏదో కీడును శంకిస్తోంది తన మనసు. కొంపదీసి తపతి ఏదైనా అఘాయిత్యం చేసుకోలేదు కదా.

ప్రతీ విషయాన్ని భూతద్దంలోంచి చూసే హిమజ నిశిత పరిశీలన ఈ విషయంలో ఆమెకు మేలు చేసింది.

ఒక్క ఉదుటున వెళ్లి గది తలుపు తోసిన హిమజ అవి తెరుచుకోకపోవడంతో ఆందోళనకు గురైంది.

లోపల గడియ పెట్టబడి ఉండడంతో ఓరగా వేసి ఉన్న కిటికీ రెక్కను తోసి చూసిన హిమజ భయవిహ్వలతతో "కెవ్వున కేక పెట్టి కుప్ప కూలిపోయింది. ఆ వెంటనే షాక్తో స్పృహ కోల్పోయింది. "

★★★

"డోంట్ వర్రీ... షి ఈజ్ అవుట్ ఆఫ్ డేంజర్" చెప్పాడు తపతిని ట్రీట్ చేస్తున్న డాక్టర్.

సురేష్, హిమజ, మహిత, సలిల, కిరణ్ అందరూ ఆనందంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"థాంక్ గాడ్. ఆ దేవుడు నా మొరాలకించాడు. నా కూతురిని క్షేమంగా నాకప్పగించాడు" ఎమోషనల్గా అన్నాడు సురేష్.

"అవునండీ... నేనే కనుక తపతిని వెంటనే చూసుండకపోతే ఈపాటి..." దుఃఖంతో గొంతు పూడుకు పోయింది హిమజకు.

"సురేష్ గారూ కంట్రోల్ యువర్ సెల్ఫ్... హిమజగారూ... ఊరుకోండి. భగవంతుడి దయ వలన గట్టెక్కింది. కానీ తపతి మానసిక పరిస్థితి అంతగా బాగు లేదు. తన ప్రమేయం లేకుండా తన మీద అత్యాచారం జరగడంతో మెంటల్ డిప్రెస్ అయింది. ఇటువంటి సమయంలో తనకి సైకియాట్రిక్ ట్రీట్ మెంట్ తాలూకు అవసరం

ఎంతైనా ఉంది" సూచించాడు కిరణ్.

"యస్ కిరణ్ యూ ఆర్ ఆబ్సొల్యూట్లీ కరెక్ట్. నా ఉద్దేశ్యమూ అదే. తనని ఎవరైనా మంచి సైకియాట్రిస్ట్ కి చూపించాలి" అతడి సజెషన్ సబబైనదేనని బలపరచింది సలిల.

తపతిని ట్రీట్ చేసిన డాక్టర్నే కన్సల్ట్ చేస్తే అతడు సిటీలోకెల్లా పేరున్న మానసిక వైద్యుని దగ్గరకు తీసుకెళ్లమని సూచించాడు.

“సలిలా... నా తపతి మామూలు మనిషవుతుందంటావా?” భోరుమంది హిమజ.

తప్పకుండా ఆంటీ. అయినా ఇప్పుడేమంత కొంప మునిగిపోయిందని అలా ఏడుస్తున్నారు. శరీరానికి దెబ్బ తగిలితే మందులు వేసి మానుకుంటాం. అదే మనసుకి దెబ్బ తగిలితే... మానసికవైద్యుని సంప్రదించడానికి వెనుకంజ వేస్తాం. తపతి మనసు ఊహించని విధంగా గాయపడింది. కొద్దిపాటి కౌన్సిలింగ్తో ఆమె మామూలుగా మారుతుంది. ఇంకొక మాట... ఇప్పటికే తాను తప్పు చేశానన్న భావన ఆమెను కృంగతీస్తోంది. అందుచేత జరిగిన అనర్థాన్ని పదే పదే ఆమెకు గుర్తు చేసి తను ఇంకా బాధపడేలా చేయద్దు” నెమ్మదిగా చెప్పినా చిన్నపాటి కరుకుదనాన్ని తన పలుకులలో మేళవించి చెప్పింది సలిల.

హిమజ అపరాధభావనతో కుమిలిపోతూ “చాలు... చాలు... ఇప్పటికే నేను తనని పెంచిన విధానం లోపభూయిష్టమైనదని తల్లడిల్లుతున్నాను. నా అతిజాగ్రత్త వలనే తపతి ఇలా తయారైంది. అనుక్షణం ఆత్మ న్యూనతతో బాధపడి ప్రేమ కోసం తపించిపోయింది. స్వేచ్ఛ కావాలని ఆరాటపడింది. ఇంకా తనని వేధించి దూరం చేసుకోలేను" అంది.

సలిల జాలిగా చూసింది. హిమజ వైపు.

తను మొదట్నుంచీ హెచ్చరిస్తూనే ఉంది ఆమెను. ఆడపిల్లలను కట్టుదిట్టాలలో పెంచడం అవసరమే గానీ, తగు మోతాదులో ఆమెకు స్వేచ్ఛనివ్వడం మరింత అవసరం.

మనమిచ్చే స్వేచ్ఛను వారు ఏ మేరకు వినియోగించుకుంటున్నారో జాగ్రత్తగా పసిగడుతూ, అవసరమైన చోట అంటకత్తెర వేయాలి.

అనుక్షణం వారిని నిర్బంధంలో ఉంచి, సూటి పోటి మాటలతో

హింసించే బదులు, స్నేహితురాలిలా వాళ్లతో మెలుగుతూ వారి మనోభావాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

అప్పుడే ఆడపిల్ల మనస్సు ఏ చీడ పీడలు సోకకుండా ఆరోగ్యవంతమైన మొక్కలా ఎదుగుతుంది.

హిమజ అనే కాదు చాలామంది తల్లిదండ్రులకీ చిన్న విషయం తెలీదు. అణచి ఉంచిన కొద్దీ స్ప్రింగ్ మీదకు లేస్తుంది. గోడకు కొట్టిన బంతి అదే వేగంతో మన మీదికి వస్తుంది.

సున్నితమనస్కులైన టీనేజ్ అమ్మాయిల మనస్తత్వమూ అలాగే ఉంటుంది. వద్దన్న పనే చేయాలని, స్వేచ్ఛగా విహరించాలనీ ఆరాటం కలుగుతుంది.

తపతీ అంతే. తల్లి మాటలు ముళ్లపంజరాలై తనను బంధిస్తూంటే ఆ రక్షణ వలయాన్ని ఛేదించుకు రావాలన్న ఆదుర్దాలో తన జీవితాన్ని నాశనం చేసుకుంది.

తల్లుల్లారా మారండి. సుతిమెత్తని అమ్మాయిల మనసులని సూదిపోట్ల లాంటి మాటలతో తూట్లు పొడవకండి. అతిజాగ్రత్త పేరుతో వాళ్లని అజాగ్రత్త పాల్చేయకండి.

సలిల హృదయం ఆక్రోశించింది.

" మీరు వెళ్లి ఆమెను చూడొచ్చు. ఆమెను డిస్టర్బ్ చేయడానికి వీల్లేదు. ఆమెకు తగినంత విశ్రాంతి కావాలి" ఐ.సి.యు. లోంచి బయటకు వచ్చిన నర్స్ చెప్పింది.

ఆడవాళ్లు లోపలికి వెళ్లారు. కిరణ్ కూడా వెళ్లబోతూంటే ఆపాడు సురేష్

"సూసైడ్ అటెంప్ట్ కదా! పోలీస్ కేస్ అవుతుందేమోనని భయంగా ఉంది. దానికి తోడు ఈ మీడియా ఒకటి. బాధతో కుమిలిపోతున్న వాళ్లని రచ్చకీడిస్తే గానీ వాళ్లకి మనశ్శాంతీ ఉండదు" కూతురు ఆత్మహత్యాయత్నం చేసిందన్న వేదనతోపాటు, ఈ విషయం పదిమందికీ తెలిస్తే ఆమె బ్రతుకు అల్లరిపాలవుతుందేమోనన్న భయం కూడా తోడైంది సురేష్ కి.

అతడి భుజం మీద చేయివేసి ఓదార్పుగా తడుతూ 'డోంట్ వర్రీ సురేష్ గారూ. అలాంటివేం జరగకుండా నేను చూసుకుంటాను మీరు నిశ్చింతగా ఉండండి' హామీ ఇచ్చాడు కిరణ్.

సురేష్ తేలిగ్గా ఊపిరి పీల్చి వదిలాడు.

ఆకాశానికి రంధ్రాలు పొడిచినట్లుగా కురుస్తున్నాయి నీటి ధారలు. మీద నుండి పడుతున్న వాన ధారలను ఎవరో జల్లెడపడుతున్నట్లుగా సన్నగా జాలువారుతున్నాయి వర్షపు జల్లులు. ప్రకృతి సమస్తం ఆ వర్షంలో తడిసి పులకించిపోతోంది.

చెట్ల ఆకులు, పువ్వులు తమ ఉపరితలాల మీద అలముకున్న దుమ్మును, ధూళిని కడిగేసుకుని తాజాగా మెరిసిపోతున్నాయి.

“ఏమిటోయ్ అలా తదేకంగా చూస్తున్నావు?'' కిటికీలోంచి, కురుస్తున్న వాన అందాలను, స్నానిస్తున్న పరిసరాలను దీక్షగా చూస్తున్న సలిల తలపక్కకు తిప్పి ఆనందంగా నవ్వింది.

ఆ ఆనందం ఎందుకో కిరణ్ కి తెలుసు ఆ మదిని పరవశింపచేసే ప్రకృతి సౌందర్యం అంటే సలిలకెంత మక్కువో.

వాన కురిసిందంటే చాలు చిన్నపిల్లైపోతుంది. కాగితపు పడవలు చేసి నీటిలో వదిలి, అవి సాగిపోతూంటే మురిసిపోతుంది. చిట-పట కురుస్తున్న చినుకులలో చేతులు తప-తపలాడించుకుంటూ, నాలుకతో ఒక్కో నీటి బిందువును స్పృశిస్తూ, ఆగకుండా కురిసే వానధారలను దోసిట పట్టుకుంటూ తనని తానే మైమరచిపోతుంది.

సృష్టిలోని ఆనందాలను పరిపూర్ణంగా అనుభవిస్తూ, ఎదుటి వారు వాటిని ఆస్వాదించేలా చేయడం ఆమెకే చెల్లు.

"చూడండి అలా... వాన ఆగకుండా కురుస్తూ ఉంటే ఎంత హాయిగా ఉందో” కిరణ్ దగ్గరగా జరుగుతూ అంది సలిల.

ఆ చల్లదనంలో అతడి వెచ్చని స్పర్శ ఎంతో బాగుందనిపించిందామెకి.

“ నిజమే అన్ని సుఖాలు అమరిన మనం ఇలా అనుకోవడం సహజం. కానీ, కూలిపోవడానికి సిద్దంగా ఉన్న ఇళ్లు కలిగిన బడుగు జీవులు, ఏ కాస్త వాన పడినా జలమయమై పోయే లోతట్టు ప్రాంతాలవారు... వరద ముంపుకు గురై, ఆశ్రయం కోల్పోయే తీరప్రాంతాల వారు... వీళ్లు మాత్రం వాన రాకూడదని కోరుకుంటారు. ఋతు ధర్మం ప్రకారం వర్షం కురిసినా సరే తిట్టుకుంటారు. అల్లల్లాడిపోతారు''

కిరణ్ స్వరంలో అదోలాంటి వేదన పసిగట్టిన సలిల లాలనగా అతడి భుజం మీద చేయి వేసింది.

“ ఏమైంది కిరణ్ ఎందుకలా బాధపడుతున్నారు?'' అడిగింది ప్రేమగా.

"ఎందుకో ఈ వానని చూస్తూంటే అలాంటి అభాగ్యులు గుర్తొచ్చారు సలిలా. వచ్చే నెల నా జీతమంతా ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కి ఇచ్చేద్దామనుకుంటున్నాను'' చెప్పాడు కురుస్తున్న వాన మీద నుండి చూపు మరల్చకుండా.

"తప్పకుండా ఇచ్చేయండి. నా సేవింగ్స్ లోంచి ఓ అయిదు వేలిస్తాను. అవి కూడా ఇచ్చేయండి" అంది అతడి క్రాఫ్ లో వేళ్లు పోనిచ్చి నిమురుతూ.

కదిలిపోయాడు కిరణ్. "తను చేయాలనుకుంటున్న సత్కార్యంలో సతీమణి కూడా భాగం " పంచుకోవాలనుకోవడం అతడిని రంజింపచేసింది.

అడుగడుగునా ఇలా సహకారమందించే శ్రీమతులు ఎంతమందుంటారు? ఆ అయిదు వేలు దాచుకొని ఏ చీరో, నగో కొనుక్కోవాలని కోరుకోకుండా, ఇలా దీనుల కోసం వెచ్చించాలనుకోవడం అతనికి చాలా నచ్చింది.

"అందుకే సలిలా నువ్వంటే నాకు ఇష్టం. ప్రతి పనిలోనూ నాకు చేదోడు-వాదోడుగా ఉంటావు" ఒక దేవతని చూస్తున్నంత పూజ్యభావంతో తొణికిసలాడాయి అతడి నయనాలు.

అంతకంతకు వాన ఉధృతి ఎక్కువవ్వసాగింది. గాలి కూడా తోడవ్వడంతో జల్లులు ఏటవాలుగా కురిసి కిటికీ పక్కనున్న వీరిని కొద్దిగా తడుపుతున్నాయి. నీటి తుప్పర్లు శరీరాన్ని తాకుతూ ఉంటే మదిలో కొంటె కోరికలు పురుడుపోసుకుంటున్నాయి.

అప్రయత్నంగా ఒకరికొకరు చేరువయ్యారు.బయటి చల్లదనం, శరీరాలలో నుండి ఉద్భవిస్తున్న వేడిమి కలగలసి వారి మదిలో వింత భావాలను ఉద్భవింపజేస్తున్నాయి.

ఉన్నట్లుండి సలిల అంది. "అయ్యో వాన ఎక్కువైందండీ.. మన స్వీటీ... పిల్లలు తడిసిపోతున్నాయో ఏమో!"

ఒక్క ఉదుటున లేచి సందులోకి పరుగుతీసింది. అక్కడ పిల్లి లేదు, పిల్లి పిల్లలూ లేవు.

" ఏమయ్యాయి... ఇక్కడే కదా ఉండేవి" ఆమె వెనుకే వచ్చిన కిరణ్ అడిగాడు కంగారుగా.

"డోంట్ వర్రీ శ్రీవారు... పిల్లి తన పిల్లలను భద్రంగా కాపాడుకోవడం కోసం ఏడిళ్లలో తిప్పుతుందట. అవున్న ప్లేస్ ని ఎవరైనా గమనించి, వాటికి హాని తల్ల పెడతారన్న భయంతో వాటిని రక రకాల చోట్లకి తరలిస్తుంది. మొన్న మనం దానికూనలని చూశాంగా. అందుకే దాని జాగ్రత్తలో అదుంది" నవ్వింది సలిల.

కిరణ్ తెలియని విషయాన్ని వింటున్నట్లుగా ముఖం పెట్టాడు.

"అయ్యో లోపలికెళదాం రండి. చూడండి ఎలా తడిసిపోతున్నారో" వాలుగా తమ మీదికి వస్తున్న జల్లులో తడిసి ముద్దైన కిరణ్ చేయి పట్టుకు లాగుతూ పిలిచింది సలిల.

వానాకాలపు సాయంత్రంలోని హాయిని అనుభవిస్తూ, ఆస్వాదిస్తూ మధ్య-మధ్యలో సలిల చేసిచ్చిన వేడివేడి పకోడీలను నములుతూ చాలా చక్కగా ఎంజాయ్ చేశాడు కిరణ్.

అన్ని ఆనందాల నడుమ ఒకేఒక్క సమాధానం తెలియని ప్రశ్న వేధిస్తుంది సలిలను ఇంత సంతోషంగా తనతో గడిపే కిరణ్... తనతో అబద్ధాలెందుకు చెప్పినట్లు?

★★★

ఈమధ్య మనసు కుదురుగా లేకపోవడం వలన చాలామట్టుకు ఆర్డర్స్ ని తిరస్కరిస్తోంది సలిల. ఉన్న వర్కర్స్లో ఒకమ్మాయికి పెళ్లి కుదిరి మానేసింది. మరొక అమ్మాయికి ఎగ్జామ్స్ అని సెలవు తీసుకుంది.

దానికితోడు మనసులో కిరణ్ గురించిన సందేహాల పరంపర మొదలవ్వడంతో ఏ పని మీదా ఏకాగ్రత ఉండడం లేదు.

ఏకాగ్రత లేని మనసులో ఏ పని చేసినా కుదరదని సలిలకు అనుభవపూర్వకంగా తెలుసు.

డిటెక్టివ్ ఏజెన్సీ వాళ్ల దగ్గర నుండి ఏ సంగతీ –సమాచారం లేకపోవడంతో చూసి చూసి తనే ఫోన్ చేసింది..

"మేం ఆ పనిలోనే ఉన్నాం మేడమ్. వితిన్ డేస్ మీ ముందు మా ఎంక్వైరీ రిపోర్ట్ ఉంటుంది" చెప్పాడు మ్యానేజర్.

అప్పుడప్పుడు 'అమెరికా అరవింద' మాటలు కూడా మనసులో మెదిలేవి. కిరణ్ గురించి, వేరెవరో వ్యక్తుల ద్వారా తెలుసుకోవలసిన దుర్గతి పట్టింది తనకు.

ఫోన్ చేసి ఉప్పందించిన వ్యక్తి చెప్తే గాని అతడు ఆ కాలేజీలో పనిచేయడం లేదన్న విషయం తెలుసుకోలేకపోయింది.

అరవింద మూలాన కిరణ్ మనస్తత్వం ఎలాంటిదో తెలిసింది.

ఇకపోతే... ఆ ఎంక్వైరీ రిపోర్ట్ లో కిరణ్ గురించిన ఏయే నిజాలు నిక్షిప్తమై ఉంటాయోనన్న భయం వెంటాడుతూనే ఉంది..

నిద్రలో సైతం పీడకలలా మారి వేధిస్తూనే ఉంది.

తన భర్త మీద తానే గూఢచారి పని చేయడం వ్యక్తిత్వమున్న ఏ జాతికైనా నరకంతో సమానం.

అందులో భర్త అంటే అలాంటిలాంటి భర్తా! నారీలోకమంతా తలవంచి మొక్కదగిన వ్యక్తిత్వమున్న మగవాడు.

భార్యనీ, ఆమె విశ్వాసాన్నీ ఆదరించగలిగిన పరిపూర్ణమైన మగాడు.

స్త్రీ పురుష సమానత్వాన్ని మాటలలో కాకుండా, చేతల ద్వారా అమలుపరచి, ఆచరణలో పెట్టి చూపిస్తున్న పుణ్యపురుషుడు.

అలాంటి మగని, అనుమానించి అనుసరించడం ఏ మగువకైనా కూడని పని. కాని... ఆ పనే తాను చేయవలసి వచ్చినందుకు మానసికంగా నలిగిపోతోంది సలిల.

అప్పటికప్పుడే... తనను తానే ఓదార్చుకుంటోంది కూడా....

ఇందులో తప్పు లేదు. తన కిరణ్ ఏ మచ్చా లేని చందమామ అని నిరూపితమవ్వడానికే కదా! తనే పరిశోధనకు పూనుకున్నది...

భగవాన్! ఎవరూ నొచ్చుకోకుండా, ఏ ఉపద్రవం సంభవించకుండా నా అనుమానాలన్నీ తీరే మార్గం చూపించు.

నిజం నిగ్గు తేలాలని ఆశీర్వదించు.

మనసులోనే భగవంతుని వేడుకుంది సలిల.

★★★

"హలో సలిలగారూ ఎంతవరకూ వచ్చింది మీ డిటెక్షన్" ఫోన్ చేసి అడిగాడా అపరిచిత వ్యక్తి.

''నేనవరి మీదా డిటెక్షన్ చేయడం లేదు. అయినా నా భర్త మీదే గూఢచారి పని చేయవలసిన దురవస్థ నాకు పట్టలేదు'' తాను చెప్తున్నది తనకే అసంబద్దంగా తోచింది సలిలకు.

''ఎందుకండీ అబద్ధాలు ఆడడం అలవాటు చేసుకుంటారు. మీరు మీ భర్త గురించి ఎంక్వైరీ చేయమని ఒకానొక ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీని కన్సల్ట్ చేశారా? లేదా?'' అతడి మాటలు చెవుల్లో బాంబులై పేలుతున్న భావన కలిగింది.

'' మీకు.. మీకు.. ఎలా తెలుసు?'' గొంతు పెగల్చుకుని అడిగింది సలిల.

తాను గుట్టుచప్పుడు కాకుండా ఎంతో రహస్యంగా చేద్దామనుకున్న పని ఇలా బట్టబయలు అవడంతో షాక్ కి గురైంది.

అతడు నవ్వాడు గల-గల. డబ్బాలో గులక రాళ్లు పోసి దొర్లించినంత కర్ణకఠోరంగా వినిపించిందతని నవ్వు.

సలిల మనసులో మంటలు చెలరేగాయి. ''చెప్పానుగా నీ శ్రేయోభిలాషినని. నువ్వు వేసే ప్రతి అడుగునీ నేను గమనిస్తానని మరచిపోకు'' అన్నాడతడు.

ఆ స్వరంలో చిన్న పిసరు క్రౌర్యం తొంగిచూడడం గమనించలేకపోలేదు సలిల.

ఎవరితడు? ఇలా తనను ఫాలో అవుతూ, ఫోన్లో టార్చర్ చేయవలసిన అవసరం ఏమొచ్చింది?

“ నీకు ధైర్యముంటే నా ఎదురుగా వచ్చి నా భర్త గురించిన నిజాలు నాతో చెప్పు... అంతేగానీ, పిరికివాడిలా ఇలా ఫోన్లలో బెదిరించడాలు, చాటు మాటుగా నన్ను వెంబడించడాలు చేయడం నీకు తగదు''

ధైర్యం సడలిపోతున్నా, బింకంగా అంది సలిల. ''ప్రస్తుత పరిస్థితుల్లో నేను ఇంతకన్నా ఏమీ చేయలేను. కానీ ఒక్కటే గుర్తుంచుకో, నీ భర్త అసలు స్వరూపం బయటపడిన నాడు నేను నీకు అండగా నిలుస్తాను'' అదొక రకమైన వెటకారం ధ్వనించింది అతడి స్వరంలో..

"యు షటప్... నువ్వేం నాకు అండగా నిలబడక్కరలేదు. నువ్వు నన్నిలా టార్చర్ పెడుతున్నావని పోలీస్ రిపోర్ట్ ఇచ్చాననుకో వాళ్లే నిన్ను ట్రేస్ అవుట్ చేసి పట్టుకొని ఘనంగా సత్కరిస్తారు. మైండిట్" ఆగ్రహంగా అరిచింది సలిల. "బెస్ట్ ఆఫ్ లక్" చెప్పేసి లైన్ కట్ చేశాడవతల.

ఎంత ధైర్యం వాడికీ!? తనకి అండగా ఉంటాడుట.

పోనీ... ఇతడు తననిలా అల్లరి పెడుతున్నాడని కిరణ్తో చెప్పేసి, తన సందేహాలన్నీ తీర్చేసుకుంటేనో...

వద్దు... వద్దు... అదంత మంచి పద్ధతి కాదు.

డిటెక్టివ్ ఏజెన్సీ వాళ్లిచ్చిన రిపోర్ట్, అమెరికా అరవింద చెప్పిన సంగతులు అన్నీ సరిపోల్చిచూసుకొని అప్పుడే అతడి ముందు బయటపడాలి.

ఎందుకో ఈ సంగతి తన ప్రాణ సమానుడైన చిన్నన్నయ్య చెవిన వేసి అతడి సహాయం తీసుకోవాలని కూడా అనిపించలేదామెకి.

అసలే నీరజ ఒంట్లో బాగాలేదన్న వర్రీలో మునిగి తేలుతున్నాడతడు. ఇప్పుడీ వార్త కూడా తెలిస్తే మెంటల్గా అప్ సెట్ అవుతాడు.

అటు నీరజ దగ్గర ఉండలేక, ఇటు తన క్షేమ సమాచారాలు విచారించలేక నానా యాతన పడతాడు.

"ఇది తన సమస్య తను మాత్రమే పరిష్కరించుకోవలసిన సమస్య. ఇందులో అందరికీ ఇన్వాల్వ్ చేయవలసిన పని లేదు. ఎందుకంటే కిరణ్, తను ప్రేమించి పెళ్లాడారు. ఆ ప్రేమలో మూడో వ్యక్తి ప్రమేయం లేనట్లే ఈ చిక్కుముడిని విడదీయడంలోనూ ఇంకొకరి హస్తం ఉండడానికి వీల్లేదు... తనకీ ఒంటరి పోరాటం తప్పనిసరి! సలిల దృఢ నిర్ణయానికి వచ్చింది.

అయితే అదే ఆమె చేసిన పొరపాటు. తాననుభవిస్తున్న ఈ మానసిక సంక్షోభాన్ని అరవింద్ దృష్టికి తెచ్చుంటే ఈ చిక్కుముడి చాలా సులువుగా వీడిపోయి ఉండును. మనస్సు మబ్బులు వీడిన ఆకాశంలా నిర్మలంగా మారుదును.

ఒంటరి పోరాటం చేయాలన్న తాపత్రయంతో సలిల మనసు పరిపరి విధాల పరుగెడుతోంది.

★★★

కిటికీలోంచి కనబడుతున్న చిక్కటి చీకటి వైపు చూస్తూ కూర్చుంది తపతి. కన్ను పొడుచుకున్నా ఏమీ కానరాని కటిక చీకటి... ఆ చీకట్లో వింత వింత ధ్వనులను వినిపిస్తున్న కీచురాళ్ల అరుపులు వికృతంగా మారుమోగుతున్నాయి.

ఎంతగా మరచిపోవాలన్నా ఆనాటి ఆ సంఘటన మరచిపోలేకపోతోంది తపతి. తన అసహాయతకు అద్దంపట్టే ఆ చేదు అనుభవం పదే– పదే ఆమె తలపుల్లో మెదలుతూ మనశ్శాంతి లేకుండా చేస్తోంది.

ఆమె కాలేజీకి కూడా వెళ్లడం లేదు. ఇంట్లో నుండే చదువుకొని, ఎగ్జామ్స్ రాసేందుకు స్పెషల్ పర్మిషన్ తీసుకొచ్చాడు సురేష్ ఆమె ఆరోగ్యం బాగాలేదన్న సర్టిఫికెట్ పెట్టి.

ఇంట్లో కూచున్నా ఆమె ఆలోచనా విధానంలో మార్పు లేదు.

ఏమిటీ వ్యవస్థలోని వైచిత్రి!?

ఆడది తప్పు చేసినా, మగాడు తప్పు చేసినా ఆడదే తలదించుకోవాలి... జరిగిన దానిలో ఆమె తప్పు ఏమీ లేకపోయినా సమాజం స్త్రీనే హీనంగా చూస్తుంది. ఆమె కదలికల మీద నిఘా వేసుంచి సూటిపోటి మాటల్లో కుళ్లబొడుస్తుంది.

ఆ మానసిక హింస ఎవరికీ చెప్పుకోలేనిది. తల్లి, తండ్రి, మహతీ... వీరందరూ తనని ఎంత ఆదరంగానో చూస్తున్నారు. కానీ ఇరుగు పొరుగు మాత్రం సందు దొరికితే చాలు నీచంగా మాట్లాడుతున్నారు.. ఎప్పుడైనా బయట తారసపడితే అవహేళనగా చూస్తున్నారు. అగౌరవపరుస్తున్నారు.

తన ముందున్న జీవితం అంధకారబంధురమని తెలుస్తున్నా ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉంది,

తన భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపిస్తున్న ఈ స్థితిలో ఎటు అడుగు వేయాలి? ఏం నిర్ణయం తీసుకోవాలి?

తపతి మనస్సు ఇలా డోలాయమాన స్థితిలో ఉన్నప్పుడు ఆ గదిలో ప్రవేశించింది సలిల..

ఆమె ఈమధ్య తరుచుగా తపతిని కలసి ధైర్యం నూరి పోస్తోంది. ఎలాగైనా ఆమెకు జీవితం పట్ల ఆశ చిగురించేలా చేయాలని ఆమె తపన.

“హాయ్ తపతీ హౌ ఆర్ యూ?'' పలకరించింది లోపలికి వస్తూనే.

నిర్జీవంగా నవ్వి 'ఫైన్ అక్కా... రా'' అంది. తపతి..

మాటల్లో నిర్లిప్తత, కళ్లల్లో అలముకున్న నీలినీడలు, కళ్ల క్రింద పాకిన నల్లని చారలు, వన్నె తరగని సౌందర్యం... ఇవన్నీ తపతి మానసిక స్థితి ఇంకా కుదుటపడలేదని చెప్తున్నాయి.

అత్యంత దయనీయంగా ఉన్న ఆమె వాలకాన్ని గమనించిన సలిల హృదయం కలుక్కుమంది.

ఏమీ కాని తనకే ఇంత బాధగా ఉంటే, తల్లిదండ్రులకింకెంత నరకాన్ని అనుభవిస్తున్నారో...

డాక్టర్లేమీ దేవుళ్లు కారుగా. మంత్రగాళ్లు అంత కన్నా కాదు.

“ఛూమంతర్ కాళి'' అని ఓ మంత్రం వదిలి మనసులో ఉన్న వేదన రూపుమాపడానికీ...

తట్టుకోలేనంతగా గాయపడి, అల్లకల్లోలంగా ఉన్న ఉల్లం చల్లబడాలంటే కాస్త సమయం తీసుకుంటుంది మరి!

“ ఏమిటి విశేషాలు తపతీ.. పోటీకి ప్రిపేర్ అవుతున్నానా?'' చొరవగా అడిగింది సలిల ఆమె పక్కనే కూర్చుంటూ.

ఆమె అలా ప్రశ్నించిన ఉద్దేశ్యం వేరు. కనీసం ఆ ప్రయత్నంలోనైనా తపతి మామూలుగా అవుతుందని ఆశ.

కానీ... ఆ మాటలకి హిస్టీరిగ్గా రియాక్ట్ అయ్యింది తపతి.

''వద్దు...నాకే పోటీలు వద్దు. ప్రైజ్లూ వద్దు. నన్ను పతనమయ్యేలా చేసింది వాటి మీద నాకున్న ఇష్టమే'' పిచ్చి పట్టినట్లుగా కేకవేసింది తపతి.

అప్పటికి గానీ సలిలకు తను చేసిన పొరబాటు అర్థమవ్వలేదు.

తపతి భుజం మీద చేయి వేసి తన గుండెల్లో పొదువుకొని... కూల్ డౌన్ తపతీ. కూల్ డౌన్. డోంట్ బి ఎమోషనల్ నీలో ఉన్న కళను సాన పట్టి మెరుగుపరుచుకోమంటే అంత ఆవేశం దేనికి? లాలనగా అడిగింది సలిల.

“ఆ కళ మీదున్న వ్యామోహం వలనే కదా ఆ కామాంధుడు నన్ను గోతిలోకి దింపింది. అందుకే వాటి పేరెత్తితే కంపరం కలుగుతోంది” వెక్కుతూ అంది తపతి.

నిజమే తపతీ... నీలో ఉన్న ప్రతిభ వెలికి వచ్చింది అతడి ప్రేరణతోనే నేను కాదనడంలేదు. కానీ అవి ముందునుండీ నీలో నిద్రాణమై ఉన్నాయి. ఆ ప్రతిభ నీకు భగవంతుడిచ్చిన వరం. దాన్ని నువ్వు సద్వినియోగపరచుకుంటే అంతే చాలు. దానికి ఎవరి ప్రేరణో, సహకారమో అవసరం లేదు. నీ మీద నీకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు" ఆమెకు అర్థమయ్యేలా తెలియజెప్పడానికి ప్రయత్నించింది సలిల.

"నువ్వెన్ని చెప్పు అక్కా.. పదే పదే వాడు చేసిన నమ్మకద్రోహం గుర్తొస్తూనే ఉంది. అందుకే నాకిష్టమైన హాబీస్ మీద కూడా ఇంట్రెస్ట్ పే చేయలేకపో తున్నాను" ఏడ్చింది తపతి సలిలను అల్లుకుంది.

శరీరానికైన గాయం మందుల వల్ల త్వరగా మానుతుందేమో కానీ, మనసుకి తగిలిన గాయం పెట్టే సలుపు నుండి అంత త్వరగా తేరుకోలేదెవరూ... తపతి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుంది... అనుకుంది సలిల.

"చూడు తపతీ... నీకు ఏదన్నా ఏక్సిడెంట్ అయ్యి ఏదన్నా భాగానికి దెబ్బ తగిలిందనుకో. నువ్వేం చేస్తావు? దెబ్బ తగ్గేవరకూ మందులు వాడుతావు. తగ్గాక యధాప్రకారం నీ పనులు నువ్వు చేసుకుంటావు. ఇదీ ఒక యాక్సిడెంటే అనుకో. యాధృచ్చికంగా జరిగిన ఈ సంఘటనలో నీ ప్రమేయమేమీ లేదు. దాని కోసమని నిన్ను నువ్వు శిక్షించుకోనవసరం లేదు. ఎవరెన్ని కారుకూతలు కూసినా పట్టించుకోనక్కరలేదు. అమాయకురాలైన నిన్ను మోసపుచ్చి, నీ బలహీనతలతో ఆడుకున్న అతడు సమాజంలో తలెత్తుకు తిరుగుతున్నప్పుడు, ఏ తప్పూ చేయని నువ్వు తలెందుకు దించుకోవాలి!? చక్కగా కృషి చేసి అతడూహించనంత ఎత్తుకి ఎదిగి

చూపించు.

జరిగిన పరాభవం నీ శరీరానికి కాదు, మనసుకి కాదని గుర్తించు. శరీరానికీ అయిన గాయాల్ని మందులు వేసి ఎలా మానుకున్నావో, మనసుకైన గాయాన్ని నీలో ఉన్న నైపుణ్యాల్ని మెరుగుపెట్టుకోవడానికి తగినంత సాధన చేసి మాన్పుకో.

మబ్బులడ్డు వచ్చినంత మాత్రాన సూర్యోదయం ఆగదు. తనని కప్పిఉంచిన మేఘాలు తొలగిపోగానే దేదీప్యమానంగా వెలిగిపోతూ, జగతికి వెలుగునిస్తాడు. కాలు విరిగినంత మాత్రాన కోకిలమ్మ కూయడం మానదు. కాకపోతే ఆ గానంలో బాధ ధ్వనిస్తుంది.

నీ హృదయాన చెలరేగిన అవమానం నుండి నీ బ్రతుకుకు సరికొత్త బాటలు నిర్మించుకో. మనిషికి శారీరకమైన అందంతో పాటు, భావ సౌందర్యం కూడా అవసరమేనని చాటి చెప్పు. నిన్ను నువ్వు నిరూపించుకో

మానని పుండులా రగులుతూ సలుపుతున్న తపతి మనో మందిరం పైన, మెత్త మెత్తని మాటల పాల స్త్రీని పూసింది సలిల.

ఆమే ఒక మానసిక వైద్య నిపుణురాలిలా మారింది ఆ క్షణం.

తపతి తల మీద నిమురుతూ, చల్లచల్లగా, మెల్లమెల్లగా ఆమెలోకి సరికొత్త ఉత్తేజాన్ని ఇంజెక్ట్ చేస్తూ, ఆమె మది నిండా ధైర్యాన్ని నింపుతూ సాగిన సలిల వాగ్ధాటి సరియైన ప్రభావాన్నే చూపాయి అనడానికి తార్కాణంగా తపతి ముఖ కవళికల్లో మార్పు వచ్చింది. ఆమె వదనం వెన్నెలదీపంలా తళుక్కు మంది. వెలుతురు రేకులు సోకిన వికసిత జలజమైంది.

ఒక స్పర్శ... భగ భగ మండుతున్న మదిలో జ్వాలలను ఉపశమింప చేయగలదు.

ఒక మంచి మాట నిరాశతో కుమిలిపోతున్న మనసుకు ఔషధంలా పనిచేసి ఉపశాంతినందించగలదు.

ఇప్పుడు తపతి విషయంలో జరిగినదదే.

అవును.. అక్క చెప్పిన దాంట్లోనూ నిజముంది. తనను దొంగచాటుగా పాడు చేసిన ఆ ప్రబుద్ధుడు కాలరెత్తుకొని తిరగగా లేనిది తను మాత్రం ఎందుకు హాయిగా జీవించకూడదు?

జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను, గుణ పాఠాలుగా స్వీకరించి మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి... వేస్తుంది కూడా. ధారగా బుగ్గల మీద నుండి జాలువారుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ "యస్ అక్కా.. నువ్వన్నది సెంట్ పర్సెంట్ కరెక్ట్. నేను బ్రతికి చూపిస్తాను. శీలమనేది శరీరానికి సంబంధించినది కాదనీ, మానసికమనీ అర్థమయ్యింది నాకు. నైతిక పతనాన్ని మించినది మరేదీ లేదనీ తెలుసుకున్నాను. నాకు ఈ భూమ్మీద జీవించే హక్కు, అనుకున్నది సాధించే నేర్పు ఉన్నాయని నమ్ముతున్నాను.

"యస్... నేను బ్రతికి సాధిస్తాను. అంతే... ఎంతమంది కార్తీక్ లు వచ్చినా నన్నేమీ చేయలేరింక" స్థిరంగా చెప్పింది తపతి.

ఆనందంగా నవ్వింది సలిల. తన మీద తనకు నమ్మకం కలిగినవాడు ప్రపంచంలోని ఏ శక్తీ ఆ మనిషిని ఏమీ చేయలేదు.

మనిషిలోని సంతోషానికైనా, విషాదానికైనా మనసే ఆధారం.

ఖేదమైనా, మోదమైనా, సుఖమైనా దుఃఖమైనా, ఏ భావాలైనా... మనసులోంచే ఉద్భవిస్తాయి..

మనం కష్టపడినా ఒకరిని కష్టపెట్టినా, సుఖపడినా సుఖపెట్టాలన్నా, కలత చెందినా కలలు పండించుకున్నా, నవ్వినా ఏడ్చినా, ఓడినా గెలిచినా అన్నీ... అన్నీ ఆ మనసు చేసే గారడీలే..

రంగు, రూపు, రుచి, వాసన లేని అంతరంగాన్ని అనుసరించి, అది ఆడించినట్లే ఆడతాం. దాని అధీనంలో ఉండి మనుగడ సాధిస్తాం.

మన భావోద్వేగాలకు, రాగద్వేషాలకు ఆలవాలమైన మనసుని కళ్లెం వేసి నియంత్రించగలచిన నాడు...

మనిషికి అన్నీ విజయాలే... అంతా ఆనందమే.

అది కష్టతరమేమో గానీ అసాధ్యం మాత్రం కాదు..

తపతిలో సరికొత్తగా మొలకెత్తిన ఆత్మవిశ్వాసం ఆమెను విజయ తీరాలకు చేరుస్తుందనే ఆశిస్తోంది సలిల.

ఆ రోజు రాత్రి సలిలకు ఒక ఫోన్ వచ్చింది. ఆ మరునాడు, తమ ఆఫీసుకొస్తే ఆమె కోరిన విధంగా ఎంక్వైరీ రిపోర్ట్ అందించగలమని ఫోన్ చేశాడు మేనేజర్.

ఆ సమయంలో కిరణ్ గాఢనిద్రలో ఉన్నాడు. వైబ్రేషన్ మోడ్లో ఉంచిన సెల్ ఫోన్ తీసుకొని బయటికెళ్లి మాట్లాడింది సలిల. కిరణ్ కి నిద్రాభంగం కాకుండా జాగ్రత్త పడింది ఆమె.

ఫోన్లో మాట్లాడి వచ్చాక తిరిగి పడుకున్నా కంటి మీదికి కునుకు రాలేదు కన్ను పొడుచుకున్నా.

అలల తాకిడికి అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలా ఉంది ఆమె హృదయం.

అంతులేని అంతర్మథనంతో నలిగిపోతోందామె.

‘ ఏమని ఉంటుందా రిపోర్ట్ లో? కిరణ్ మంచి వాడనా? లేక ఇంకేమన్నా?’

వద్దు... వద్దు... తన కిరణ్ గురించి వేరేగా ఆలోచించలేదు. ఒకవేళ ... ఆ రిపోర్ట్ కిరణ్ కి ప్రతికూలంగా వస్తే... అప్పుడేం చేయాలి? ఆలోచిస్తున్న కొద్దీ తలపగిలిపోతున్నట్లుగా అనిపిస్తోంది...

కిరణ్... తన జీవితం... తన ఆశ... తన ఆలంబన... తన ఆశాకిరణం... అటువంటి కిరణ్ తనకి దూరమైతే... తను బ్రతకగలదా!?

అర్థంపర్థం లేని పిచ్చి ఆలోచనలతో గందరగోళంగా ఉంది ఆమె మెదడు.

ఎంతో సేపు... పక్కమీద అస్థిమితంగా కదిలిన మీదట, మాగన్నుగా నిద్రపట్టింది ఆమెకు.

★★★

“ నేనివాళ మీ కాలేజీకి రావాలనుకుంటున్నాను" సలిల చెప్పింది కూల్ గా, టిఫిన్ తింటున్న కిరణ్ గొంతులో ఇడ్లీముక్క అడ్డం పడి పొలమారింది. నెమ్మదిగా అతడి తలమీద తట్టి మంచినీళ్ల గ్లాసు చేతికందించింది సలిల.

అతడు కాస్త స్థిమితపడ్డాక అప్పుడడిగింది.

“ ఎవరో మిమ్మల్ని తలుచుకుంటున్నట్లుంది. లేకపోతే మీ కాలేజీకి వస్తానన్నందుకు కంగారు పడ్డారా?”

అతడలా కుడితిలో పడ్డ ఎలకలా గిలగిలలాడుతోంటే సరదాగా అనిపిస్తోంది సలిలకు.

"నువ్వు భలేదానివే.. నాకెందుకు కంగారు. కాకపోతే నీకు మా కాలేజీలో పనేంటా అని ఆలోచిస్తున్నానంతే" తన తడబాటును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశాడు కిరణ్.

అతడి ప్లేట్లో మరొక ఇడ్లీ వడ్డిస్తూ "మరేం లేదండీ.. మన ఎదురింటి వీరేంద్రనాథ్ గారి అబ్బాయిని ఇంటర్లో చేర్పించాలనుకుంటున్నారు. ఏ కాలేజీలో చేర్పిస్తే మంచిదోనని బుర్రలు పగలకొట్టుకుంటూంటే నేనే సలహా ఇచ్చాను" అంది సలిల.

“ సలహానా? ఏం సలహా ఇచ్చావు? అయినా మనకెందుకు వాళ్ల గోడవలు" మింగలేక కక్కలేక ఉన్నాడు కిరణ్.

" మీరు మరీనూ... మీ కాలేజీలో చేర్పిస్తే మంచిదని చెప్పాను. ఇందులో సలహా ఇవ్వకపోవడానికేముంది?” ఎదురు ప్రశ్న వేసింది సలిల.

"ఇస్తే ఇచ్చావులే. దానికి నువ్వు కూడా రావడం దేనికి? వాళ్ల తంటాలేవో వాళ్లే పడతారులే" గయ్ మన్నాడు కిరణ్.

సలిల అలా మాట్లాడుతూంటే చాలా చిరాగ్గా ఉందతనికి.

కానీ అతడికి తెలియదు... ఆల్రెడీ సలిల ఆ కాలేజీకి వెళ్లడం, తను అక్కడ పనిచేయడం లేదన్న విషయాన్ని కనుక్కోవడం జరిగిపోయిందని.

"నేనేదో కాని పని చేస్తున్నట్లుగా అలా చిందులు తొక్కుతారే... పైగా మీరు దీనికి సంతోషించాలి కూడానూ. నయాపైసా ఖర్చు లేకుండా ఫ్రీ పబ్లిసిటీ వస్తోంది. మీ కాలేజ్ కి. " అతడు ఉడుక్కుంటున్న కొద్దీ కవ్వించబుద్ధవుతోంది సలిలకు.

"సరే.. నీ ఇష్టం వచ్చినట్లుగా చేసుకో. కాదనడానికి నాకేం అధికారం ఉంది?" అలకపూనాడు కిరణ్.

" అయ్యో... అయ్యవారికి అతిగానే కలిగినట్లుంది ఆగ్రహం! ఓ.కె, బాబా...నేను రాను లెండి. నా రాక వలన మీకేం ఇబ్బందో ఏమో!” గడుసుగా అంది సలిల.

పసివాడిలా నవ్వాడు కిరణ్.

హమ్మయ్య! "ఇవాల్టికీ గండం గట్టెక్కింది. సలిలతో తనకు సంబంధించిన నిజాలు వెల్లడించవలసిన తరుణం ఆసన్నమైంది. వీలు చూసుకుని ఆమెకి అన్ని విషయాలూ చెప్పేయాలి మనసులోనే అనుకున్నాడు.

నిజానికి సదరు వీరేంద్రనాథ్ గారి అబ్బాయి వేరే కాలేజీలో చేరిపోయాడు. కిరణ్ రియాక్షన్ ఎలా ఉంటుందో అబ్జర్వ్ చేసేందుకే సలిల అలా చెప్పింది...

అతడి ముఖంలో తనూహించిన ఎఫెక్ట్ రావటంతో, తన పరిశోధనను ముందుకు తీసుకువెళ్లాలని సంకల్పించింది.

కిరణ్ ఆఫీస్ కి వెళ్లిపోగానే ఇంటి పని పూర్తి చేసుకుని హిమజ ఇంటికి బయలుదేరింది.

అంతకు మునుపే ఆమె మహతిని రిక్వెస్ట్ చేసింది రెండు రోజులపాటు ఆమె స్కూటీ వాడుకుంటాననీ. మహతి సరేనని కీస్ ఇచ్చేసి వెళ్లిపోయింది.

“ఆంటీ... సారీ ఫర్ ది ఇన్కన్వినియెన్స్. మహతి వెహికల్ రెండ్రోజుల్లో ఇచ్చేస్తా" చెప్పింది స్కూటీ స్టార్ట్ చేస్తూ.

"ఫరవాలేదులే సలిలా... నీకిష్టమైనన్ని రోజులు వాడుకో. ఎన్నడూ ఏదీ కోరవు. నీకెంత అవసరమైందో ఏమో” అభిమానంగా అంది హిమజ.

"థాంక్యూ ఆంటీ" స్కూటీ ముందుకురికింది పంచకళ్యాణిలా.

ఎప్పుడో, ఫ్రెండ్స్ బలవంతం మీద బండి నడపటం నేర్చుకుంది సరదాగా.. కాలేజీ రోజుల్లో కాలక్షేపం కోసం నేర్చుకున్న విద్య ఇలా ఉపయోగపడుతోందన్నమాట... ఆ టైములో ఆటోల్లో తిరిగే సహనం, సమయం రెండూ లేవు.

తనలో తనే నవ్వుకుంది సలిల. కొత్త స్కూటీ తారురోడ్డు మీద మెత్తగా సాగిపోతోంది.

“మై డియర్ కిరణ్... కొద్ది క్షణాల్లో నీ గుట్టు రట్టవబోతోంది. నేడో, రేపో నిన్ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోబోతున్నాను. బి రెడీ...” ప్రాణనాథుడిని తలుచుకుంటూ నవ్వుకుంది సలిల విజయగర్వంతో.

★★★

డిటెక్టివ్ ఏజెన్సీలోకి వెళ్లి రిపోర్ట్ కలెక్ట్ చేసుకొని, అంత త్వరగా పని ముగించి పెట్టినందుకు అభినందించి, ధన్యవాదాలు తెలియజేసింది సలిల.

“ఆయన మీ శ్రీవారే కద మేడమ్" ఆసక్తిగా అడిగిన మేనేజర్ కి ఏ సమాధానం ఇవ్వకుండా నవ్వుతూ.

“ మీకభ్యంతరం లేకపోతే... ఇక్కడే కూర్చుని ఈ రిపోర్ట్ చదవచ్చా” అభ్యర్థనగా అడిగింది..

"భలే వారే మేడమ్.. తప్పకుండా కూర్చోండి" అన్నాడు మేనేజర్

"థాంక్యూ వెరీమచ్” చెప్పేసి, అక్కడే ఉన్న ఓ కుర్చీలో కూర్చుని సీల్డ్ కవర్ ఓపెన్ చేసింది సలిల.

మొత్తం నాలుగు పేజీలున్న రిపోర్ట్ అది.

చకచక కాగితాలు తిప్పుతూ, పావుగంటలో చదివేసింది సలిల దాన్ని. ఆశ్చర్యంతో ఆమె కళ్లు విప్పారాయి. గుండెలోని భారమంతా దూదిపింజై ఎగిరిపోయిన భావన కలిగింది ఆమెకు. కిరణ్ బాల్యానికి సంబంధించిన వివరాలతో పాటు, అతడి చదువు, ఫ్రెండ్స్, ఉద్యోగం, ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ తదితర విషయాలన్నీ సేకరించి పొందుపరిచారందులో.

కిరణ్ గురించి అమెరికా ఆరవింద చెప్పిన విషయాలన్నీ యదార్థమేనని తేలడంతో నిశ్చింతగా నిట్టూర్చింది సలిల. థాంక్ గాడ్... తన కిరణ్ ప్రవర్తనలో ఎటువంటి మరక లేదు. తను భావిస్తున్నట్లుగానే అతడు శ్రీరామచంద్రుడు. పరులకు ఉపకారమే తప్ప కలలో కూడా అపకారం తలపెట్టని మహా మనిషి. నిజంగా అతడు తన భర్తగా లభించడం తన అదృష్టం. ఆనందంతో మనసు మబ్బుల్లో విహరిస్తున్నట్లుగా ఉంది.

అంత ఆనందంలోనూ ఏదో అపశృతి... అన్నీ మంచి లక్షణాలే మూర్తీభవించిన కిరణ్, పెళ్లయిన తరువాత కూడా ఈ విషయాలన్నీ తన దగ్గర ఎందుకు దాచిపెట్టినట్లు?సరే... తినబోతూ రుచులెందుకు? రేపు అతడిని అతడి స్థావరంలోనే కలుసుకోబోతోందిగా... అప్పుడే ముఖాముఖి తేల్చుకుంటుంది. డిటెక్టివ్ ఏజెన్సీ తాలూకు ఆఫీసు లోంచి బయటపడి స్కూటీ స్టార్ట్ చేసింది సలిల.

ఆమెనే వెంటాడుతున్న రెండు కళ్లు కసిగా నవ్వుకున్నాయి.

★★★

మర్నాడుదయం కిరణ్ బయటికి వెళ్లడానికి రెడీ అవుతూండగానే తనూ తయారైపోయింది సలిల.

'ఇంత ఉదయాన్నే నువ్వు ఎక్కడికి?' నొసలు ముడివేసి అన్నాడు కిరణ్.

"అత్యవసరంగా ఒక ఫ్రెండ్ ని మీటవ్వాలి" చెప్పింది సలిల ముభావంగా.

"ఎవరో అంత ముఖ్యమైన ఫ్రెండ్" ఓరగా చూస్తూ అడిగాడు కిరణ్..

"కలిసొచ్చి చెప్తాగా" అంది సలిల ముఖంలో ఏ భావమూ, వ్యక్తపడకుండా జాగ్రత్త వహిస్తూ.

"ఓ.కే. సలిలా... సాయంత్రం పెందలాడే ఇంటికొస్తా. నీతో ముఖ్యమైన విషయం గురించి మాట్లాడాలి" బయల్దేరుతూ చెప్పాడు కిరణ్.

" ఏంటో అంత ముఖ్యమైన విషయం?" నర్మగర్భంగా అంది సలిల.

"కాస్త ఓపిక పట్టు.. అన్నీ సాయంత్రం తెలుస్తాయి" అన్నాడు కిరణ్ గంభీరంగా.

"మైడియర్ శ్రీవారూ... ఇక ఓపిక పట్టడం నా వల్ల కాదు. కాస్సేపట్లో కథ కంచికి చేరబోతోంది" మనసులోనే అనుకుంటూ అతడితో పాటే బయటకు దారి తీసింది సలిల.

అతడు బైక్ స్టార్ట్ చేసే వరకు చూసి, గోడపక్కగా పార్క్ చేసి ఉన్న స్కూటీని స్టార్ట్ చేసింది తను కూడా.

అతడు తనని గమనించకుండా జాగ్రత్తపడుతూ, అతడిని వెంబడించసాగింది.

కాస్సేపు ప్రయాణించిన కిరణ్ ఓ అధునాతన భవంతి దగ్గర ఆగడం, లోనికి వెళ్లి కొద్ది నిముషాల్లోనే అట్టహాసంగా తయారై, ఒక కార్లోకి ఎక్కి కూర్చోవడం, అతడు కూర్చోంగానే కార్ రయ్ మంటూ సాగిపోవడం ఇవన్నీ చాటు నుండి గమనించింది సలిల.

వెంటనే అతడిని ఫాలో అయ్యింది నీడలాగ.. కార్ సిటీ లిమిట్ దాటింది. చిన్న చిన్న పల్లెల్ని దాటుకొని హైవే మీదికి మరలింది. అలా కొంచెం దూరం ప్రయాణించి, మరొక పల్లె దారి పట్టింది.

మహానుభావుడికి ఈ స్థలం కారుచవగ్గా దొరికినట్లుగా ఉంది. పోయి పోయి ఇంత దూరంలో పెట్టాడు తన డెన్... విసుగ్గా అనుకుంది సలిల.

అలా వెళ్లి ఒక గేట్ ముందు ఆగింది కారు. గేటు ముందున్న సెక్యూరిటీ సెల్యూట్ చేసి గేటు తీశాడు.

అతడి కారు లోపలికి వెళ్లగానే తిరిగి గేటు మూశాడు.

ఒక పావుగంట దాటిన తరువాత తను కూడా గేటు దగ్గరికి చేరుకుంది సలిల.

ఆమెను లోపలికి పోవడానికి వీల్లేదంటూ అటకాయించాడు సెక్యూరిటీ.

“మీ ఐడెంటిటీ చూపించండమ్మా... స్పెషల్ పర్మిషన్ లేనిదే లోపలికి పోనివ్వరు" అన్నాడు కచ్చితంగా.

"నేను.." ఇంకా ఏదో చెప్పబోతున్న సలిల ఆగిపోయింది.

" ఏయ్ మదీనా... ఆవిడని అడ్డగించుతున్నావేంటి? ఆవిడ ఎవరనుకున్నావు? మన ఎం.డి. సార్ మిసెస్" అంటూ మందలించాడు అప్పుడే అక్కడ బైక్ ఆపిన ఒక యువకుడు.

అతడు.. ఆరోజు డిపార్ట్ మెంటల్ స్టోర్స్లో కనిపించిన యువకుల్లో ఒకరుగా గుర్తించింది సలిల పలకరింపుగా నవ్వాడు ఆ అబ్బాయి.

"గుడ్ మార్నింగ్ మేడమ్" విష్ చేశాడా యువకుడు.

"క్షమించండమ్మా... ఎవరో బయటివాళ్లనుకొని ఆపాను. మీరెళ్లండమ్మా... అమ్మా... సార్తో నా గురించి చెప్పకండేం" భయం భయంగా అన్నాడు మదీనా.

సలిల నవ్వుతూ “నువ్వేం తప్పు చేశావని నీ మీద కంప్లైంట్ ఇస్తానూ...నీ డ్యూటీ నువ్వు చేశావు. అయినా నేనెవరో ఏంటో నీకు తెలియదు కదా” అంటూ స్కూటీ స్టార్ట్ చేసింది మళ్లీ.

మెయిన్ గేట్ నుండి సరిగ్గా అర కిలో మీటర్ దూరం ఉంది ఆఫీస్ బిల్డింగ్. దారిపొడుగునా, బాటకిరువైపులా ఉన్న రకరకాల పూలమొక్కలు, అశోకవృక్షాలు మొదలైన వాటితో పచ్చగా కళకళలాడిపోతోంది ఆ ప్రదేశం.

ఆఫీస్ ఎదుట స్కూటీ పార్క్ చేసి, తలెత్తి బిల్డింగ్ మీద భాగంలో చూసింది సలిల..

'సలిల సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్' అని బంగారు రంగులో పెద్ద పెద్ద అక్షరాలు పొదిగి ఉన్న బోర్డ్ ఉంది భవనం ఉపరితలాన.

'అయ్యగారికి తనంటే ఎంత ప్రేమో!...' మురిపెంగా అనుకొని లోపలికి నడిచింది సలిల.

సెంట్రల్లీ ఎయిర్ కండిషన్ చేయబడిన ఆఫీస్ చాలా విశాలంగా, అందంగా ఉంది.

వెయిటింగ్ హాల్లో మెత్తటి ఖరీదైన సోఫాలు వేసి, ఇండోర్ ప్లాంట్స్ అమర్చి చక్కటి లుక్ తీసుకొచ్చారు.

తిన్నగా రిసెప్షనిస్ట్ దగ్గరకు వెళ్లి “ మీ ఎం.డి. సార్ ని కలుసుకోవాలి'' అంది సలిల.

" అపాయింట్ మెంట్ ఉందా?” తలెత్తకుండొనే అడిగింది ఆ అమ్మాయి.

''నేనవెరో తెలిస్తే మీరా ప్రశ్న వేయరు?” చిరు నవ్వుతో అంది సలిల.

ఆమె చప్పున తలెత్తి చూసింది. “ మీరూ...'' అడిగింది ఆశ్చర్యంగా.

“ అయాం మిసెస్ సలిలా కిరణ్'' గంభీరంగా చెప్పింది సలిల.

"అయాం సారీ మేడమ్. ఎవరో అనుకొని... అయినా సామాన్యుల్లా నన్ను పర్మిషన్ అడగడం దేనికి? సార్ ఛాంబర్లోకి స్వయంగా దూసుకుపోయే హక్కు మీకుంది''

ఎంతో పొలైట్గా చెప్పింది ఆ అమ్మాయి.

నిరాడంబరంగా ఉన్న సలిల వైఖరి ఆమెకెంతో ఆశ్చర్యాన్ని కలుగజేసింది. లేత గులాబీ రంగు వెంకటగిరీ జరీ చీర, అలాంటిదే బ్లౌజ్... మెడలో ఒంటి పేట సూత్రాల గొలుసు, సింపుల్ డిజైన్తో ఉన్న నల్లపూసలు, ఒక చేతికి నాలుగే నాలుగు బంగారు గాజులు... మరొక చేతికి వాచీ... ముఖానికంతటికీ అలంకారంగా వెలిగిపోతున్న చిరుదర హాసం. ఏమేకప్ వేసుకోకపోయినా, అద్భుతంగా మెరిసిపోతున్న సలిల సౌందర్యాన్ని చూసి 'సార్ అదృష్టవంతులు... మేడమ్ చాలా బ్యూటిఫుల్ గా ఉన్నారు' అనుకుంది మనసులోనే.

"చూడండి... సార్ ఫ్రీగానే ఉన్నారు కదా. ఏమైనా అఫీషియల్ మీటింగ్స్ ఉన్నాయేమోనని తెలుసుకోడానికే మిమ్మల్ని పర్మిషన్ అడిగింది" అంది సలిల.

ఒక సాధారణమైన వ్యక్తిలా, తనని అనుమతి కోరుతున్న ఆమె సంస్కారానికి అబ్బురపడింది రిసెప్షనిస్ట్. తలుచుకుంటే, ఎవర్నీ లెక్క చేయక లోపలికి దూసుకుపోగలిన చొరవ, స్వతంత్రం హక్కులు ఆమె కలిగి ఉంది. అయినా సరే... ఎంత మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తోంది?

సత్ప్రవర్తన మనిషికి వన్నెనిస్తుంది అనుకోకుండా ఉండలేకపోయింది ఆమె.

ఆఫీస్ స్టాఫ్ కోసం విడివిడిగా కట్టించిన క్యూబికల్స్ అన్నీ దాటుకొని ఒక రాజకుమార్తెలా ఠీవిగా,దర్పంగా ముందుకు తరలిపోతున్న సలిలను ఆశ్చర్యంగా చూడసాగారు అందరూ.

శాపవశాత్తు భువి నుండి దివి మీద జీవిస్తున్న అప్సరసలా తోచింది ఆమె వారి కళ్లకు.

ఎం.డి. పర్సనల్ ఛాంబర్ ముందు ఆగి ఒక్కసారి గుండెల నిండా గాలి పీల్చి వదిలింది సలిల.

అనుకోకుండా తననిక్కడ చూసి కిరణ్ ఎలా రియాక్టవుతాడు?

ఆ సమయంలో అతడి ముఖంలో మారే భావాల రంగులను గమనించాలి. నవ్వుకుంట్లూ, డోర్ మీద చిన్నగా తట్టి "మే ఐ కమిన్" అడిగింది సలిల లోగొంతుకతో.

★★★

సరిగ్గా అదే సమయానికి కార్తీక్ తన తోటి స్టూడెంట్స్ తో కలసి మంత్రాలోచనలో మునిగి ఉన్నాడు.

తాను తపతిని అంతగా పరాభవించినా ఆమె ఏమీ ఖాతరు చేయనట్లుగా ధీమాగా తిరగడం అతని గుండెను రగిల్చేస్తోంది.

ఈమధ్య కాలంలో అతడు ఆమె వెంట పడి రెండు మూడు సార్లు అల్లరి చేయబోయాడు.

అమె భయపడలేదు సరికదా... చెప్పుతో సత్కరించింది ఓసారి.

అంతేకాదు... ఆ సంగతి తండ్రితో చెప్తే అతడు కిరణ్ సహాయం అర్థించాడు.

ఆ ఏరియా పోలీస్ ఇన్ సెక్టర్ కిరణ్ కి బాగా తెలిసినవాడు కావడంతో, అతడి సహాయంతో మెత్తగా దేహశుద్ధి చేయించాడు కిరణ్.

నోట్లో వేలు పెడితే కొరకలేనంత అమాయకురాలైన తపతి ఈ రకంగా రెచ్చిపోవడం వెనుక కిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ధైర్యముందని తెలుసుకున్న కార్తీక్ అతడి మీద పగ పెంచుకోసాగాడు.

అదునుచూసి అతని మీద ప్రతీకారం తీర్చుకోవడానికి తన స్నేహితులతో కలసి వ్యూహరచన చేయసాగాడు.

సమయం చూసి దెబ్బతీయడానికి పంజా సిద్ధం చేసుకుంటున్న పులిలా, అతడు పథకం రూపొందించాడు.

"ఒరేయ్ కిరణ్... ఇవాళ నీ అంతు చూస్తానురా... నీకేమాత్రం సంబంధం లేని మ్యాటర్లో కలుగజేసుకున్నావ్... మాతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో... చూపిస్తాను..." పట పట పళ్లు కొరుకుతూ కుటిలంగా నవ్వాడు కార్తీక్.

అతడి మీద దాడికి యంత్రాంగం సిద్ధమైపోయింది ఆ క్షణమే.

★★★

"యస్ కమిన్... గంభీరంగా వినిపించింది కిరణ్ స్వరం.

అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వెళ్లి, గొంతు సవరించుకొని "గుడ్ మార్నింగ్ మిస్టర్ రాజ్ కిరణ్" అంది సలిల కూల్ గా.

వెనక్కి తిరిగి ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్న కిరణ్ తనకెంతో సుపరిచితమైన అర్ధాంగి స్వరం విని గిర్రున ఇటు తిరిగాడు.

ఎదురుగా... తనెంతో ఆరాధించి, ప్రేమించి పెళ్లాడిన తన ప్రియసతి... సలిలను గాంచి విస్మయం చెందాడు.

ఎప్పుడో అప్పుడు... సలిలకు నిజం చెప్పేయాలనుకున్నాడు. ఈ సాయంత్రం ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నాడు అందుకోసం.

కానీ... ఇంత సడెన్గా ఇప్పటికిప్పుడు ఆమె తనకి 'షాక్' ఇస్తుందని ఊహించలేదు. వెంటనే లైన్లో ఉన్న అవతలి వ్యక్తికి ఫోన్ పెట్టేయమని చెప్పాడు.

ఆమె ఇచ్చిన సడెన్ సర్ ప్రైజ్ నుండి తేరుకుంటూ...

"హార్టీ వెల్కమ్ టు మై స్వీట్ హార్ట్ మిసెస్ సలిలా కిరణ్" చెప్పాడు తల వంచి అభివాదం చేస్తూ.

మహారాణిలా, హుందాగా అతడి ఆహ్వానాన్ని మన్నిస్తున్నట్లుగా తలూపింది సలిల. కిరణ్ వదనంలో ఆమె ఎదురు చూసిన తడబాటుగానీ, కంగారు గానీ కనిపించకపోవడం ఒకింత వింతగా అనిపించింది ఆమెకు.

"శ్రీవారు నన్నిక్కడ చూసి షాక్ తింటారనుకున్నాను" ఓరగా అతడినే చూస్తూ అంది సలిల.

కిరణ్ తమాషాగా భుజాలెగరేసి, ఏదో ఒకరోజు అసలు విషయం చెప్పి నేనే నిన్ను సర్ప్రైజ్ చేయాలనుకున్నాను. కానీ ఊహించని విధంగా నువ్వే నాకు 'స్వీట్ షాక్' ఇచ్చావు నవ్వాడు చిన్నగా. సలిల కూడా నవ్వింది. తన మొగుడు ఉద్దండ పిండం... కింద పడ్డా మీద వాడినే అంటున్నాడు. చేసిన పొరపాట్లను అందంగా సమర్ధించుకోవడం అందరికీ చేతకాని విద్య.

"ఇలా రిలాక్స్డ్ గా కూర్చో డాళింగ్... ఎలాగూ నేనెవరో, ఏమిటో కనిపెట్టేశావు కాబట్టి నీ దగ్గర దాచేందుకేంలేదు. ఇలా కూర్చో. తాపీగా అన్ని విషయాలు మాట్లాడుకుందాం! ఆమె చేయి పట్టి సోఫాలో కూర్చో బెడుతూ చెప్పాడు కిరణ్.

అతడి ఆదేశాన్ని పాటించింది సలిల మంత్ర ముగ్ధలా.

ఇంటర్ కమ్లో పి.ఎ.ని పిలిచాడు కిరణ్.

అతడు వచ్చి వినయంగా "యస్ సర్" అన్నాడు.

“చూడండి... నన్ను చూడ్డానికి నా మిస్సెస్ వచ్చింది. ఇద్దరం కాస్సేపు పర్సనల్ మేటర్స్ డిస్కస్ చేసుకోవాల్సి ఉంది. ఒక గంట సేపు నా రూమ్లోకి ఎవరినీ పంపవద్దు. అలాగే ఏ ఫోన్ కాల్స్ కూడా కనెక్ట్ చేయవద్దు. ప్యూన్తో చెప్పి రెండు కాఫీ పంపించండి” ఆర్డర్ వేశాడు కిరణ్.

కాఫీ వచ్చేవరకు ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు.

అక్కడి ఎ.సి. మెత్తగా చప్పుడు చేస్తోంది వాతావరణం మరీ అంత నిశ్శబ్దంగా ఉంటే బాగుండనట్లు.అక్కడే... అద్భుతంగా ఇంటీరియర్ డెకరేషన్ చేసిన ఆ గది గోడపై ఉన్న తన లైఫ్ సైజ్ ఫోటో లామినేషన్ ని చూసింది సలిల. తలంటుకున్న జుట్టు ఎగిరి అల్లిబిల్లిగా ముఖం మీద పరుచుకొని ఉండగా కిరణ్ ఏదో జోక్ చెప్పినప్పుడు నవ్వాపుకోలేని తను పగలబడి నవ్వుతూ ఉండగా... చటుక్కున తన సెల్లోంచి ఆ ఫోటో తీశాడు కిరణ్.

అదంటే అతడికిష్టం...మాటల్లో వ్యక్తపరచలేనంత ఇష్టం.

స్వేచ్ఛగా, కల్లాకపటం తెలియని పాపాయిలా నవ్వుతున్న సలిల రూపం అతడి మదిలో చెరగని ముద్ర వేసింది..

'సిరిమల్లె పువ్వల్లె నవ్వు... చిన్నారి పాపల్లె నవ్వు" అంటూ పాడుతూ ఉంటాడు ఆ ఫోటో చూసినప్పుడల్లా.

దాన్ని అతడు లామినేట్ చేయించి తన పర్సనల్ ఛాంబర్లో పెట్టుకోవడాన్ని బట్టి చూస్తే తన మీద అతడికెంతో ప్రేమని తెలుస్తూనే ఉంది.

కానీ... ఇక్కడ ప్రశ్న అతడికి తన మీద ప్రేమ ఉందా లేదా? అన్నది కాదు.

వంచనని, మోసాన్ని ద్వేషించే తన దగ్గర ఇన్నాళ్ల పాటు నిజాన్ని ఎందుకు దాచి ఉంచాడన్నదే మిలియన్ డాలర్ల క్వశ్చన్స్.

కాఫీ తాగడం పూర్తయ్యాక "ఊ... ఇప్పుడు చెప్పు నా మీద, నీ అభియోగాలేంటో. అసలు నేనిక్కడుంటానని ఎలా తెలుసుకున్నావు? నా పూర్తి పేరు 'రాజ్ కిరణ్' అని కూడా కనిపెట్టగలిగావంటే నువ్వు సామాన్యురాలివి కాదు" అన్నాడు కిరణ్ నింపాదిగా.

" అంతగా పొగడకండి. ఇందులో నా గొప్పతనమేమీ లేదు" అతడి గురించి తానెలా తెలుసుకుందో క్లుప్తంగా వివరించింది.

"వెరీ గుడ్. ఎలా తెలిసినా నేను చెప్పకుండా నా గురించి తెలుసుకున్నావు. అది చాలు నువ్వు అసాధ్యురాలివని తెలుసుకోవడానికి. ఇంకా ఏమేం అడుగుతావో అడిగేయి. నువ్వు అడగడం పూర్తయ్యాక నేను చెప్పడం మొదలెడతాను" అన్నాడు కిరణ్.

" మీరు, మా అన్నయ్య ఫ్రెండ్ 'రాజ్' ఒకరేనా?"

"అవును... అరవింద్ బెస్ట్ ఫ్రెండ్ 'రాజ్' ని, నీ 'లవ్లీ హజ్బెండ్' కిరణ్ ఇద్దరినీ నేనే" అటు-ఇటు పచార్లు చేస్తూ చెప్పాడు కిరణ్.

నివ్వెరపోయింది సలిల. అన్నయ్య ఎంత బలవంతపెట్టినా తనను చేసుకోనని, ఇలా 'కిరణ్' లా తన జీవితంలో ప్రవేశించి తన మెడలో తాళి కట్టాడన్నమాట.

కానీ అంతగా కాదన్న తననే ఏరికోరి పెళ్లిచేసుకోవాలని అతడికెందుకు అనిపించిందో మాత్రం అర్థం కాలేదు.

అదే అడిగింది కిరణ్ ని.

" అరవింద్, నేను ఇంజనీరింగ్ చదివే రోజుల్నుంచీ ప్రాణస్నేహితులం. అరవింద్ కి నువ్వంటే చాలా ఇష్టం. తరుచూ అతడి మాటల్లో నీ ప్రస్తావనే దొర్లేది. నీ అందం గురించి, నీలో ఉన్న టాలెంట్స్ గురించి, నీ సౌశీల్యం గురించి ఇంకా... ఇంకా... నీకు సంబంధించిన అనేక విషయాల గురించి అతడి నోట కథలు కథలుగా విన్న నేను నాకు తెలియకుండానే నీ పట్ల ఎట్రాక్ట్ అయ్యాను" చెప్పాడు కిరణ్ గుక్క తిప్పుకోకుండా..

" ఒక మనిషిని చూడకుండా ప్రేమించడం సాధ్యమా! రూపాన్ని చూసి, సర్వం తెలిసి వెంట పడి వలచిన ప్రేమలే క్షణాల మీద ఆవిరవుతున్నాయి. అలాంటిది మనిషితో పరిచయమనేది లేకుండా ఆరాధించడం జరిగే పనేనా?" ప్రశ్నించింది సలిల.

కిరణ్ నవ్వాడు తనదైన శైలిలో. "ఎందుకు కాదు? ఒక మనిషిని ప్రేమించడానికి కావల్సినది ప్రేమించే హృదయమే గానీ బాహ్యంగా కనిపించే రూపురేఖలు కావు"

"ఒకవేళ నేను అందంగా ఉండి ఉండకపోతే అప్పుడూ నన్నే ప్రేమించి ఉండేవారా!" లాజిక్ లాగింది సలిల.

" ఏమో! ప్రేమించి ఉండేవాడినేమో! ఎందుకంటే నీ గురించి విని ఆరాధన పెంచుకున్నాకే నీ ఫోటో చూడడం తటస్థించింది"

కిరణ్ స్వరంలోని నిజాయితీ సలిల మదిని కదిలించింది.

" మీరు తలచుకుంటే సంఘంలో మీకున్న స్టేటస్, మీరు చదువుకున్న చదువుకి నాకన్నా చదువుకున్న, అందమైన, డబ్బున్న అమ్మాయి దొరికుండేది. కానీ మీరు ఏరికోరి నన్నే ఎందుకు వరించారు?"

"నీకు గతంలోనే చెప్పాను. ఎందరో అమ్మాయిలు నన్ను పెళ్లిచేసుకునేందుకు సుముఖత చూపించి ఉండవచ్చు. కానీ వారందరూ సలిలలు కాలేరు...

"ఐ లవ్ సలిలా.... ఐ లవ్ సలిలా... ఐ లవ్ సలిలా ఫరెవర్" తన్మయత్వంగా పలికాడు కిరణ్.

పెళ్లిలో చదివిన వేదమంత్రాల్లా, పరమపవిత్రంగా అనిపించాయి సలిలకు అతడి మాటలు.

ఆమె చెవుల్లో గుండె గదిగోడల్లో కూడా ప్రతిధ్వనించింది. అతడు జపించిన ప్రేమమంత్రం... తనంటే ఎంత అనురాగం ఇతడికి!?

ఆమె తనలోని భావాలేమీ బయటపడనివ్వక "అయితే...నన్ను మీరు పెళ్లి చేసుకోవడం వెనుక మా అన్నగారి పాత్ర కూడా ఉండే ఉంటుంది" కోపం నటిస్తూ అడిగింది సలిల.

''పాత్రధారి ఏమిటి? ఈ తతంగానికంతటికీ వాడే సూత్రధారి అయితేనూ. మొదటిసారిగా నాకు నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉందని చెప్పినప్పుడు, పెద్ద ఉద్యోగస్తులను, ధనవంతులను చేసుకోవడం నీకిష్టమే లేదని, అందుచేత నా కోరిక తీర్చడం సాధ్యపడడం లేదని వాపోయాడు అరవింద్.

నాకు ప్రాప్తం లేకపోవడం చేతనే నువ్వు నాకు దక్కలేదనీ, ఇందులో నువ్వు బాధపడడానికేమీలేదని ఓదార్చాను. నీ తలపుల నుండి తప్పించుకునేందుకు ప్రాజెక్ట్ వర్క్ పేరిట అమెరికా పారిపోయాను.

కానీ... అక్కడ కూడా నిన్ను స్మరించుకోకుండా ఉండలేకపోయాను. నీవు నీ భర్తతో ఆనందంగా ఉండాలని ఆ దేముడికి ఎన్నో ప్రార్థనలు చేశాను.

ఊపిరి పీల్చుకునేందుకు ఆగాడు కిరణ్. సలిల మౌనంగా వింటోంది. కిరణ్ తో తన పెళ్లి జరగడం వెనుక ఎంత కథ ఉందో వింటున్న కొద్దీ ఆమెకు ఉక్రోషం ముంచుకొస్తోంది.

"ఆ తరువాత నువ్వు నీ సౌభాగ్యాన్ని కోల్పోయావన్న వార్త విని తట్టుకోలేని షాక్ కి గురయ్యాను. నా ఆరాధ్య దేవత బ్రతుకు ఇలా అయిపోయిందేమిటా అని ఆక్రోశించాను. నువ్వు సుఖంగా ఉండాలని ఆ దేవుడికి చేసిన ప్రార్థనలో నిజాయితీ లోపించి ఉంటుందని తల్లడిల్లిపోయాను. అలాంటి సవుయుంలోనే ... అరవింద్ చెప్పాడు. నీకు మళ్లీ పెళ్లి చేయాలన్న ఆలోచన తమకుందని, నువ్వు కూడా తటస్థంగా వ్యవహరిస్తున్నావని... అంతే... మోడువారిందనుకున్న నా హృదయ వృక్షం తిరిగి చిగురించనారంభించింది. అరవింద్ తో నా ఆకాంక్షను చెప్పాను. కానీ అతడు నీ అభిప్రాయంలో ఏ మార్పు లేదని, నన్ను చేసుకోవడానికి ఆనాటి విముఖతనే చూపిస్తున్నావని చెప్పగానే నా అంత దురదృష్టవంతుడు ఈ భూమ్మీద లేడని డీలా పడిపోయానొక్కసారిగా. అయితే ఈసారి మాత్రం నిన్ను జారవిడుచుకునేందుకు నా మనసు అంగీకరించలేదు. ఎలాగైనా నీ అభిప్రాయం మార్చాలన్న దృఢసంకల్పం కలిగింది. 'ప్రేమ' అనే శక్తి ముందు ప్రపంచంలోని ఏ వస్తువైనా తీసికట్టేనని నిరూపించదలిచాను. నా ప్లాన్ అరవింద్ తో చెప్పగానే ఎగిరి గంతేశాడు. తన చెల్లెలి జీవితంలో రాగసుధలు కురిపించడానికి వచ్చానంటూ నన్ను ఆకాశానికెత్తేశాడు''

అలసట కలగడం వలన కాస్సేపు ఆగాడు కిరణ్.

సలిల సంభ్రమాశ్చర్యాలకు గురై వింటోంది అతడు చెప్పిన విషయాన్ని.

“మీ అమ్మ నాన్నలను కలసి నా కోరికను, అరవింద్ అభీష్టాన్ని విన్నవించి, అది తీర్చుకోవడానికి నేనెంచుకున్న మార్గాన్ని వివరించాను. వారి సహాయ, సహకారాలను అర్థించాను. వారూ దీనికి అంగీకరించి, ఆమోదముద్ర వేశారు.” సలిల పెదవి కొరుక్కుంది కసిగా. ఆమె మనసులో తల్లిదండ్రుల పట్ల కినుక పెరిగిందొక్కసారిగా.

'తన వాళ్లందరూ ఈ నాటకంలో తమ తమ పాత్రలను అమోఘంగా పోషించారన్నమాట. తనకెంత మాత్రం అనుమానం రాకుండా కథను రక్తి కట్టించారు. తనే పిచ్చిమొద్దులా..' ఏడుపు ఉబికి వచ్చిందామెకు.

ఆమె కంట నీళ్లు తిరగడం గమనించిన కిరణ్ హృదయం బాధగా మూలిగింది. ఒక్క ఉదుటున ఆమెను కౌగిట్లోకి తీసుకొని లాలించాలన్న ప్రగాఢ వాంఛ కలిగింది. కానీ నిగ్రహించుకున్నాడు.

"నువ్వు హైదరాబాద్లో చదువు నిమిత్తం ఉన్నావని తెలియగానే, రెక్కలు కట్టుకుని నీ ముందు వాలాలన్న వాంఛ కలిగింది నాలో. కానీ తొందర పడితే మొదటికే ముప్పు అని గ్రహించి బలవంతాన నిగ్రహించుకున్నాను. ముందు జాగ్రత్త చర్యగా అరవింద్ పర్సనల్ ఆల్బంలోనున్న నా ఫోట లన్నీ తీసి దాచేయమని చెప్పాను. నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి కొందరు ఎన్.ఆర్.ఐ. మిత్రులసహకారంతో నీ పేరు మీదే ఈ సంస్థ స్థాపించాను. కంప్యూటర్ లో స్పెషలైజేషన్ చేసిన అనేకమంది యువతీ యువకులు సాఫ్ట్ వేర్ సంస్థల చుట్టూ ప్రదక్షిణలు చేయడం గమనించాను. వాళ్లందరికీ కాకపోయినా నాకున్న పరిధిలో కొందరికైనా ఉపాధి కల్పించదలచిన నేను, ఈ కంపెనీ మొదలు పెట్టడానికి సాహసించాను"

అతడి మాటలకు అడ్డుతగిలిన సలిల "సంస్థల చుట్టూ ప్రదక్షిణలు చేయడం దేనికి? ఇప్పుడు కాలేజ్ స్థాయినే, అనేక సాఫ్ట్ వేర్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ, తగినవాళ్లని సెలెక్ట్ చేసుకుంటున్నాయి కదా!" అతడి వాదాన్ని సమర్థించనట్లుగా అంది.

"వాటి ద్వారా సెలక్టవుతున్న వారు కొద్ది మంది మాత్రమే. మిగిలిన వారి మాటేంటి? ప్రతిభ ఉండి కూడా భయం వలనో, కాలం కలిసిరాకో, తగినంత కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడం వలనో ఏ కారణం చేతనైతేనేమి చాలామంది యువతీయువకులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు.

వారిలో కొంతమందికైనా ఉపాధి కల్పించగలిగితే అంతే చాలునన్న సదుద్దేశ్యంతోనే ఈ సంస్థ స్థాపించాను" చెప్పాడు కిరణ్ తన వాదనకు బలం చేకూర్చుకుంటూ.

సలిల మాట్లాడలేదు. అతడి పలుకులను ఖండించలేదు.

సంభాషణ ఎక్కడో మొదలై ఇంకెక్కడికో పోతోంది. అతడు చెప్పేది వినడం తప్ప వేరే ఏం చేయలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో "నా అదృష్టమో, నీ నామ మహిమో కానీ నా కంపెనీ ఆరు నెలల కాలంలోనే బాగా పుంజుకుంది. నా దగ్గర పనిచేసే చిరుద్యోగులకు సైతం మంచి జీతాలు పే చేసే స్థాయికి ఎదిగాను. ఒక సాధారణ సాఫ్ట్ వేర్ ఇంజనీర్గా నా వరకు నేను హాయిగా బ్రతకగలను. కానీ ఈ కంపెనీ అధినేతగా నాకు అదనపు సంపాదన సమకూరడంతో పాటు, పదిమందిని పోషించగలుగుతున్నానన్న ఆత్మసంతృప్తి కలుగుతోంది. ఆ తృప్తిని నేను ఎన్ని కోట్లు వెదజల్లినా కొనుక్కోలేను. నా ఆదాయం పెరిగింది. అలాగే నాకు నీ మీద ఉన్న ప్రేమానురాగాలు కూడా నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి. కాదంటావా?" సున్నితంగా అడిగాడు కిరణ్.

అతడి మాటల్లో లొసుగులెంచలేనంతగా ప్రభావితురాలైంది సలిల.

నిజమే.. తాము ఆర్థికంగా ఎదిగితే మరికొంత మందికి కూడా మేలు ఒనగూరుతుందని భావించినప్పుడు ఎదగడంలో తప్పేంటి? ఈ కిరణే గనుక. తృప్తి చెంది, అదే ఉద్యోగంలో కొనసాగితే నేడు ఇంత మందికి ఉద్యోగాలిచ్చి, పోషించేంత ఎత్తుకి ఎదిగి ఉండే వాడా!

అయితే గతంలో ఆమె డబ్బున్నవారి పట్ల ఏర్పర్చుకున్న అభిప్రాయాలు పూర్తిగా పోగొట్టుకోలేదామె..

" మీ ప్రేమని నేను శంకించడం లేదు. మీరు నన్ను అమితంగా ప్రేమిస్తున్నారని నేనెరుగుదును. కానీ డబ్బు సంపాదనలో పడి తన వారిని నిర్లక్ష్యం చేసే వారి పట్ల నా ఒపీనియన్ మాత్రం మార్చుకోలేను. అందుకు సాక్ష్యం మా పెద్దన్నయ్య ముకుంద్" చెప్పింది సలిల ఆవేశంలో ముక్కుపుటాలదురుతూండగా.

" అరవింద్ కూడా మీ అన్నయ్యేగా. అతడికీ బోలెడంత సంపాదన ఉంది. మరి అతడు మిమ్మల్నందరినీ చక్కగానే చూస్తున్నాడే', కిరణ్ అడిగాడు చల్లగా.

ఈ ప్రశ్నకీ సమాధానం లేదు సలిల దగ్గర. "చూడు సలిలా... కొన్ని కోణాల్లోంచి నీ. వాదన నిజం కావచ్చు. కానీ అందరి విషయంలోనూ, అన్నివేళలా అది సమర్ధనీయం కాదు. ఈ లోకంలో రకరకాల వృత్తులను జీవనోపాధిగా చేసుకొని బ్రతుకుతున్నవారున్నారు. వారి వారి స్థాయిలను బట్టి, తాహతును బట్టి వారి క్రింద మరికొంత మంది జీవిస్తుంటారు.

ఒక లాయర్, ఒక డాక్టర్, ఒక బిజినెస్ మ్యాగ్నెట్, ఒక స్కూల్ యజమాని, ఒక బిల్డింగ్ కాంట్రాక్టర్... ఇలా అనేకమంది తమ తమ సంపాదనను పెంచుకొనే ప్రయత్నం చేస్తూనే మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఉంటారు.

ఉదాహరణకి ఒక డాక్టరున్నాడనుకో... అతడి కింద కాంపౌండర్, నర్సు్లు, వార్డ్ బోయ్స్, పారిశుధ్య సిబ్బంది... ఇలా రకరకాల మంది పనిచేస్తూ ఉంటారు. పవిత్రమైన డాక్టర్ వృత్తిలో ఉన్నవారు వృత్తిరీత్యా బయటనే ఎక్కువ కాలం గడుపుతూ ఉండవచ్చును. వృత్తి బాధ్యతల చేత తనవారికి ఎక్కువ సమయం కెటాయించలేకపోవచ్చును. అంతమాత్రం చేత డాక్టర్ ని పెళ్లి చేసుకోకూడదని, ప్రతి అమ్మాయీ కోరుకుంటే... వారికి పెళ్లిళ్లూ జరగవు. సంపాదనలూ ఏర్పడవు"

కిరణ్ మాటలు సలిలలో పేరుకున్న అనుమానపు పొరలను తొలగించి వేస్తున్నాయి. కళ్ల ముందు ఆవరించుకుని ఉన్న అజ్ఞాన తిమిరమేదో తొలగిపోతున్న భావన కలిగిందామెకి.

" తన వారిని ఆదరంగా చూడాలంటే ప్రేమించే హృదయం కావాలి. తన వృత్తినీ, తనను నమ్ముకున్న తనవారినీ నిర్లక్ష్యం చేయకుండా ఉండాలి అంటే... రెండింటి మధ్యన సమన్వయం ఏర్పడేలా చూసుకోవాలి. అప్పుడే అతడు ఏ ఒత్తిడులకూ లోనవ్వకుండా అటు వృత్తికీ ఇటు వ్యక్తిగత జీవితానికీ న్యాయం చేయగలుగుతాడు. నేను రెండు పాత్రలనీ సమర్ధవంతంగా పోషించాననే అనుకుంటున్నాను.... ఏమంటావు?" ఆత్రుతగా అడిగాడు కిరణ్.

ఏమీ అనలేకుండా ఉంది సలిల. అతడు చెప్తున్న ప్రతి మాటా అక్షర సత్యం. కాదనలేని జీవనవాస్తవం. అయితే... ఒక్క విషయం ఆమెను విపరీతంగా బాధిస్తోంది.

తమ దాంపత్య సౌధం అసత్యమనే పునాది మీద నిర్మించబడి ఉంది. తనకు సంబంధించిన విషయాలన్నిటినీ దాచి పెట్టి తనను పెళ్లిచేసుకున్నాడు కిరణ్.

అదే... అదే... ఆమె మనసుని రంపపుకోతకు గురిచేస్తోంది.

''ఇంతగా చెప్పినా నువ్వు నన్ను అర్థం చేసుకోలేదంటే నా కన్నా అభాగ్యుడు మరొకడుండడు'' బాధగా కణతలు రుద్దుకున్నాడు కిరణ్.

''అది కాదు.. నేను మోసాన్ని, అసత్యాన్ని సహించలేనని తెలిసి కూడా మాయచేసి నాకు దగ్గరయ్యారు. దానికేమంటారు?'' ఉక్రోషంగా అడిగింది సలిల.

''నేను నీతో అబద్దం చెప్పినమాట నిజమే. నా గురించిన నిజాల్ని దాచి పెట్టి నిన్ను పెళ్లి చేసుకున్న మాట వాస్తవమే. కానీ నిన్ను ఏమార్చాలన్న దురుద్దేశ్యం నాకు లేదు. ఈ రోజు సాయంత్రం ఈ విషయాలన్నీ నీతో చెప్తామనే అనుకున్నాను. కానీ ఇంతలో నువ్వే వచ్చావు. నా వివరణలో సిన్సియారిటీ కనిపించలేదా?" అడిగాడు కిరణ్ ఎంతో ఆర్తిగా.

తనింతగా నచ్చ చెప్పినా ఆమె కన్విన్స్ కావడం లేదన్న వేదన తొంగిచూసింది అతడి స్వరంలో.

"అబద్ధం చెప్పి నన్ను పెళ్లి చేసుకోవడమంటే అది ఏమార్చడమేగా. నా దృష్టిలో రెండింటికీ పెద్ద తేడా ఏం లేదు. ఇవన్నీ సరే... తెల్లవారి లేస్తే బెంగ్ళూర్ క్యాంప్లకు పరుగెత్తేవారు. అక్కడెవరు న్నారో తమరికి?'' వ్యంగ్యంగా అడిగింది సలిల.

కిరణ్ ముఖం గంభీరంగా మారింది. ''అక్కడ మా అమ్మ నాన్నలు, అన్నయ్య అక్క అందరూ ఉన్నారు. నాన్నగారికీ మధ్యే ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆయన్ని చూడడానికే అస్తమాను బెంగుళూర్ పరుగెత్తేవాడిని" బాధగా చెప్పాడు కిరణ్.

సలిల కదిలిపోయింది. అతడు తన కుటుంబానికీ, తనకూ మధ్య ఎంతగా నలిగిపోయాడో, ఎవరి హృదయమూ నొచ్చుకోకుండా ఎలా బ్యాలెన్స్ మెంటైన్ చేశాడో విన్న ఆమె మనసులో అతడి పట్ల అనురాగం వెల్లువైపొంగింది. కానీ... అదేమీ బయటపడనివ్వక బింకంగా ఉండాలనుకుంది.

ఉలుకు– పలుకు లేకుండా శిలావిగ్రహంలా కూర్చుండిపోయిన సలిల వైపు దీనంగా చూశాడు కిరణ్.

సలిల మనసులో ఆలోచనలు వేరు.

తన దగ్గర నుండి ఇన్ని విషయాలు దాచి, తీయని మోసంతో తనను స్వంతం చేసుకున్న ఈ మహాశయుడికి పనిష్ మెంట్ ఇచ్చి తీరాలి. కానీ... అది అతడు జీవితాంతం గుర్తుంచుకునేంత మధురంగా ఉండాలి.

కిరణ్ మాత్రం ఆమె ప్రతిస్పందన ఎలా ఉంటుందోనని ఆతృతగా ఎదురుచూస్తున్నాడు.

లాభంలేదు... సలిల తనను క్షమించదు. తనకంటూ కొన్ని నియమాలు ఏర్పర్చుకున్న ఆమె ఈ రకమైన వంచనను భరించలేదు. ఒకవేళ ఆమె తనని అసహ్యించుకుంటే...

ఆవేదన అతడి గుండెల్ని పట్టి కుదిపివేసింది.

పట్టు వదలని విక్రమార్కుడిలా ఆమె చెంతకు చేరి " అమ్మ-నాన్నగారు, అన్నవదినెలు అందరూ నిన్ను చూడాలని ఉందని, తీసుకురమ్మని ఒకటే గొడవ చేస్తున్నారు. నీకిష్టమైతే..." ఆశ చావని కిరణ్ ఆఖరు అస్త్రం ప్రయోగించాడు.

దానికీ సమాధానం ఇవ్వలేదు సలిల. సోఫాలో పెట్టిన తన హ్యాండ్ బ్యాగ్ ని అందుకుని లేచి నిలబడుతూ " మీరు సాయంత్రం ఇంటికి రండి. అప్పుడు మిగిలిన విషయాలు చర్చించుకుందాం" చెప్పింది సలిల.

అయ్యబాబోయ్.. ఇంకా సాయంకాలం వరకూనా.. ఇప్పటికే ఉత్కంఠతో నరాలు తెగేట్లున్నాయి. ఈమె కరుణాకటాక్షవీక్షణాల కోసం సాయంత్రం వరకు పడిగాపులు పడాలా...

డీలాపడిపోయాడు కిరణ్ గాలి తీసిన బెలూన్లా.

అతడి ఆదుర్దా గమనించిన సలిల గుంభనంగా నవ్వుకుంది.

ఇన్నాళ్లూ తనని టెన్షన్ లో పెట్టి చంపినందుకీయనగారికీ డోస్ పడాల్సిందే. రానీ... అప్పుడు తీర్చుకుంటుంది స్వీట్ రివెంజ్.

గబగబ బయటకు అడుగులు వేసింది సలిల అతడివైపు చూడకుండా..

ఆశాభంగం చెందినవాడిలా కిరణ్. అలా చూస్తూ నిలబడిపోయాడు ఆమెను ఆపే ప్రయత్నం అయినా చేయకుండా.

స్కూటీ స్టార్ట్ చేసి బయట గేటు వైపు'రయ్'మంటూ దూసుకొస్తున్న సలిలను చూసి సెల్యూట్ చేస్తూ గేటు తీశాడు సెక్యూరిటీ.

అతడిని చూసి నవ్వుతూ బ్రేక్ వేసింది సలిల.. " భయపడకు.. నీ గురించి నేనేమీ చెప్పలేదులే. ఇలాగే సిన్సియర్గా డ్యూటీ చేస్తూ ఉండు. సార్ నీకు ఈనాం ఇస్తారు"" అంది..

"సార్ చాలా మంచివారమ్మా. మా అందరినీ కన్నబిడ్డల్లా చూసుకుంటారు. మా అందరి కోసం క్వార్టర్స్, మా పిల్లలు చదువుకోవడానికి స్కూల్, రోగాలొస్తే చూపించుకునేందుకు ఆసుపత్రి ఇవన్నీ కట్టిస్తున్నారు. అదుగో చూడండి" అంటూ దూరంగా వేలు పెట్టి చూపించాడు.

అక్కడ... నిర్మాణదశలో ఉన్న కొన్ని భవన సముదాయాలు కనిపించాయి ఆమెకి.

ఇందరి జీవితాలను ఆనందమయం చేస్తున్న తన భర్త అభినందనీయుడు. ఇటువంటి పుణ్యమూర్తిని పొందిన తాను చాలా అదృష్టవంతురాలు.

అతడి గురించిన నిజాలు తెలిసిన తరువాత తొలిసారిగా అనుకుంది సలిల మనసు ఆనందసంద్రంలా ఉప్పొంగుతోంది.

"వస్తాను మదీనా' సెక్యూరిటీతో చెప్పి ముందుకు సాగిపోయింది,

కేవలం ఒక్కసారి విన్నంతమాత్రం చేత తన పేరు గుర్తుంచుకుని సంబోధించి మాట్లాడుతున్న ఆమెను గౌరవంగా చూస్తూ ఉండిపోయాడతడు. 'సార్ కి తగిన భార్య' అనుకున్నాడు తృప్తిగా.

అన్ని విషయాలు అతడితో కూలంకషంగా మాట్లాడదామని ఇంటి దగ్గర అనుకొని బయలుదేరిన సలిల, కొన్ని విషయాలు మాత్రం ప్రస్తావించడం మరచిపోయింది.

వారి సంభాషణ నడుమ అమెరికా అరవింద సంగతి గానీ, పదే-పదే ఎవరో అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి కిరణ్ గురించి తనను హెచ్చరించిన విషయం గానీ చర్చించడం మరచిపోయింది సలిల.

గేటు దాటిన వెంటనే ఆ విషయం జ్ఞప్తికి వచ్చింది. సరే ఎలాగూ సాయంత్రం ఇంటికొస్తాడు కదా. అప్పుడు అతడి చెవిన వేయచ్చు అనుకొని సాగిపోయింది. " అదే... ఆమె చేసిన పొరబాటు. ఈ

విషయం చూచాయగానైనా కిరణ్ తో అని ఉంటే ఆమె ఊహించని ఆ అనర్థం జరిగి ఉండేది కాదేమో!"

కిరణ్ కి సంబంధించిన మధురోహలలో తేలిపోతూ, గగన విహారం చేస్తున్నంత హాయిగా సాగిపోతున్న సలిల, హ్యాండ్ బాగ్లో ఉన్న సెల్ఫోన్ గోల చేయడంతో స్కూటీ ఆపింది.

రోడ్ కి లెఫ్ట్ సైడ్న వెహికల్ ఆపి, బ్యాగ్లోంచి సెల్ తీసి, ఆన్ చేసి 'హలో' అంది. "హలో.. నేనే!! ఆ స్వరం వెంటనే గుర్తుపట్టింది ఆమె.

"నువ్వా?"

" అవును నేనే... నీ పతిదేవుడికి సంబంధించిన విషయాలన్నీ తెలుసుకున్నావు కదా. ఎలా అనిపించింది?" తాపీగా అడిగాడతడు.

"ఎలా అనిపిస్తుంది...నువ్వు నన్ను భయపెట్టినంత దారుణంగా ఏం లేదని ఢంకా భజాయించి మరీ చెప్పగలను. అయినా అంతటి ఉత్తముడి గురించి రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చి, నోటికొచ్చినట్లుగా చెప్పడానికి సిగ్గులేదూ" ఆగ్రహంతో అరిచింది సలిల.

"మీ ఆయన ఏ మచ్చా లేని నిండుజాబిలి అనీ, నువ్వు నమ్మినట్లే శ్రీరామచంద్రుని అంత ఆదర్శమూర్తి అనీ నాకూ తెలుసు" కూల్ గా చెప్పాడావ్యక్తి.

"వ్వాట్?" అదిరిపడింది సలిల.

" అవును శ్రీమతి సలిలాకిరణ్. మీ శ్రీవారు చాలా మంచివారు. ఆపన్నులను ఆదుకునే దయార్ద్రహృదయులు"

"మరి... అలాంటివాడి గురించి నాతో ఎందుకు చెడుగా చెప్పావు?"

"పగ తీర్చుకోవడం కోసం. కేవలం పగతీర్చుకోవడం కోసమే" వికటాట్టహాసం చేశాడా వ్యక్తి.

" ఆయన నీకే అపకారం చేశారు? పగ తీర్చుకోవడానికి?" ఆశ్చర్యంగా అడిగింది సలిల.

ఆ వ్యక్తి అంతరంగం ఏమిటో అవగతమవడం లేదు ఆమెకు.

"చేశాడు... నాకు తీరని ద్రోహం చేశాడు. అతడి సమాజసేవ దీనుల వరకే పరిమితమైతే బాగుండును. కానీ అమెరికన్ పౌరసత్వం పొంది హాయిగా జీవించవలసిన నన్ను కటకటాలపాలు జేశాడు. నా పాస్ పోర్ట్ రద్దు చేయించి అమెరికా నన్ను బహిష్కరించేలా చేశాడు.

నా భార్యతో నాకు విడాకులిప్పించాడు" ఒక్కో మాటా కసిగా, వత్తివత్తి పలుకుతూ అంటున్నాడు అతడు.

సలిలకు అర్థమయ్యీ అవనట్లుగా ఉంది. ఎక్కడో, ఏదో లింక్ తగులుతోంది అతడి మాటలలో,

ఆమె అలా అయోమయంలో మునిగి ఉండగానే తన మాటలను కొనసాగించాడతడు.

" అతడు చేసిన ఈ పని వలన నాకు మనుగడ లేకుండాపోయింది. స్వదేశంలో కూడా నాకు విలువ లభించలేదు. నా చరిత్ర తెలిసిన ప్రతి కంపెనీ నాకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించింది. ఇదంతా చేసింది నీ మొగుడు కదూ. అందుకే... అందుకే... అతడి ప్రాణసమానమైన నిన్ను మెంటల్ గా టార్చర్ చేయడమే నా ధ్యేయంగా పెట్టుకున్నాను. ఎవరికైనా సరే... గుండెను కోస్తే బాధ

కలగదూ" హేళనగా పలికిందతని స్వరం.

"నేటితో నీ ఆట కట్టు మిస్టర్. ఇక మీదట . నువ్వు నన్ను టార్చర్ చేయలేవు" అంతులేని ఆత్మవిశ్వాసంతో అంది సలిల.

"నాకు తెలుసు నువ్వు ఘటికురాలివి. ఇక మీదట నిన్నేమీ చేయను. నా తదుపరి టార్గెట్ మీ ఆయనే. మరికొద్ది క్షణాల్లో అతడికి ఏ గతి పట్టబోతోందో వేచి చూడు. నన్ను అవమానపరచినందుకు అతడు ఈ శిక్ష అనుభవించవలసిదే" క్రూరంగా నవ్వాడతడు.

ఒకానొక భయం గుండెల్లో మొదలై వెన్నులోంచి జరజర పాకి సలిలను వణికించింది.

" నీ మొహం... నువ్వాయన్ని ఏమీ చేయలేవు. నీలాంటి వాళ్లు ఎన్ని వేషాలు వేసినా ఆయనకేం కాదు" మేక పోతు గాంభీర్యంతో అంది సలిల.

“అదీ చూద్దువుగాని.. ఇది పైపై మాటలనుకుంటున్నావేమో. అదేంకాదు..కాసేపట్లో నీ మొగుడి మరణ వార్త నీ చెవుల పడుతుంది. అన్నట్లు నా పేరు చెప్పనే లేదు కదూ..నిన్నింకా సస్పెన్స్ లో ముంచి చంపడం నాకిష్టం లేదు. నా పేరు అవినాష్" చెప్పేసి ఫోన్ పెట్టేశాడు ఆ వ్యక్తి.

చేష్టలుడిగి నిలబడిపోయింది సలిల. “అవినాష్.. అవినాష్..” ఆ పేరు ఎక్కడో విన్నట్లుంది. చాలా సేపు బుర్ర బద్దలు కొట్టుకున్న మీదట అతడెవరో స్ఫురించింది ఆమెకు..

ఆ వెంటనే చెమటలతో తడిసి ముద్దైంది ఆమె దేహం. మైగాడ్ ఎంతకు తెగించాడు అతడు!?

అరవిందకు న్యాయం చేయడం కోసం తపించిన కిరణ్ ని అంతమొందించడానికి ప్రయత్నిస్తున్నాడన్నమాట.

మంచి-చెడుకి ఈ సంఘర్షణ తప్పనిసరేమో! అవినాష్.అరవింద భర్త..అవును... కిరణ్ దగ్గరుండి మరీ శిక్ష వేయించిన అరవింద భర్త. వెంటనే కిరణ్ ని అలర్ట్ చేయాలనుకొని, సెల్ ఫోన్ తీసి కిరణ్ నంబర్ డయల్ చేసింది సలిల.

'దిస్ టెలిఫోన్ ఈజ్ టెంపరర్లీ స్విచ్డ్ ఆఫ్..' అటు నుండి వాయిస్ రికార్డర్ వినిపిస్తోంది.

'ఛ.. ఇప్పుడే ఇతగాడు స్విచ్ ఆఫ్ చేయాలా...' అనుకుంటూ అసహనంగా కాలిని నేలకేసి తన్నింది సలిల.

మరొక రెండు మూడుసార్లు చేసినా అదే సమాధానం రావడంతో తనే స్వయంగా అతడిని చేరుకొని ఈ సమాచారాన్ని చేరవేయాలనుకొని, స్కూటీ వెనక్కు తిప్పింది. కానీ... అప్పటికే ఆలస్యమైంది.

★★★

సలలి వెళ్లిన మరొక అరగంటకు కిరణ్ కు ఓ ఫోన్ కాల్ అందింది. దాన్ని విన్న అతడి శరీరం చెమటలతో నిండిపోయింది.

ముఖం భయంతో నిండిపోయింది. కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లూరాయి.

తన ఆరో ప్రాణం. తన ఆరాధ్యదేవత...సలిల యాక్సిడెంట్ కి గురైందా? చావు బతుకుల మధ్య ఊగిసలాడుతూ, దిక్కుతోచని స్థితిలో పడుందా!

అతన్నెంతో ఇరిటేషన్ కి గురిచేసిన ఆఫోన్ కాల్ వచ్చిన నేపథ్యంలో దాన్ని చేసినవారెవరో ఏమిటో కనుక్కోవాలన్న కనీస జ్ఞానం కూడా కోల్పోయాడు అతడు. వెంటనే పీ.ఎ ని పిలిచి ఆరోజు కార్యక్రమాలన్నింటటిని మర్నాటికి వాయిదా వేయమని చెప్పి హడావుడిగా బయలుదేరిపోయాడు.

తనకి ఎవరో తప్పుడు సమాచారం అందించి ఉంటారన్న ఆలోచన కూడా రాలేదు అతనికి. కనీసం..ఆ అనుమానంతోనన్నా సలిలకు కాల్ చేయాలన్న ఆలోచన కలిగితే బాగుండిపోదును.

అన్యమనస్కంగా డ్రైవ్ చేస్తున్న కిరణ్ పదే పదే దేవుడిని వేడుకుంటున్నాడు..

'స్వామీ.. సలిలలకు ఏమీ కాకుండా కాపాడు. నా సలిలను నా నుండి దూరం చేయకు' ఆందోళన నిండిన మనసుతో డ్రైవ్ చేస్తున్న కిరణ్, తన కారుకడ్డంగా ఏవో పడి వుండడం గమనించి సడెన్ బ్రేక్ వేశాడు. సాఫ్ట్ వేర్ సిటీ దాటి హైవే మీదికి మళ్లే దారి అది.

కార్లోంచే పరిసరాలను గమనించిన కిరణ్, దరిదాపుల్లో ఎవరూ లేకపోవడం గమనించి విస్తుపోయాడు.

ఎవరు? ఇలా దారిడ్డంగా రాళ్లు రప్పలు పరచినవారు అనుకుంటూ విసుగ్గా కారు దిగి, వాటిని తొలగించడానికి పూనుకున్నాడు.

అదే అదనుగా భావించి ఒక వైపు నుండి అవినాష్ ఏర్పాటు చేసిన కిరాయి గూండాలు, మరొక వైపు నుండి కార్తీక్ మిత్రబృందం అటాక్ చేశారు. అతడి మీదికి.

ఊహించని ఈ దాడికి కిరణ్ బిత్తరపోయాడు. కాలేజీ రోజుల్లో కరాటే నేర్చుకున్న అతడు వాళ్లని ప్రతిఘటించడానికి పూనుకున్నాడు..

ఈ సందట్లో అతడి సెల్ ఫోన్ క్రిందపడి, అందరి కాళ్ల మధ్య నలిగి, విరిగిముక్కలైంది.

అతడు ఒక్కడు. వాళ్లు పదిమంది. కార్తీక్ పంపిన కుర్రాళ్లను ఎదుర్కొన్నాడు ధైర్యంగానే. వారు అతడి ధాటికి తట్టుకోలేక తోక ముడిచారు. కానీ..పచ్చిరక్తం తాగే రాక్షసుల్లాంటి కిరాయి గూండాల్లో ఆట్టే సేపు పోరాడలేకపోయాడతడు.

వాళ్లు అతడి ఒంటిమీద లావుపాటి దుడ్డుకర్రల్తో దెబ్బలు కొట్టడం ప్రారంభించారు.

కర్కోటకుల్లా తనమీద అటాక్ చేసిన వాళ్లతో చాలాసేపే యుద్ధం చేశాడు కిరణ్. కానీ అతడి ప్రతిఘటన ఎందుకూ పనికి రాలేదు. ఇదేం సినిమా కాదు. ఒక్కడు పదిమందిని చితకబాది,మడత నలగని బట్టల్లో బయట పడడానికి.

వాళ్లు బలమైన కర్రలతో అతడిని కొట్టి దారుణంగా గాయపరిచారు. ఒక దృఢకాయుడు కర్రెత్తి అతడి తలమీద బాదబోతూండగా జరిగిందా సంఘటన...

స్కూటీమీద తిరిగి అతడి ఆఫీస్ కి వస్తున్న సలిల, దూరం నుండే గమనించింది రౌడీలు చేస్తున్న మారణకాండను.

అక్కడ ఉన్నది తన భర్త కిరణో కాదో కూడా ఆమెకు తెలియదు. ఎవరైనా సరే.. అక్కడ ఏదో జరుగుతుందని లీలగా కనిపిస్తోంది.

అందుకే స్కూటీ మీద నుండే గావుకేకలు పెట్టనారంభించింది రక్షించమంటూ. ప్రక్కనున్న పొలాల్లో పనిచేస్తున్న కూలీలకు ఆమె ఆర్తనాదాలు వినిపించాయి. ఎవరో ఆడకూతురు అరుస్తోంది. సంగతేంటని కనుక్కుందదామని అందరూ గుంపులుగా పోగయ్యారు రోడ్డుమీద.

చటుక్కున తన స్కూటీనాపి, కొట్లాట జరుగుతున్న ప్రదేశాన్ని వేలు పెట్టి చూపించింది.

అంతే.. వాళ్లందరూ తమ చేతుల్లో ఉన్న కత్తులు, కొడవళ్లు పలుగు పారలు తీసుకొని పదండంటే పదండనుకొని ఆ ప్రదేశంకేసి పరిగెత్తారు.

జనమందరూ గుంపుగా తమకేసి రావడం గమనించిన ఒక గూండా, కిరణ్ తల పైన కొట్టబోతున్న ఇంకొక గూండాను హెచ్చరించాడు.

"చూడు భాయ్..ఎవరో ఇటువైపే వస్తున్నారు. వాళ్ల చేతికి చిక్కామంటే సున్నంలోకి ఎముక లేకుండా అన్ని పారేస్తారు. ఇప్పటికే చాలా దెబ్బలు తిన్నాడు. ఇక వదిలేయ్" అంటూ హితబోధ చేశాడు.

జనమంతా అక్కడికి చేరేసరికి ఎటు వాళ్ళటు ఉడాయించారు. అయినా సరే జనం చేతికి చిక్కాడు ఒకతను.

బట్టలు చిరిగి, రక్తసిక్తమైన దేహంతో నేలమీదకొరిగిపోయి, గిల గిల తన్నుకుంటున్న భర్తను చూసి "కిరణ్" అంటూ గుండెలవిసిపోయేలా అరిచింది సలిల.

అత్యంత దయనీయ స్థితిలో ఉన్న కిరణ్ సలిలను చూస్తూ " నీకేం కాలేదు కదా!" అంటూ ఒళ్లంతా తడిమేశాడు ఆర్తిగా.

తన ప్రాణసఖికి ఏ ప్రమాదమూ జరగలేదన్న సంగతి గ్రహించిన అతడికి కొండంత బలం వచ్చినట్లయ్యింది.

అంత యాతనలోనూ తన పేరే కలవరిస్తూ, తన క్షేమం కోసమే పరితపించిపోతున్న భర్తను చూసి ఏడుపు ఆపుకోలేకపోయింది సలిల.

ఈ ప్రేమ మూర్తినా తను శంకించింది. ఇలాంటి వ్యక్తి సహచర్యం లభించిన తను ఎంతో భాగ్యవంతురాలు.

అతడి తలను తన గుండెలకు హత్తుకొని "కిరణ్.. కిరణ్..." అంటూ ఏడవసాగింది సలిల.

వెంటనే ఏదో స్పురించినట్లుగా సెల్ఫోన్ తీసి అంబులెన్స్ కి ఫోన్ చేసింది. ఒంట్లో ఓపిక హరించిపోయిన కిరణ్ కళ్లు తేలిపోతున్నాయి నీరసంతో.

ఈలోపు చేత చిక్కిన రౌడీకి దేహశుద్ధి చేసిన పల్లె జనం, తాడు వేసి వాడిని చెట్టుకి కట్టేశారు.

కిరణ్ చుట్టూ చేరి సలిలకు ధైర్యం చెప్పసాగారు. ఈలోపు అంబులెన్స్ వచ్చింది. అందరూ సాయం పట్టి కిరణ్ ని అందులోకి ఎక్కించారు.

అతడి తలను ఒళ్లో పెట్టుకుని మౌనంగా రోదించసాగింది సలిల.

ఇంతలో పోలీస్ లకి కూడా సమాచారం రావడం, వారు వచ్చి ఆ కిరాయి రౌడీని అరెస్ట్ చేసి, తీసుకుపోవడం అన్నీ జరిగిపోయాయి.

అంబులెన్స్ కదిలింది. తనకి సహాయపడిన వారందరికీ చేతులెత్తి నమస్కరించింది సలిల కన్నీళ్లతో.

★★★

ఆసుపత్రిలో చేరిన కిరణ్ కోలుకొనేందుకు సరిగ్గా వారం రోజులు పట్టింది. ప్రాణహాని తప్పినా రౌడీలు బలంగా కొట్టడం వలన చాలా రక్తమే పోయింది.

ఈవారం రోజులూ హాస్పటల్ అంతా జాతర వాతావరణంతో నిండి పోయింది.

ఎక్కడెక్కడ నుంచో కిరణ్ ఫ్రెండ్స్, ఆఫీస్ స్టాఫ్ చాలామంది సన్నిహితులు వచ్చేవారు అతడిని పరామర్శించడానికి. వాళ్లందరినీ అదుపులో పెట్టలేక సతమతమయ్యేవారు ఆ హాస్పటల్ సెక్యూరిటీ సిబ్బంది.

కిరణ్ స్పృసుహలోకొచ్చాడు. అతడి స్టేటుమెంట్ తీసుకోవడానికి వచ్చాడు పోలీస్ ఇన్ స్పెక్టర్. తమ అధీనంలో ఉన్న రౌడీ ఎన్ని విధాల విచారించినా వాడు నోరు విప్పడం లేదని చెప్పాడు.

వారెవరో తనకు తెలియదని, తన మీద హత్యాయత్నం జరగడం తనకీ ఆశ్చర్యంగా ఉందని చెప్పాడు కిరణ్..

అప్పుడు చెప్పింది సలిల తనకి తెలిసిన విషయాన్ని. అవినాష్ అనే

వ్యక్తి భర్తను చంపాలని ప్లాన్ చేసి, తనకు ఫోన్ ద్వారా ఆ విషయం చెప్పి బెదిరించాడని తెలిపింది. .

పోలీస్ ఇన్ స్పెక్టర్ ఆ స్టేటుమెంట్ ని రికార్డ్ చేసుకున్నాడు.

ఒక ఆడపిల్ల జీవితం పాడైపోకుండా అడ్డుకున్నందుకా తనకు ఈ సన్మానం!

ఆశ్చర్యపోయాడు కిరణ్.

"మీ మీద అటాక్ చేసిన వాళ్లల్లో కొందరు స్టూడెంట్స్ కూడా ఉన్నారని మా ఇన్వెస్టిగేషన్లో తేలింది సర్. మీరు రిపోర్ట్ ఇస్తే వారిని కూడా.." అన్నాడు ఎస్.ఐ.

"వద్దొద్దు. ఆ పని మాత్రం చేయకండి" అడ్డుకున్నాడు కిరణ్.

"అదేంటి సార్! మీమీద మర్డర్ అటెంప్ట్ చేసిన వారిని అరెస్ట్ చేసి, ఇంటరాగేట్ చేయడం నా ధర్మం" అన్నాడు ఎస్.ఐ. ఆశ్చర్యంగా.

"అవుననుకోండి. కానీ వాళ్లందరూ స్టూడెంట్స్. వారికోసం ఎంతో భవిష్యత్తు ఎదురుచూస్తోంది. ఇలా పోలీస్ రికార్డ్స్ కెక్కితే వారి ఫ్యూచర్ నాశనం అవుతుంది. అది నాకిష్టం లేదు" చెప్పాడు కిరణ్.

తనకి హాని తలపెట్టాలని చూసిన వారిని సహృదయంతో క్షమించి ఊరుకున్న కిరణ్ మూర్తీభవించిన సౌజన్యంలా కనిపించాడు అతడి కన్నులకి.

కిరణ్ రిపోర్ట్ మేరకు అవినాష్ మీద ఎఫ్.ఐ. ఆర్. పుటప్ చేయాలని ప్లాన్ చేశాడు ఎస్.ఐ.

మరో మారు అతడి మహోన్నత వ్యక్తిత్వానికి జోహార్లు అర్పిస్తూ సెలవు తీసుకున్నాడు...

“ఆ...చూడండి. ఆ స్టూడెంట్స్ తాలూకు వివరాలు సేకరించి నాకివ్వండి. వీలైతే.. వాళ్లతో నేను మాట్లాడతాను'' అన్నాడు బయలుదేరబోతున్న యస్.ఐ. తో.

“ అలాగే సర్..” వినమ్రంగా చెప్పేసి వెళ్లిపోయాడు ఎస్.ఐ.

వారం రోజుల పాటు అహోరాత్రులు కిరణ్ నే కనిపెట్టుకుని వుండి సకల సేవలు చేసింది సలిల.

ఆ యమధర్మరాజునే ఎదిరించి తన భర్త ప్రాణాలు తిరిగి తెచ్చుకున్న సతీసావిత్రి గుర్తుకొ చ్చింది కిరణ్ కి.

'ఈ దేశం ఎందరో పతివ్రతలకు జన్మనిచ్చిన పుణ్యభూమి..నా సలిల కూడా ఆ కోవకే చేరుతుంది' అనుకున్నాడు ఆమె ఎంతో ధైర్యంగా తనను రక్షించుకున్న వైనం జ్ఞప్తికి వచ్చిన కిరణ్.

కిరణ్ కి యాక్సిడెంటైన విషయం తల్లిదండ్రులకు, అరవింద్, నీరజలకు తెలియకుండా జాగ్రత్త పడింది సలిల.

వాళ్లకీ విషయం తెలియపరుస్తామన్నా సురేష్ దంపతులను వద్దని వారించింది.

ఇప్పటికే నీరజ ఆరోగ్యపరిస్థితి వలన టెన్షన్ పడుతున్న వాళ్లని, మరింత ఉద్విగ్నతకు గురిచేయవద్దని చెప్పేసింది సున్నితంగా.

కిరణ్ హాస్పిటల్లో ఉన్నన్నినాళ్లూ సలిలకు కావలసినవన్నీ సమకూర్చి పెట్టింది హిమజ.

“మావల్లే.. మీకీ యాతన'' కళ్లనీళ్లు పెట్టుకుంటూ బాధపడ్డారు తపతి, అమెరికా అరవింద.

“డోంట్ వర్రీ..నాకేం కాలేదు..వాళ్ల పాపం వాళ్లు అనుభవిస్తారు'' సర్దిచెప్పాడు కిరణ్.

అతడి ఓదార్యానికి ముగ్ధులైనారు వారు.

మరునాడే కిరణ్ ని డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు డాక్టర్స్. సురేష్ ని కిరణ్ కి తోడుగా ఉండమని చెప్పి ఇంటికెళ్లి ఇల్లంతా నీట్గా సర్దుకొని వచ్చింది సలిల.. సలిలతో హృదయం విప్పి మాట్లాడే మధురక్షణం కోసం తహ తహలాడసాగాడు కిరణ్.

★★★

"మెల్లగా దిగండి" కారులోంచి దిగుతున్న కిరణ్ కి తన భుజం ఆసరాగా అందించింది సలిల.

ఆమె భుజం చుట్టూ చేయి వేసి నెమ్మదిగా ఇంట్లోకి అడుగు పెట్టిన కిరణ్ సంభ్రమానందాల జడివానలో నిలువెల్లా తడిసి ముద్దైనాడు.

ఇల్లంతా రంగు రంగుల చమ్కీ కాగితాలతో బెలూన్లతో అందంగా అలంకరించబడి వుంది.

గుమ్మానికి ఎదురుగా ఉన్న గోడ మీద చక్కగా బోసి నవ్వులు రువ్వుతూ ఉన్న పసివాడి పోస్టర్ అంటించబడి వుంది.

"అనుమతి లేకుండా నా జీవితంలోకి చొరబడిన ఇద్దరు అతిథులకు సుస్వాగతం"

తళుకులీనే అక్షరాలతో వ్రాయబడి ఉంది ఆ చిన్నారి పోస్టర్ క్రింద.

"సలిలా..సలిలా.." సంతోషాన్ని ఆపుకోలేని కిరణ్ సలిలను చుట్టేశాడు ఆత్రంగా.

ఆమె కళ్లు సిగ్గుతో గమ్మత్తుగా వాలిపోతూ ఉన్నాయి. ముఖం అరుణిమను నింపుకొని ఆనందంతో వెలిగిపోతోంది.

ఆమె కళ్లల్లోకే సూటిగా చూస్తూ "ఇది నిజమేనా?" మంద్రస్వరంతో అడిగాడు కిరణ్.

"ఏది?" తెలియనట్లుగా అడిగింది సలిల.

"అది" అంటూ గోడమీద పోస్టర్ వైపు చూపించాడు కిరణ్ తన చూపుడు వేలితో..

"ఊ..." మృదువుగా అంది సలిల మెత్తని స్వరంతో.

"నువ్వు కన్సీవ్ అయ్యావని ఎప్పుడు తెలిసింది?" అర్ధాంగి మీద అనురాగం కట్టలు తెంచుకొని ప్రవహిస్తోంది కిరణ్ వాక్కులలో.

"రెండు రోజుల క్రిందటే" దాచుకుందామన్నా దాగని సిగ్గు సలిలలో.

" వీరనారిలా అన్ని సాహసాలు చేసినదానివి.. నీకు ఇంత సిగ్గా?" కవ్వించాడు కిరణ్.

"సాహసాలు చేస్తే మాత్రం స్త్రీని కాదా!" నవ్వింది సలిల.

వెంటనే నాకెందుకు చెప్పలేదు. ఇంకా నన్నొక మోసగాడిగానే భావిస్తున్నావు కదూ! ఆవేదనగా అడిగాడు కిరణ్.

"నో..నో.. అదేం లేదు. మీరు పూర్తిగా కోలుకున్నాకే చెప్పాలనిపించింది. అందుకే ఆగాను" చెప్పింది సలిల.

"నా గురించి తెలుసుకున్న మరుక్షణం నీకేమనిపించింది? సిన్సియర్ గా చెప్పాలి" కుతూహలంగా అడిగాడు కిరణ్.

"కర్ర పట్టుకుని మిమ్మల్నీ, నా సోదరుడినీ నాలుగు తన్నాలనిపించింది" సీరియస్ గా చెప్పింది సలిల.

" ఓసి రాక్షసీ..మొగుడిని పట్టుకు అంత మాటంటావా? కళ్లు పోగలవు" అన్నాడు కిరణ్ కోపం నటిస్తూ.

" మీరే కదా! సిన్సియర్ గా చెప్పమన్నారు. అందుకే చెప్పాను. తప్పా!" అమాయకంగా అడిగింది సలిల.

ఆమెను దగ్గరగా హత్తుకొని చెంపకు చెంప చేర్చి "నా మీద కోపం పోయిందా?" గారంగా అడిగాడు కిరణ్.

"వస్తే కదా పోవడానికి".

"మరి..ఆరోజు అలా వచ్చేశావేం?"

"బాధనిపించింది.. అందుకే వచ్చేశాను"

"బాధా! ఎందుకు? నీ దగ్గర నిజం దాచినందుకా?" తప్పుచేసినట్లుగా అడిగాడు కిరణ్.

"కాదు. ఇంత పెద్ద కంపెనీకి ఎం.డి. అయిన మీ చేత జాకెట్లకి హుక్స్, కాజాలు కుట్టించినందుకు" సలిల చెప్పింది.

ఆమె కళ్లు సజలమయ్యాయి. .

కిరణ్ లాలనగా ఆమెను దగ్గరకు తీసుకొని . " ఏయ్ పిచ్చీ.. అదా నీ బాధ.. అయినా నేనెవరికి సహాయం చేశాననీ. నా భార్యవైన నీకేగా.. అప్పుడే కాదు, ఎప్పటికీ నీకు పనిలో సాయం చేస్తూనే ఉంటాను. కాదనకూడదు". అన్నాడు మృదువుగా ఆమె కంటి నుండి జాలువారుతున్న అశృబిందువులను తుడుస్తూ.

“కిరణ్ మీరెంత మంచివారు?" అతడిని హత్తుకుపోయింది సలిల. కాస్సేపు ఆ గాఢ పరిష్వంగంలోని సుఖాన్ని మనసారా అనుభవించారు. దంపతులు ఇద్దరూ కూడా.

ఏదో గుర్తొచ్చినట్లుగా అతడి నుండి విడివడుతూ “ మీ అబ్బాయి కూడా మీలాగే బహు దుడుకువాడు. నా పర్మిషన్ లేకుండానే కడుపున పడ్డాడు" అంది సలిల చిరుకోపం నటిస్తూ,

ఈమధ్య టెన్షన్స్లో ఉన్న ఆమె కాంట్రాసెప్టివ్ పిల్స్ వాడడంలో ఇర్రెగ్యులర్ గా ఉంది. దాని ఫలితమే ఈ ప్రెగ్నెన్సీ.

"అవును సుమీ.. బయటపడనీ వాడి పని పడదాం" అన్నాడు కిరణ్ ఆమెకు వత్తాసు పలుకుతూ.

అతడి హావభావాలు చూసి ఫక్కున నవ్వింది సలిల.

“ఉండు ఈ శుభవార్త మీ అమ్మ-నాన్నలకీ, నా బామ్మర్తికీ చెల్లాయ్ కి చెప్పేద్దాం" అంటూ అరవింద్ కి ఫోన్ చేశాడు కిరణ్.

విషయం విని చిన్న పిల్లవాడిలా కేరింతలు కొట్టాడు అరవింద్.

వైదేహి, రాఘవరావుల ఆనందానికి అంతే లేదు.

పుబ్బలో పుట్టి, మఘలో మాడిపోయిందనుకున్న కూతురి జీవితం మళ్లీ చిగుళ్లు తొడిగి పుష్పిస్తే, ఏ కన్నవారికైనా సంతోషంగానే వుంటుంది.

"సలిలమ్మా.. నిజమేనా..నేను మామయ్యనైపోతున్నానంట" హుషారుగా అడిగాడు అరవింద్.

“ఊ..” అని నెమ్మదిగా పలికి ''నువ్వు, నీ ఫ్రెండ్ కలిసి ఆడిన నాటకం బయటపడిపోయిందని చెప్పడానికి చింతిస్తున్నాను'' అంది సలిల లేని విచారం నటిస్తూ..

అరవింద్ చిన్నగా కేక పెట్టాడు అటునుండి.

''సలిలమ్మా.. అంతా తెలిసిపో యిందన్నమాట.. ఇంకేముంది..మా ఇద్దరికీ బడితె పూజ ఖాయమన్న మాట'' అన్నాడు భయం నటిస్తూ.

“మరి వదిలి పెడతాననుకున్నావా.. కృష్ణభగవానుడి లెవెల్లో మీ బావగారి చేత దొంగనాటకం ఆడించి, సుభద్రాపరిణయం స్టైల్లో నా పెళ్లి చేయించావుగా” కినుకగా అంది సలిల.

''సారీ నాన్నా...రాజ్ ని చేసుకొనేది లేదని నువ్వు కచ్చితంగా చెప్పేశాక ఏం చేయాలో పాలుపోలేదు నాకు. వాడిని చేసుకుంటే నువ్వు కలకాలం సుఖసంతోషాలతో హాయిగా ఉంటావనిపించింది. అందుకే.. అలా చేయాల్సి వచ్చింది” సంజాయిషీ ఇచ్చాడు అరవింద్.

“ అవునన్నయ్యా. నీ ఆలోచన సరియైనదే... కిరణ్ వలన నేను చాలా సంతృప్తిగా జీవిస్తున్నాను'' తృప్తినిండిన స్వరంతో పలికింది సలిల.

''నేను కోరుకున్నదీ అదేనమ్మా” ఆప్యాయంగా అన్నాడు అరవింద్.

''కానీ నేను మాత్రం నీకు ఇద్దరూ ఆడపిల్లలే పుట్టాలని కోరుకుంటున్నాను” కసిగా అంది సలిల.

'' అదేంటి చెల్లాయ్. అలా దీవించేశావు?” తెల్లబోయాడు అరవింద్.

'' అబద్దాలు బాగా ఆడతావు కదా'' అంది సలిల.

గలగల నవ్వాడు అరవింద్. ''పుడితేనేమ్మా.. మా సలిలమ్మ లాంటి బంగారు తల్లులు పుట్టాలే గాని, ఇద్దరేం ఖర్మ.. అరడజను మంది అయినా ఫరవాలేదు'' అన్నాడు నవ్వడం కొనసాగిస్తూనే.

అతడి చేతిలోంచి ఫోన్ లాక్కొని ''ఆయనకేం పోయింది.. ఎన్ని హామీలైనా ఇస్తారు. మోయాల్సిందీ.. కనాల్సిందీ నేనే కదా'' బితుగ్గా అంది నీరజ.

'' నీరూ..ఎలా ఉన్నావు? ఆరోగ్యం జాగ్రత్త” అంది సలిల ప్రేమగా.

"నాదీ సేమ్ డైలాగ్.. ఇప్పుడే స్పీకర్లో విన్నాను. చాలా ఆనందంగా ఉంది నాకు'' నీరజ గొంతులో సంబరం చిందులేసింది.

మరికాస్సేపు వారితో ఆనందాన్ని పంచుకున్నాక ఫోన్ కట్ చేశారు కిరణ్, సలిల.

" వీలు చూసుకుని బెంగుళూర్ కి టిక్కెట్స్ రిజర్వ్ చేయించండి. నాకు అత్త మామల్ని చూడాలని వుంది'' కిరణ్ షర్ట్ బటన్స్తో ఆడుకుంటూ గోముగా అంది" సలిల.

"జీ మహారాణీ..మీ ఆజ్ఞ శిరసా వహిస్తాను'' వినయంగా అన్నాడు కిరణ్.

వెన్నెల విరిసినట్లుగా నవ్వింది సలిల. "నిన్ను చూస్తే మా వాళ్లు ఎంతగా పొంగిపోతారో తెలుసా? నీలాంటి మంచి అమ్మాయి కోడలిగా దొరికినందుకు తెగ సంతోషపడతారు ?

ఆమె కురులు సవరిస్తూ చెప్పాడు కిరణ్.

గాలికి కూడా తమ మధ్య స్థానం ఇవ్వడం ఇష్టలేనంత గాఢంగా అతడిని హత్తుకుపోయింది సలిల.

ఒకరి మనసులొకరికి తెరచిన పుస్తకాల్లా అర్ధమైన తరుణాన, మబ్బులు వీడిన వినీలాకాశంలా నిర్మలమైన వారి మనసులు, మధుమాసపు కోయిలలై నవ్య జీవన రాగాలాపనలు చేస్తున్నాయి.

''హే ప్రభూ... కలలోనైనా ఈ బంధం వీడకుండా, కలకాలం కలిసి వుండేలా దీవించు'' భగవంతుని ప్రార్థించింది సలిల.

"తథాస్తు'' అభయహస్తం చూపించాడు కిరణ్.

జలతరంగిణిలా నవ్వుతూనే వుంది సలిల.

– అయిపోయింది –